www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్
చెన్నై • తిరువళ్లూరు • మదురై • తిరుచ్చి
పుదుచ్చేరి • కుంభకోణం • రామనాథపురం
కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్
విశాఖపట్నం • తిరుపతి • హైదరాబాద్ • బెంగళూరు

గురువారం | 10-1-2019 | పేజీలు: 18 + 20 | వెల: రూ. 6.50 | సంపుటి: 15 సంచిక: 185 | శ్రీవిళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: చవితి సా. 5.22 తదుపరి పంచమి; నక్షత్రం: శతభిషం తె. 5.55 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: ఉ. 10.57-12.45; దుర్ముహూర్తం: ఉ. 10.33-11.17, మ. 2.57-3.41; అమృతఘడియలు: రా. 9.47-11.35; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.54; సూర్యాస్తమయం: 5.52 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

www.andhrajyothy.com
నిజామాబాద్ సిటీ*
ఆంధ్రజ్యోతి
వెల: రూ. 6.50
సంపుటి: 15
సంచిక: 185
గురువారం | 10-1-2019
పేజీలు: 18 + 20
Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

TELANGANA STATE POLICE

పోలీసులకు 8 గంటలే డ్యూటీ!

షిఫ్ట్ పద్ధతుల్లో విధులకు యోచన

అదనంగా పనిచేస్తే అలవెన్సులు

వారాంతపు సెలవులు, ఇన్సెంటివ్‌లు

సాధ్యాసాధ్యాలపై అధ్యయనం

ఎంత మంది కావాలో లెక్కలు

మరి కొద్ది నెలల్లో అమల్లోకి

"ఒక వ్యక్తి సెలవు లేకుండా గరిష్ఠంగా 12 రోజులు మాత్రమే పని చేయగలుగుతాడు. ఆ తర్వాత అతని నుంచి ఆశించిన స్థాయిలో ఫలితాలు రాబట్టడం కష్టం. ఇది అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన సర్వేలో వెల్లడైన విషయం"
-తెలంగాణ పోలీసు ఉన్నతాధికారి వ్యాఖ్య

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పీపుల్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న తెలంగాణ పోలీసు విభాగం ఇప్పుడు సిబ్బంది పనితనాన్ని పెంచేందుకు మరో కీలక నిర్ణయం వైపు అడుగులు వేస్తోంది. 'వన్ స్టేట్, వన్ పోలీస్, వన్ ఎక్స్‌పీరియన్స్' లక్ష్యాన్ని చేరుకోవాలంటే ముందుగా సిబ్బంది పూర్తి సంతోషంతో విధులు నిర్వహించే వాతావరణం ఉండాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. అందులో భాగంగా షిఫ్ట్‌ల విధానం, వారాంతపు సెలవులు అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక పోలీసింగ్ మౌలిక సదుపాయాల కల్పనకు

మిగతా 4వ పేజీలో...

పాఠశాలలకు రేపట్నుంచే సంక్రాంతి సెలవులు 11

● 10 శాతం కోటా

దస్ కా దమ్!

గురితప్పని నరేంద్రుడి బ్రహ్మాస్త్రం



ఆర్థిక బలహీన వర్గాలకు 10 శాతం కోటా

రాజ్యాంగ సవరణ బిల్లుకు పార్లమెంటు ముద్ర

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో కొత్త కోటా

కేంద్రం లెక్క రూ.8 లక్షల వార్షిక ఆదాయం

రాష్ట్రాలు సొంతంగా నిర్ణయించుకోవచ్చు

బిల్లుకు రాజ్యసభలోనూ బంపర్ మెజారిటీ

న్యూఢిల్లీ, జనవరి 9: ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతావని చరిత్రలో సరికొత్త కోటా ఉదయించింది. రిజర్వేషన్లకు మొట్టమొదటి సారిగా 'ఆర్థిక వెనుకబాటు' కూడా ప్రాతిపదికగా మారింది. ఇప్పటి దాకా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు మాత్రమే అందుతున్న రిజర్వేషన్ ఫలాలు... ఇక ఆర్థిక బలహీన వర్గాలందరికీ (ఈడబ్ల్యూఎస్) అందనున్నాయి. దీనికి సంబంధించిన 124వ రాజ్యాంగ సవరణ బిల్లు-2019 లోక్‌సభలో మంగళవారమే భారీ మద్దతుతో గట్టెక్కగా... మోదీ సర్కారుకు విషమ పరీక్ష పెట్టే రాజ్యసభలో బుధవారం ఈ బిల్లు బంపర్ మెజారిటీతో నెగ్గింది. సుమారు ఎనిమిది గంటల వాడివేడి చర్చ తర్వాత... బుధవారం రాత్రి 10.10 గంటల సమయంలో ఈ చరిత్రాత్మక బిల్లును పెద్దల సభ ఆమోదించింది. ఇక... రాష్ట్రపతి ఆమోదముద్రతో చట్టం

మిగతా 12వ పేజీలో...



'విన్నింగ్ సిక్సర్లు' ఇంకా ఉన్నాయి

ఈ బిల్లును ఇప్పుడే ఎందుకు తెచ్చారని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. క్రికెట్‌లో మ్యాచ్ గెలిచే ముందే సిక్సర్లు పడతాయ్! ఇది మొదటి సిక్సర్ మాత్రమే. దానికే మీరు కంగారు పడుతున్నారు. ఇలాంటి 'విన్నింగ్' సిక్సర్లు మరిన్ని పడతాయ్!
- రవిశంకర్ ప్రసాద్

ఓ మహిళను అడ్డం పెట్టుకుని..

పార్లమెంట్ నుంచి మోదీ పరార్

రాహుల్ వివాదాస్పద వ్యాఖ్య

మహిళా జాతిని అవమానించారు

ప్రధానమంత్రి మండిపాటు 13

కాంగ్రెస్ చీఫ్‌కు నేడు మహిళా కమిషన్ నోటీసు



ఇప్పుడు కాకుంటే ఇంకెప్పుడు..?

భారత్‌లో తరచూ ఎన్నికలాయె!.. ఓట్ల దృష్టితో కోటా బిల్లు తేలేదు

అన్యాయం అంతం కావాలి... అందరికీ అవకాశం రావాలి: మోదీ 12



ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ ముత్యాల ముగ్గులు రాష్ట్ర స్థాయి ఫైనల్స్‌కు హాజరైన మిల్కీబ్యూటీ తమన్నా

ముగ్గుకే ముద్దొచ్చె!

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముగ్గుల పోటీకి తమన్నా ఫిదా

తనకూ ముగ్గులు వేయాలని ఉందన్న సినీనటి

విదేశాల్లోనూ సంక్రాంతి వేడుకలు: తలసాని

ఘనంగా ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్స్

కరీంనగర్ 'శ్రీపెల్లి ఇందు'కు ప్రథమ బహుమతి

హైదరాబాద్ సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అక్కడ చుక్కలాంటి తమన్నా.. అందంగా పరిచిన చుక్కల ముగ్గులు. తళుకుతారకు దీటుగా తామూ అన్నట్లుగా ఆ రంగవల్లులు కళకళలాడాయి. తీరొక్క రంగులతో తీర్చిదిద్దిన ఆ ముగ్గులు... 'నువ్వా దిద్దవా చుక్కల ముగ్గులు?' అన్నట్లుగా ఆమెతో ఊసులాడాయో ఏమో.. 'ముగ్గులు వేయడం అంత ఈజీ కాదు బాబూ' అంటూ తమన్నా బుంగమూతి పెట్టింది. అంతలోనే.. 'నేను కూడా అందంగా ముగ్గులు వేయడం నేర్చుకుంటాను. ఇలాగే ముగ్గుల పోటీలో పాల్గొని అందంగా పేర్చుతాను' అని ఆనందంగా చెప్పింది. సినీనటి తమన్నాకు ముగ్గులపై ఇలా ముచ్చట కలిగిన

మిగతా 4వ పేజీలో...

జూనియర్ కార్యదర్శి పోస్టుల్లో క్రీడా కోటా! 11
పంచాయతీరాజ్ శాఖ నిర్ణయం

రైతుబంధు కోసం రుణం?

రేపే ఢిల్లీకి వెళ్లనున్న అధికారులు

14 కోట్ల రూపాయల జీఎస్టీ ఎగవేత
రిసార్టు సీఎండీ అరెస్టు

 13

మహాకూటమిలో చేరబోం

నవీన్ స్పష్టీకరణ

 4

టీఆర్ఎస్‌లోకి ఎమ్మెల్యే సండ్ర?

చేరిక దాదాపు ఖాయం

తుదిదశకు చేరిన చర్చలు





పరంజ్యోతి
Paramjyothi



ఆత్మను తెలుసుకున్నవాడే శోకాన్ని దాటుతాడు

యోగమనగా కలయిక. జీవాత్మ పరమాత్మల సంయోగమే యోగం. శ్రీకృష్ణుడు భగవద్గీతలో 'సమత్వం యోగ ముచ్యతే' అని యోగవిద్యను నిర్వచించాడు. మనసు, బుద్ధి, ఇంద్రియాలు మున్నగువాని యందు నేనను ప్రజ్ఞ మేలుకొని ఉండటమే యోగం. అంటే.. తానే మనసు కాదని, తన యందే మనసు, ఇంద్రియాలు ఉన్నాయని తెలుసుకోవడం. ఇది తెలిసిన వానికి జీవితమే యోగం. శ్రీకృష్ణుని సాన్నిధ్యములో గోపికలు ఇట్టి స్థితినే అనుభవించారు. సర్వభూతముల యందు తనను, తనయందు సర్వభూతములను ఎవడు చూస్తాడో.. వాడు అభేదంచే సత్యదార్ఢమును అంతటా చూస్తాడు. దీనివల్ల భేదభావము తొలగి ఆత్మానుభూతి కలుగుతుంది. ఇట్టి భక్తుడు తన సర్వకర్మలనూ భగవదర్పితం చేసి ఆయన ధ్యానములో లీనమై ఉంటాడు. ఆయనను విస్మరిస్తే వ్యాకులపడతాడు. గోపికాభక్తి ఈ శ్రేణిలోనిదే. జ్ఞానం వలె, కర్మ కూడా భక్తికి ఆటంకం కాదు. కానీ, కర్మఫలం మాత్రం ఆశించకూడదు. దాని వలన కామ క్రోధాదులు కూడా భగవంతునికే అర్పితమవుతాయి. భక్తి సూత్రాలలో.. దాస్య, కాంత భావములలో దేన్నికైనా అవలంబించవచ్చు. కానీ, వాటి యందు పరిపూర్ణత మాత్రం.. 'భక్తి, భక్తుడు, భగవానుడు' అనే భేదం లేనప్పుడే సిద్ధిస్తుంది. అలాంటి సమదృష్టియే ప్రేమ రూప భక్తి. అందులో జప, తప, వ్రత, నియమపాలన ఉండవు. భగవంతుడు ప్రేమభక్తికి పరవశుడై శీఘ్రమే అనుభవాన్ని ప్రసాదిస్తాడు. కనుక భక్తి అనే ప్రేమ ప్రవాహంలో భక్తుని సంపూర్ణ వ్యక్తిత్వం భగవన్మయమవుతుంది. ఆత్మ-పరమాత్మలు అభేదమనే గ్రహింపు కలుగుతుంది. ఆ దశలో మనసులో కామాదివికారాలుండవు. పరమాత్మ మనకంటే వేరుకాదనే తలంపు వస్తుంది. దీన్నే ప్రేమాద్వైతం, 'రసాద్వైతం' అంటారు. 'చైతన్యమహాప్రభువు' భగవంతుని ప్రియునిగా ఎట్లు ప్రేమించవచ్చునో ప్రత్యక్షముగా ప్రదర్శించి చూపారు. రాధా భావమును పొంది, రాధ కృష్ణుని ప్రేమించినట్లు తాను కూడా కృష్ణుని ప్రేమించడానికి ప్రయత్నించారు. చైతన్యుడే స్వయముగా కృష్ణుడైనా, కృష్ణుని ఎలా ప్రేమించాలో చూపడానికి ఆయన రాధ భావం వహించారు. "విక్షేపరహిత భక్తి ఉదయించగానే రజస్తమోగుణ భావములైన కామలోభాదులచే అభిభూతము కాకుండా, మనస్సు శుద్ధ సత్వమగ్నమై ప్రసన్నమవుతుందని భాగవతం తెలుపుతుంది. శుద్ధ సత్వం గల మనసు నారాయణ చైతన్యంలో లయిస్తుంది.

"గుణనేతా నతీత్యత్రీన్ దేహీదేహ సముద్భవాన్
జన్మమృత్యుజరాదుఃఖైర్విముక్తో మృతమశ్నుతే"

భగవద్భక్తిచే జీవుడు త్రిగుణములను అతిక్రమించి చావు, పుట్టుక, వృద్ధాప్యం, దుఃఖాల నుంచి విముక్తుడై అమృతత్వాన్ని పొందుతున్నాడని "భగవద్గీత గుణత్రయ విభాగ యోగములో గీతాచార్యుడు తెలిపాడు. కనుక దేహభ్రాంతిని వదిలిపెట్టి, మనోబుద్ధులనధిగమించి ఆత్మ యందు లయించడమే జ్ఞానం. అదే ఆత్మజ్ఞానము. "తరతి శోక మాత్మవిత్".. ఆత్మను తెలుసుకున్నవాడు శోకాన్ని దాటుతాడని ఉపనిషద్వచనం.

- మేఘశ్యామ (ఈమని) 8332931376

5 రోజులు.. 200 మంది రుత్వికులు

- మహాయాగం పనులు పరిశీలించిన కేసీఆర్
- సందర్శకుల అనుమతిపై త్వరలో నిర్ణయం



జగదేవపూర్, జనవరి 9: ముఖ్యమంత్రి కేసీఆర్ తన వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించనున్న మహారుద్ర సహిత సహస్ర చండీ మహాయాగం పనులను బుధవారం పరిశీలించారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామ సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో ఈ నెల 21 నుంచి 25 వరకు యాగం నిర్వహించడానికి వేద పండితులు నిర్ణయించారు. మూడేళ్ల కిందట ఇక్కడే అయుత చండీయాగం నిర్వహించిన కేసీఆర్.. గత ఏడాది రాజశ్యామల యాగం నిర్వహించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 88 స్థానాల్లో విజయం సాధించిన ఆయన.. తాజాగా సహస్ర చండీ మహాయాగానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే శృంగేరీ పీఠం పండితులు శశాంక శర్మ, గోపీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో యాగ నిర్వహణ ఏర్పాట్లపై చర్చించారు. ఫాంహౌస్‌లో పది రోజుల క్రితం యాగం పనులకు అంకురార్పణ జరిగింది. బుధవారం మధ్యాహ్నం ఫాంహౌస్‌కు చేరుకున్న కేసీఆర్.. పనులు వేగిరం చేయాలని సూచించారు. ఐదు రోజుల పాటు జరగనున్న ఈ యాగానికి 200 మంది రుత్విక్కులు హాజరవుతుండగా, వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ యాగం పనులను తెలంగాణ పత్రిక ఎడిటర్ అష్టకాల రామ్మోహనశర్మ, శృంగేరి పీఠం పండితులు ఫణిశశాంక శర్మ, గోపీకృష్ణ శర్మ పర్యవేక్షిస్తున్నారు. యాగానికి సంబంధించి కేసీఆర్ శృంగేరి పీఠాధిపతి భారతీ తీర్థ, విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి ఆశీస్సులు, సలహాలు తీసుకున్నారు. ఈ యాగానికి సందర్శకులను అనుమతించే విషయంపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.



ముగ్గుల పోటీల్లో రాష్ట్రస్థాయి విజేతలు ఇందు, విజయలక్ష్మి, సువర్ణ, సుమలతకు చెక్కులు అందజేస్తున్న తారలు తమన్నా, నిత్యానరేశ్, 'ఆంధ్రజ్యోతి' అసిస్టెంట్ ఎడిటర్ వక్కలంక రమణ, న్యూస్ నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్

ముగ్గుకే ముద్దొచ్చె!

(మూడోపేజీ తరువాయి)

సందర్భానికి 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముగ్గుల పోటీ వేదికైంది. టేస్ట్ పార్టనర్ గోల్డ్ డ్రాప్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్, హెల్త్ పార్టనర్ అమృత బిందు సౌజన్యంతో 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' నిర్వహిస్తున్న సంతూర్ గోల్డ్ సోప్ ముత్యాల ముగ్గుల పోటీల్లో భాగంగా రాష్ట్రస్థాయి ముత్యాల ముగ్గుల ఫైనల్స్ అమీర్‌పేటలోని గురుగోవింద్ సింగ్ మున్సిపల్ స్టేడియంలో బుధవారం జరిగాయి. సినీనటి తమన్నా, వర్ధమాన నటి నిత్యానరేశ్ పాల్గొని పోటీలకు మరింత కళ తెచ్చారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ అమెరికా, యూకే వంటి దేశాల్లోనూ బోనాలు, బతుకమ్మ, సంక్రాంతి వంటి పండుగలు ఘనంగా నిర్వహించుకుంటున్నారన్నారు. తమన్నా మాట్లాడుతూ సినిమాలో ముగ్గులు వేయడం ఈజీ అయినా నిజంగా ముగ్గులు వేయడం కష్టమన్నారు. తాను కూడా ముగ్గులు వేయడం నేర్చుకొని ఇలాంటి పోటీలో పాల్గొనే ప్రయత్నం చేస్తానన్నారు. నటి నిత్యానరేశ్ మాట్లాడుతూ చిన్నప్పుడు సంక్రాంతికి పతంగులు ఎగరేస్తుంటే సంతోషంగా గడిపేవాళ్లమన్నారు. 'ఆంధ్రజ్యోతి' అసిస్టెంట్ ఎడిటర్ వక్కలంక రమణ మాట్లాడుతూ సంక్రాంతి పండగ అనగానే మహిళలకు ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు గుర్తుకు వస్తాయన్నారు. అంతకు ముందు జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోనల్, యూసీడీ అదనపు కమిషనర్ హరిచందన ముగ్గుల పోటీలను ప్రారంభించారు. జొన్నలగడ్డ శకుంతల, సి.రజిని పోటీకి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు తమన్నా, రమణ, ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్ చెక్కులను అందజేశారు. ప్రథమ విజేతగా కరీంనగర్ జిల్లా వాస్తవ్యురాలు శ్రీపెల్లి ఇందు (రూ.30వేలు), ద్వితీయ విజేతలుగా వరంగల్ జిల్లాకు చెందిన సుమలత, నల్లగొండ జిల్లాకు చెందిన విజయలక్ష్మి, రంగారెడ్డి జిల్లాకు చెందిన బి.సువర్ణ (రూ.10వేలు) నిలిచారు. మరో ఆరుగురికి కన్సోలేషన్ బహుమతికింద రూ.3వేల చొప్పున చెక్కులను అందజేశారు. పోటీల్లో పాల్గొన్న 10 మందికి స్పాన్సర్స్ గోల్డ్ డ్రాప్ హైదరాబాద్ జోనల్ మేనేజర్ గౌతమ్, డిగ్‌సెల్ సౌత్‌సేల్స్ మేనేజర్ జి.కల్యాణ్ అమృత బిందు, సంజీవిని హెల్త్‌కేర్ ప్రొప్రైటర్ కుశల్ రెడ్డి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు.

ఏడేళ్లుగా పాల్గొంటున్నా

రాష్ట్ర స్థాయిలో గెలవాలన్న నా కల నేరవేరింది. సంక్రాంతి సందడి మొదలైందంటే చాలు 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముగ్గుల పోటీలు ఎప్పుడు నిర్వహిస్తారని ఎదురుచూస్తుంటాను ఏడేళ్లుగా ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నా. ఈ ఏడాది ఫైనల్‌కు రావడంతో పాటు మొదటి స్థానంలో నిలవడం సంతోషంగా ఉంది.

- శ్రీపెల్లి ఇందు , కరీంనగర్, ప్రథమ విజేత

భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి

ముగ్గుల పోటీల్లో రాష్ట్రస్థాయిలో పాల్గొనడం సంతోషంగా ఉంది. భవిష్యత్తు తరాలకు పండుగల ప్రాముఖ్యం తెలియచేప్పేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడుతాయి.

- బి.సుమలత, వరంగల్, ద్వితీయ విజేత

ఫైనల్‌కు రావడం రెండోసారి

నేను ఫైనల్‌కు రావడం ఇదో రెండోసారి. ఈ తరం వారికి సంక్రాంతి ముగ్గుల ప్రత్యేకత ఇలాంటి పోటీల నిర్వహణతో తెలుస్తుంది.

- వి.విజయలక్ష్మి, నల్లగొండ, ద్వితీయ విజేత

ధైర్యాన్ని పెంచుతాయి

ఇళ్లల్లో ఉండే మహిళల్లో ఇలాంటి పోటీలు ధైర్యం నింపుతాయి. ఈ సంవత్సరం మొదటి బహుమతి సాధించాలనే లక్ష్యంతో వచ్చాను. కొంత తేడాతో మొదటి స్థానం కోల్పోయాను.

- బి.సువర్ణ, రంగారెడ్డి, ద్వితీయ విజేత

బాలుడి కడుపులో 400 రాళ్లు

- శస్త్రచికిత్స చేసి తొలగించిన వైద్యులు



ముస్తాబాద్, జనవరి 9: ఆ బాలుడికి కడుపు నొప్పి అంటే చూపించని ఆస్పత్రి లేదు. రకరకాల ఆస్పత్రులు తిప్పి వైద్య పరీక్షలు చేయిస్తే చివరకు బాలుడి పెద్ద పేగుల్లో రాళ్లు ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆపరేషన్ చేసిన వైద్యులు కడుపులో బయటపడ్డ రాళ్లను చూసి ఆశ్చర్యపోయారు. ఎందుకంటే బాలుడి కడుపులో నుంచి ఐదో.. పదో కాదు ఏకంగా 400 రాళ్లు బయటపడ్డాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటకు చెందిన అఫ్రాన్(5)కు తరచూ కడుపునొప్పి రావడంతో అతని తల్లిదండ్రులు ముస్తాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు చేసిన వైద్యులు బుధవారం పేగుల్లో నుంచి 400కు పైగా రాళ్లను తొలగించారు. కాగా, మట్టి తినే అలవాటు ఉన్న బాలుడు.. ఈ రాళ్లను కూడా మింగినట్లు అనుమానిస్తున్నారు.

జగిత్యాలలో రూ.46 లక్షల సెల్‌ఫోన్లు చోరీ



జగిత్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రెండు మొబైల్ దుకాణాలను దొంగలు ఊడ్చేశారు. అర్ధరాత్రి సమయంలో ఇనుపరాడ్లతో షెటర్లను బలవంతంగా తెరిచి.. షాపులో ఉన్న రూ.46లక్షల విలువైన సెల్‌ఫోన్లను అపహరించారు. ఈ ఘటన జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో జీపులో వచ్చిన నలుగురు దొంగలు.. యావర్‌రోడ్డులోని భవానీ సెల్‌పాయింట్ షెటర్లను ఇనుప రాడ్లతో బలవంతంగా తెరిచారు. చేతులకు గ్లౌజులు, ముఖాలకు మాస్క్‌లతో షాపులోకి చొరబడి రూ.30లక్షల విలువైన సెల్‌ఫోన్లతో పాటు రూ.1.30లక్షల నగదును అపహరించారు. అనంతరం పక్కనే ఉన్న లాట్ మొబైల్ షోరూంలో నుంచి రూ.16లక్షల విలువైన సెల్‌ఫోన్లను దొంగిలించారు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు అక్కడి సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా వివరాలు సేకరించారు. మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు చెందిన దొంగలు ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు ఇతర జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాల పోలీసులకు చోరీ విషయమై సమాచారం అందించారు.

టీఆర్ఎస్‌లోకి ఎమ్మెల్యే సండ్ర?



సత్తుపల్లి, జనవరి 9: ఇటీవలి ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఫలితాలు మిగతా జిల్లాలకు భిన్నంగా వచ్చాయి. సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు సండ్ర వెంకట వీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు విజయం సాధించారు. కానీ రాష్ట్రంలో టీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో వారిద్దరు కూడా అధికార పార్టీలో చేరతారని ప్రచారం జరిగింది. అయితే మెచ్చా తాను టీడీపీని వీడే ప్రసక్తే లేదని పలు సందర్భాల్లో స్పష్టం చేయగా తాను ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సండ్ర ఇటీవల వివరణ ఇచ్చారు. అయితే రెండు రోజులుగా ఆయన హైదరాబాద్‌లో టీఆర్ఎస్ అగ్ర నాయకులతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో టీఆర్ఎస్‌లో సండ్ర చేరిక దాదాపు ఖరారైనట్లు మళ్లీ జోరుగా ప్రచారం సాగుతోంది. టీఆర్ఎస్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు, మరో నాయకుడు కూడా ఈ చర్చల్లో పాల్గొన్నారు. దీనిపై సండ్రను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

హైదరాబాద్‌లో జాగృతి యూత్ లీడర్‌షిప్ సదస్సు

- 103 దేశాల ప్రతినిధులు రాక

హైదరాబాద్, జనవరి 9(ఆంధ్ర జ్యోతి): హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు తెలంగాణ జాగృతి ఇంటర్నేషనల్ యూత్ లీడర్‌షిప్ సదస్సు-2019 (టీజేఐవైఎల్‌సీ) జరగనుంది. గాంధేయ మార్గంలో సమగ్ర సుస్థిరాభివృద్ధి ధ్యేయంగా చేపట్టిన, చేపట్టాల్సిన ఆవిష్కరణలు ఈ సదస్సు ఎజెండా. తెలంగాణ జాగృతి సంస్థ ఈ నెల 18, 19, 20 తేదీల్లో మాదాపూర్‌లోని హైటెక్స్ వేదికగా ఈ ప్రతిష్ఠాత్మక సదస్సు నిర్వహిస్తోంది. తమ దేశాల్లో సుస్థిర అభివృద్ధికి విశేష కృషి చేసిన యువ ఔత్సాహిక నేతలను కార్యక్రమానికి ఆహ్వానించారు. 103 దేశాలకు చెందిన 550 మంది యువ ఆవిష్కర్తలు సదస్సులో పాల్గొంటారు. యువత, మహిళలు, నైపుణ్యాభివృద్ధి, సామాజిక అంశాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై చర్చలు ఉంటాయి. వివిధ రంగాల నిష్ణాతులు సదస్సులో ప్రసంగిస్తారు.



రోజుకు 40 మంది రైతుల మృతి

- 146 రోజుల వ్యవధిలో 5,821 మరణాలు: వ్యవసాయ శాఖ

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వివిధ కారణాలతో రోజుకు సగటున 40 మంది రైతులు చనిపోతున్నారు. బుధవారం రాష్ట్ర వ్యవసాయశాఖ విడుదల చేసిన రైతుబీమా' నివేదికలో ఈ వివరాలు వెల్లడించారు. 2017 ఆగస్టు 14 అర్ధరాత్రి నుంచి రాష్ట్రంలో రైతు జీవిత బీమా పథకం ప్రారంభమైన విషయం విదితమే. ఇప్పటివరకు 146 రోజుల వ్యవధిలో రాష్ట్రంలో 5,821 రైతులు మృతి చెందారు. అంటే సగటున 40 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటివరకు 5,525 మంది నామినీ ఖాతాలో రూ.5 లక్షల చొప్పున రూ.276.25 కోట్లు జమచేశారు. బుధవారం వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారధి ఈ పథకంపై ఆ శాఖ ఉన్నతాధికారులు, ఎల్ఐసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రతిపాదనల్లో ఏమైనా తప్పులు ఉంటే జిల్లా నోడల్ అధికారులు చొరవ తీసుకొని, ఒక్కో కేసును పరిశీలించాలన్నారు.

పోలీసులకు 8 గంటలే డ్యూటీ!

(మూడోపేజీ తరువాయి)

ప్రభుత్వం అధిక ప్రాధాన్యం కల్పించింది. ఇప్పటికే 10 వేల మంది ఎస్సై, కానిస్టేబుల్ స్థాయిలో నియమితులయ్యారు. మరో 18 వేల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. మరో ఆరు నెలల్లో 12 వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడనుంది. దశల వారీగా నియామకాలు జరుగుతున్నందున షిఫ్టులు, వారాంతపు సెలవులను ఆచరణలోకి తేవాలని అధికారులు భావిస్తున్నారు. పోలీసింగ్ మెరుగుపడాలంటే షిఫ్ట్ పద్ధతే సరైనదని బ్యూరో ఆఫ్ పోలీసు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్‌డీ), ఆస్కీ సంయుక్త అధ్యయనంలో తేలింది. సెలవులు లేకుండా నిరంతరం విధుల్లో ఉండటం వల్ల ప్రజలకు మెరుగైన సేవలందక పోవడమే కాకుండా పోలీసులు అనారోగ్యం పాలవుతున్నారని సర్వే తేల్చింది. అదనపు గంటలు పని చేసిన సిబ్బందికి అదనపు అలవెన్సులు ఇవ్వాలని, రవాణా అలవెన్స్ తప్పకుండా అందేట్లు చూడాలని సూచించింది. ఎనిమిది గంటల షిఫ్ట్‌తో మెరుగైన ఫలితాలు రాబట్టవచ్చని, వారానికొక రోజు సెలవు ఇవ్వడం వల్ల పోలీసులు మానసికంగా ధృడంగా ఉంటారని పేర్కొంది. నివేదికను తెలంగాణలో పూర్తి స్థాయిలో అమల్లోకి తెచ్చేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. కమిషనర్లు, జిల్లా ఎస్పీల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. బీపీఆర్‌డీ నివేదిక పూర్తి స్థాయిలో అమలు



చేయడం సాధ్యమవుతుందా? అమలు చేయాలంటే ఆయా కమిషనరేట్లు, ఎస్పీల పరిధిలో ఎంత మంది సిబ్బంది ఉండాలి? వంటి వివరాలు రాబడుతున్నారు. వారినుంచి పూర్తి నివేదిక అందిన తర్వాత 8 గంటల పని విధానం అమలు, అదనపు పని గంటలకు అలవెన్సుల చెల్లింపు, వారాంతపు సెలవుపై నిర్ణయం తీసుకోనున్నారు. పంచాయతీ ఎన్నికల హడావిడి ముగిసిన తర్వాత నూతన విధానం అమల్లోకి రానున్నట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల అనంతరం పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. నల్లగొండ జిల్లాలో వారాంతపు సెలవులు ప్రయోగాత్మకంగా చేపట్టి విజయవంతంగా కొనసాగించినా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నాలుగు నెలలుగా వారాంతపు సెలవుల విధానాన్ని రద్దు చేశారు.

పెరిగిన పని ఒత్తిడి

గతంలో నేరాల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల పోలీసుల సంఖ్య తక్కువైనా మేనేజ్ చేయగలిగారు. నిరంతర ఒత్తిడి లేకపోవడం వల్ల షిఫ్ట్ పద్ధతిలో పని చేయాల్సిన అవసరం లేకుండా పోయింది. కాల క్రమేణా సామాజిక పరిస్థితులు మారడంతో నేరాల సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది. పోలీసుల పనిభారం పెరిగింది. 24 గంటలూ పని ఒత్తిడితో పోలీసులు అనారోగ్యం పాలవుతున్నారని సర్వేలో తేలింది. షిఫ్టు విధానం అమలు చేస్తే పోలీసుల పనితీరును 1.68 రెట్లు మెరుగుపరుచుకోవచ్చని చెబుతున్నారు. ప్రస్తుతం దేశంలో పోలీసు స్టేషన్లలో సిబ్బంది ఉండాల్సిన దాంట్లో 30 శాతం మాత్రమే అందుబాటులో ఉన్నారు. దీన్ని పెంచేందుకు తెలంగాణ సర్కారు భారీ ఎత్తున రిక్రూట్‌మెంట్లు చేపడుతోంది.

బీపీఆర్‌డీ భారీ సర్వే

బీపీఆర్‌డీ, ఆస్కీ దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాల్లో 319 పోలీసు స్టేషన్ల పరిధిలో 12,156 మంది కానిస్టేబుళ్లు, 1003 మంది స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, 962 మంది సూపర్‌వైజరీ స్థాయి అధికారుల అభిప్రాయాలను సేకరించి అధ్యయనం చేశారు. మెట్రోపాలిటన్, అర్బన్, అర్బన్-రూరల్ మిక్స్‌డ్, రూరల్, క్రైం, ట్రాఫిక్, వుమెన్, ట్రైబల్ ఇతర తదితర 9 రకాల పోలీసు స్టేషన్లను శాంపిల్‌గా తీసుకున్నారు. 8 గంటల షిఫ్టు విధానం అమలు చేయాలంటే ఎంత మంది సిబ్బంది అవసరమో కూడా లెక్కించారు. విరామం లేకుండా డ్యూటీలో ఉండటం వల్ల పనితీరు మందగిస్తుందని, పోలీసు వ్యవస్థతో రావాల్సిన మంచి ఫలితాల కన్నా దుష్ఫలితాలు వస్తాయని అధ్యయనంలో పేర్కొన్నారు.

లోకం తీరు



ఓట్లకోసం అనుకున్నావా...
నీ అభివృద్ధి కోసమే చేస్తున్నా...

చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	13.0	31.0
వరంగల్	10.5	28.5
నిజామాబాద్	11.9	28.1
హైదరాబాద్	10.9	29.8
నల్లగొండ	15.0	29.0

ఏడు జిల్లాల్లో చలిగాలులు!

హైదరాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి) : ఉత్తర, ఈశాన్య దిశల నుంచి వీస్తున్న చలిగాలుల ప్రభావంతో ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో చలిగాలులు ఎక్కువ వీయవచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో రాగల మూడు రోజుల్లో పొడి వాతావరణమే ఉంటుందని తెలిపారు.



ముఖ్యమంత్రిలా కాదు క్లర్క్‌లా పనిచేస్తున్నా

"ప్రతి విషయంలో కాంగ్రెస్ జోక్యం చేసుకుంటుంది. తమకు అనుకూలంగా పనిచేయాలని బలవంతపెడుతుంది. దీంతో రాష్ట్ర ముఖ్యమంత్రిలా కాకుండా.. ఒక క్లర్క్‌లా వాళ్లు చెప్పింది చేయాల్సి వస్తుంది."

- జేడీఎస్ ఎమ్మెల్యేలతో కర్ణాటక సీఎం కుమారస్వామి



కాంగ్రెస్ ఎమ్మెల్యేకు రూ.100 కోట్ల గాలం

మధ్యప్రదేశ్‌లో కమల్‌నాథ్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు మా ఎమ్మెల్యే బాజీనాథ్ కుశావహను బీజేపీ ఎమ్మెల్యే నారాయన్ త్రిపాఠి ఓ దాబాకు తీసుకెళ్లారు. బీజేపీకి సహకరిస్తే త్రిపాఠికి 100 కోట్లు, మంత్రి పదవి ఇస్తామని ఆశ చూపారు. కానీ ఈ డీల్‌కు కుశావహ ఒప్పుకోలేదు

- కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.72.67	పాత ధర 67.66
కొత్త ధర రూ.73.07	కొత్త ధర 67.98
పెరుగుదల 40 పైసలు	పెరుగుదల 32 పైసలు



సోషల్ మీడియాతో మానసిక రుగ్మత!

హూస్టన్, జనవరి 9: ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడపడం, తమను ఇతరులతో పోల్చుకోవడం వంటి ప్రతికూల లక్షణాలు తీవ్రమైన మానసిక రుగ్మతకు సూచనలని అమెరికాలోని టెక్సాస్ స్టేట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఫేస్‌బుక్, ట్విటర్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ వంటి సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్న 504 మంది టీనేజర్లపై శాస్త్రవేత్తలు అధ్యయనం చేశారు. వారిలో ఎక్కువ మందికి సోషల్ మీడియాలో గడపడం వ్యసనంగా మారి ఎదుటివారికంటే తాము తక్కువనే భావనలో ఉంటారని గుర్తించారు. ప్రాముఖ్యత లేని చిత్రాల్లో తమను ట్యాగ్ చేయడానికి, అలాగే ఇతర వ్యక్తులతో కలిసి దిగిన ఫొటోలను పోస్ట్ చేయడానికి కూడా వారు ఇష్టపడరని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

రక్త ప్రసరణను పర్యవేక్షించే సెన్సర్!

బోస్టన్, జనవరి 9: ధమనుల్లో రక్త ప్రసరణను పర్యవేక్షించేందుకు శాస్త్రవేత్తలు ఒక బయోడీగ్రేడబుల్ (జీవశైథిల్య) సెన్సర్‌ను రూపొందించారు. బ్యాటరీ అవసరం లేని ఈ వైర్‌లెస్ సెన్సర్.. రక్తనాళాల శస్త్రచికిత్సలో డాక్టర్లకు ఎంతగానో ఉపయోగపడుతుందని అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ పరిశోధకులు తెలిపారు. రోగి శరీరంలో ఎక్కడైనా రక్తం నిలిచిపోతే ఈ పరికరం వెంటనే డాక్టర్లను హెచ్చరిస్తుంది.

తొలి విడతకు ముగిసిన నామినేషన్లు

చివరిరోజు భారీగా తరలివచ్చిన అభ్యర్థులు.. దేవరకొండ ఎమ్మెల్యే తండ్రి.. సర్పంచ్‌గా ఏకగ్రీవం

- నల్లగొండ జిల్లాలో సర్పంచ్ పదవులకు వేలం పాట
- గుర్రంపోడు సర్పంచ్ పదవి రూ.63.30 లక్షలు
- రిజర్వేషన్ల తగ్గింపుపై సుప్రీంకోర్టుకు ఆర్.కృష్ణయ్య
- రైతు సమన్వయ సమితి సభ్యులూ పోటీ చేయొచ్చు: ఈసీ

ఊరు మనదిరా

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

గ్రామ పంచాయతీ తొలివిడత ఎన్నికలకు నామినేషన్ల గడువు ముగిసింది. నామినేషన్ల చివరిరోజైన బుధవారం పెద్ద సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో నామినేషన్ కేంద్రాలు కిక్కిరిపోయాయి. మొత్తం 4480 పంచాయతీలకు, 39,832 వార్డులకు భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. గురువారం నామినేషన్ పత్రాల పరిశీలన అనంతరం.. వాటిలో ఎన్ని సరైనవన్నది ఎన్నికల అధికారులు సాయంత్రానికి ప్రకటిస్తారు. తిరస్కరించిన నామినేషన్లకు సంబంధించి శుక్రవారం (ఈ నెల 11న) అప్పీలు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. నామినేషన్లపై ఈ నెల 12న ఎన్నికల కమిషన్ తుది నిర్ణయం వెలువరుస్తుంది. 13న నామినేషన్లు ఉపసంహరణకు గడువు ఉంటుంది. అదే రోజు ఎన్నికల బరిలో నిలిచిన మొత్తం అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తారు. ఈ నెల 21న పోలింగ్ జరుగుతుంది. కాగా నల్లగొండ జిల్లా దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తండ్రి కన్నీలాల్.. తన సొంత గ్రామమైన రత్యా తండాకు సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా ఇదే మండలంలోని తాటికల్ గ్రామ సర్పంచ్ పదవికి అత్తా కోడళ్ల మధ్య పోటీ ఏర్పడింది. సొంత అన్నదమ్ములు రెండు గ్రూపులుగా విడిపోయి.. ఒకరు తన భార్యను, మరొకరు తల్లిని పోటీకి నిలిపారు. ఇక గుర్రంపోడు మండల కేంద్రంలో సర్పంచ్ పదవిని వేలం వేశారు. దీంతో అధికార పార్టీ నాయకుడొకరు రూ.63.30 లక్షలకు దక్కించుకున్నారు. ఇదే మండలంలోని చామలేడు గ్రామ సర్పంచ్ పదవిని రూ.16.50 లక్షలకు, మైలాపురంలో రూ.16.50 లక్షలకు, తేనెపల్లిలో రూ.8లక్షలకు సర్పంచ్ పదవులను వేలం పాటలో నాయకులు దక్కించుకున్నారు.జోగుళాంబ గద్వాల, మంచిర్యాల జిల్లాల్లో ఐదు పంచాయతీలకు వేలం పాటలు నిర్వహించి, ఏకగ్రీవం చేసుకున్నారు. ఇక రాష్ట్రంలోనే అతి చిన్న పంచాయతీ అయిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలంలోని దొంగతోగు పంచాయతీ ఎన్నిక ఏకగ్రీవమయింది. కేవలం 34 మంది ఓటర్లు మాత్రమే ఉన్న ఈ పంచాయతీ సర్పంచ్‌గా. బాయమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వార్డు సభ్యులు, ఉప సర్పంచ్ ఎన్నిక కూడా ఏకగ్రీవంగా జరిగింది.



సూర్యాపేట జిల్లా మాధవరం సర్పంచ్‌గా ఎన్నికైన నంద్యాల విజయలక్ష్మి

మాధవరం పంచాయతీకి అంతా మహిళలే!

సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని మాధవరం గ్రామ పంచాయతీకి సర్పంచ్‌గా, వార్డు సభ్యులుగా అంతా మహిళలే ఎన్నికయ్యారు. టీఆర్ఎస్‌కు చెందిన నంద్యాల విజయలక్ష్మిని సర్పంచ్‌గా, సీపీఎంకు చెందిన జానకమ్మను ఉపసర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఈ విషయంలో మహబూబ్‌నగర్ ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి చొరవ తీసుకున్నారు. మరోవైపు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు తగ్గించడంపై బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం వచ్చే వారం విచారణకు రావచ్చని సమాచారం. ఇక పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌తోపాటు వార్డు సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నికైతే ఆ ప్రకటన వెలువరించిన రోజునే ఉప సర్పంచ్‌ను కూడా ఎన్నుకుంటారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. రైతు సమన్వయ సమితి సభ్యులు తమ పదవులకు రాజీనామా చేయకుండానే పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయవచ్చునని పేర్కొంది. మరోవైపు పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో గ్రామ, మండల స్థాయి అధికారులకు భాగస్వామ్యం కల్పించాలని కోరుతూ సీఈవో రజత్‌కుమార్‌కు టీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ వినతిపత్రం సమర్పించారు.

కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి కిడ్నాప్..?

దౌల్తాబాద్: వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం నీటూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయాల్సిన విశ్వనాథ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. విశ్వనాథ్ గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందా రు. తాజాగా గ్రామం బీసీ జనరల్‌గా రిజర్వు కావడంతో ఈసారి సర్పంచ్ బరిలో నిలిచేందుకు గ్రామస్థులు, పార్టీ నాయకులు నిర్ణయించారు. విశ్వనాథ్ మంగళవారం అర్ధరాత్రి పశువులకు మేత వేసేందుకు వెళ్లి అదృశ్యమయ్యాడు. దీంతో భార్య నిర్మల పోలీసులకు ఫిర్యాదు చేసింది. విశ్వనాథ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి గేటు దగ్గర విద్యుత్ బల్బును తొలగించి కిడ్నాప్ చేశారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మాజీ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి గ్రామానికి చేరుకొని విశ్వనాథ్ కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వికారాబాద్ ఎస్పీ అన్నపూర్ణకు ఫోన్‌లో విషయాన్ని వివరించారు. పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి,కిడ్నాప్ అయిన విశ్వనాథ్ (ఇన్‌సెట్లో)

ఇద్దరు సైబర్ నేరస్తుల అరెస్టు

- లాటరీ పేరుతో ప్రజలకు టోకరా

వరంగల్ అర్బన్ క్రైం, జనవరి 9: లాటరీ పేరుతో కోటి రూపాయలకు టోకరా వేసిన నైజీరియన్ సైబర్ నేరస్తుడితో పాటు అతడికి సహకరించిన నాగాలాండ్ మహిళలను వరంగల్ కమిషనరేట్ పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ. 2.03 లక్షల నగదుతో పాటు 2 ల్యాప్‌టాప్‌లు, 23 సెల్‌ఫోన్లు, విదేశీ పాస్‌పోర్టును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం వరంగల్ సీపీ రవీందర్ ఇద్దరు నిందితులను మీడియాకు చూపించి వివరాలను వెల్లడించారు. నైజీరియా దేశానికి చెందిన డిమ్యూయేన్ ఉచేన్, నాగాలాండ్ రాష్ట్రం, డిమాపూర్ జిల్లా అంగామికి చెందిన హినియాలు ఒక టీమ్‌గా ఏర్పడి సైబర్ నేరాలకు పాల్పడే వారు. ఢిల్లీ కేంద్రంగా ఉంటూ అమాయక ప్రజలకు కోట్లలో లాటరీ తగిలిందని బల్క్ మెసేజ్‌లు పంపిస్తారు. తిరిగి అడ్రస్‌లు, మెయిల్స్ పంపించిన వారిని ముగ్గులోకి లాగి మోసం చేసే యత్నం చేస్తారు. అమాయకులను నమ్మిస్తూ డబ్బులు పంపించాలంటే ఇమిగ్రేషన్, కస్టమ్స్ ట్యాక్స్, మనీ ల్యాండరింగ్, టెర్రరిస్ట్ సర్టిఫికెట్, ఆర్‌బీఐ క్లియరెన్స్ సర్టిఫికెట్లు పొందాల్సి ఉందని దశలవారీగా డబ్బులు లాగేస్తారు. ఇలా చాలా మంది నుంచి రూ.కోటి వరకు టోకరా వేశారు. ఈ క్రమంలో వరంగల్ రూరల్ జిల్లా శాయంపేట మండలం మైలారం గ్రామానికి చెందిన సిరిపురం మహేందర్ అనే వ్యక్తి నుంచి 2017లో 12 అకౌంట్లలో రూ.10 లక్షలు డిపాజిట్ చేయించుకున్నారు. చివరికి డబ్బులు రాకపోవడంతో వారికి ఫోన్ చేయగా ఆ ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి ఉన్నాయి. దీంతో ఇటీవల బాధితుడు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసును సైబర్ పోలీసులకు అప్పగించారు. సైబర్ పోలీసులు బాధితుడికి వచ్చిన మెయిల్స్, ఫోన్‌కాల్స్ ఆధారంగా ఢిల్లీలో ఇద్దరిని అరెస్టు చేశారు. వారిని విచారించగా నేరాన్ని అంగీకరించారు. పోలీసులు వారి నుంచి నగదు, ల్యాప్‌టాప్స్, సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు.

'మేడారం' హామీలన్నీ అమలు చేస్తాం : కడియం

మేడారం , జనవరి 9 : మేడారం మహాజాతర అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి తీరుతారని మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క-సారలమ్మను బుధవారం ఆయన కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. బెల్లం (బంగారం), చీరను తల్లులకు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కడియం విలేకరులతో మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మల దీవెనలతోనే 2018 ఎన్నికల్లో కేసీఆర్ నాయకత్వంలో టీఆర్ఎస్ ఘన విజయం సాధించిందన్నారు 2016, 2018లో జరిగిన మహా జాతరల్లో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించడం కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం వందల కోట్లు వెచ్చించిందని అన్నారు. వచ్చే మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించడానికి, ఏడాది పొడవునా భక్తులు దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.

ప్రబుద్ధుల వల్లే ఓటమి: పొంగులేటి



తల్లాడ, జనవరి 9: కొందరు ప్రబుద్ధుల వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో టీఆర్ఎస్ అభ్యర్థులు ఓడిపోయారని ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా తల్లాడ మండలం రంగంబంజర్‌లో సుమారు 400 మంది ఎంపీ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంపీ మాట్లాడుతూ నాయకుడి నడవడికను బట్టే ప్రజలు ఆదరిస్తారని, నచ్చకపోతే ఓడిస్తారని అన్నారు. ఓటమికి గల కారణాలపై బహిరంగ వేదికలపై ఆరోపణలకు దిగడం సమంజసం కాదన్నారు. రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలన్నారు. రబీసీజన్‌లో ఇప్పటికే సాగుచేసిన వరిపైర్లకు సాగర్ జలాలు విడుదల విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి, తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గత పాలకుల హయాంలో గీతవృత్తి నిర్లక్ష్యం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : గత పాలకుల హయాంలో గీతవృత్తి నిర్లక్ష్యానికి గురైందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం గౌడ ఐక్య సాధన సమితి క్యాలెండర్ ఆవిష్కరణలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో కల్లు దుకాణాలను మూసి వేసి గీతవృత్తిని నిర్వీర్యం చేయాలని గత ప్రభుత్వాలు చూశాయని విమర్శించారు. గీత కార్మికులు ఆర్థికంగా ఎదిగేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. చెరువు కట్టలపై తాటి, ఈత చెట్ల పెంపకం బాధ్యతలను ఇరిగేషన్ శాఖకు అప్పగించి గీత కార్మికుల భవిష్యత్తుకు కేసీఆర్ భరోసానిచ్చారన్నారు. చెట్ల పన్నును రద్దు చేయడంతో పాటు గీత కార్మికులకు పింఛన్లు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు.

ఆత్మకూర్ శివారులో చిరుత కళేబరం



మెట్‌పల్లి రూరల్, జనవరి 9 : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని ఆత్మకూర్, నిజామాబాద్ జిల్లా కమ్మరిపల్లి మండలం కోనాపూరం సరిహద్దులో బుధవారం చిరుత పులి కళేబరం లభ్యమైంది. నాలేగండి అటవీ ప్రాంతంలోకి గొర్రెలను మేపడానికి వెళ్లిన ఆత్మకూర్‌కు చెందిన ఇరువురు వ్యక్తులు అక్కడ రాళ్ల మధ్య పడి ఉన్న చిరుత కళేబరాన్ని గమనించి గ్రామస్థులకు చెప్పారు. సమాచారం అందుకున్న మెట్‌పల్లి అటవీ శాఖ అధికారులు కళేబరాన్ని, ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిరుతకు మూడు నుంచి నాలుగేళ్ల వయస్సు ఉంటుందని, రెండు నెలల క్రితం మృతి చెంది ఉంటుందని అంచనా వేశారు. ఈ చిరుత ఎలా మరణించిందన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

కవి ఆడెపు మృతి



సిరిసిల్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కవి, రంగస్థల నటుడు ఆడెపు నారాయణ (90) మంగళవారం రాత్రి తుదిశ్వాసను విడిచారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం హన్మాజీపేటకు చెందిన నారాయణ... వ్యాపారరీత్యా చాలా కాలం క్రితమే సిరిసిల్లకు వచ్చి స్థిరపడ్డారు. సిరిసిల్లలో సాహిత్య సమితిలో కీలక బాధ్యతలను పోషిస్తూ అనేక కార్యక్రమాలను చేపట్టారు. 1932లో జన్మించిన నారాయణ సాహిత్యంలో దాదాపు 20 సంకలనాలను వెలువరించారు. సాహిత్య సమితి ద్వారా ముద్రించే ప్రతి సంకలనంలోనూ నారాయణ కవిత్వం ఉండేది. 64 వసంతాల సినారె జన్మదినం సందర్భంగా 'సిరివెలుగు' పురస్కారాన్ని నారాయణ అందుకున్నారు. సినారెకు ఆయన చిరకాల మిత్రుడు.

శబరిమలలో ఘర్షణ వాతావరణంతో మాల ధరించిన అయ్యప్పలు అక్కడి వెళ్లి ఇరుముడి సమర్పించాలంటే జంకుతున్నారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లికి చెందిన పలువురు తమ ఇరుముడులను బుధవారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి అయ్యప్పస్వామికి సమర్పించారు. - నార్కట్‌పల్లి

'సమతూక' తీర్పు!

సీబీఐ డైరక్టర్‌గా అలోక్‌వర్మను సుప్రీంకోర్టు తిరిగి నియమించడంతో రెండున్నర నెలల క్రితం బలవంతపు సెలవుమీద వెళ్ళవలసి వచ్చిన ఆయన తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఈ తీర్పు అలోక్‌కు ఎంత సంతృప్తినిచ్చిందో తెలియదు కానీ, విపక్షాలు మాత్రం దీనిని మోదీ ప్రభుత్వానికి అవమానకరమైనదిగా, ఎదురుదెబ్బగా అభివర్ణించాయి. ఈ తీర్పు ప్రధానిపైనా, ఆయన కార్యాలయంపైనా నేరారోపణ అని అంటున్నాయి. రాఫెల్ సహా అనేక కుంభకోణాలపై అలోక్ ఆధ్వర్యంలో సీబీఐ చేపట్టబోతున్న దర్యాప్తును ఇక ఎవరూ ఆపలేరని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. సీబీఐ డైరక్టర్‌ను తప్పించే అధికారం సీవీసీకి, కేంద్ర ప్రభుత్వానికీ ఉన్నాయా? అన్న ప్రశ్న చుట్టూ వాదనలు సాగి, ఢిల్లీ ప్రత్యేక పోలీసు చట్టం నిబంధనల ప్రకారం సెలక్షన్ కమిటీకి తప్ప వేరెవరికీ సీబీఐ డైరక్టర్‌ను తప్పించే అధికారం లేదన్న ప్రమాణాల ప్రకారం చెప్పిన తీర్పు ఇది. అందువల్ల, సెలక్షన్ కమిటీ మాత్రమే ఆలోక్ విషయాన్ని తేల్చాలనీ, అంతవరకూ ఆయన విధాన పరమైన నిర్ణయాలేవీ చేయకూడదని అనడం అలోక్‌కు నైతిక విజయం మాత్రమే.

ఒక సర్వస్వతంత్ర సంస్థ పనితీరులో జోక్యం కూడదన్న మౌలిక ఆకాంక్షను సుప్రీంకోర్టు ఈ తీర్పుతో నిలబెట్టింది. అలోక్ స్థానంలో ఎవరినీ నియమించకపోయినా, సెలవుపై పంపేయడాన్ని ఎన్ని మారుపేర్లతో పిలిచినా అది జోక్యం కిందకే వస్తుందన్నది తీర్పు సారాంశం. కొన్ని అనూహ్యమైన, నివారించలేని పరిస్థితుల్లో తాత్కాలికంగా ఈ నిర్ణయం చేశామన్న ప్రభుత్వ వాదనను కూడా సుప్రీంకోర్టు అంగీకరించలేదు. అధికారంగా బదిలీ జరిగినా, లేకున్నా సీబీఐ డైరక్టర్‌ను సవ్యంగా పనిచేసుకోనివ్వకపోవడమే ప్రభుత్వ ఉద్దేశమని సుప్రీంకోర్టు భావించింది. సీబీఐకు ఉన్న స్వేచ్ఛ, స్వతంత్రలను పరిరక్షించాల్సిన ఆవశ్యకతను మారోమారు గుర్తుచేయడంతో పాటు, వాటిని కాపాడేందుకు న్యాయపరంగా, రాజ్యాంగపరంగా పడిన పునాదులను కూడా సుప్రీంకోర్టు గుర్తుచేసింది. అయితే, ఇంతటి ఘాటైన తీర్పు చెప్పి కూడా తిరిగి సెలక్షన్ కమిటీ చేతుల్లో అంతిమ నిర్ణయాధికారాన్ని పెట్టడం ఆశ్చర్యం కలిగించే విషయం. అలోక్‌ను సెలవుపై పంపడమంటే ఉద్యోగం చేయకుండా అడ్డుపడటమేనని భావించి, అనుసరించిన విధానం కూడా అక్రమమని నిర్ధారించి తిరిగి ఆయనను కుర్చీలో కూర్చోబెట్టిన సుప్రీంకోర్టు, అందుకు భిన్నంగా అనేక పరిమితులతో అలోక్ కాళ్ళూ చేతులు కట్టేయడం విచిత్రం. అలోక్ శక్తులను ఉపసంహరించిన ప్రభుత్వ ఆదేశాలనూ, ఇందుకు ఆధారంగా పనిచేసిన చీఫ్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) సూచనలను పక్కనబెట్టేసిన సుప్రీంకోర్టు అలోక్‌ను నేరుగా అక్టోబర్ 23నాటి పూర్వస్థితిలో ప్రతిష్ఠించి ఉంటే సరిపోయేది. అలోక్ కేసులో వాదోపవాదాలన్నీ ఆయనను బలవంతపు సెలవుపై పంపిన సాంకేతికాంశాల చుట్టూ సాగాయి. ప్రభుత్వాన్ని ఈ తీవ్ర నిర్ణయానికి పురిగొల్పిన అవినీతి ఆరోపణలు, అంతర్గత పోరు ఇత్యాది అంశాల జోలికి కోర్టు పోలేదు. అందువల్ల, తీర్పులో సైతం ఈ అంశాలను పరిగణించాల్సిన, అలోక్‌ను నియంత్రించాల్సిన అవసరం లేదు. ఆదేశాలు అక్రమమన్న తరువాత, అక్రమ ఆదేశాల వెనుక దురుద్దేశాలు ఉన్నాయన్నాక, ఆ దురుద్దేశాలను పాక్షికంగానైనా సమర్థించే విధంగా తీర్పు ఉండటం సముచితం కాదు. జైట్లీ మాటల్లో చెప్పాలంటే ఈ సమతూకమైన తీర్పు వల్ల ప్రభుత్వం గతకాలపు అర్ధరాత్రి కుట్రలో చేయలేనిది సెలక్షన్ కమిటీ మార్గంలో సాధించగలిగే అవకాశం ఏర్పడింది. ఈ నెలాఖరుకు రిటైర్ కాబోతున్న అలోక్ నిజానికి ప్రభుత్వ చట్టవ్యతిరేక చర్య వల్ల ఇప్పటికే మూడునెలల కాలాన్ని నష్టపోయారు. ఈ విషయంలో ఆయనకు ఎటువంటి న్యాయం చేకూర్చాలో సుప్రీంకోర్టు చెప్పలేదు. అలాగే, తాత్కాలిక డైరక్టర్‌గా నాగేశ్వరరావు నియామకం సరికాదన్నప్పటికీ, గత రెండునెలల కాలంగా ఆయన తీసుకున్న పలు కీలకమైన నిర్ణయాలను సుప్రీంకోర్టు తక్షణమే సమీక్షించకుండా వాయిదావేసింది. దీనితో ఈ తీర్పు యథాతథస్థితిని కొనసాగించిందే తప్ప అంతిమంగా న్యాయం చెప్పలేదన్న భావన కలగక తప్పదు. ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రతిపక్ష నాయకుడితో కూడిన ఎంపిక కమిటీ అలోక్ భవితవ్యాన్ని తేల్చవలసి ఉంది. తీర్పు రాసిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, తీర్పు చెబుతున్న రోజు కోర్టుకు హాజరు కాలేదు. బుధవారం జరిగిన ఎంపిక కమిటీ సమావేశానికి సైతం రంజన్ గొగోయ్ తన తరఫున జస్టిస్ సిక్రీని పంపారు. నేడు మరోమారు జరగబోతున్న భేటీ అలోక్‌కు ఏ విధంగా న్యాయం చేస్తుందో చూడాలి.

రావణవిమానం ఉండగా రాఫెల్ ఎందుకు?

సందర్భం



■ కె. శ్రీనివాస్

శాస్త్రీయ దృష్టి, మానవత, సత్యాన్వేషణా స్ఫూర్తి, సంస్కరణ– వీటిని అభివృద్ధి చేయడం భారత రిపబ్లిక్ ప్రజల ప్రాథమిక కర్తవ్యాలలో ఒకటని రాజ్యాంగం చెబుతున్నది. నవభారతాన్ని ఆధునిక భారతదేశంగా తీర్చిదిద్దేందుకు మొదటి తరం ప్రభుత్వాలు అత్యున్నత స్థాయి శాస్త్రవిజ్ఞాన సంస్థలను పరిశోధనావ్యవస్థలను ఏర్పరచాయి. అంతర్జాతీయంగా వివిధ విజ్ఞానరంగాలలో సాగుతున్న పురోగతిని అందుకోవడం, దేశీయ ఆవిష్కరణలను సాధించడం, అంతరిక్ష పరిశోధన, అణుశక్తి, రక్షణ వంటి కీలకరంగాలలో స్వావలంబన సాధించేందుకు ప్రాథమిక వనరులు కల్పించడం– ఇటువంటి ఆశయాలనేకం స్వతంత్ర భారతం లక్ష్యాలుగా పరిగణన పొందేవి. రాజకీయ మిత్రదేశాలనుంచో, వాణిజ్య మిత్రదేశాల నుంచో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాలను అవసరమైనప్పుడు దిగుమతి చేసుకోవడం కూడా భారతదేశం చేస్తూ వస్తున్నది. అయినప్పటికీ, ఏవో కొన్ని రంగాలు మినహా, శాస్త్రవిజ్ఞాన రంగాలలో మౌలిక ఆవిష్కరణలలో భారతదేశం ఘనవిజయాలు సాధించిందని చెప్పలేము. అందుకోసం, మలితరం ప్రభుత్వాలు పెద్దగా శ్రద్ధను ప్రదర్శించడం కానీ, భారీ పెట్టుబడులు పెట్టడం కానీ చేయలేదు. ఫలితంగా, దేశానికి చెందిన ఎన్నో విలువైన, నాణ్యమైన మేధలు సంపన్నదేశాలకు వలసవెళ్లాయి. ఆయా దేశాల ప్రతినిధులుగా నోబెల్ బహుమతులను కూడా సాధించాయి. పెద్ద పెద్ద సంస్థలలో కీలకస్థానాలను చేపట్టగలిగాయి.



దేశంలో శాస్త్రవిజ్ఞానరంగాల పురోగతి ఎట్లా ఉన్నా, స్వాతంత్ర్యానంతరం మొత్తం మీద సమాజంలో వైజ్ఞానిక దృష్టి, హేతువాదం, వేగంగా, సార్వత్రికంగా కాకపోయినా, ఎంతో కొంత పెరుగుతూ వస్తున్నాయని చెప్పుకోవచ్చు. మత విశ్వాసాలు, సాంస్కృతిక ఆచారాలు, కులమతాలకు సంబంధించిన దృక్పథాలు– వీటి విషయంలో ఏ మార్పూ కనిపించనట్టు, పైపెచ్చు ఇంకా బలపడుతున్నట్టు కనిపిస్తున్నా– లౌకిక వ్యవహారాలలో సెక్యులర్‌గా ఉండడం, హేతుబద్ధ ఆలోచనలు కలిగి ఉండడం ఆధునికం అన్న అవగాహన యువతరాలలో కనిపిస్తూ వచ్చింది. దేశ పురోగతికి అది మాత్రమే సరిపోదు, జీవనవిలువలన్నిటినీ ప్రభావితం చేయగలిగిన వైజ్ఞానికత బలంగా వ్యాపించాలి. అందుకు గట్టి రాజకీయ సంకల్పం కూడా కావాలి. సెంట్రిస్టులమని, ప్యూడలిజానికి వ్యతిరేకులమని చెప్పుకునే రాజకీయ పక్షాలకు, ప్రభుత్వాలకు అటువంటి నిబద్ధత ఏదీ లేకపోయింది. వారి నిజాయితీ రాహిత్యం ఫలితంగానూ, వామపక్షవాదుల వైఫల్యం కారణంగానూ తిరోగామి ఆలోచనలది పైచేయి కావడం, హేతువు పైన విశ్వాసానిది పైచేయి కావాలనే శక్తులు రాజకీయంగా, సామాజికంగా బలపడడం పెనుప్రమాదంగా పరిణమించాయి. భారత రాజ్యాంగ స్ఫూర్తికి, ప్రగతిశీల ఆశయాలకు కష్టకాలం దాపురించింది.

పంజాబ్‌లోని జలంధర్‌లోని లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఇటీవల జరిగిన 106వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ – భారతదేశాన్ని అంతర్జాతీయ విజ్ఞానశాస్త్రరంగ వేదికపై ఒక విదూషకురాలి వలె నిలబెట్టింది. కొద్ది సంవత్సరాలుగా శాస్త్రసాంకేతిక అంశాలపై రాజకీయవాదులు, మత తత్వ వాదులు అల్పమైన వ్యాఖ్యలు, సూత్రీకరణలు చేస్తున్నారు. శాస్త్రజ్ఞుల పంక్తిలో నిలబడేవారు కూడా ఇటీవలి సభల్లో హాస్యాస్పదమైన ప్రతిపాదనలు చేశారు. అదే క్రమం ఈ సారి కూడా కొనసాగింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి, రంగాల నుంచి, వివిధదేశాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు సైన్స్ కాంగ్రెస్ వేదికపై సాగిన ప్రహసనం చూసి నివ్వెరపోయారు. బెంగుళూరు వంటి చోట్ల శాస్త్రజ్ఞులు ఈ సైన్స్ కాంగ్రెస్‌లో కొందరు వక్తల తీరుకు నిరసనగా ప్రదర్శనలు కూడా జరిపారు. కౌరవులు టెస్ట్ ట్యూబ్ పిల్లలని, స్టెమ్‌సెల్ పరిశోధన వేలేండ్ల కిందటే మన దేశంలో ఉన్నదని ఆంధ్రాయూనివర్సిటీ వైస్ చాన్సలర్, రసాయనశాస్త్ర వేత్త నరసింహారావు సైన్స్ కాంగ్రెస్ వేదిక మీద నిస్సంకోచంగా ప్రకటించారు. లక్ష్యాన్ని ఛేదించి, వెనుకకు రాగలిగిన క్షిపణులు రామాయణ కాలంలోనే ఉన్నాయని, రావణుని దగ్గర 24 రకాల విమానాలు ఉండేవని, లంకలో ఎయిర్‌పోర్టు కూడా ఉండేదని ఆయన చెప్పుకొచ్చారు. తమిళనాడుకు చెందిన కె జె కృష్ణన్ అనే శాస్త్రవేత్త, ఐన్‌స్టీన్ కంటె తానే పెద్ద శాస్త్రవేత్తనని, న్యూటన్, స్టీఫెన్ హాకింగ్ కూడా శాస్త్రవేత్తలు కారని, ఐన్‌స్టీన్ ప్రయోగాలు సరైనవే కానీ, సిద్ధాంతాలు కావని కాంగ్రెస్ వేదిక మీద ప్రకటించారు.

ఆ మధ్య ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా మన పూర్వీకులకు ప్లాస్టిక్ సర్జరీ తెలుసునని, మొట్టమొదటి తల మార్పిడి చికిత్స గణేశుడికి జరిగిందని చెప్పారు. త్రిపుర ముఖ్యమంత్రి విప్లవ్‌దేబ్ భారత కాలం లోనే ఇంటర్నెట్, వైఫై ఉన్నాయని ప్రకటించారు. 103 వ సైన్స్ కాంగ్రెస్ లో ఒక శాస్త్రవేత్త పులి చర్మం మీద కూర్చుని యోగా చేస్తే వార్ధక్యం రాదని ప్రతిపాదించే పత్రాన్ని సమర్పించారు. మరొక కాంగ్రెస్‌లో ఒక పత్రసమర్పకుడు, గోవు మూత్రంలో ఉండే ఒక బాక్టీరియా ఆహారాన్ని స్వచ్ఛమైన బంగారంగా మారుస్తుందని ప్రతిపాదించారు. దేశంలో కొంత కాలంగా ఉన్న భావ వాతావరణానికి తగినట్టుగా రాజకీయ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారు. శాస్త్రవేత్తలు కూడా అదే తీరులో వ్యవహరించడం విచిత్రం.

మనదేశంలో ఉన్న పురాతన విజ్ఞానాన్ని ఎవరో అపహరించారని, పరాధీనత వల్ల ఆ జ్ఞాన సంపదను మనం కోల్పోయామని – ఒక అభిప్రాయం జాతీయోద్యమకాలం నుంచి ప్రచారంలో ఉన్నది. గతఘనకీర్తి అనేది జాతీయత నిర్మాణంలో ఒక దినుసుగా పనిచేస్తుంది కాబట్టి, ఆ అభిప్రాయానికి విస్తృత వ్యాప్తి వచ్చింది. కానీ, స్వాతంత్ర్యానంతరం కూడా, మన వైఫల్యాలకు, వెనుకబాటుతనానికి మనమూ మన విధానాలూ కూడా బాధ్యత వహించవలసిన కాలంలో కూడా, పురాణాలలోని అద్భుతాలను శాస్త్ర విషయాలుగా చెప్పడం మనలను తేలిక పరుస్తుందే తప్ప, ఘనత నివ్వదు. ధర్మం, ఆచారం, సంప్రదాయం, విశ్వాసం వంటి వాటి స్థానంలో హేతుబద్ధ ఆలోచన, పరీక్షకు నిలిచే గుణం, చట్ట బద్ధ పాలన, రాజ్యాంగ పారమ్యత– వంటి ఆధునిక విలువలు వ్యాపించవలసిన కాలం ఇది. గతాన్ని ఆధునికంగా నిలబెట్టాలనుకునే శక్తులు, విపరీత వాదనలతో, వక్రభాష్యాలతో ప్రజల ఆలోచనలను ప్రభావితం చేస్తున్నాయి. ఒక శాస్త్ర విజ్ఞాన రంగమే కాదు, సామాజిక మానవీయశాస్త్రాలలో కూడా ఈ రకం తిరోగమనం బలపడుతున్నది.

మానవజాతి ఈరోజు ఈ దశకు చేరుకున్నదంటే, దాని సుదీర్ఘప్రయాణంలో అంచెలంచెలుగా సాధిస్తూ వచ్చిన విజయాలు కారణం. పురాతన మానవుడు అజ్ఞాని కాదు. మానవసమాజాలు తమ దశకు తగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంటూనే వస్తున్నాయి. అట్లాగే, ప్రకృతిశక్తులతో తమ సంబంధాన్ని అద్భుతాలతో, మార్మికతతో, ఆరాధనాది తతంగాలతో ముడిపెట్టుకుంటూ వస్తున్నాయి. పురాణాల్లో ఇతిహాసాల్లో కనిపించే అద్భుత వర్ణనలు వాటి రచనాకాలం నాటి మానవ ఊహలకు, సృజనాత్మకతకు సంబంధించినవి తప్ప, ఆ అద్భుతాలు నాడు జరిగాయని కాదు. భారతదేశం పురాచరిత్రలో కూడా శాస్త్రవిజ్ఞానం ఉన్నది, సత్యాన్వేషణ ఉన్నది. హేతువును ఆధారం చేసుకుని వేసిన ప్రశ్నలున్నాయి. దేవుడిని, మూఢాచారాలను నిరసించిన మతమార్గాలున్నాయి. చార్వాకుడు, జాబాలి, ఆర్యభట్ట, వరాహమిహిరుడు, భాస్కరుడు, గౌతమబుద్ధుడు మొదలైన వారు వివిధ రంగాలలో ఆనాటికి సాధ్యమైన శాస్త్రదృష్టిని అందించారు. సృష్టి అంతా కణం కణంగా ఏర్పడిందని ఏనాడో చెప్పిన కణాదుడి అన్వేషణ అక్కడే ఎందుకు ఆగిపోయింది? ఆ పరంపర ఎందుకు ఆధునిక విజ్ఞానశాస్త్రం దాకా అవిచ్ఛిన్నంగా ప్రయాణించలేదు? అన్నది ప్రశ్న. చదువుని, అన్వేషణని కొన్ని వర్గాలకే పరిమితం చేసిన కుల వ్యవస్థ కారణమా, శ్రామిక కులాల జ్ఞానం వ్యవస్థీకృతం అయి అభివృద్ధి చెందే అవకాశాలు లేకపోవడం కారణమా, నూతనాన్వేషణలకు ఎటువంటి అవసరమూ కల్పించని 'స్వయంసమృద్ధ' గ్రామీణ వ్యవస్థకారణమా, లేక అన్నీ కారణమా?– ఇవి ఇంకా చారిత్రక శేషప్రశ్నలుగానే ఉన్నాయి.

> **భారతీయ పురాజీవనంలో అంతర్భాగమైన ప్రజావిజ్ఞానం, వృత్తి నైపుణ్యాలు, వైద్యం – వీటిని ఎందుకు స్మరించరు? అన్నీ మా పురాణాల్లోనే ఉన్నాయనేవారు, ఆయుర్వేద వైద్యవిధానాన్ని అవసరమైన మేరకు ఉన్నతీకరించే లక్ష్యంతో పెట్టుబడులు ఎందుకు పెట్టరు? ఆదివాసుల వద్ద ఉన్న సంప్రదాయ జ్ఞానవ్యవస్థల నుంచి యావత్ సమాజం లబ్ధి పొందగలిగే ప్రయత్నాలు ఎందుకు చేయరు? ఎందుకు మీరు గతంలోనూ హేతువును కాక, మాయను మంత్రాన్ని ఆశ్రయిస్తున్నారు?**

ఈ పౌరాణిక శాస్త్రవేత్తలను అడగవలసినది ఏమిటంటే, మీరు ఆర్యభట్టునో చార్వాకుడినో ఎందుకు ఘనమైన పురాతన శాస్త్రవేత్తలుగా గుర్తించడం లేదు? ఎందుకు పౌరాణిక అద్భుత కల్పనలను శాస్త్ర అంశాలుగా మభ్యపెడుతున్నారు? మూఢత్వాన్ని, మూర్ఖత్వాన్ని, స్వార్థాన్ని విసర్జించి ఒక గొప్ప సామూహిక జీవనాన్ని ప్రతిపాదించి ఆచరించి చూపిన గౌతమబుద్ధుడు మీకు ఎందుకు సామాజిక తత్వవేత్త కాకపోయాడు? భారతీయ తత్వ చింతనలో సాంఖ్యం వంటి అవైదిక, నాస్తిక మార్గాలు అనేకం ఉన్నాయని ఎందుకు గుర్తుకురాదు? భారతీయ పురాజీవనంలో అంతర్భాగమైన ప్రజావిజ్ఞానం, వృత్తి నైపుణ్యాలు, వైద్యం – వీటిని ఎందుకు స్మరించరు? అన్నీ మా పురాణాల్లోనే ఉన్నాయనేవారు, ఆయుర్వేద వైద్యవిధానాన్ని అవసరమైన మేరకు ఉన్నతీకరించే లక్ష్యంతో పెట్టుబడులు ఎందుకు పెట్టరు? ఆదివాసుల వద్ద ఉన్న సంప్రదాయ జ్ఞానవ్యవస్థల నుంచి యావత్ సమాజం లబ్ధి పొందగలిగే ప్రయత్నాలు ఎందుకు చేయరు? ఎందుకు మీరు గతంలోనూ హేతువును కాక, మాయను మంత్రాన్ని ఆశ్రయిస్తున్నారు?

వైద్యవిద్య సిలబస్‌లు రద్దుచేసి, పిండాన్ని ముక్కలు చేసి వందమందిని పుట్టించే టెక్నాలజీ యేమిటో విద్యార్థులకు నేర్పండి. రాఫెల్ ఒప్పందాన్ని రద్దు చేసి రావణాసురుడి విమానవిద్యను పునరుద్ధరించండి. ■

శలాక పురుషుడు పింగళి

పింగళి లక్ష్మీకాంతం, ఖండవల్లి లక్ష్మీరంజనం, భూపతి లక్ష్మీనారాయణరావు– ఈ ముగ్గురు మహావిద్వాంసులు ఆంధ్ర, ఉస్మానియా, మద్రాసు విశ్వవిద్యాలయాల్లో తెలుగు స్నాతకోత్తర పీఠాలకు పేరు ప్రతిష్ఠలు సంతరించిపెట్టిన ఆచార్య వర్యులు. తొలితరం తెలుగు ఆచార్యులైన ఈ ముగ్గురూ ముగ్గురే. ఈ ఆచార్య త్రయంలో పింగళి లక్ష్మీకాంతం స్థానమానాలు అద్వితీయం, అపూర్వం. తెలుగు బి.ఏ ఆనర్సు తరగతులకు ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో పటిష్ఠమైన పాఠ్య ప్రణాళికను రూపొందించిన ఘనత లక్ష్మీకాంతం గారిదే. అంతేకాక, యం.ఏ. ఆనర్సు (యం.లిట్., యం.ఫిల్) పరిశోధనకు పర్యవేక్షక బాధ్యత వహించి సాధికారిక పరిశోధన జరిపించిన కీర్తి కూడా పింగళివారిదే.

పింగళి లక్ష్మీకాంతం 1931 నుండి 1949 వరకు ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో లెక్చరర్, రీడర్‌గా పని చేశారే గానీ ఆచార్య స్థాయిని అందుకోలేకపొయ్యారు. 1961–65 మధ్య కాలంలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖలోనే ఆచార్య పీఠం అలంకరించగలిగారు. ఇప్పుడు విశ్వవిద్యాలయం తెలుగు శాఖల్లో కొన్ని చోట్ల ఎనిమిదిమంది దాకా ఆచార్యులు– చిల్లర దేవుళ్ళు– వెలుగుతున్నారు. పాండిత్య గరిమ, గ్రంథ రచనా వైశిష్ట్యం, పాఠ ప్రవచనా కౌశలం, పరిశోధనా పటిమ– ఆచార్య పుంగవులకు అవసరమైన ఈ నాలుగు లక్షణాలు పింగళి లక్ష్మీకాంతంలో పుష్కలంగా లభిస్తాయి.



పింగళివారు ప్రాచీన తెలుగు కావ్య నాటకాల్ని తలస్పర్శిగా అధ్యయనం చేసిన ఆచార్యులు. అంతేకాదు వాటిని విద్యార్థుల మనస్సులకు హత్తుకుపొయ్యేలా పాఠం చెప్పిన ఘనాపాఠి. ఆయన పాఠ ప్రవచనాలు శ్రద్ధగా విని, మున్ముందు ఉత్తమ అధ్యాపకులుగా, ఆచార్యులుగా రూపొందిన వాళ్లలో కొందరు ప్రముఖులు–– దివాకర్ల వేంకటావధాని, పాటిబండ మాధవ శర్మ, కె.వి.ఆర్. నరసింహం, పోణంగి శ్రీరామ అప్పారావు, కొత్తపల్లి వీరభద్రరావు, దిగుమర్తి సీతారామ స్వామి మొదలైన వారు. కవిగా, ఆంధ్ర వాగ్గేయకార చరిత్రకారులుగా పేరుమోసిన బాలాంత్రపు రజనీకాంత రావు; కవి, సాహిత్య మర్మజ్ఞులు, ఎందరో శిష్యుల జీవితాల్ని మలచిన డా. నండూరి రామకృష్ణమాచార్యులు పింగళివారు పెంచి, పోషించిన విద్యార్థి కల్పతరువులే.

> **పాండిత్య గరిమ, గ్రంథ రచనా వైశిష్ట్యం, పాఠ ప్రవచనా కౌశలం, పరిశోధనా పటిమ–ఆచార్య పుంగవులకు అవసరమైన ఈ నాలుగు లక్షణాలు పింగళి లక్ష్మీ కాంతంలో పుష్కలంగా లభిస్తాయి. లక్ష్మీ కాంతం గారి చదువులోతు, గద్ద చూపు, మాట పొందిక, బాస బిగువు, తెలుగు సాహిత్య విమర్శలో ఆయన్నొక శలాక పురుషునిగా తీర్చిదిద్దాయి.**

పింగళి లక్ష్మీకాంతం తెలుగు సాహిత్య రచనకు సుభద్రమైన పునాది వేసిన ప్రతిభా సంపన్నులు. ఆయన రాసిన 'ఆంధ్ర సాహిత్య చరిత్ర' ఆయన మరణానంతరమే (1974) వెలువడ్డా నలభయేళ్ల పాటు లిఖిత రూపంలో సాహిత్య విద్యార్థులకు దారి దీపమై వెలుగొందింది. పింగళివారు ఆంధ్ర విశ్వ కళాపరిషత్తులో ఉపన్యాసకులుగా చేరినప్పుడు తెలుగు సాహిత్య చరిత్రకు పటిష్ఠమైన రూపం ఏర్పడి వుండలేదు. గురజాడ శ్రీరామమూర్తి 'కవిజీవితములు', కందుకూరివారి 'ఆంధ్ర కవుల చరిత్ర' మూడు భాగాలు, వంగూరి సుబ్బారావుగారి 'ఆంధ్ర వాఙ్మయ చరిత్ర' (1920), కవిత్వవేది కల్లూరు వెంకటనారాయణరావుగారి 'ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహము' (1926), బసవరాజు అప్పారావుగారి 'ఆంధ్ర కవిత్వ చరిత్రము' (1921) మొదలైన గ్రంథాలు వెలువడ్డాయి. కాని తెలుగు సాహిత్య యుగవిభజన, యుగలక్షణాలు, కృతుల సమాలోచనం, వగైరా విషయాల్ని పరిశీలించి ప్రకృష్టమైన శైలిలో గ్రంథ నిర్మాణం చేసే సామర్థ్యం ప్రదర్శించిన సాహిత్యవేత్త పింగళి లక్ష్మీకాంతం గారే. మునుపటి తెలుగు సాహిత్య చరిత్రకారులు పై విషయాలన్నింటినీ స్థూలంగా పరిశీలించారే కాని లోతుకు దిగలేదు. కాని పింగళివారు మాత్రం 'ఆంధ్ర సాహిత్య చరిత్ర' రచనలో తెలుగు కావ్య నాటకాదుల్ని అడుగంట తరచి చూసి, చక్కని, చిక్కని శైలిలో తమ ప్రతిభను ప్రదర్శించారు.

పింగళి లక్ష్మీకాంతం తెలుగు సాహిత్య చరిత్రను 10 యుగాలుగా విభజించారు. కొంతమంది విద్వాంసులు భిన్నాభిప్రాయం వ్యక్తం చేసినా, ఆయన చూపిన దారినే అనుసరిస్తున్నారు. వెనుకటి ఆంధ్ర సాహిత్య చరిత్రకారులు కవుల కాల, జన్మ, వంశ ప్రస్తావన చేసి, వాళ్ళ రచనల సంక్షిప్త పరిచయం మాత్రమే చేశారు. కాని పింగళివారు కవి దేశకాల వంశ పరిచయంతోపాటు వాళ్ల కావ్య వైశిష్ట్యాన్ని లోతుగా పరిశీలించి సమీక్షించడం గమనార్హం.

పింగళి లక్ష్మీకాంతం గారిది డేగ చూపు. ఆయన కావ్య నాటకాది రచనల్ని లోతుగా అధ్యయనం చేసి, వాటి సారాన్ని, లక్ష్యాన్ని వొడిసిపట్టి ఆ రచనలు ప్రచారం పొందటానికి, వ్యాప్తిలోకి రాకపోవటానికి కారణాల్ని సూటిగా చెప్తారు. నన్నెచోడుని, పాలకురికి సోమనాథుని కావ్యాలు బహుళ ప్రజాదరణ పొందకపోవడానికి కారణం పింగళివారు ఇలా చెప్తారు: "పాల్కురికి సోమనాథుడు నన్నెచోడుని వలెనే ఎక్కువగా మాండలిక దేశిపదములనే వాడెను. కాని ఆతని గ్రంథములు భారతము వలె సాహిత్యపరులందరకు సంసేవ్యములు కాలేదు. దానికి కారణము సోమనాథుడు కావ్యములనుపేర మత గ్రంథములు వ్రాయుట".

పింగళివారు సందర్భానుసారముగా ఇద్దరు కవుల కావ్యరీతుల్ని తులనాత్మకంగా పరిశీలించిన వైనం మహత్తరమైనది. పెద్దన, శ్రీకృష్ణదేవరాయల 'మనుచరిత్ర', 'ఆముక్తమాల్యద'ల తౌలనిక వైఖరికి మచ్చుతునక. "మనుచరిత్ర పద్యములు శ్రావ్యతకు, బ్రసన్నతకు, నంక్లిష్టాన్వయమునకు, బ్రౌఢములయ్యు గాఢములు గాని సమాసములకు బ్రసిద్ధి చెందిన గ్రంథము. మాధుర్య సంపాదనము పెద్దనగారి సొమ్ము. వర్ణనలకు సందర్భోచితి గాపాడుట యాయన రీతి. అప్రసిద్ధమలను వాడకుండుటాయన దీక్ష. ఆముక్తమాల్యద పద్యములకు శ్రావ్యత లేదు. ప్రసన్నత మృగ్యము. వర్ణనలతిదీర్ఘములు. సందర్భోచితిని గోల్పోయినవి. సమాసములకు గాఠిన్యమెక్కువ. అయ్యును రాయలకు బ్రకృతి పరిశీలనాదుల యందు బెద్దనగారిని మించిన భావనాపటిమ గలదు. పెద్దన చూపుకంటె రాయల చూపు అతి నిశితమైనది. స్థూలాకారదర్శన వర్ణనలతో బెద్దన తృప్తిని బొంద, రాయలాంతర స్నాయువుల గుండ దర్శించిగాని తృప్తి బొందడు. ఆయన రూపచిత్రణములు చిత్రకారులకు గూడ నసాధ్యములు. లోకజ్ఞత యందును బెద్దన రాయలకు జాలడు". ఆచార్య పింగళి లక్ష్మీ కాంతం గారి చదువు లోతు, గద్ద చూపు, మాట పొందిక, బాస బిగువు, తెలుగు సాహిత్య విమర్శలో ఆయన్నొక శలాక పురుషునిగా తీర్చిదిద్దాయి.

■ ఘట్టమరాజు

(నేడు పింగళి లక్ష్మీకాంతం 125వ జయంతి)

జనవాక్యం


70% రిజర్వేషన్లు కావాలి

ఆర్థికంగా వెనుకబడ్డ వర్గాలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించడానికి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బిల్లుపై చర్చలో భాగంగా తెరాస పార్టీ అవలంబించిన తీరు సముచితంగా ఉంది. తెలంగాణ రాష్ట్రం ఇదివరకే ముస్లిం వెనుకబడిన వర్గాలు, షెడ్యూల్ తెగల రిజర్వేషన్లను పెంచుతూ కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి పంపిన బిల్లును కేంద్రం వ్యతిరేకిస్తున్నది. తెలంగాణ రాష్ట్రంలోని బీసీ ఎస్సీ ఎస్టీల జనాభా అధికం. ప్రస్తుతం అమలులో ఉన్న 50% రిజర్వేషన్ల వల్ల రాష్ట్ర జనాభాలో 85% ఉన్న వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. కేంద్రం ఓసీ క్యాటగిరీలో ఆర్థికంగా వెనుకబడ్డ వారికి 10% రిజర్వేషన్లు కల్పించిన నేపథ్యంలో, సామాజికంగా విద్యాపరంగా ఎన్నో ఏళ్ళ తరబడి వివక్షకు గురవుతున్న వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లను కూడా 50% నుండి కనీసం 70% వరకు పెంచుతూ రాజ్యాంగ సవరణ చేయాలి. అగ్ర వర్ణాలకు ఈబిసి కోటా కింద 10% రిజర్వేషన్లు కల్పిస్తున్నారు కాబట్టి, జనరల్ క్యాటగిరీలో మిగిలిన నలభైశాతాన్ని 20% మేరకు తగ్గించినా ఎవరూ వ్యతిరేకించరు. రాష్ట్రాలకు తమ రిజర్వేషన్ల శాతాన్ని వారి వెనుకబడ్డ జనాభా నిష్పత్తి ప్రకారం పెంచుకునే అధికారాన్ని కేంద్రం కల్పించాలి. సుప్రీమ్ కోర్టు ఇందిరా సహానీ కేసులో రిజర్వేషన్లు 50% కంటే ఎక్కువ ఉండరాదంటూ విధించిన నిబంధనను తొలగిస్తూ రాజ్యాంగ సవరణ చేయాలి. ఆర్థికంగా వెనుకబడ్డ వారికి రిజర్వేషన్లు కల్పించడం స్వాగతించవలసిందే. కానీ ఈ వెసులుబాటును అడ్డం పెట్టుకొని అడ్డదారిలో ప్రయోజనం పొందాలనే ధనిక వర్గాల కుట్రలను అడ్డుకోవడానికి కఠినమైన నిబంధనలు రూపొందించవలసి ఉంది.

– ఇఫ్తేకార్ అహ్మద్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్,
హుడా హైట్స్, రోడ్ నంబరు 70, జూబిలీ హిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

వికేంద్రీకరణతోనే ప్రజాపాలన



> **అధికారంలో ఉన్న రాజకీయ పక్షంతో పాటు అధికారం కోసం ప్రయత్నాలు చేస్తున్న రాజకీయపక్షాలు, ఇంకా సామాజిక, ప్రజాస్వామ్య తెలంగాణ డిమాండును ఉద్యమకాలంలో ముందుకు తెచ్చిన వివిధ శక్తులూ అన్నీ ఒక శాస్త్రీయమైన అవగాహనతో చిత్తశుద్ధితో స్థానిక ప్రభుత్వాలను పటిష్ఠపరచడానికి పూనుకోవాలి. 'మా పాలన మాకే' అన్న నినాదాన్ని నిజం చేయడానికి స్థానిక ప్రభుత్వాలకు సంపూర్ణంగా అధికారాలు బదిలీచేయాలి.**

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ, ప్రత్యేక రాష్ట్ర సాధనతో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని విశ్వసించారు. నీళ్ళు, నిధులు, నియామకాలతో పాటు ఒక బలమైన ప్రజాస్వామ్యీకరణ వైపు తెలంగాణ రాష్ట్రం ముందుకెళుతుందని ఆశించారు. ఉద్యమ కాలంలో ప్రజాస్వామిక తెలంగాణ అని కొన్ని వర్గాలు, సామాజిక తెలంగాణ అని మరికొన్ని వర్గాలు స్ఫూర్తిదాయకమైన చర్చలను లేవదీసారు. ఈ రెండు వాదనలు చాలా బలమైనవి. ప్రజాస్వామిక లేదా సామాజిక తెలంగాణను సాధించుటకు మొదట రాజ్యాంగబద్ధంగా రాష్ట్రాన్ని భౌగోళికంగా సాధించుకోవాలి. భౌగోళిక తెలంగాణ సాధించుకున్నాక మిగతా విషయాలపై దృష్టి పెడదామనే వాదనతో ప్రజలు, ఉద్యమకారులు, రాజకీయ పక్షాలు పూర్తిగా ఏకీభవించాయి.

ప్రస్తుత పాలనా వ్యవస్థ కేంద్రీకృతమై ఉన్నది. గ్రామ పంచాయతీలలో తీసుకోవాల్సిన నిర్ణయాలను సైతం రాష్ట్ర రాజధానిలో తీసుకోవడం జరుగుతోంది. విధాన నిర్ణయాలు తీసుకోవడం ప్రజాప్రతినిధుల బాధ్యత. అయితే మన వ్యవస్థలో ప్రభుత్వ అధికారులే నిర్ణయాలు చేస్తుంటారు. గ్రామాలలో సంక్షేమ పథకాల అమలు బాధ్యతను స్థానిక ప్రభుత్వాలకే అప్పగించాలి. లబ్ధిదారుల ఎంపికపై గ్రామ సభలో నిర్ణయాలు తీసుకోవాలి, అన్ని వర్గాల ప్రజలు పాలనా నిర్ణయాలలో పాల్గొనేలా చూడాల్సిన బాధ్యత అధికారులది. ఇటువంటి ప్రక్రియలో పాల్గొనడానికి ప్రజలకు ఆసక్తి లేదని అధికారులు అనడం తరచూ వింటుంటాం. ఆసక్తి లేదని పన్నులు విధించడం లేదా, పన్నులు పెంచడం లేదా! ఆసక్తి కల్పించాలి తప్ప ప్రజలు పాల్గొనరని ఒక నిర్ణయానికి వచ్చి మొక్కుబడి గ్రామసభలు, మండల సభలు నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయరాదు. ఈ విధంగా స్థానిక ప్రభుత్వాల అధికారాలను ప్రభుత్వ అధికార గణం కాలరాచివేస్తోంది. కొన్ని సందర్భాలలో స్థానిక ప్రభుత్వాల అధికారాలను కాపాడుకోవడానికి న్యాయ స్థానాలను ఆశ్రయించడం కూడా మనం చూస్తున్నాం. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన అధికారాలను స్థానిక ప్రభుత్వాలకు బదలాయించాలి. ప్రజాస్వామ్యం పట్ల ప్రజల పట్ల పూర్తి విశ్వాసాన్ని ఉంచి దృఢమైన రాజకీయ సంకల్పం ద్వారా స్థానిక ప్రభుత్వాలను పటిష్ఠం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

స్థానిక ప్రభుత్వాల వికేంద్రీకరణ దిశగా అడుగులు వేయాలంటే దృఢమైన రాజకీయ సంకల్పం అవసరం. ముఖ్యంగా 1. పరిపాలనా వికేంద్రీకరణ 2. అభివృద్ధి వికేంద్రీకరణ 3. ఆర్థిక వికేంద్రీకరణ చేపట్టాలి. గత ప్రభుత్వాల దృక్పథాలను కనుక అనుభవంలోకి తీసుకుంటే ముందుగా స్థానిక సంస్థలను బలోపేతం చేసి ఆ తరువాత అంచెలంచలుగా ఆయా స్థానిక సంస్థల స్తోమతను బట్టి అధికారాలను ఇవ్వాలని మామూలుగా ఆలోచిస్తుంటారని అర్థమవుతుంది. కానీ నిజమైన ప్రజాస్వామ్య వికేంద్రీకరణ అనేది ఒక గట్టి రాజకీయ సంకల్పం కావాలి. ఆ సంకల్ప సాధనకు ఒక దృఢమైన, సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని అధికారాలు, వనరులు, విధులు ఒకేసారి బదలాయించాలి. ఈ విధంగా చేయడం తప్పనిసరి. ఎందుకంటే కేంద్రీకృత పరిపాలనకు అలవాటు పడి, ఒకే మూసలో పని చేస్తున్న అధికారులు స్థానిక సంస్థలకు జవాబుదారిగా ఉండాల్సి వస్తుందని వ్యతిరేకించేవారు మొదలగువారికి ఆలోచించే సమయం ఇవ్వకుండా చేయాలంటే ఒకేసారి ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టే సాహసం చేయాలి. ఇందుకు భిన్నంగా ముందు బాధ్యతలు ఇచ్చి ఆ తర్వాత వారి సామర్థ్యాలు పెంచి, ఆ పిమ్మట అధికారాలు ఇచ్చి, తదనంతరం నిధుల మార్పిడికి విధి విధానాలు రూపొందిస్తామని, తదుపరి పర్యవేక్షణ విధానాలు నిర్దేశిస్తామనడం ఆశయ పరిపూర్తికి తోడ్పడదు. ఎందుకంటే అటువంటి ఆలోచన పాలనా వికేంద్రీకరణ వ్యతిరేకులకు ఉపయోగపడుతుంది తప్ప ప్రజాస్వామ్య పాలనలో పౌరుల భాగస్వామ్యానికి ఎంతమాత్రం ఉపయోగపడదు. బాధ్యతలను, నిధులను రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో బదిలీచేయాలి. కాబట్టి ప్రభుత్వంపై వివిధ వర్గాలనుంచి ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. బదిలీచేసిన అధికారాలను సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అని, అలాగే నిధులు దుర్వియోగం కాకుండా చూసే అదనపు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై పడుతుంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే ప్రజాస్వామ్య వికేంద్రీకరణను సుసాధ్యం చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకోవాలి.

ప్రజాస్వామ్య వికేంద్రీకరణ, సామాజిక న్యాయం సమన్వయం జరగాలంటే ప్రజలను ముందుగా సన్నద్ధం చేయాలి. స్థానిక సంస్థలకు అధికారం అనే ఒక ప్రజా ఉద్యమాన్ని నడపాలి. అందులో ప్రజలను సంపూర్ణంగా భాగస్వాములను చేయాలి. వికేంద్రీకృత ప్రజాస్వామ్యం కొరకు ప్రజల మద్దతును కూడగట్టాలి. తెలంగాణలో ఈ కల సాకారం కావాలంటే 1. గ్రామపంచాయితీ 2. మండలపంచాయితీ 3. జిల్లా పంచాయితీ 4. పట్టణ మునిసిపాలిటీలు, కార్పోరేషన్లను స్థానిక ప్రభుత్వాలుగా గుర్తించాలి. వివిధ ప్రభుత్వ శాఖల అధికారాలను, వాటి వాటి పనులను స్థానిక ప్రభుత్వాలకు బదలాయించాలి. ఉదాహరణకు ప్రైమరీ విద్యాశాఖకు సంబంధించిన టీచర్లు, బోధనేతర సిబ్బంది, ఆరోగ్యం సంబంధిచిన ఏఎన్ఎమ్/ఎవైఎహెచ్, మహిళా శిశు సంక్షేమ శాఖకు చెందిన అంగన్‌వాడీ ఆయాలు, గ్రామ రెవెన్యూ సిబ్బంది ఇలా అన్ని ప్రభుత్వ వ్యవస్థలకు ప్రణాళికలు సిద్ధం చేయడం వరకు అధికారాలను ఒకేసారి బదులాయించాలి. సామాజికన్యాయం–ప్రజల అధికారం అనే నినాదం ప్రజలలో పెద్ద ఎత్తున ప్రచారం చేయాలి. ఈ ప్రక్రియలో పౌరులపాత్ర ఎంత ప్రాముఖ్యత సంతరించుకుందో తెలియచేయాలి. ఇలా పౌరులందరూ పాల్గొనడం ద్వారానే విప్లవాత్మక ప్రజాస్వామ్యీకరణ సుసాధ్యమని సమాజానికి రాష్ట్ర ప్రభుత్వం తెలియజేయాలి.

తెలంగాణ రాష్ట్రంలో 8695 గ్రామపంచాయితీలు, 438 మండల ప్రజా పరిషత్తులు, పాత, కొత్త జిల్లా పరిషత్తులు, 25 నగర పంచాయితీలు, 37 మునిసిపాలిటీలు, 6 మునిసిపల్ కార్పోరేషన్లు ఉన్నాయి. దాదాపు 2కోట్ల మంది ప్రజలు గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తుంటే 1 కోటి 36 లక్షల మంది జనులు పట్టణ ప్రాంతాలలో నివసిస్తున్నారని 2011 జనాభా లెక్కలు వెల్లడించాయి. మొత్తం 3 కోట్ల 50 లక్షల జనాభా గల తెలంగాణలో దాదాపు ఒక కోటి మంది జిహెచ్‌యంసి పరిధిలో 20 లక్షల కుటుంబాలు నివాసముంటున్నారు.

గ్రామీణ ప్రాంతాలకు గ్రామ పంచాయితీల ద్వారా పరిపాలనందించాలి. పట్టణ ప్రాంతాలకు పట్టణ స్థానిక సంస్థల ద్వారా అభివృద్ధి, పరిపాలనందించాలి. ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం మొదలగు అంశాలను తమ ఎజెండాలో చేర్చాలి. దీనికి గాను ఒక పటిష్ఠమైన వ్యూహాత్మకమైన, నమ్మకంతో కూడిన రాజకీయ సంకల్పం ఎంతైనా అవసరం. అధికారంలో ఉన్న రాజకీయ పక్షంతో పాటు అధికారం కోసం ప్రయత్నాలు చేస్తున్న రాజకీయపక్షాలు, ఇంకా సామాజికన్యాయం, ప్రజాస్వామ్య తెలంగాణ డిమాండును ఉద్యమకాలంలో ముందుకు తెచ్చిన వివిధ వర్గాలూ శక్తులూ అన్నీ ఒక శాస్త్రీయమైన అవగాహనతో చిత్తశుద్ధితో స్థానిక ప్రభుత్వాలను పటిష్ఠ పరచడానికి పూనుకోవాలి. 'మా పాలన మాకే' అన్న నినాదాన్ని నిజం చేయడానికి స్థానిక ప్రభుత్వాలకు సంపూర్ణంగా అధికారాలు బదిలీ చేసి, విప్లవాత్మక ప్రజాస్వామ్యం వైపు అడుగులు వేసి భారత దేశానికే తెలంగాణ ఒక మార్గదర్శకం కావాలి.

■ ఆర్. వెంకట్‌రెడ్డి
సామాజిక కార్యకర్త

ఆంధ్రజ్యోతి

అనేక
నిజామాబాద్ ● గురువారం 10 జనవరి 2019

అవధాన ఆదిత్యుడు



అమెరికాలో పుట్టి, పెరిగినా అమ్మభాషపై మక్కువ

పద్యాలు నేర్చుకోవడం నుంచి పద్యాలు రాసేస్థాయికి

అష్టావధానాలు, నవావధానాలతో పెద్దల ఆశీస్సులు

శ్రీరామానుజుగాచినావు భరతున్ సేనన్ సువేగమ్ముతో
కారాగారవినాశకారివయి నన్ గావంగ జాగేల వి
శ్వారాధ్యా గ్రహపీడనివారణ కృపాసంపూర్ణ రావయ్య ధీ
శూరా నన్ దయజూడు శీఘ్రముగ తేజోరూప యో మారుతీ

పదహారేళ్ల కుర్రాడు రాసిన తొలి పద్యమిది! అదీ.. అమెరికాలో పుట్టి, అక్కడే పెరిగి ఏరోనాటికల్ ఇంజనీరింగ్ చదువుతున్న నవ యువకుడి ప్రతిభకు నిదర్శనం!! మన సంస్కృతి, సంప్రదాయాలకు దూరంగా ఉండే గడ్డపై పుట్టినా.. అమ్మ, నాన్నల సాహిత్యాభిలాష, భాషాభిమానం నుంచి స్ఫూర్తిపొంది.. సంస్కృతాంధ్రాల్లో పట్టు సాధించి, అష్టావధానాలు చేసే స్థాయికి ఎదిగిన ప్రతిభాశాలి అతడు. పేరు.. గన్నవరం లలిత్ ఆదిత్య. సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 16వ సంస్కృతాంధ్ర ద్విగుణిత అష్టావధానం చేయబోతున్న లలిత్ ఆదిత్య గురించి..

చిరుప్రాయంలోనే పద్యం వైపు ఆకర్షితుడైన లలిత్ ఆదిత్య తండ్రి గన్నవరం మారుతీ శశిధర్, తల్లి శైలజ. ఇద్దరూ హైదరాబాద్‌లో పుట్టిపెరిగారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో నిపుణులైన మారుతీ శశిధర్ ఐబీఎంలో పనిచేస్తున్నారు. వృత్తిరీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. ఆ దంపతులకు 2000 సంవత్సరం సెప్టెంబరు 23న లలిత్ జన్మించాడు. చేసేది ఐటీ ఉద్యోగమే అయినా.. మారుతీశశిధర్‌కు సాహిత్యాభిలాష ఎక్కువ. దీంతో తనకు కూడా చిన్నతనం నుంచి సాహిత్యంపై ఆసక్తి పెరిగిందని లలిత్ చెబుతారు. ఇక.. లలిత్‌తో తెలుగులో ఓనమాలు దిద్దించి, మాతృభాషపై అభిమానాన్ని పెంపొందించింది అతడి మాతృమూర్తి శైలజ. "తెలుగు రాయడం, చదవడం, వేమన పద్యాలు, సుమతీశతకం.. అన్నీ అమ్మ దగ్గరే నేర్చుకున్నా. క్రమంగా.. పద్యాలు రాయాలన్న ఆసక్తి కలిగింది. రాయడానికి ప్రయత్నించాను. రాయాలంటే ఛందస్సు తెలియాలి కదా! ఇంటర్‌నెట్‌లో వెతికి ఛందస్సు నేర్చుకున్నాను. అలా చిన్నచిన్నగా పద్యాలు రాయడం ఆరంభించి.. నా పదహారో ఏట ఆంజనేయ స్వామి శతకం రాశాను. నాకు హనుమంతుడంటే ఇష్టం. 2016లో కనెక్టికట్‌లో సరస్వతీ దేవి ఆలయం ఒకటి నిర్మించారు. ఆ గుడిలోనే ఆంజనేయస్వామిని కూడా ప్రతిష్ఠించారు. ఆ సందర్భంలోనే ఆ స్వామిని స్తుతిస్తూ తేటగీతిలో శతకం రాశాను. ఆ శతకాన్ని ఎవరికైనా పెద్దలకు చూపిస్తే తప్పొప్పులు చెప్తారు కదా అనే ఉద్దేశంతో ప్రయత్నించగా.. ధూళిపాళ మహదేవమణిగారి గురించి తెలిసింది. ఆయన అందులో తప్పొప్పుల గురించి నాకు వివరించారు. 'వీడు పద్యాలు రాయగలుగుతాడు' అనుకున్నారో ఏమో.. వారే నాకు యతి, ప్రాస నియమాల గురించి చెప్పి నేర్పించారు." అని లలిత్ వివరించారు. "ధూళిపాళవారి కన్నా ముందు నాకు వేదం, వేదాంతం, సంప్రదాయం, పూజల గురించి నేర్పినవారు మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి. ఇంట్లో మా అమ్మ, నాన్న నేర్పిన పద్యాలు, తెలుగు పునాది మాత్రమే. పద్యాలు కాకుండా నాకు వచ్చిన దేదైనా ఉందీ అంటే అది ఆయన దగ్గర నేర్చుకున్నదే. వారి ఆశీస్సులు లేనిదే నేను లేను. అలాగే నాకు సంస్కృతం నేర్పిన గురువు రాయప్రోలు కామేశ్వర శర్మ. మన సంస్కృతి తెలియాలంటే.. సంస్కృతం తెలియాల్సిందేనని మా అమ్మానాన్నలు చెప్పారు. అందుకే సంస్కృతం కూడా నేర్చుకున్నాను" అని తెలిపారు.



లలిత్ తల్లిదండ్రులు
మారుతీ శశిధర్, శైలజ

అష్టావధానం..

పద్యాలు రాయడం ఒకెత్తు అయితే.. అంతమంది పెద్దలు, హేమాహేమీల ముందు అష్టావధానం చేయడం మరొక ఎత్తు! అదెలా సాధ్యమైందన్న ప్రశ్నకు.. "అష్టావధానం చేయాలనుకున్నాను. కానీ.. చేయగలననే నమ్మకం వచ్చేలోగానే చేయాల్సి వచ్చింది" అని లలిత్ చెప్పారు. చాలాకాలంపాటు ఇంటర్‌నెట్ ద్వారా ధూళిపాళ మహదేవమణి వద్ద శిష్యరికం చేసిన లలిత్.. 2017లో రాజమండ్రిలోని ఆయన నివాసంలో 7 రోజుల పాటు ఉన్నారు. అక్కడున్నన్ని రోజులూ.. దత్తపది, నిషిద్ధాక్షరి ఇలా రకరకాల సమస్యలు ఇచ్చి శిక్షణ ఇచ్చిన మహదేవమణి.. తన శిష్యుడు అష్టావధానానికి సిద్ధమయ్యాడనే నిర్ణయానికి వచ్చారు. ఒక శుభముహూర్తాన.. 'అష్టావధానం రేపు చేస్తావా? ఎల్లుండి చేస్తావా?' అని ఆయన తనను అడిగినట్టు లలిత్ చెబుతారు. "ఆయన అలా అడగగానే.. రేపెందుకొచ్చిన గొడవ, ఒకరోజు సమయం దొరుకుతుంది కదా అని ఎల్లుండి చేస్తానన్నాను. అలాగని టెన్షన్ పడలేదు. నేను చేయగలుగుతానన్న నమ్మకం లేకుంటే ఆయన చెప్పరు కదా. అదీ నా నమ్మకం" అని వివరించారు. తొలి అష్టావధానంలోనే పెద్దల ప్రశంసలందుకున్న లలిత్ ఆ తర్వాత తెలుగు రాష్ట్రాల్లో, అమెరికాలో కూడా అష్టావధానాలు, నవావధానాలు విజయవంతంగా చేశారు.

చదువులోనూ మేటి..

శతకాలు రాయడంలోనే కాదు.. మామూలు చదువులోనూ లలిత్ మేటి. ప్రస్తుతం యూటీ ఆస్టిన్ వర్సిటీలో ఏరో స్పేస్ ఇంజనీరింగ్ చేస్తున్నారు. తొలిసంవత్సరంలో తొలి సెమిస్టర్ ఇటీవలే పూర్తయింది. అటు పద్యం.. ఇటు ఈ సాంకేతిక విద్య.. రెండూ ఎలా సాధ్యమయ్యాయంటే.. 'పద్యం నాకిష్టం. పైగా దానికి ప్రత్యేకంగా కష్టపడాల్సిన పని లేదు. నా మంచం మీద పడుకుని నా పద్యాలు నేను చెప్పుకొంటే సరిపోతుంది. ఇక, పద్యం అంటే ఎంత ఇష్టమో.. విమానాలన్నా, స్పేస్ అన్నా కూడా చిన్నప్పటి నుంచీ అంతే ఇష్టం. అందుకే ఆ విభాగం ఎంచుకున్నా" అని చెప్పారు. అదే సమయంలో.. మన సంస్కృతికి సంబంధించిన అంశాల గురించి పెద్దల దగ్గర తెలుసుకోవడం కూడా లలిత్‌కు చాలా ఇష్టమైన పని. అందుకే ప్రస్తుతం కొద్దిరోజులుగా ఏపీలో ఉంటూ.. విజయవాడ సమీపంలోని టేకుపల్లిలో వెంపటి కుటుంబశాస్త్రి వద్ద అలంకార శాస్త్రం.. దోర్బల ప్రభాకర శర్మ వద్ద న్యాయంలో పాఠం చెప్పించుకున్నారు. ఈ 'అవధాన యువ కిశోరం' భవిష్యత్‌లో మరిన్ని ఉన్నతస్థానాలకు ఎదగాలని కోరుకుందామా!!

-సెంట్రల్ డెస్క్

కష్టమైన పూరణ..

"ఇన్ని అష్టావధానాలు చేశారు కదా, మీకు కష్టంగా అనిపించిన సమస్య ఎవరైనా ఇచ్చారా?" అని లలిత్‌ను ప్రశ్నిస్తే.. 'కష్టమని కాదుగానీ, బాగా గుర్తుండిపోయిన ఒక పూరణ ఉంది' అంటూ ఒక పద్యం గురించి వివరించారు.

సమస్య: వాలికి సేవజేసె వనవాసనివాసిని సీత భక్తితో..

దానికి లలిత్ పూరణ ఇదీ..

నేలను బుట్టు యజ్ఞ నవనీతయె సీత, తదీయభర్తకున్
వ్రాలి పదమ్ములంటి లలనామణి స్వామి శుభమ్ముకోరి యా
ర్యాలలితన్ భజించి సమయమ్మున రక్తిమెయిన్ మహాలిక
జ్వాలికి సేవజేసె వనవాసనివాసిని సీత భక్తితో

లలిత్ రచనలు

సంస్కృతంలో


నారసింహనమశ్శతం, హనుమన్నవకం, నృసింహపాదాదికేసరాంతస్తోత్రం, శారదాపంచవింశికా

తెలుగులో

హనుమద్దోర్దండ శతకం, శ్రీరామ షోడశి, ఆవిర్భావము (నరసింహావిర్భావ ఘట్టం), పర్యావరణావనం, శార్దూల విక్రీడితం

అమెరికా విద్యావంతుల్లో

హిందువులే టాప్



అమెరికా అనగానే ఉన్నత చదువులు.. భారీ వేతనాలే గుర్తొస్తాయి. కానీ అక్కడ ఉన్నత విద్యావంతులను, వార్షిక ఆదాయం ఎక్కువ ఉన్న వారిని లెక్కిస్తే హిందువులే అత్యధికంగా ఉన్నారు. అమెరికాలో అన్ని మతాలతో పోలిస్తే హిందువులే ఉన్నత చదువులు చదివినట్లు ప్యూ రిసెర్చ్ సెంటర్ అధ్యయనంలో తేలింది. ఆదాయం విషయంలోనూ హిందూ కుటుంబాలే అగ్రస్థానంలో ఉన్నాయి.

ప్యూ అధ్యయనం ప్రకారం ఉన్నత విద్యావంతుల్లో..

77% హిందువులు

39% ముస్లింలు

26% క్యాథలిక్స్

లక్ష డాలర్లు
అమెరికాలో హిందూ కుటుంబాల సగటు వార్షిక ఆదాయం



59 వేల డాలర్లు
అమెరికాలో ఇతర మతాల వారి సగటు వార్షిక ఆదాయం

జవాన్ల పరేడ్‌కు మహిళ నేతృత్వం

▸ ఆర్మీ చరిత్రలో ఇదే తొలిసారి.. హైదరాబాద్ యువతి ఘనత



ఆర్మీ చరిత్రలో ఈ నెల 15న ఒక అరుదైన ఘట్టం ఆవిష్కృతం కానుంది. 71వ ఆర్మీ డే సందర్భంగా నిర్వహించే సైనిక పరేడ్‌కు తొలిసారి ఒక మహిళ నేతృత్వం వహించనున్నారు. 23 ఏళ్ల తర్వాత పరేడ్‌లో పాల్గొంటున్న 144 మంది జవాన్లు గల ఆర్మీ సర్వీసెస్ కాప్స్(ఏఎస్‌సీ) దళానికి హైదరాబాద్ యువతి, లెఫ్టినెంట్ భావనా కస్తూరి సారథ్యం వహించబోతున్నారు. ఈ అవకాశం కల్పించిన ఆర్మీ అధికారులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. కాగా, భావనా కస్తూరి హైదరాబాద్‌లోని అబిడ్స్‌లో ఉన్న సెయింట్ జార్జ్‌స్ బాలికల పాఠశాలలో ఇంటర్ వరకూ చదివారు. చెన్నైలోని ఓటీఏలో సైనికాధికారిగా శిక్షణ తీసుకున్నారు. మహిళా జవానుగా దేశ సరిహద్దుల్లోని కార్గిల్‌కి వెళ్లే అరుదైన అవకాశం దక్కించుకున్నారు. 2015లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పరేడ్‌లో మహిళా దళానికి.. కెప్టెన్ దివ్య అజిత్ నేతృత్వం వహించిన విషయం తెలిసిందే! అయితే ఇప్పుడు 144 మంది పురుషులు గల దళానికి కస్తూరి సారథ్యం వహిస్తుండటం విశేషం!

దక్షిణాదికి వృద్ధాప్యం!

2050 నాటికి 20 శాతానికి పైగా వృద్ధులు

ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు వయసు పైబడిన వారితో సతమతమవుతుంటే భారత్‌లో యువ రక్తం ఉరకలెత్తుతోంది. ప్రస్తుతం మన దేశ జనాభాలో దాదాపు 65% మంది 35 ఏళ్లలోపు వారే. కానీ మరో ముప్పై ఏళ్ల తర్వాత పరిస్థితి ఏంటి? మీరెప్పుడైనా ఆలోచించారా? ఎలా ఉంటుందో ఊహించారా? 2050 నాటికి భారత్‌లో జనాభా అసమతుల్యత ఏర్పడుతుందని, దక్షిణాది రాష్ట్రాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుందని ఎస్‌బీఐ పరిశోధనలో వెల్లడైంది.

దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడులో వృద్ధుల సంఖ్య భారీగా పెరిగిపోనుందని ఎస్‌బీఐ తన పరిశోధక నివేదికలో పేర్కొంది. 2050 నాటికి ఈ నాలుగు రాష్ట్రాల్లోని జనాభాలో 20 శాతానికి పైగా వృద్ధులుగా మారతారని తెలిపింది. మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఒడిశాలోనూ వృద్ధుల శాతం పెరిగిపోతుందని చెప్పింది. యూపీ, రాజస్థాన్, అసోం, బిహార్, హరియాణాలో మాత్రం యువత ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. ఇలా యువకులు, వృద్ధుల వ్యత్యాసం వల్ల ఈశాన్య, ఉత్తర భారతం నుంచి దక్షిణాది రాష్ట్రాలకు వలస కార్మికుల సంఖ్య పెరిగిపోతుందని వెల్లడించింది. ఈ వలసల వల్ల కార్మికుల కొరత కొంత వరకు తీరినా.. మౌలిక సదుపాయాల విషయంలో దక్షిణాది రాష్ట్రాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని నివేదికలో పేర్కొంది. జనాభా సంక్షోభాన్ని నివారించేందుకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు దక్షిణాది రాష్ట్రాలు ఇప్పటికే చర్యలు ప్రారంభించాయని తెలిపింది. కాగా, నాలుగు రాష్ట్రాల్లో 65 ఏళ్లకు పైబడిన జనాభా పెరిగితే.. బ్యాంకుల్లో సేవింగ్స్ కూడా పెరుగుతాయని, అనంతరం వృద్ధాప్యంలో వచ్చే అనారోగ్య సమస్యలతో ఖర్చులు పెరిగి డబ్బులు తరిగిపోతాయని పేర్కొంది. అంతేకాదు ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాలు సంపన్నమైనవని, ఆదాయం విషయంలో రెండు ప్రాంతాల మధ్య చాలా వ్యత్యాసం ఉన్నదని ఎస్‌బీఐ ఆర్థిక పరిశోధన విభాగం అంచనా వేసింది.





పాముల్లో విషం గుట్టు తెలిసింది!

పాముల్లో విషపూరితమైనవి కొన్నే! ఆ కొన్నింటిలోనూ అత్యంత విషపూరితమైనవి, తక్కువ విషమున్నవి ఉన్నాయి. మరి వీటి మధ్య వ్యత్యాసం ఎందుకు ఉంది? అనేది ఇప్పటి వరకూ ప్రశ్నార్థకంగానే ఉంది. ఇప్పుడీ ప్రశ్నకు సమాధానం దొరికింది. పాము పరిమాణంతో పాటు అది నివసించే వాతావరణం మీద ఆధారపడి విషం ఉంటుందని యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ సెయింట్ ఆండ్రూస్ పరిశోధకులు గుర్తించారు. ముఖ్యంగా పాములు తినే జీవుల ఆధారంగా విషం కలిగి ఉంటాయని తేల్చారు. అందుకే సముద్రాల్లో ఉండే పాములు తక్కువ విషం, కోబ్రా వంటి సర్పాల్లో ఎక్కువ విషం ఉంటుందన్నారు. తాజా పరిశోధనల ఆధారంగా సర్పాల వల్ల మనుషులకు పొంచి ఉన్న ముప్పును గుర్తించే వీలుందని పరిశోధకులు తెలిపారు.

గాలిలో గూగుల్ అబ్రకదబ్ర

▸ పరికరాన్ని తాకకుండానే చేతి వేళ్ల కదలికలతో నియంత్రణ

▸ 'సోలి' ప్రాజెక్టుతో వినూత్న ఆవిష్కరణ



అబ్రకదబ్ర అంటూ గాలిలో చేతి వేళ్లను కదిలించి వస్తువులను ప్రత్యక్షం చేసే గారడీలు చూశాం.. నిజంగానే గాలిలో చేతి వేళ్లను కదిలించి ఏదైనా పరికరాన్ని నియంత్రించాలనుకుంటే..? అత్యాధునిక సాంకేతికతతో గూగుల్ ఆ ఆవిష్కరణే చేసింది. పరికరాన్ని తాకకుండా గాలిలో ఆపరేట్ చేసే ప్రాజెక్టును అభివృద్ధి చేసింది. దానికి 'సోలి' అని పేరు పెట్టింది. ఇందులో భాగంగా.. చిన్న చిన్న మైక్రోచిప్‌లలో ఓ రాడార్‌ను అమర్చింది. ఆ రాడార్ సహాయంతో పరికరం నుంచి కొద్ది దూరం వరకు గాలిలో చేతి వేళ్లను కదిలిస్తూ దాన్ని ఆపరేట్ చేయవచ్చు. బొటనవేలిని, చూపుడు వేలిని నొక్కి కనిపించని బటన్‌ను ఆన్/ఆఫ్ చేయవచ్చు. రెండు వేళ్లను రుద్ది వాల్యూమ్‌ను నియంత్రించవచ్చు. 57 గిగా హెడ్జ్‌ల నుంచి 64 గిగా హెడ్జ్‌ల ఫ్రీక్వెన్సీ బ్యాండ్ వరకు దీన్ని ఆపరేట్ చేయవచ్చుట. సెకనుకు 10వేల ఫ్రేమ్‌లను గుర్తిస్తుందని, వేళ్లతో సంజ్ఞలు చేస్తే కెమెరా ఆధారిత సెన్సర్లు పసిగట్టి, వాటిని కమాండ్‌గా అనువదించి పరికరానికి చేరవేస్తాయని, తదనుగుణంగా పరికరం ప్రవర్తిస్తుందని గూగుల్ తెలిపింది. ఆ సోలి సెన్సర్‌ను స్మార్ట్ గడియారాల్లో, స్మార్ట్ ఫోన్లలో, కంప్యూటర్లలో, వాహనాల్లో అమర్చుకోవచ్చని వెల్లడించింది. త్వరలోనే ఈ సెన్సర్లను అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొంది.

జంప్ జిలానీలతో ప్రజాస్వామ్యానికి చేటు!

చట్టసభల సభ్యులు పదవీకాలం పూర్తి కాకుండానే రాజీనామాలు చేయటం ప్రజలకిచ్చిన ఎన్నికల వాగ్దానాలను భంగపరచడమని, రాజీనామా చేయకుండా నిరోధించాలని దాఖలైన వ్యాజ్యాన్ని బొంబాయి హైకోర్టు కొట్టివేసింది. సభ్యులు ప్రజాసేవకులే గానీ, ప్రజలకు కట్టుబానిసలు కారని.. రాజీనామా వారి ప్రజాస్వామిక హక్కు అని వ్యాఖ్యానించింది. గత డిసెంబరులో మహారాష్ట్ర గోమంతక్ పార్టీ కేసులోని ఈ తీర్పు మధ్యంతర ఎన్నికలతో ప్రజలపై పడుతున్న ఆర్థికభారం గురించి ప్రస్తావించకపోవడం శోచనీయం. పదవీకాలం పూర్తయ్యే చివరి రోజుల్లో పార్టీలు మారే జంప్ జిలానీలు, అయిదేళ్లు గడవక ముందే సభను రద్దుచేసి, అధికారం కొనసాగింపు కోసం మధ్యంతర ఎన్నికలకు ప్రజాధనం వెచ్చించే విధానాలకు ఊతమిచ్చే ఈ తరహా తీర్పులు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తాయనేది వాస్తవం. 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పదవ షెడ్యూలులో చేరిన పార్టీ ఫిరాయింపుల వ్యవహారం గోడదూకుడు ప్రహసనాలకు కొంతమేర చెక్ పెట్టినా, చట్టాన్ని నిర్వచించి, సజావుగా అమలు చేయడంలో మాత్రం అలసత్వం చోటుచేసుకుంది. ఎంపికైన ప్రజాప్రతినిధుల ప్రజాస్వామ్య హక్కులను పదో షెడ్యూలు ఆటంకపరచలేదని 'హోటాహట్ల బన్' కేసులో చెప్పిన సుప్రీంకోర్టు (1993) ఫిరాయింపు డ్రామాలపై స్పీకర్ నిర్ణయం తిరగదోడే న్యాయసమీక్షాధికారం కోర్టులకుందని స్పష్టం చేసింది. స్పీకరుకు 'ట్రిబ్యునల్' అధికారాలను కట్టబెట్టినప్పటికీ, సాధారణంగా పాలకపార్టీ నామినీ అయిన స్పీకర్ విచక్షణాధికారంపై పార్టీ విధాన ప్రభావం ఉండి తీరుతుందని, అందుచేత రాష్ట్రపతి లేదా గవర్నరులతో కూడిన ప్రత్యేక సంస్థ ఎన్నికల కమిషన్ సలహా మేరకు పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులపై విచారణ చేసి నిర్ణయం వెలువరించే దిశలో చట్టసవరణ చేయాలని దినేష్ గోస్వామి కమిషన్ సూచించింది. బహిష్కరణకు గురైన లేదా ఫిరాయింపునకు పాల్పడిన సభ్యులు వేరే పార్టీ తీర్థం పుచ్చుకోకూడదని, మరే ప్రజా ప్రభుత్వ పదవినీ చేపట్టరాదని హలీమ్ కమిటీ సూచించింది. 2002 నాటి రాజ్యాంగ సమీక్ష కమిటీ, 1999లో వెలువడిన 170వ లా కమిషన్ నివేదికలూ ఈ తరహా సిఫార్సులనే చేశాయి. ప్రభుత్వాలను కూలదోసేందుకు సహకరించే 'మనస్సాక్షి' ఓట్లను చెల్లుబాటు చేయరాదనే అభిప్రాయాన్ని కూడా కమిషన్ వెలిబుచ్చింది.



లా-లోచనం
Law lochanam

ఇదిలావుండగా సభాపతుల వ్యవహారశైలి కూడా పార్టీ ఫిరాయింపులకు దోహదం చేస్తుందనే అపవాదు ఉంది. పార్టీల చీలిక, కలయిక ప్రక్రియల్లో ఫిరాయింపు ఫిర్యాదులపై స్పీకర్లు నిష్పాక్షిక నిర్ణయం వెలువరించకపోవటం వారి రాజ్యాంగ విధి నిర్వహణాలోపంగా రాజేంద్రసింగ్ కేసు(2007)లో సుప్రీం తీర్మానించింది. ఇలాంటి సందర్భాల్లో కోర్టు జోక్యం తప్పనిసరి అని వ్యాఖ్యానించిన సుప్రీంకోర్టు, శాసనసభల నిర్వహణలో కోర్టుల జోక్యానికి దారి ఏర్పర్చింది. 2001లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం పార్టీ ఫిరాయింపులు, పార్టీల అంతర్గత కుమ్ములాటలతో భారత రాజకీయ రంగం భ్రష్టుపట్టిందని వెల్లడయింది. 2001లో అప్పటి ఎన్నికల కమిషనర్ మనోహర్ గిల్ వాపోవడమే.. ఎన్నికలు రాజ్యాంగ ప్రక్రియగా కాక, రాజకీయ క్రీడలుగా మారాయనేందుకు నిదర్శనం. ఏ రంగానికైనా నైతిక విలువలు, నిబద్ధత ముఖ్యం. ప్రజాస్వామ్యానికి విలువలను చేకూర్చే రాజకీయ రంగానికి ఇది మరీ ముఖ్యం. నిండు అయిదేళ్లూ ప్రభుత్వాన్ని నడిపి ప్రజలను పాలించాల్సిన పార్టీ, మధ్యలోనే గద్దె దిగటం, మళ్లీమళ్లీ ఎన్నికలకు తెరతీయటం ప్రజాస్వామ్యాన్ని బలహీనం చేయటమే. ఎన్నికల వాగ్దానాలు నెరవేర్చే దిశలో ప్రభుత్వాలు అయిదేళ్లూ పనిచేయాలనేది ప్రధానాంశం.

- వేదాంతం సీతారామావధాని,
భారత సుప్రీంకోర్టు మాజీ సెక్రటరీ జనరల్,
ఈ మెయిల్ : sitharam.avadhani@gmail.com





మేథ్స్ టఫ్ ఫిజిక్స్ మోడరేట్ కెమిస్ట్రీ ఈజీ

జెఇఇ మెయిన్ విశ్లేషణ

ప్రతిష్ఠాత్మక ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి ఉద్దేశించిన జెఇఇ మెయిన్‌లో ప్రశ్నల సరళి మోడరేట్ నుంచి కష్టంగా ఉందన్న అభిప్రాయం అటు విద్యార్థులు ఇటు అధ్యాపకుల నుంచి వ్యక్తమవుతోంది. ఈ సంవత్సరం నుంచి జెయిఇ మెయిన్‌ను రెండు విడతలుగా, పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. మొదటి విడత ఈ నెలలో, రెండో విడత ఏప్రిల్‌లో జరుపుతున్నారు. మొదటి విడత ఎగ్జామ్ మంగళవారం నుంచి ఆరంభమైంది.

జెఇఇ మెయిన్ ప్యాటర్న్‌లో ఎలాంటి మార్పులు చోటుచేసుకోలేదు. మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి ఎప్పటి మాదిరిగానే ఒక్కోదానిలో 30 చొప్పున 90 ప్రశ్నలు మాత్రమే అడిగారు. పరీక్ష విధానం, ప్రశ్నలు అడిగిన తీరులో ఎలాంటి ఆశ్చర్యాలు లేవు. విద్యార్థులు సమయాన్ని చూసుకునేందుకు కంప్యూటర్ స్క్రీన్‌పై వాచీని అమర్చారు. అలాగే రఫ్ వర్క్ కోసం బ్లూ బాల్‌పెన్‌ను కూడా అందించారు. సాంకేతికంగా ఇంతవరకు ఎలాంటి అడ్డంకులు ఇప్పటివరకు కలగలేదని సమాచారం. రెండు రోజులుగా స్లాట్ల పద్ధతిన పరీక్ష సాఫీగా, ప్రశాంతంగా జరుగుతోంది.

మొత్తమ్మీద ఫిజిక్స్ ఈజీ నుంచి మోడరేట్‌గా ఉంది. మేథ్స్‌లో ప్రశ్నల నిడివి ఎక్కువగా ఉండి కష్టంగా అనిపించింది. అలాగే అప్లయిడ్ ప్రశ్నలు ఎక్కువ ఇవ్వడంతోనూ విద్యార్థులు ఇబ్బందికరంగా భావించారని అంటున్నారు. దాంతో ఈ విభాగాన్ని పూర్తిచేయడం విద్యార్థులకు భారంగా మారింది. కెమిస్ట్రీ ఒక్కటి మాత్రమే సాపేక్షంగా సులువుగా ఉంది. కొన్ని స్లాట్స్‌లో కెమిస్ట్రీలో అడిగిన ప్రశ్నల నిడివి ఎక్కువగా ఉంది. అయితే జాగ్రత్తగా చదివి, అర్థం చేసుకోగలిగితే సమాధానాన్ని సులువుగా గుర్తించవచ్చు.

నిజానికి పేపర్ సులువుగా ఉందని, మరీ హైలెవెల్‌లో అస్సలు లేదని మరొక నిపుణుడు వ్యాఖ్యానించారు. బేసిక్ కాన్సెప్ట్‌లను విద్యార్థి ఏమేరకు అర్థం చేసుకున్నాడన్నది పరీక్షించేలా ప్రశ్నలు ఉన్నాయన్నారు. అలాగే కొన్ని ప్రశ్నలు ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల్లో నుంచి యథాతథంగా తీసుకున్నారని తెలిపారు. మరికొన్ని కొద్దిగా అదే నమూనాలో ఉన్నాయన్నారు. ఫండమెంటల్స్‌పై పట్టు ఉన్న విద్యార్థులు సులువుగా ఈ పేపర్లను సాల్వ్ చేయగలరని తెలిపారు.

కెమిస్ట్రీతో మొదలుపెట్టండి...!

ఇకపై స్లాట్స్‌లో పరీక్ష రాసే విద్యార్థులు కెమిస్ట్రీతో మొదలుపెట్టడం మంచిదన్న సూచన అధ్యాపకులు, కోచింగ్ నిపుణుల నుంచి వ్యక్తమవుతోంది. మరీముఖ్యంగా కష్టంగా ఉన్న సెక్షన్లపై ఎక్కువసేపు దృష్టి సారించి, సమయం వృథా చేసుకోవద్దని కూడా సలహా ఇస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన స్లాట్లను పరిశీలిస్తే కటాఫ్ మార్కు 72-77 మధ్య ఉంటుందని అంటున్నారు. ఇంకొంతమంది 85 మార్కులకు మించవచ్చని కూడా చెబుతున్నారు. ఎన్‌సిఇఆర్‌టి - నాన్ ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాలతో ప్రిపరేషన్ ఈ తేడాకు కారణంగా భావించవచ్చు. జాగ్రత్తగా మూడు సబ్జెక్టుల నుంచి అడిగిన ప్రశ్నల్లో 60 శాతం ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల నుంచి ఇప్పటివరకు వచ్చాయని చెబుతున్నారు. జెఇఇ మెయిన్‌కు సంబంధించి పదేళ్ళ పాత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేసిన వారికి మాత్రం ఇతరులతో పోలిస్తే ఈ సారి ఎగ్జామ్ సులువుగా ఉండటమే కాదు, మంచి స్కోర్ సాధించగలరని అకడమిక్ నిపుణులు భావిస్తున్నారు.

నాసా, ఇస్రో

అలాగే ఆర్కిటెక్చర్‌లో ప్రవేశానికి ఉద్దేశించిన ప్రశ్నలు రెండు ప్రశ్నలు చూసి ఆశ్చర్యపోవడం విద్యార్థుల వంతైంది. నాసా, ఇస్రో ఫుల్‌ఫామ్ అడిగారు. అబ్రివేటెడ్ పదాలతో ప్రశ్న అడిగారు. వాటిని పూర్తిగా విస్తరించాలి. ఈ రెంటికి ఎనిమిది మార్కులు. జాతీయ స్థాయిలో జరిగే అత్యున్నత పోటీ పరీక్షలో ఇలాంటి ప్రశ్నలా అన్న ఆశ్యర్యం సర్వత్రా వ్యక్తమైంది.

కెమిస్ట్రీలో అడిగిన కొన్ని ట్రికీ ప్రశ్నలు

1. What are isotopes of H_2
2. What is ppm of safe drinking water
3. What is reduction of freindlich isotherm
4. What is the chemical bonding of copper pyrite

గ్రేడప్ అనాలసిస్

- **బుధవారం ఉదయం స్లాట్**
- **ఫిజిక్స్:** ఈ సబ్జెక్టులో మెకానిక్స్ 8, హీట్ అండ్ థెర్మోడైనమిక్స్ 6, కరెంట్ ఎలక్ట్రిసిటీ అండ్ ఇఎంఐ 7, ఎలక్ట్రో స్టాటిస్టిక్స్ అండ్ మేగ్నటిజమ్ 4, ఆప్టిక్స్ అండ్ మోడర్న్ ఫిజిక్స్ 5 ప్రశ్నలు అడిగారు.
- **మేథ్స్:** ఆల్జీబ్రా 10, కాలిక్యులస్ 8, కోఆర్డినేట్ జామెట్రీ 6, ట్రిగ్నామెట్రీ 6 ప్రశ్నలు అడిగారు.
- **కెమిస్ట్రీ:** ఇనార్గానిక్ కెమిస్ట్రీ 12, ఆర్గానిక్ కెమిస్ట్రీ 9, ఫిజికల్ కెమిస్ట్రీ 9 ప్రశ్నలు ఇచ్చారు.

ఫిబ్రవరి 1 నుంచి ఖరగ్‌పూర్ ఐఐటి జిఇఎస్

GES 2019

ఖరగ్‌పూర్ ఐఐటికి చెందిన ఎంట్రప్రెన్యూర్‌షిప్ సెల్ ఏటా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టే గ్లోబల్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ సమ్మిట్(జిఇఎస్)ని ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు నిర్వహిస్తోంది. కొత్తతరం ఎంట్రప్రెన్యూర్లు, సుప్రసిద్ధ బిజినెస్ పర్సనాలిటీలు, వెంచర్ క్యాపిటలిస్టులు, కాలేజీ విద్యార్థులకు ఉద్దేశించిన విస్తృత సాంకేతిక వేదికగా జిఇఎస్ ఇప్పటికే పేరొందింది. భారత దేశంలో ఎంట్రప్రెన్యూర్‌షిప్ వ్యవహారాలను సరికొత్త అంచులకు తాకించే కృషిని నిర్వహిస్తోంది. గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్, ఇండియా టీవీ సిఇఒ, ఫౌండర్ రజత్ శర్మ వంటి వ్యక్తులు జిఇఎస్ నిర్వహించిన గత సదస్సుల్లో పాల్గొన్నారు. అదే తరహాలో ఈసారీ పలువురు ప్రముఖులు ఈ సమ్మిట్‌కు హాజరుకానున్నారు. ఎంట్రప్రెన్యూర్‌షిప్‌లో మెలకువలపై సాగే ఈ సదస్సుకు శాంసంగ్, మైక్రోసాఫ్ట్, బిఎస్‌ఇ, ఐబిఎం, ఇంటెల్, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వెబ్ సర్వీసెస్, డెలాయిట్ నుంచి ప్రతినిధులు వస్తారని భావిస్తున్నారు. అవకాశాలకు వేదికగా, వివిధ అలోచనలకు ఊతమిచ్చే విధంగా చర్చలు జరుగుతాయి. 'కనెక్ట్ ద డాట్స్' పేరిట ఒక చర్చ వేదికను కూడా నిర్వహిస్తారు. వివిధ ఎంట్రప్రెన్యూర్‌షిప్ విభాగాలు ఇందులో పాల్గొంటాయి. ఈ విషయంలో ప్రస్తుతం భారతదేశంలో నెలకొన్న పరిస్థితి అదేవిధంగా ఎంట్రప్రెన్యూర్‌షిప్ మరింత విధంగా ఊపు అందుకునేందుకు తీసుకోదగ్గ చర్యలపై చర్చిస్తారు. స్టార్టప్ క్యాంప్ కూడా ఉంటుంది. ఈ సదస్సుకు హాజరైన వారి నుంచి మంచి టాలెంట్ ఉన్న వ్యక్తులను స్టార్టప్‌లు రిక్రూట్ చేసుకునేందుకు ఉద్దేశించిన క్యాంప్ ఇది. అదే విధంగా వెంచర్ క్యాపిటలిస్టులు సైతం వారికి అందుబాటులో ఉంటారు. ఒక రకంగా ఈ సమ్మిట్ ఎంట్రప్రెన్యూర్‌లను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుంది. ఆలోచనలు, పెట్టుబడులు, అవసరమైన టాలెంట్ వ్యక్తులను ఎంపిక చేసుకునేందుకు వేదికగా ఈ సమ్మిట్ ఉపయోగపడుతుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు హాజరయ్యే విద్యార్థులకు నామమాత్రపు చార్జీలకు అకామిడేషన్ సదుపాయం కల్పిస్తారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ చూడవచ్చు.

http://reg-ges.ecell-iitkgp.org,
www.ges.ecell-iitkgp.org/register

Bulletin Board

Astronomy course

MP Birla Institute of Fundamental Research, Bengaluru will be conducting a basic course in Astronomy on Saturdays for all interested general public from January 12, 2019, to February 9, 2019. The course is open to all. No restrictions on age and educational background. The number of seats is limited to 30. Admissions will be done on a firstcome-first-served basis. The medium of instruction will be English. The application forms for the course may be downloaded from www.mpbifr-blr.in.

Education awards

Nominations for EdTechReview Higher Education Awards are open. The last date to submit applications is January 18, 2019. For more details, log on to http://events.edtechreview.in/edtech-summit /2019/ awards/?utm_ source= InMailText &utm_source=Higher+Ed+India &utm_ campaign =811b2f3ba0-EMAIL_CAMPAIGN_2018_ 12_27_07_01_COPY_01&utm_medium=email&utm_ term=0_4309555fcb-811b2f3ba0-19082757.

BA Economics

The University of Sheffield, UK is inviting applications for BA Economics course starting in September 2019. This course gives students a grounding in modern economic theory and techniques of applied economic analysis. The last date to apply is June 30, 2019. For more details, log on to https://www.sheffield.ac.uk/international/ enquiry/ money/ug.

Scholars programme

College Board invites applications for the College Board India Scholars Program 2018-19. The programme gives an opportunity for top performers in SAT to get up to 100% tuition fee waiver. The last date to submit applications is February 08, 2019. For details, log on to www. college-board.org.

Loan scholarship

The JN Tata Endowment awards is a one-time loan scholarship to Indian nationals at the beginning of the course for full-time postgraduate, PhD, postdoctoral studies or research fellowships studies abroad, in all fields. The last date to submit applications is March 10, 2019. For details, log on to www.jntataendowment.org/loan-scholarship-process.

Interior design courses

The Indian Institute of Art and Design in collaboration with Kingston School of Art, London offers undergraduate programmes in Fashion Design, Fashion Business Management, Communication Design and Interior Architecture & Design. It also offers postgraduate programmes in Fashion Design and Fashion Business Management. The last date to apply is April 17, 2019. For more details, visit www.iiad.edu.in.

PhD programme

IIHMR University is inviting applications for a 3-year PhD programme. The last date for submission of the application form is January 25, 2019. Candidates aspiring for admission to the PhD programme may apply online or download the application form from the website: www.iihmr.edu.in.

Life Skills Olympiad

Singapore-based Skillizen Olympiad Foundation is conducting online 'International Life Skills Olympiad' on January 27, 2019. One can register at: www.lifeskillsolympiad.org.

సిఎంసి లుథియానా

దేశంలో పేరొందిన వైద్య కళాశాలల్లో లుథియానాలోని సిఎంసి ఒకటి. గత శతాబ్ది అయిదో దశకంలో ఏర్పాటైన ఈ కళాశాల అంచలంచెలుగా ఎదిగి, దేశంలోనే ప్రముఖ వైద్య విద్యాసంస్థగా విరాజిల్లుతోంది. తెలుగు రాష్ట్రాల విద్యార్థులు చాలాకాలంగా దరఖాస్తు చేస్తున్న మెడికల్ కాలేజీల్లో ఇది కూడా ఒకటి. నీట్ రాకముందు ప్రత్యేకించి టెస్ట్‌ను నిర్వహించుకునేది. ప్రస్తుతం నీట్ ర్యాంక్‌తోనే ఈ కాలేజీలోనూ సీటు పొందవచ్చు. తెలుగు వారికి దక్కే సీట్లు కొద్దే అయినప్పటికీ నాణ్యమైన వైద్యవిద్యకు దీనిని కూడా ఎంపిక చేసుకోవచ్చు. ముఖ్యంగా సేవాభిలాషులకు ఉత్తమమైన మెడికల్ కాలేజీ ఇది.



జాతీయ వైద్య విద్యాసంస్థ

దేశంలోని అత్యుత్తమ మెడికల్ కళాశాలల్లో లుథియానాలోని క్రిస్టియన్ మెడికల్ కాలేజీ ఒకటి. లుథియానా ప్రాంతంలో క్రైస్తవ మిషనరీలు ఆరంభించిన ఆరోగ్యసేవలు కాలక్రమేణా మెడికల్ కాలేజీ ఏర్పాటుకు దారి తీశాయి. తొలుత 1881లో క్రైస్తవ మిషనరీకి చెందిన గ్రీన్‌ఫీల్ట్ సిస్టర్స్ ఆరోగ్య సేవలు ఆరంభించారు. స్కాట్‌లాండ్‌కు చెందిన మరతా రోజ్, కే గ్రీన్‌ఫీల్డ్ కలసి ఆరోగ్య కార్యక్రమాల్లో పాలుపంచుకునేవారు. దాంతో ఆ ఉభయులను గ్రీన్‌ఫీల్డ్ సిస్టర్స్ అని పిలిచేవారు. 1893లో డాక్టర్ ఎడిత్ మేరీ బ్రౌన్ వీరిద్దరికీ తోడయ్యారు. 1894లో ఆమె ఏకంగా నార్త్ ఇండియన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ఫర్ క్రిస్టియన్ ఉమన్‌ను ఆరంభించారు. వైద్య రంగంలో మహిళలు సేవలు అందించే విధంగా శిక్షణను ఈ సంస్థ ద్వారా ఇప్పించాలని భావించారు. అప్పట్నించి 1954 వరకు మహిళలకు శిక్షణ కేంద్రంగానే ఈ సంస్థ పని చేసింది. 1952 వరకు తమ వద్ద శిక్షణ పొందిన వారికి ఎల్ఎస్ఎంఎఫ్ పట్టాను ప్రదానం చేసేవారు. 1953లో దానినే ఎంబిబిఎస్‌గా మలిచారు. ఇక అప్పట్నించి స్త్రీ, పురుషులిద్దరికీ కోర్సులో ప్రవేశం లభిస్తోంది. తదుపరి దశాబ్దంలోనే మెడిసిన్‌లో పీజీ ప్రోగ్రామ్‌లూ ప్రారంభమయ్యాయి.

లుథియానా రైల్వే స్టేషన్‌కు కొద్ది దూరంలో క్రిస్టియన్ మెడికల్ కాలేజీ క్యాంపస్ ఉంది. క్యాంపస్‌కు ఇరువైపులా ఉన్న రహదారిని బ్రౌన్ రోడ్ అంటారు. ఎడిత్ ఎం బ్రౌన్ పేరిట పిలుస్తారు. ఫరీద్‌కోట్‌లోని బాబా ఫరీద్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ అలాగే ఆయా కౌన్సిళ్ళ అనుమతి సిఎంసి అందిస్తున్న కోర్సులకు ఉంది.

మెడిసిన్‌లో డిగ్రీ, పోస్ట్ డిప్లొమా, పీజీ, సూపర్ స్పెషాలిటీ, డాక్టొరల్ కోర్సులను సిఎంసి అం దిస్తోంది. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు ఉన్న ఎంబిబిఎస్‌లో 75 సీట్లు ఉన్నాయి.

నర్సింగ్ శిక్షణను 1889లోనే గ్రీన్ ఫీల్డ్ సిస్టర్స్ ఆరంభించారు. 1936లో జనరల్ నర్సింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 1973లో కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌గా ఎదిగింది. 1987 నుంచి నర్సింగ్‌లో ఎమ్మెస్సీ కోర్సును అందిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ అయిదు స్పెషాలిటీలు ఉన్నాయి.

ఇక్కడి డెంటల్ హెల్త్ విభాగం 1968 నుంచి కమ్యూనిటీ హెల్త్ సర్వీస్‌లో నిమగ్నమైంది 1984 నుంచి గ్రామీణ ప్రాంతాలకు చేరువ అవుతోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు సేవలు అందిస్తోంది. ఈ తరహా సేవలను దేశంలో ఇక్కడ మాత్రమే చూడగలుగుతాం. క్రిస్టియన్ డెంటల్ కాలేజీలో 1992లో బిడిఎస్, 2002లో ఎండిఎస్ కోర్సులు ఆరంభమయ్యాయి. ఫిజియోథెరపీ కాలేజీని 2002లో ప్రారంభించారు. ఉత్తర భారతంలో పేరొందిన కాలేజీల్లో ఇది అత్యుత్తమమైనది. బ్రౌన్ మెమోరియల్ ఆసుపత్రిగా పేరొందిన ఈ వైద్యశాలలో 740 పడకలు ఉన్నాయి. సుప్రసిద్ధులైన వైద్యులు, అధునాత సదుపాయాలతో ఆ ఆసుపత్రి మంచి పేరు తెచ్చుకుంది. లేబరేటరీ తదితర ఆరోగ్య పరిరక్షణ అంశాల్లో శిక్షణకుతోడు డిప్లొమా కోర్సులు ఇక్కడ ఉన్నాయి.

నీట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగానే లుథియానా సిఎంసిలోని ఎంబిబిఎస్, బిడిఎస్‌లో సీటు లభిస్తుంది. బిఎస్సీ నర్సింగ్, బిపిటి కోర్సుల్లో సీటుకు సైతం మెరిట్ మాత్రమే ఆధారం. కోర్సు పూర్తి చేసిన తరవాత, సొసైటీ నేతృత్వంలోని ఆసుపత్రి లేదా సంస్థలో కనీసం రెండేళ్ళు చేస్తామని బాండ్ రాయాల్సి ఉంటుంది. ఎంబిబిఎస్ చేయాలనుకునే విద్యార్థి వయస్సు 2019 డిసెంబర్ 31 నాటికి 17 సంవత్సరాలు ఉండాలి. భారత సంతతికి చెంది విదేశాల్లో ఉన్న వారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే వారికి వేరే దరఖాస్తు ఉంటుంది. అచ్చంగా విదేశీయులకు మాత్రం అడ్మిషన్ ఇక్కడ ఇవ్వరు. కనీసం 50 శాతం మార్కులతో బైపీసి ఇంటర్ పూర్తి చేసినవారు ఈ కోర్సులో చేరడానికి అర్హులు.ఎంబిబిఎస్‌లో చేరిన విద్యార్థులకు మొదటి ఏడాది ట్యూషన్ ఫీజు రూ.6,60,000. ఇది ప్రభుత్వం గత ఏడాది నిర్దేశించిన ఫీజు. హాస్టల్ ఫీజు ఏటా రూ.28,,000. మెస్, విద్యుత్తు ఖర్చులు అదనం. బిడిఎస్ విద్యార్థులకు ట్యూషన్ ఫీజు రూ.2.20,00. ఇక్కడ బాల బాలికలకు వేర్వేరు హాస్టల్స్ క్యాంపస్‌లో ఉన్నాయి. కోర్సులో చేరిన వారంతా విధిగా ఆయా హాస్టళ్ళలోనే ఉండాలి. ఆయా నిబంధనలు పాటించాలి.

వెబ్‌సైట్: www.cmcludhiana.org
ADDRESS: Christian Medical College, Ludhiana-141008, Punjab.
Phone : +91-161-5010809; Email: registrar@cmcludhiana.in / cmcludhianaregistrar@gmail.com
Website: www.cmcludhiana.in

సీట్ల పంపిణి

1.	ఓపెన్ జనరల్(పంజాబ్)	8
2.	ఓపెన్ జనరల్(ఆలిండియా కోటా)	4
3.	క్రిస్టియన్ మైనారిటీ	48
4.	పంజాబ్ నుంచి ఎస్సీ, ఎస్టీ	3
5.	పంజాబ్ నుంచి బీసీ/ఓబీసీ	1
6.	ఎన్ఆర్ఐ	11
	మొత్తం	75

(నోట్: మొత్తం 75 సీట్లకు గాను 4 ఆలిండియా ఓపెన్ కోటాకు కేటాయించారు. వీటికి దేశంలోని విద్యార్థులు ఎవరైనా పోటీపడవచ్చు. అలాగే క్రిస్టియన్ మైనారిటీకి 48 సీట్లను ఉద్దేశించారు. వీటిలో మళ్ళీ ఆరింటిని మాత్రమే తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాలకు ప్రత్యేకించారు. వాటికీ పోటీపడవచ్చు. క్రిస్టియన్ మైనారిటీ కోటా కింద సీట్లు పొందాలనుకునే విద్యార్థులు నిర్దేశిత సర్టిఫికెట్లను సమర్పించాలి. అదే విధంగా వారు బైబిల్ టెస్టు కూడా రాయాలి. ఇది పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ప్రతి ప్రశ్నకు నాలుగు ఛాయిస్‌లు ఉంటాయి.

నెగెటివ్ మార్కింగ్ ఉండదు. ఇంగ్లీష్ లాంగ్వేజ్‌లో మాత్రమే పరీక్ష ఉంటుంది. బైబిల్ నుంచి ముఖ్యంగా ఫ్యాక్ట్స్ ఆధారిత ప్రశ్నలు మాత్రమే అడుగుతారు. పరీక్ష కేవలం లుథియానాలో మాత్రమే నిర్వహిస్తారు. చివరగా ఎన్ఆర్ఐ కోటా కింద 11 సీట్లు కూడా ఉన్నాయని గమనించాలి.)

టిమ్‌కుక్ పారితోషికం రూ.110 కోట్లు



వాషింగ్టన్: అమెరికన్ మల్టీ నేషనల్ కంపెనీ యాపిల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ టిమ్ కుక్ గత సంవత్సరంలో 1.57 కోట్ల డాలర్ల (సుమారు రూ.110 కోట్లు) పారితోషికాన్ని అందుకున్నారు. అంతకు ముందు ఏడాదితో పోల్చితే ఇది 22 శాతం అధికకావడం విశేషం. కుక్ అందుకున్న మొత్తం వేతనంలో 30 లక్షల డాలర్లు బేస్ సాలరీ కాగా 1.2 కోట్ల డాలర్ల బోనస్, 6.80 లక్షల డాలర్ల ఇతర పారితోషికం (ప్రైవేట్ ఎయిర్ ట్రావెల్, సెక్యూరిటీ వ్యయాలు) ఉన్నాయి. ఈ మేరకు వివరాలను సెక్యూరిటీ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్‌కు యాపిల్ సమర్పించింది.

హైదరాబాద్ విమానాశ్రయానికి మరిన్ని విమానాలు!

విమాన పార్కింగ్ సదుపాయం బాగా ఉన్న విమానాశ్రయం నుంచి మరిన్ని గమ్య స్థానాలకు సర్వీసులను ప్రారంభించడానికి విమానయాన కంపెనీలు ముందుకు వస్తాయి.

కొత్తగా 26 విమాన పార్కింగ్ స్టాండ్‌లు.. 45% పెరిగిన హ్యాండ్లింగ్ సామర్థ్యం

దక్షిణాదిలోనే అత్యుత్తమ కనెక్టివిటీ విమానాశ్రయంగా ఆవిర్భావం

2018లో 21 శాతం పెరిగిన ప్రయాణికులు

గతేడాదిలో 2 కోట్ల మందికి పైగా రాకపోకలు



హైదరాబాద్, ఆంధ్రజ్యోతి బిజినెస్

ఏదైనా విమానయాన కంపెనీ ఒక గమ్యస్థానానికి సేవలను ప్రారంభించాలంటే.. ప్రధానంగా పరిశీలించే అంశాల్లో విమాన పార్కింగ్ సదుపాయం. విమాన పార్కింగ్ సదుపాయం ఉంటే విమాన సేవలు పెరుగుతాయి. విమాన మరమ్మతు (ఎంఆర్‌ఓ) సేవలు, శిక్షణ సదుపాయాల రంగంలోని కంపెనీలు కార్యకలాపాలను విస్తరించడానికి ఆసక్తి చూపుతాయి. విమాన పార్కింగ్ సదుపాయం బాగా ఉన్న విమానాశ్రయం నుంచి మరిన్ని గమ్యస్థానాలకు సర్వీసులను ప్రారంభించడానికి విమానయాన కంపెనీలు ముందుకు వస్తాయి. ప్రయాణికుల రద్దీ పెరుగుతుంది. మొత్తం మీద విమానయాన హబ్‌గా మారేందుకు అవకాశాలు ఉంటాయి. ఈ నేపథ్యంలో విమానాశ్రయం విస్తరణ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ)లో కొత్తగా 26 విమాన పార్కింగ్ స్టాండ్‌లను ప్రారంభించారు. ప్యాసింజర్ టెర్మినల్ బిల్డింగ్‌కు తూర్పున జనవరి 1న 26 పార్కింగ్ స్టాండ్‌లను ప్రారంభించామని, దీంతో విమానాశ్రయంలో మొత్తం విమాన పార్కింగ్ స్టాండ్‌లు 83కు చేరతాయని విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (జీహెచ్‌ఐఏఎల్) తెలిపింది. ఇప్పటి వరకూ 57 స్టాండింగ్ సదుపాయాలు-47 రిమోట్, 10 ఏరోబ్రిడ్జ్‌లు ఉన్నాయి. తాజాగా ఏర్పాటు చేసిన పార్కింగ్ స్టాండ్‌లతో శంషాబాద్ విమానాశ్రయంలో ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాండ్లింగ్ సామర్థ్యం 45 శాతానికిపైగా పెరుగుతుందని జీహెచ్‌ఐఏఎల్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) ఎస్‌జికె కిషోర్ తెలిపారు. కొత్త పార్కింగ్ స్టాండ్‌లను ఏర్పాటు చేయడానికి దాదాపు 10 నెలలు పట్టింది. వీటిలో 22 షెడ్యూల్ కోడ్ సి విమానాలు, నాలుగు కోడ్ బీ విమానాలను నిలపవచ్చన్నారు. ఈ రకాల విమానాలను సాధారణ ప్రయాణికుల రవాణా, బిజినెస్ జెట్‌లుగా వినియోగిస్తారు.

ఆస్తులను గరిష్ఠంగా వినియోగించుకోవడానికే..

ఆస్తులను గరిష్ఠంగా వినియోగించుకునే వ్యూహంలో భాగంగానే కొత్త విమాన పార్కింగ్ స్టాండ్‌లను ఏర్పాటు చేశామని జీఎంఆర్ గ్రూప్ బిజినెస్ చైర్మన్ (ఎయిర్‌పోర్ట్స్) జీబీఎస్ రాజు తెలిపారు. ప్రయాణికులను పెంచేందుకు, ఎయిర్‌సైడ్ (ప్రయాణికులు కాకుండా మిగిలిన కార్యకలాపాలు) సామర్థ్యాన్ని పెంచేందుకే వీటిని ఏర్పాటు చేశామన్నారు. ఆర్‌జీఐఏ ద్వారా ప్రయాణికులకు అత్యుత్తమ కనెక్టివిటీని కల్పించడమే తమ లక్ష్యమని కిషోర్ అన్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రయాణికులు, కార్గో రవాణా, విమానాల రాకపోకలు ఆకర్షణీయంగా పెరుగుతున్నాయని చెప్పారు.

రోజుకు 500 విమాన రాకపోకలు

గత సాధారణ సంవత్సరానికి (జనవరి-డిసెంబరు, 2018) హైదరాబాద్ విమానాశ్రయం నుంచి దాదాపు 2.09 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు నిర్వహించారు. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ప్రయాణికులు 21 శాతానికి పైగా పెరిగారని జీహెచ్‌ఐఏఎల్ వెల్లడించింది. విమానాల రాకపోకలు (ఎయిర్ ట్రాఫిక్ మూవ్‌మెంట్స్-ఏటీఎం) 22 శాతం వృద్ధితో 1.75 లక్షల ఏటీఎంలకు చేరాయి. సగటున రోజుకు 500 పైగా విమానాల రాకపోకలు జరుగుతున్నాయి. కొత్త పార్కింగ్ స్టాండ్‌లతో దక్షిణాదిలోనే అత్యుత్తమ కనెక్టివిటీ ఉన్న విమానాశ్రయంగా విమానాశ్రయం ఆవిర్భవిస్తుందని జీఎంఆర్ పేర్కొంది. విమానాశ్రయం జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో జీఎంఆర్ గ్రూప్‌నకు 63 శాతం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ)కు 13%, తెలంగాణ ప్రభుత్వానికి 13%, మలేషియా ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్స్ బెర్హాద్‌కు 11% వాటా ఉంది.

12 రాష్ట్రాలకు డాక్‌ప్రైమ్.కామ్ విస్తరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పాలసీబజార్ గ్రూపునకు చెందిన డాక్‌ప్రైమ్.కామ్ దేశంలోని 12 రాష్ట్రాలకు తన సేవలను విస్తరించింది. వీటిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కూడా ఉన్నాయి. ఇప్పటికే ఢిల్లీ, ఎన్‌సీఆర్‌లో డాక్‌ప్రైమ్‌కు మంచి ఆదరణ లభిస్తోంది. డాక్‌ప్రైమ్.కామ్ ద్వారా ఉచితంగా ఆన్‌లైన్ కన్సల్టేషన్‌ను పొందవచ్చు. అంతేకాకుండా 20వేలకు పైగా డాక్టర్లు, 5వేలకు పైగా డయాగ్నోస్టిక్స్ లాబ్స్ వద్ద పేషెంట్లు డిస్కౌంటు ధరలతో అపాయింట్‌మెంట్స్‌ను బుక్ చేసుకోవచ్చు. ఈ సంస్థ వచ్చే మూడేళ్లకాలంలో ప్రివెంటివ్ హెల్త్‌కేర్‌లో 1.5 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టాలని భావిస్తోంది.

వచ్చే ఏడాది ఏఐ విక్రయం

రూ. 7,000 కోట్లు సమీకరించే వీలు.. అప్పటిలోగా సబ్సిడరీలు, స్థిరాస్తుల అమ్మకం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ విమాన సంస్థ ఎయిర్ ఇండియా వాటా విక్రయం ద్వారా దాదాపు రూ.7,000 కోట్లు రాబట్టాలని కేంద్రం చూస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2019-20) ద్వితీయార్ధంలో ఎయిర్ ఇండియా విక్రయ ప్రక్రియను ప్రారంభించనుంది. అప్పటిలోగా సంస్థ అనుబంధ విభాగాలు, ఇతర ఆస్తులను విక్రయించనుంది. ప్రస్తుతం ఎయిర్ ఇండియాపై రూ.55,000 కోట్ల రుణ భారం ఉంది. ఇందులో రూ. 29,000 కోట్ల రుణాన్ని ఎయిర్ ఇండియా అసెట్ హోల్డింగ్ కంపెనీ అనే స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీవీ)కు బదిలీ చేయనున్నారు.

తొలి ప్రయత్నం విఫలం

అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఈ సంస్థలో వ్యూహాత్మక వాటా (76 శాతం) విక్రయానికి గత ఏడాది కేంద్ర ప్రభుత్వం ఆసక్తి వ్యక్తీకరణ (ఇఒఐ) దరఖాస్తులు ఆహ్వానించింది. కానీ సంస్థను కొనుగోలు చేసేందుకు ఏ ఒక్కరూ ముందుకు రాలేదు. దాంతో ఖంగుతిన్న ప్రభుత్వం విక్రయ ప్రతిపాదనను తాత్కాలికంగా వాయిదా వేసుకుంది. మరిన్ని నిధులు సమకూర్చడం ద్వారా సంస్థను బలోపేతం చేయడంతోపాటు అనుబంధ విభాగాలు, సంస్థపేరిటఉన్న భూముల విక్రయం ద్వారా రుణభారం తగ్గించుకోవాలని మంత్రుల కమిటీ నిర్ణయించింది.

అనుబంధ విభాగాల విక్రయానికి ఆమోదం

ఎయిర్ ఇండియాకు చెందిన గ్రౌండ్ హ్యాండ్లింగ్ సేవల అనుబంధం ఎయిర్ ఇండియా ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్‌లో వ్యూహాత్మక వాటా విక్రయానికి మంత్రుల కమిటీ ఇప్పటికే ఆమోదం తెలిపింది. మరో అనుబంధ విభాగం ఎయిర్ ఇండియా ఇంజనీరింగ్ సర్వీసెస్‌ను సైతం విక్రయించే ఆలోచన ఉంది. ఎయిర్‌లైన్స్‌కు చెందిన సబ్సిడరీలు, భూములు, భవనాల అమ్మకం ద్వారా వచ్చిన సొమ్మును ఎస్‌పీవీకి బదిలీ చేయనున్నారు. రుణ భారాన్ని తగ్గించుకునేందుకు ఎస్‌పీవీ ఆ నిధులను ఉపయోగించుకోనుంది.

ఖర్చులు తగ్గించుకునే ప్రయత్నం

సంక్షోభంలో ఉన్న ఎయిర్ ఇండియా వీలైనన్ని మార్గాల్లో ఖర్చులను తగ్గించుకునే పనిలో ఉంది. అందులో భాగంగా కేటరింగ్ సేవల్లో ఆదాపైనా సంస్థ దృష్టిపెట్టింది. ఇకపై అంతర్జాతీయ సర్వీసుల తిరుగు ప్రయాణంలోనూ ప్రయాణికులకు సంస్థ దేశీ ఆహారాన్నే అందించనుంది. ఇందుకోసం భారత్ నుంచి బయలు దేరేటప్పుడే తిరుగు ప్రయాణంలో అవసరమయ్యే ఆహారాన్ని కూడా పట్టుకెళుతున్నట్లు ఎయిర్ ఇండియా చైర్మన్, ఎండీ ప్రదీప్ సింగ్ తెలిపారు. ప్రయాణికులు తమ సీటును ఎకానమీ క్లాస్ నుంచి బిజినెస్ క్లాస్‌కు మార్చుకునేందుకు వీలుగా కొత్తగా బిడ్డింగ్ విధానాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎయిర్ ఇండియా చీఫ్ ప్రదీప్ సింగ్ తెలిపారు.

జీడీపీ వృద్ధి 7.3 శాతం

2018-19పై ప్రపంచబ్యాంక్

చైనాకన్నా భారత్ వృద్ధే అధికం

వాషింగ్టన్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19)లో భారత జీడీపీలో 7.3 శాతం వృద్ధి నమోదయ్యే అవకాశం ఉందని ప్రపంచబ్యాంక్ అంచనా వేస్తోంది. వచ్చే రెండు సంవత్సరాల్లో 7.5 శాతం చొప్పున వృద్ధికి ఆస్కారం ఉందని పేర్కొంది. దేశంలో వినియోగం, పెట్టుబడులు పెరుగుతున్న నేపథ్యంలో ఆర్థిక వ్యవస్థ వృద్ధికి అవకాశం ఏర్పడుతోందని తెలిపింది. భారత్ రానున్న కాలంలో కూడా ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందని పేర్కొంది. ఈ మేరకు ప్రపంచ ఆర్థిక అంచనాల నివేదికను మంగళవారంనాడు ప్రపంచబ్యాంక్ విడుదల చేసింది. 2017 సంవత్సరంలో చైనాకన్నా తక్కువగా భారత్ వృద్ధిని సాధించిందని, దీనికి కారణం పెద్ద నోట్ల రద్దుతోపాటు వస్తుసేవల పన్ను (జీఎస్‌టీ) అమలే కారణమని పేర్కొంది. దేశీయ డిమాండ్ పుంజుకుందని, జీఎస్‌టీ వంటి నిర్మాణాత్మక సంస్కరణలు, బ్యాంకుల పునర్‌మూలధనీకరణ వంటివి ప్రభావం చూపుతున్నాయని తెలిపింది. ఇక పొరుగు దేశం చైనా ఆర్థిక వ్యవస్థలో నమోదుకానున్న వృద్ధి అంచనాలను కూడా ప్రపంచబ్యాంక్ ప్రకటించింది. 2019, 2020 సంవత్సరాల్లో చైనా ఆర్థిక వ్యవస్థలో వృద్ధి 6.2 శాతం చొప్పున నమోదుకానుందని పేర్కొంది. 2018 సంవత్సరంలో చైనా ఆర్థిక వ్యవస్థ 6.5 శాతం వృద్ధి చెందే అవకాశం ఉందని పేర్కొంది. భారత్ శరవేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఉందని వరల్డ్ బ్యాంక్ ప్రాస్పెక్ట్స్ గ్రూప్ డైరెక్టర్ అహన్ కోస్ తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కారుమబ్బులు కమ్ముకున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని అహన్ కోస్ అభిప్రాయపడ్డారు.

రూ.5 లక్షల వరకు ఆదాయ పన్ను వద్దు

- 80సీ పరిమితిని రూ.2.5 లక్షలకు పెంచాలి: సీఐఐ

న్యూఢిల్లీ : మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుదారులపై మరింత దయ చూపాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) కోరింది. ముఖ్యంగా ఆదాయ పన్ను చెల్లింపు పరిధిలోకి వచ్చే వార్షిక ఆదాయ పరిమితిని ప్రస్తుత రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేసింది. వివిధ పెట్టుబడులకు ప్రస్తుతం సెక్షన్ 80సి కింద ఉన్న రూ.1.5 లక్షల వార్షిక ఆదాయ మినహాయింపు పరిమితినీ, రూ.2.5 లక్షలకు పెంచాలని కోరింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల మధ్య ఉంటే ఐదు శాతం, రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల మధ్య ఉంటే 20 శాతం, రూ.10 లక్షలపైన ఉంటే 30 శాతం చొప్పున ఆదాయ పన్ను రేట్లు అమల్లో ఉన్నాయి. బడ్జెట్‌లో కంపెనీలపైనా పన్నుల భారం తగ్గించాలని సీఐఐ కోరింది. టర్నోవర్‌తో సంబంధం లేకుండా కంపెనీల ఆదాయంపై ఉన్న 30 శాతం పన్ను భారాన్ని 25 శాతానికి కుదించాలని కోరింది. తర్వాత దశలవారీగా ఈ భారాన్ని 18 శాతానికి తగ్గించాలని విజ్ఞప్తి చేసింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరిగే అవకాశం ఉంది. కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన రాజకీయ వ్యవహారాల కేంద్ర కేబినెట్ కమిటీ (సీసీపీఏ) ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.

మహిళలకే ముద్రా రుణాలు అధికం

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి ముద్రా యోజనా (ముద్రా) పథకం ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలు అధికంగా ప్రయోజనం పొందినట్టు కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. ఈ పథకం కింద జారీ చేసిన రుణాల్లో మహిళలే 75 శాతం పొందినట్టు ఆమె చెప్పారు. మహిళలను వ్యవస్థీకృత రంగంలోకి తీసుకురావాలన్న యోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. దేశంలోని మహిళా పారిశ్రామికవేత్తల సంఖ్య పెరుగుతోందనడానికి ఇది నిదర్శనమన్నారు.

కార్డు లావాదేవీలకు మరింత భద్రత!

ముంబై: డెబిట్, క్రెడిట్ కార్డు లావాదేవీల్లో భద్రత పెంచేందుకు ఆర్‌బీఐ మరో చర్య చేపట్టింది. అన్ని రకాల కార్డు లావాదేవీల్లో టోకనైజ్డ్ సర్వీసులు ఆఫర్ చేసేందుకు కార్డు కంపెనీలకు అనుమతిచ్చింది. ఇందుకు సంబంధించి తాజాగా మార్గదర్శకాలు కూడా విడుదల చేసింది. ఈ విధానం అమలులోకి వచ్చాక కస్టమర్లు తమ కార్డు వివరాల స్థానంలో టోకెన్ పేరిట కార్డు కంపెనీలు జారీ చేసే వినూత్న ప్రత్యామ్నాయ కోడ్ సాయంతో లావాదేవీలు జరిపేందుకు వీలుంటుంది. ఈ టోకెన్ ద్వారా ఆన్‌లైన్‌లో, పాయింట్ ఆఫ్ సేల్స్ (పీఓఎస్) టెర్మినళ్ల వద్ద చెల్లింపులు జరుపవచ్చు. క్విక్ రెస్పాన్స్ (క్యూఆర్) కోడ్ , ఇన్-యాప్ పేమెంట్స్ కూడా చేయవచ్చు. ఈ విధానంలో ముందుగా టోకెన్‌ను క్రియేట్ చేసుకోవాల్సి ఉంటుంది. వినియోగదారుడి కార్డు, టోకెన్ కోసం అభ్యర్థించిన సంస్థ (ఉదాహరణకు ఈ-కామర్స్ పోర్టల్), ఉపయోగిస్తున్న డివైజ్ (ఉదాహరణకు మొబైల్) ఆధారంగా కార్డు కంపెనీ వినూత్న టోకెన్‌ను జారీ చేస్తుంది.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	రూపాయి డాలర్	ముడి చమురు
231.98 ▲	53 ▲	65 ▲	225 ▲	▼	▲
36212.91	10855.15	31,975	38,995	70.46	59.77

ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

నిలిచిన రూ.20 వేల కోట్ల

చెక్కు క్లియరెన్సులు

» బ్యాంక్ ఉద్యోగుల సమ్మె ప్రభావం

చెన్నై: బ్యాంక్ ఉద్యోగుల సమ్మె ప్రభావంతో దేశవ్యాప్తంగా రూ.20,000 కోట్ల విలువైన చెక్కు క్లియరెన్సులకు విఘాతం కలిగింది. అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సంఘం (ఏఐబీఈఏ) ఈ విషయాన్ని వెల్లడించింది. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ పది ప్రధాన కార్మిక సంఘాలు ఈ నెల 8, 9 తేదీల్లో దేశవ్యాప్త సమ్మె పాటించాయి. వీరికి మద్దతుగా ఏఐబీఈఏతోపాటు మరో బ్యాంక్ ఉద్యోగ సంఘ సభ్యులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. బ్యాంక్ అధికారుల సంఘం మాత్రం ఈ సమ్మెకు దూరంగా ఉంది. ఈ రెండ్రోజుల్లో ప్రభుత్వ బ్యాంకుల శాఖలు తెరిచే ఉన్నప్పటికీ సాధారణ నగదు లావాదేవీలు, చెక్కుల క్లియరెన్సులు, రెమిటెన్సులు, బిల్స్ డిస్కౌంటింగ్, ప్రభుత్వ ట్రెజరీ కార్యకలాపాలు, విదేశీ మారక లావాదేవీలు, ఎగుమతి, దిగుమతి బిల్లులపై ప్రభావం పడిందని ఏఐబీఈఏ పేర్కొంది.

ఇండస్ ఇండ్ లాభంలో 5% వృద్ధి

న్యూఢిల్లీ : ప్రైవేటు రంగంలోని ఇండస్ ఇండ్ బ్యాంక్ డిసెంబరు 31వ తేదీతో ముగిసిన మూడో త్రైమాసికానికి 5.2 శాతం వృద్ధితో రూ.985.03 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇదే సమయంలో బ్యాంకు ఆదాయం రూ.5473.54 కోట్ల నుంచి రూ.7232.32 కోట్లకు పెరిగింది. స్థూల మొండిబకాయిలు 1.16 శాతం నుంచి 1.13 శాతానికి తగ్గగా నికర ఎన్‌పీఏలు మాత్రం 0.46 శాతం నుంచి 0.59 శాతానికి పెరిగాయి. బుధవారం ఈ బ్యాంకు షేరు బీఎస్ఈలో 1.47 శాతం పెరిగి రూ.1600.80 వద్ద ముగిసింది.

నీరసంలోనూ నిలకడగానే..!

ఐటీ కంపెనీల త్రైమాసిక ఫలితాలపై అంచనా.. నేడు టీసీఎస్ ఫలితాలు

దేశంలో అతిపెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) గురువారం నాడు మూడో త్రైమాసిక (అక్టోబరు - డిసెంబరు) ఆర్థిక ఫలితాలు ప్రకటించనుంది. ఈ ఫలితాల సీజన్‌కు బోణీ కొట్టనున్న బ్లూచిప్ కంపెనీ ఇదే. మొత్తం ఐటీ రంగ పనితీరుపై అవగాహన కల్పించే టీసీఎస్ ఫలితాల కోసం మార్కెట్‌వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. సాధారణంగానే ఐటీ రంగంలో డిసెంబరు త్రైమాసిక పనితీరు నీరసంగా ఉంటుంది. ఉద్యోగుల గైర్హాజరుతోపాటు అమెరికా మార్కెట్లో క్రిస్మస్ సెలవుల నేపథ్యంలో ఐటీ రంగంలో పనితీరు మందగిస్తుంది. అయితే బలహీన సెంటిమెంట్ నేపథ్యంలోనూ ఐటీ కంపెనీలకు రూపాయి క్షీణత అంశం కలిసి రానుంది. అక్టోబరు-డిసెంబరు మధ్యకాలంలో డాలర్‌తో రూపాయి మారకం రేటు 2.7 శాతం మేర తగ్గింది. ఇందుకు తోడు వ్యయ నియంత్రణ చర్యలు, డిజిటల్ సేవల దన్నుతో ఐటీ కంపెనీల ఫలితాలు నిలకడగా నమోదుకావచ్చని బ్రోకరేజీ సంస్థలు భావిస్తున్నాయి. అయితే, క్రాస్ కరెన్సీ ప్రతికూలతలు మాత్రం డాలర్ ఆదాయ వృద్ధిని పరిమితం చేసే అవకాశం ఉందని వారు అంటున్నారు.

టీసీఎస్ మూడో మధ్యంతర డివిడెండ్!

షేర్ హోల్డర్లకు మూడో మధ్యంతర డివిడెండ్ చెల్లింపు ప్రతిపాదనపైన టీసీఎస్ బోర్డు నిర్ణయం తీసుకోనుంది. ఈ నెల 18న డివిడెండ్ చెల్లించే అవకాశం ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం(జూలై-సెప్టెంబరు)లో టీసీఎస్ లాభం రూ.7,901 కోట్లుగా నమోదైంది. త్రైమాసిక ప్రాతిపదికన లాభం 7.6 శాతం వృద్ధి చెందగా.. వార్షిక ప్రాతిపదికన 22.6 శాతం పెరిగింది. ఇదే కాలానికి ఆదాయం రూ.36,854 కోట్లకు చేరుకుంది. త్రైమాసిక ప్రాతిపదికన 7.6 శాతం, వార్షిక ప్రాతిపదికన 20.7 శాతం పుంజుకుంది. అంతకు ముందు త్రైమాసికంతో పోలిస్తే డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూపాయల్లో ఆదాయ వృద్ధి 1.9% వరకూ ఉండవచ్చని బ్రోక్రరైజ్ కంపెనీలు అంచనా వేస్తున్నాయి.

గమనించాల్సిన అంశాలు

- ఆదాయ, లాభాల్లో వృద్ధి
- డిజిటల్, బీఎఫ్ఎస్ఐతోపాటు ఇతర విభాగాల పనితీరు
- ప్రాంతాల వారీగా ఆదాయ వృద్ధి
- కొత్త కాంట్రాక్టులు, వాటి మొత్తం విలువ
- ఉద్యోగుల వలసలు, నియామకాలు
- భవిష్యత్‌పై సంస్థ మేనేజ్‌మెంట్ వైఖరి



టీసీఎస్ ఫలితాలపై బ్రోకరేజీల అంచనాలు

బ్రోకరేజీ సంస్థ	ఆదాయ వృద్ధి (శాతంలో)	
	రూపాయల్లో	డాలర్లలో
సెంట్రమ్ బ్రోకింగ్	1.8	1
బీఎన్‌పీ పారిబా	1.9	1.2
నిర్మల్ బంగ్ ఈక్విటీస్	1.8	1
ఫిలిప్ క్యాపిటల్	1.7	1.3

* త్రైమాసిక ప్రాపతిపదికన



వాణిజ్య ఒప్పందంపై ఆశలు

మళ్లీ 36000 పాయింట్ల ఎగువకు సెన్సెక్స్

ముంబై: అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధానికి తెరపడవచ్చన్న ఆశలు బుధవారం మార్కెట్లను ముందుకు నడిపించాయి. రెండు దేశాల మధ్య చర్చలు చక్కగా జరుగుతున్నాయంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన ఈ ఆశలకు కారణమైంది. దీనికి తోడు మూడో త్రైమాసికంలో కార్పొరేట్ కంపెనీల ఫలితాలపై ఏర్పడిన ఆశావహ దృక్పథంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు పరుగులు తీశారు. అయితే, యూరోపియన్ మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాలు కూడా మార్కెట్లకు లాభాలు తెచ్చిపెట్టాయని విశ్లేషకులు చెబుతున్నారు. అలాగే భారత వృద్ధి రేటు ఈ ఆర్థిక సంవత్సరంలో 7.3 శాతం ఉండొచ్చంటూ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ గుర్తింపును కొనసాగించుకోగలుగుతుందంటూ ప్రపంచ బ్యాంకు చేసిన ప్రకటన కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలంగా నిలిపిందని వారన్నారు. ప్రైవేటు బ్యాంకులు, ఐటీ, ఎఫ్ఎంసీజీ విభాగాల్లో కొనుగోళ్లు భారీగా సాగాయి. బ్యాంకింగ్ షేర్లలో జరిగిన లావాలా సేవా కొనుగోళ్లు జోరుగా సాగాయి. దీంతో మార్కెట్ జోరుగా కొనసాగింది. సర్వత్రా సానుకూల వాతావరణంలో సెన్సెక్స్ మళ్లీ 231.98 పాయింట్లు లాభపడి 36250.54 వద్ద క్లోజయింది. నిఫ్టీ 53 పాయింట్ల లాభంతో 10855.15 వద్ద క్లోజయింది. మార్కెట్ సూచీలు లాభాలతో ముగియడం వరుసగా ఇది నాలుగో రోజు. గత మూడు సెషన్లలో సెన్సెక్స్ 467 పాయింట్లు లాభపడింది. ఎఫ్ఎంసీజీ సూచీ గరిష్ఠంగా 1.11 శాతం లాభపడగా బ్యాంకెక్స్, రియల్టీ ఇండెక్స్ కూడా లాభాల్లో ముగిశాయి. ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్, పీఎస్‌యూ, ఇన్ఫ్రా సూచీలు నష్టాల్లో ముగిశాయి.

ఇన్ఫీ బైబ్యాక్ జోష్

ఈ నెల 11వ తేదీన జరుగనున్న బోర్డు సమావేశంలో బైబ్యాక్ విషయం పరిశీలించనున్నట్టు ప్రకటించడంతో ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ షేరు ఒక శాతం మేరకు లాభపడింది. బీఎస్ఈలో ఈ షేరు 0.90 శాతం లాభంతో రూ.675.85 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో లాభపడిన షేర్లలో యాక్సిస్ బ్యాంక్, ఐటీసీ, టాటా మోటార్స్, భారతి ఎయిర్‌టెల్, ఇండస్ ఇండ్ బ్యాంక్, హిందుస్థాన్ యూనిలీవర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతి, ఐసీఐసీఐ బ్యాంకు ఉన్నాయి.

- యెస్ బ్యాంక్, టాటా స్టీల్, హీరోమోటోకార్ప్, ఓఎన్‌జీసీ, బజాజ్ ఫైనాన్స్, ఎన్‌టీపీసీ, హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్ నష్టపోయిన షేర్లలో ఉన్నాయి.
- కాగా దేశీయ ఆర్థిక సంస్థలు మంగళవారం రూ.698.17 కోట్ల విలువ గల షేర్లను కొనుగోలు చేయగా విదేశీ సంస్థలు రూ.553.78 కోట్ల విలువ గల షేర్లను విక్రయించినట్టు స్టాక్ ఎక్స్ఛేంజీల వద్ద ఉన్న గణాంకాలు చెబుతున్నాయి.

అశోక్ లేలాండ్‌కు భారీ ఆర్డర్

న్యూఢిల్లీ: వాణిజ్య వాహనాల దిగ్గజం అశోక్ లేలాండ్‌కు దేశంలో పలు రాష్ట్ర రవాణా సంస్థల నుంచి భారీ ఆర్డర్లు లభించాయి. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్, ఉత్తర ప్రదేశ్, చండీగఢ్ రోడ్డు రవాణా సంస్థల నుంచి 2580 బస్సుల సరఫరాకు ఆర్డర్లు లభించాయి. ఈ ఏడాది మార్చి లోగా ఈ బస్సులను సరఫరా చేయాల్సి ఉంటుంది. మెరుగైన టెక్నాలజీ, నవ్యత జోడించి తాము తయారుచేసే బస్సులే ఆ విభాగంలో తాము అగ్రస్థానంలో నిలవడానికి దోహదపడుతున్నట్టు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ వినోద్ కె దాసరి అన్నారు.

జెట్ రుణాల పునర్‌వ్యవస్థీకరణకు

బ్యాంకులు సిద్ధం!

JET AIRWAYS

ముంబై: పీకల్లోతు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న జెట్ ఎయిర్‌వేస్ కష్టాలు తీరే సూచనలు కనిపిస్తున్నాయి. కంపెనీ ఈక్విటీలో అత్యధిక వాటా ఉన్న ప్రధాన ప్రమోటర్ నరేశ్ గోయల్, ఎతిహాద్ ఎయిర్‌వేస్ 45 కోట్ల డాలర్ల (సుమారు రూ.3,500 కోట్లు) కొత్త పెట్టుబడులు సమకూరిస్తే, తమకు చెల్లించాల్సిన 45 కోట్ల డాలర్ల రుణాలను పునర్ వ్యవస్థీకరించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఎస్‌బీఐ నాయకత్వంలోని బ్యాంకుల కన్సార్షియం స్పష్టం చేసినట్టు సమాచారం. అయితే దీనిపై జెట్ ఎయిర్‌వేస్, ఎస్‌బీఐ ఇప్పటి వరకు అధికారికంగా స్పందించలేదు. బ్యాంకులు చేసిన ఈ ప్రతిపాదనకు అంగీకరిస్తే జెట్ ఎయిర్‌వేస్ ఈక్విటీలో నరేష్ గోయల్ వాటా ప్రస్తుతం ఉన్న 51 శాతం కంటే దిగువకు పడిపోతుంది. ఈక్విటీలో 24 శాతం వాటా ఉన్న ఎతిహాద్ ఎయిర్‌వేస్ వాటా 49 శాతానికి పెరుగుతుంది. ఎస్‌బీఐ కూడా తనకు రావాల్సిన బకాయిల్లో కొంత భాగాన్ని ఈక్విటీగా మార్చుకునేందుకు సిద్ధమైనట్టు సమాచారం.

గోయల్ తప్పుకుంటేనే..

అయితే ఈ పరిష్కార ప్రక్రియ అంతా నరేష్ గోయల్ తన వాటాను గణనీయంగా తగ్గించుకోవడంపై ఆధారపడి ఉంటుంది. గోయల్ ఇందుకు ఒప్పుకుంటే ఈ సంవత్సరం ఏప్రిల్ 1 నుంచే ఈ పరిష్కార ప్రక్రియ అమల్లోకి వస్తుంది. ఒత్తిడిలో ఉన్న అప్పుల పరిష్కారం కోసం ఆర్‌బీఐ నిర్ణయించిన 180 రోజుల నిర్ణీత గడువు కంటే ఇది చాలా తక్కువ సమయం. గోయల్ బోర్డు నుంచి తప్పుకుంటే తప్ప, అదనపు నిధులు సమకూర్చేది లేదని రుణదాతలతో పాటు, ఇథిహాద్ ఎయిర్‌లైన్స్ ఇప్పటికే అనేకసార్లు స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో దేశీయ బ్యాంకర్లు చేసిన పరిష్కార ప్రతిపాదన ప్రాధాన్యత సంతరించుకుంది. ఇంధన ధరలతోపాటు పోటీ పెరగడంతో జెట్ ఎయిర్‌వేస్ గత మూడు త్రైమాసికాల నుంచి రూ.1,000 కోట్ల చొప్పున నష్టాలు ప్రకటిస్తోంది. దీంతో ఉద్యోగుల జీతాల చెల్లింపులతో పాటు, అప్పుల బకాయిల చెల్లింపుల్లోనూ విఫలమవుతోంది. మధ్యలో టాటా గ్రూపు జెట్ ఎయిర్‌వేస్ ఈక్విటీలో మెజారిటీ వాటా తీసుకునేందుకు సిద్ధమైంది.

సంక్షిప్తంగా...

కెల్టన్ టెక్: ఐటీ సర్వీసుల రంగంలోని కెల్టన్ టెక్ స్విట్జర్లాండ్‌కు చెందిన డోర్మకాబా కంపెనీతో క్లౌడ్ ఆధారిత ఐఓటీ ప్రాజెక్టు ఒప్పందం కుదుర్చుకున్నట్టు ప్రకటించింది. డోర్మకాబా కంపెనీకి చెందిన యాక్సెస్ కంట్రోల్, సెక్యూరిటీ వ్యవస్థలను డిజిటలైజ్ చేయడానికి తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించనున్నట్టు కెల్టన్ టెక్ తెలియచేసింది.

ఎన్ఎండీసీ: తాజాగా ప్రకటించిన రూ.1,000 కోట్ల బైబ్యాక్‌లో పాల్గొనేందుకు అర్హత గల వాటాదారులను ఈ నెల 18వ తేదీన నిర్ణయించనున్నట్టు ఎన్ఎండీసీ ప్రకటించింది. ప్రస్తుతం ఎన్ఎండీసీలో ప్రభుత్వానికి 72.43 శాతం వాటాలున్నాయి. బైబ్యాక్ స్కీమ్‌కు ప్రభుత్వం ఇప్పటికే అనుమతి ఇచ్చింది.

సన్ ఫార్మా: అమెరికన్ ఆస్పత్రులకు తాము సరఫరా చేసిన వెక్యూరోనియం బ్రోమైడ్ ఇంజెక్షన్‌లో గాజు ముక్కల అవశేషాలున్నట్టు కనుగొన్న కారణంగా 13918 కార్టన్లను స్వచ్ఛందంగా రీకాల్ చేస్తున్నట్టు సన్ ఫార్మా ప్రకటించింది. 10, 20 ఎంజీ డోసేజిల్లో ఆ ఔషధాన్ని వెనక్కి తీసుకుంటున్నట్టు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థకు పంపిన ఆ ప్రకటనలో తెలిపింది.

పీఈబీఎస్ పెన్నార్ : ప్రీ ఇంజినీర్డ్ భవన నిర్మాణ రంగంలో ఉన్న పెన్నార్ గ్రూపు కంపెనీ, పెన్నార్ ఇంజినీర్డ్ బిల్డింగ్ లిమిటెడ్ (పీఈబీఎస్ పెన్నార్) ఆర్డర్లు రూ.100 కోట్లకు చేరాయి. పారిశ్రామిక రంగంతో పాటు కార్యాలయ, నివాస భవనాల రంగంలోనూ డిమాండ్ పెరగడం ఇందుకు ప్రధాన కారణం.

10930 పైన అప్‌ట్రెండ్

టెక్ వ్యూ

నిఫ్టీ ప్రారంభంలోనే నెగిటివ్ ట్రెండ్‌లోకి వెళ్లినా 10750 కన్నాపైన రికవరీ సాధించింది. కన్సాలిడేషన్ అనంతరం 50 పాయింట్ల లాభంతో మైనర్ నిరోధం 10850కన్నా స్వల్పంగా పైన డే గరిష్ఠ స్థాయిలో క్లోజయింది. దీనితో పాటు 50, 100 డీఎంఏల కన్నా పైనే క్లోజ్ కావడం ట్రెండ్‌లో సానుకూలతను సూచిస్తోంది. మార్కెట్ మరోసారి గత కొద్ది వారాల్లో విఫలమవుతూ వస్తున్న కీలక నిరోధ స్థాయిలకు చేరింది. రానున్న కొద్ది రోజుల్లో ఇక్కడ బలాన్ని ప్రదర్శించడం చాలా అవసరం.

గురువారం స్థాయిలివే...

నిరోధం : 10930 మద్దతు : 10800

- మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించాలంటే ఇంట్రాడే నిరోధం 10930 కన్నా పైన నిలదొక్కుకోవాలి. తదుపరి టార్గెట్, మధ్యకాలిక నిరోధ స్థాయి 11000.
- మద్దతు స్థాయి 10800 కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది.
- బ్యాంక్ నిఫ్టీ కూడా కీలక ప్రధాన నిరోధం 28000 కన్నా పైన ముగిసింది.

■ వి.సుందర్ రాజా

సాధారణంగా మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి : పుష్య శుక్ల చవితి

నక్షత్రం : శతభిషం

ఆశ్లేష, జ్యేష్ఠ, రేవతి నక్షత్ర జాతకులు, మీన, కర్కాటక రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10855.15 (+53)

ట్రెండ్ మార్పు వేళలు : ఉదయం 9.35 గంటలు

ధోరణి: నిఫ్టీ ఫ్యూచర్స్ మెరుగ్గా ప్రారంభమై 10.25 నుంచి 12 గంటల వరకు నిలకడగాను, 12.15 నుంచి 1.15 మధ్యలో నిస్తేజంగాను ట్రేడ్ కావచ్చు. తిరిగి 1.15 నుంచి చివరి వరకు మెరుగ్గా ట్రేడయ్యే ఆస్కారముంది.

ట్రేడింగ్ వ్యూహం: నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లా‌స్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 10.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 12.15 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని 1.30 సమయంలో క్లోజ్ చేసుకోవాలి. ఆ తర్వాత ఎటిపి కన్నా పైన ఉంటే మరిన్ని లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవలసి ఉంటుంది.

నిరోధం : 10895, 10930


మద్దతు స్థాయిలు : 10815, 10780

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి

www.thefinanciala strologer.blogspot.in




బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	32,940	32,630	32,960	32,500	31,970
క్రితం ముగింపు	32,800	32,550	32,870	32,450	31,830
22 క్యారెట్లు	30,500	30,250	30,320	30,140	31,510
క్రితం ముగింపు	30,370	30,020	30,240	30,070	30,370
వెండి (కేజీ)	40,100	40,300	40,200	40,100	42,500
క్రితం ముగింపు	39,700	40,000	39,900	39,800	42,100



రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 5.15		నెక్ (100 గుడ్లు)	
హైదరాబాద్	453	చిత్తూరు	453
వరంగల్	455	చెన్నై	460
విజయవాడ	453	నమక్కల్	445
గోదావరి	453	బెంగళూరు	455
విశాఖపట్నం	458	ముంబై	508



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		వెంకాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	82	విజయవాడ	85
కరీంనగర్	82	గుంటూరు	86
వరంగల్	82	ఒంగోలు	87
మహబూబ్‌నగర్	82	చిత్తూరు	91
కర్నూలు	82	నెల్లూరు	91
విశాఖపట్నం	80	అనంతపురం	85
గోదావరి	82		

బీఎస్ఈలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)

ACI INFOCOM .65(.62)7000
ADITYA SPIN. 6.72(7.07)524
AGRO TECH FO 608.45(605.85)162
AISHWARYA TE 2.85(2.82)2200
ALPHAGEO (I) 453.25(473.6)919
ALU FLUORIDE 121.1(122.65)1373
AMAR RAJA BA 738.65(738.55)14530
ANDHRA BANK 30.1(30.25)154951
ANDHRA CEMEN 5.85(5.9)307
ANDHRA PETRO 68.65(72.15)150699
ANJANI PORTL 126.55(131.9)1500
ASTRA MICRO 80.15(80.35)11681
AUROB.PHARMA 756.25(746.35)436445
AVANTEL LTD 232.55(231.4)4788
AVANTI FEEDS 379.35(382.85)22339
B.N.RATHI SE 27(27.25)20
BALAJI AMINE 449.5(450.45)1495
BAMBINO AGRO 194(193)95
BARTRONICSIN 7.25(7.48)13351
BCG 2.74(2.69)81687
BHAGIRA.CHEM 423.5(425.05)250
BHAGYA INL 34.35(33.7)2001
BHARATFIN 1011.35(1001.55)15759
BNR UDYOG 15.35(15.05)40
CAMBRIDGE 46.25(47.7)436
CCHHL 7.51(7.49)1765
CCL PRODUCTS 267.85(271.85)1256
CELESTIAL 8.32(8.58)7086
CIL SECURITS 16.25(17.9)500
COROM INTER 456.5(453.35)3292
CUBEX TUBING 15.14(15.01)1251
CYBERMATE 2.23(2.19)46574
CYIENT 604.35(605.55)879
DANLAW TECH. 98.7(102.05)1229
DECAN CEMENT 397(402.15)100
DHAN ROTO SP 28(29.45)200
DIAMONPOWER 1.44(1.45)9815
DIVI'S LAB. 1474.25(1458.7)11412
DIVYA.GRANIT 86(85)26
DQ ENT 8.39(8.15)470
DR.REDDY'S 2603.9(2570.35)28514
EMPEE SUGARS 1.37(1.37)5449
EVEREST ORG. 115.25(115)1670
FACOR ALLOYS 1.99(1.97)42413
FOURTH GEN. 2.08(1.99)40
GATI LTD. 82.95(84.15)56054
GAYATRI PROJ 175.25(177.05)1380
GENNEX LAB 3.69(3.66)3268
GMR INFRASTR 16.85(16.05)2275838
GODAVARI DRU 22.95(23.35)103
GOLDSTONE EN 15.9(16.45)14629
GRANULES (I) 90.45(89.25)42661
GVK POWERINF 7.8(7.76)118442
HBL P SYS 28.4(27.95)52856
HERITGFOOD 525.95(527.15)131
INCAP LTD. 39(39.05)141
IPAPPM 462.4(453.8)4332
IVRCL LTD 1.02(1.01)38329
KAKATIYA CEM 196.25(197.45)2660
KALLAM 18.45(18.45)7858
KAVERI SEED 548.4(537.9)29740
KCP LTD 90(90.45)3768
KERNEX MICRO 23.35(23.75)455
KNR CONST 214.95(215.6)3138
KREBS BIOCHM 112(111.95)14
LOKESH MACH 45.85(45.25)7870
LOTUS CHOC 24.95(24.5)272
MADHUCON PRJ 7(6.92)5965
MOLD-TEK TEC 45.05(44.05)2511
MOSCHIP SEMI 23.45(23.35)12865
MSR INDIA 11.78(12.4)7173
N C L IND. 136(136)8544
NACLIND 27.9(28)602
NATCO PHARM 685.8(693.65)4783
NCC 90.55(88.85)930274
NEHA INTER. 4.15(4.31)2776
NETTLINX LTD 51.95(51.8)26897
NEULAND LAB. 503.55(482.4)3802
NIHAR INFO 13.54(14.25)385
NILE LTD. 381.4(375)337
NTL 1.15(1.1)399
OIL COUNTRY 15.6(15.85)4610
OLECTRA 235.75(238.45)12189
PADMALAYA TE 2.28(2.4)4601
PALRED 42.95(41.9)2489
PANYAM CEMEN 13.75(13.62)2520
PENNAR STEEL 42.3(37.55)312451
PFL INFOTECH 8.49(8.5)250
PITTIENG 65(65.65)4551
POKARNA LTD 156.5(157.55)407
PRAJAY ENGS. 8.71(8.8)5633
PREMIER EXPL 238.4(240.95)1064
PRSMJOHNSN 86.1(86.9)18920
RAIN 115.85(119.6)129443
RAJ PACKAGIN 26.5(27.05)2102
REG.CERAMIC 3.9(3.72)700
RESTILE CER. 3.9(4)1125
SAGAR CEM. 673.2(665)52
SAMKRG PIST. 190.85(189.7)815
SAMPRE NUTRI 40.45(39.95)52
SANGHI IND. 60.3(60.4)7072
SATVAH.ISPAT 9.63(9.98)11630
SAVEN TECHNO 27.6(27.35)8332
SIBAR AUTO 33.2(34.9)51
SMPL .39(.38)9597
SMS PHARMACE 71.85(72.75)4832
SREE RAYALA 162.45(154.05)14354
SUJANA INDUS .34(.34)23148
SURANATP 4.75(4.7)7470
SURYACHAKRA .35(.36)37076
SURYAMBA SP 70.2(73)500
SURYAVA SPIN 4.97(4.74)22
SURYLAK.COTT 42.05(42.05)2176
SUVEN LIFE S 226.15(229.5)26435
TAJ GVK HOTL 181.25(172.8)17706
TRANSCORP IN 22.8(22.4)114
TRANSGENE BI 3.88(3.7)32681
TRANSPORT CO 286.3(282.75)377
USHER AGRO 2.2(2.25)399
VICEROY HOTE 4.69(4.67)10042
VIJAY TEXTIL 42.9(44.2)427
VIRAT CRANE 34.2(33.55)2357
VIRINCHI 81.05(82.25)6801
VISAKA IND. 428.45(429.05)413
VISTA PHARMA 27.4(28.35)57886
VIVIMED LABS 34.45(34.55)29523
VST INDUS. 3206.25(3152.05)41
WATERBASE 156.95(158.35)30894
XLENERGY 1(1.04)2759
ZEN TECH 74(74.9)8907
ZENOTECH 36(35.7)2409

ఎన్ఎస్ఈ-500

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా (NSE)

AARTIDRUGS 585.15(583.2)6288
AARTIIND 1494.65(1494.1)62161
ABAN 74.05(73.5)456436
ABB 1299.6(1299.4)49088
ABFRL 211.75(208.35)1654540
ABGSHIP 1.95(1.95)35561
ACC 1454.15(1480.4)363164
ADANIENT 149.35(153.45)4054809
ADANIPORTS 377.3(378.75)1166498
ADANIPOWER 50.9(51.55)7317677
ADANITRANS 207.45(205.95)114197
AEGISCHEM 209.85(209.9)56068
AHLUCONT 330.3(326.4)15667
AIAENG 1653.95(1635.75)11392
AJANTPHARM 1158.45(1172.8)417835
AKZOINDIA 1753.9(1757.75)1960
ALBK 46.1(47.55)6058968
ALLCARGO 109.15(107.25)324082
ALOKTEXT 3.9(3.95)1496639
AMARAJABAT 740.75(738.7)364350
AMBUJACEM 212.85(218.7)2005058
ANANTRAJ 35.25(35.75)282663
ANDHRABANK 29.9(30.25)944973
APARINDS 626.75(634.5)15384
APLLTD 592.4(591.75)37090
APOLLOHOSP 1267.4(1249.5)289161
APOLLOTYRE 223.4(228.8)1830077
ARVIND 96.45(96.4)1387765
ASHIANA 120.65(122)24480
ASHOKA 134.25(135.25)120832
ASHOKLEY 94.45(93.05)27548584
ASIANPAINT 1402(1401.25)973687
ASTRAL 1173.35(1147.8)49363
ASTRAZEN 1476(1459.35)3216
ATUL 3461.35(3446.25)7280
AUROPHARMA 757.25(746.55)2996718
AXISBANK 670.1(650.9)18003387
BAJAJ-AUTO 2696.9(2694.85)285560
BAJAJCORP 371.75(384.25)680121
BAJAJELEC 489.35(489.7)116853
BAJAJFINSV 6399.1(6443.05)159769
BAJAJHIND 9.1(9.35)2290638
BAJAJHLDNG 2951.15(2955.45)5980
BALKRISIND 885.7(867.55)911257
BALLARPUR 5.4(5.55)541624
BALMLAWRIE 196.6(197.9)37346
BALRAMCHIN 108.8(111.15)2026711
BANKBARODA 122.95(123.85)12747179
BANKINDIA 105.45(108.8)13267879
BASF 1517.35(1519.55)3529
BATAINDIA 1148.2(1131.45)1099623
BBTC 1300.65(1302.05)39133
BEML 908.7(917)1903553
BERGEPAINT 325.45(323.85)806721
BFUTILITIE 230.7(235.25)351405
BGRENERGY 60.65(60.65)32193
BHARATFIN 1011.55(1000.6)467838
BHARATFORG 477(471.85)1367513
BHARTIARTL 334.5(329.25)7226454
BHEL 70.25(71.35)7124203
BIOCON 631.85(629.15)1452880
BIRLACORPN 568.85(572.65)21318
BLISSGVS 170.85(168.15)756510
BLUEDART 3291.2(3298.75)1253
BLUESTARCO 611.95(613.15)74731
BOMDYEING 110.1(111.1)485254
BOSCHLTD 19476.35(19300.6)8981
BPCL 340.05(351.95)4565866
BRFL 9.05(9.1)136370
BRIGADE 209.95(212.95)130662
CADILAHC 347.7(349.25)536267
CANBK 280.5(287.9)6418709
CARERATING 984.75(985.2)18857
CASTEXTECH 1.25(1.2)108319
CASTROLIND 151.2(151.6)672625
CCL 269.25(269.85)14155
CEATLTD 1259.45(1272.65)442869
CENTRALBK 36.8(35.75)2758280
CENTURYPLY 175.1(173.55)1087901
CENTURYTEX 896.65(905.45)355954
CERA 2625.55(2660.15)3952
CESC 653.95(654.25)512771
CHAMBLFERT 158.3(156.6)175934
CHENNPETRO 269.9(280.95)851526
CHOLAFIN 1198.95(1199.65)445882
CIPLA 510.1(513.65)1929305
CLNINDIA 406.05(407.6)3896
COALINDIA 232.65(233.3)2954253
COLPAL 1303.55(1310.75)373875
COROMANDEL 455.6(453.2)58964
CORPBANK 29.05(29.25)323572
COX&KINGS 170.4(171.8)28570
CRISIL 1637.65(1628)2107
CUB 191.95(194.15)1059701
CUMMINSIND 860.5(846.85)637886
CYIENT 603.9(607)39345
DABUR 421.5(416.4)2975792
DBCORP 182.3(169.45)1673603
DBREALTY 30.1(31.65)254297
DCBBANK 177.5(177.45)936333
DCMSHRIRAM 362.3(354.8)50958
DEEPAKFERT 143.65(144.05)132656
DELTACORP 262(263.55)5121784
DEN 70(70)586725
DENABANK 13.9(14)1722099
DHANUKA 416.45(410.7)24744
DHFL 227.15(231.1)6664452
DISHTV 39.95(40.5)6889392
DIVISLAB 1473.25(1458.85)248643
DLF 182.1(181.5)5570072
DREDGECORP 451.65(453.9)499020
DRREDDY 2603.1(2570.5)464336
DYNAMATECH 1477.4(1500.95)223
ECLERX 1049.45(1064.9)2488
EDELWEISS 178.65(181.05)6318457
EICHERMOT 20291.05(20044.65)163752
EIDPARRY 223.65(217.9)252291
EIHOTEL 190.05(188)105600
ELECTCAST 20.95(20.85)90999
ELGIEQUIP 251.2(246.2)23395
EMAMILTD 421.4(422.75)80911
ENGINERSIN 124.9(124.9)915169
EROSMEDIA 84.3(85.15)273864
ESCORTS 739.6(731.15)1498650
ESSDEE 20.5(21.55)27028
ESSELPACK 108.05(107.6)24297
EVEREADY 181.25(181.05)33670
EXIDEIND 259.85(261.45)590631
FCONSUMER 43.25(44.25)997973
FDC 173(173.3)19266
FEDERALBNK 96.9(95.25)16761351
FINCABLES 448.05(448.6)27246
FINPIPE 532.95(531.1)9282
FLFL 390.05(391.05)5419
FORTIS 139.2(139.4)463832
FSL 47.35(47.1)1622821
GAIL 341.35(354.6)6152832
GATI 83.05(84.15)288658
GDL 118.4(118.55)67434
GEPIL 813.6(811.3)2191
GESHIP 317.45(315.25)19698
GET&D 295.25(296.4)16383
GILLETTE 6499.55(6499.8)5299
GLAXO 1464.55(1447.85)16430
GLENMARK 656.7(654.5)589840
GLOBOFFS 13.6(13.65)4195
GMDCLTD 88(88.1)93465
GMRINFRA 16.85(16.05)35168601
GODFRYPHLP 906.65(905.7)187118
GODREJCP 773.9(779.45)824297
GODREJIND 537.8(539.55)276364
GODREJPROP 742.1(732.05)341356
GPPL 95.15(95.75)76116
GRANULES 90.8(89.45)687883
GREAVESCOT 121.8(119.75)314087
GREENPLY 140.95(140.6)98919
GRINDWELL 555.15(553)2796
GRUH 233.95(255.25)33282424
GSFC 112.3(112.6)1482469
GSKCONS 7500.3(7452.15)18456
GSPL 170.15(170.4)1040947
GUJFLUORO 952.95(945.95)329153
GUJGASLTD 661.55(657.35)31088
GULFOILLUB 829.9(830.6)73260
GVKPIL 7.85(7.75)991158
HATHWAY 31(30.75)336764
HAVELLS 681.75(669.7)877124
HCC 12.55(12.85)6674093
HCL-INSYS 24.8(25.1)708959
HCLTECH 938.4(945.15)1235860
HDFC 1994.95(1958.95)2905090
HDFCBANK 2116.8(2103)2142157
HDIL 28.3(28.75)8984469
HEIDELBERG 150(150.85)143801
HEROMOTOCO 2937.45(2970.3)388001
HEXAWARE 329.35(328.9)793764
HFCL 23(23.9)7570912
HIMATSEIDE 208.6(213.4)36188
HINDALCO 205.7(206.5)13253349
HINDCOPPER 49.6(49.95)406039
HINDPETRO 239(247.95)5611285
HINDUNILVR 1785(1770.85)1324628
HINDZINC 275.45(274.3)251548
HMT 19.9(19.65)762
HMVL 129.65(129.95)820229
HONAUT 22010.85(21849.15)768
HOTELEELA 15.2(15.25)271833
HSIL 239.1(235.1)169199
HTMEDIA 46.9(39.1)4781097
IBREALEST 87.95(88.15)1497305
IBULHSGFIN 821.75(812.55)4423414
ICICIBANK 382.25(380.15)21730142
ICRA 3181.1(3181.3)3855
IDBI 64.65(61.9)11347419
IDEA 36.95(36.95)11329866
IDFC 43.2(43.95)4085298
IFBIND 834.5(830.25)1931
IFCI 14.8(14.9)2989691
IGARASHI 549.6(547.6)17793
IIFL 482.4(481.85)34131
IL&FSTRANS 11.6(12.1)654531
INDHOTEL 141.75(141.85)1148010
INDIACEM 88.4(90.9)6889098
INDIANB 253.45(257.85)2913472
INDOCO 218.4(215.95)11219
INDUSINDBK 1601.75(1577.75)6447772
INEOSSTYRO 682.5(689.85)1612
INFRATEL 290.35(297.95)3188173
INFY 676.1(670.05)18130292
INGERRAND 584.6(592.8)6503
INOXLEISUR 251.3(252.9)39797
INOXWIND 75.65(75.65)26253
INTELLECT 221.75(223.3)144427
IOB 14.65(14.8)241137
IOC 132(134)8349450
IPAPPM 463.2(454.7)65610
IPCALAB 777.05(775)44510
IRB 156.7(160.25)1099185
ITC 290.4(284.25)12182118
J&KBANK 36.9(37.25)779872
JAGRAN 117.55(115.35)1482637
JAICORPLTD 111.7(113.4)756352
JBCHEPHARM 302.9(303.7)7344
JBFIND 21.7(21.9)18569
JCHAC 1782.25(1746.7)7592
JETAIRWAYS 244.2(245.35)5204669
JINDALPOLY 240.15(237.85)18998
JINDALSTEL 151.8(157.75)14192956
JISLJALEQS 66.75(66.6)2990498
JKCEMENT 698.9(702.95)8067
JKIL 127.75(129.8)88973
JKLAKSHMI 303.75(313.1)35874
JKTYRE 101.9(103.3)241432
JMFINANCIL 88.1(90)526446
JPASSOCIAT 7.45(7.6)17182475
JPINFRATEC 3.85(3.85)548235
JPPOWER 2.05(2.05)969479
JSWENERGY 69.85(70.3)439253
JSWHL 2655.45(2721.05)2487
JUBILANT 717.15(715.35)159154
JUBLFOOD 1234.15(1240.25)2226302
JUSTDIAL 486.85(497.15)1635417
JYOTHYLAB 203.5(203.7)110075
KALPATPOWR 382.8(383.2)16287
KANSAINER 451.65(462.45)138561
KEC 284.9(289.15)251892
KESORAMIND 82.5(83.45)149414
KIRLOSENG 199.05(200.75)8787
KITEX 109.1(109.1)53408
KOLTEPATIL 266.1(272)81787
KOTAKBANK 1238.25(1228.9)1647622
KPIT 207.35(206.85)791688
KRBL 293.05(293.6)48199
KSCL 548.4(537.75)470945
KSK 1.55(1.5)511690
KTKBANK 113.9(115.75)2277090
KWALITY 7.85(8)1106736
L&TFH 144.65(148.3)5415783
LAKSHVILAS 77.1(80)308167
LAOPALA 218.35(221.15)15417
LAXMIMACH 5719.05(5712.9)674
LICHSGFIN 476.15(480.9)939711
LT 1386.05(1382.2)1413005
LUPIN 838.15(841.7)928337
M&M 726.3(723.4)2569424
M&MFIN 459.5(461.8)1082351
MAGMA 107.8(107.65)20756
MAHINDCIE 241.9(243.95)34130
MAHLIFE 390.65(392.85)28061
MANAPPURAM 95.65(96.45)2172934
MANPASAND 84.9(86.2)262613
MARICO 383.75(381.85)1277868
MARKSANS 27.65(27.75)629254
MARUTI 7492.9(7439.5)740580
MAYURUNIQ 393.55(393.8)2746
MCLEODRUSS 113.9(112.1)101139
MERCK 3246.85(3161.35)30818
MHRIL 206.05(204.7)55182
MINDACORP 149.95(150.5)453365
MINDTREE 823.45(821.2)1108871
MMTC 28.9(29.35)623357
MOIL 167.5(167.95)96080
MONSANTO 2615.65(2643.9)7361
MOTHERSUMI 161.95(158.25)5704804
MOTILALOFS 686.2(697.25)80492
MPHASIS 904.95(924.8)389089
MRF 66070.35(66439.9)4369
MRPL 71.3(72.05)934771
MTNL 15.25(15.45)1910242
MUTHOOTFIN 516.75(517)817662
NATCOPHARM 686.85(696.2)73594
NATIONALUM 62.9(62.8)3080135
NAUKRI 1628.7(1619.4)114138
NAVKARCORP 50.6(51.2)183589
NCC 90.65(88.75)11684106
NETWORK18 39.8(39.8)301097
NHPC 25.95(26)5760250
NIITTECH 1162.25(1125.2)1544142
NITINFIRE 1.75(1.8)93604
NLCINDIA 68(68.1)143991
NMDC 91.25(94.95)11847014
NTPC 146.55(146.95)3863786
OBEROIRLTY 457.65(451.85)160252
OFSS 3599.1(3581.6)31266
OIL 175.8(176.45)722635
OMAXE 212.8(212.85)367606
ONGC 145.3(147.45)4951441
ORIENTBANK 99.25(100.85)6099024
ORIENTCEM 79.7(80.7)49178
ORISSAMINE 922.5(921.95)6472
PAGEIND 23262.8(23021.6)64706
PARSVNATH 8.1(8.2)97424
PCJEWELLER 81.2(82.75)9214670
PEL 2341.9(2308.55)446843
PERSISTENT 565.05(570.15)133830
PETRONET 214.4(220.05)2534052
PFC 108.25(108.9)7259996
PFIZER 2736.85(2745.2)31787
PFS 17.8(18.45)709827
PGHH 9982.45(9978.45)3008
PHOENIXLTD 575.15(576.45)35931
PIDILITIND 1098.1(1102.9)626835
PIIND 855.9(854.65)47299
PNB 80.7(81.7)18063915
POWERGRID 197.6(197.35)2299236
PRAJIND 144.9(129.05)15125774
PRESTIGE 226.1(226)199561
PRSMJOHNSN 86.35(86.9)216151
PTC 90.6(91.45)1335067
PUNJLLOYD 4.05(4.1)413899
PURVA 84.3(82.25)209435
PVR 1612.7(1604.65)632162
RADICO 409.3(401.1)845409
RAIN 115.7(119.4)1037489
RAJESHEXPO 570.9(571.25)501308
RALLIS 168.9(170.25)240972
RAMCOCEM 625.7(631.8)481641
RAMCOSYS 272(267.95)73275
RATNAMANI 907.45(903.75)845
RAYMOND 804.8(814.9)652758
RCF 62.7(62.9)742140
RCOM 13.8(14)58166357
RECLTD 120.85(121.6)5166948
REDINGTON 85.75(86.35)90312
RELAXO 740.9(753.65)59085
RELCAPITAL 217.1(221.55)4048776
RELIANCE 1110.75(1104.65)5766805
RELINFRA 300.6(301.9)2819774
RENUKA 11.2(11.45)529587
REPCOHOME 424.1(429.9)829440
RIIL 338(341.6)156673
RKFORGE 516.55(518.15)10060
RNAVAL 13.75(13.8)976963
ROLTA 7.9(8.3)9523356
RPOWER 29.7(30.4)10133470
RTNPOWER 3.6(3.5)1987984
RUCHISOYA 8.25(8.15)951355
SADBHAV 222.35(224.95)1316834
SADBHIN 96.25(98.2)27538
SAIL 52.25(54.35)14003107
SANOFI 6224.75(6191.25)20766
SBIN 305.3(305.3)21109911
SCHAEFFLER 5646.7(5656.45)570
SCHNEIDER 99.1(99.35)47267
SCI 45.65(45.75)306862
SHARDACROP 300(300.45)82549
SHILPAMED 385.05(384)7183
SHK 171.95(171.4)14543
SHOPERSTOP 504.95(504.55)29505
SHREECEM 16345.4(16753.85)23593
SHRIRAMCIT 1580.95(1582.65)16723
SIEMENS 1053.55(1052.3)493735
SIMPLEXINF 189.95(191.35)17964
SINTEX 11.7(11.75)1008375
SITINET 10.6(10.7)6802
SJVN 25.1(25.55)2485015
SKFINDIA 1936.2(1921.5)396068
SMLISUZU 641.95(646)4580
SNOWMAN 34.8(34.85)74715
SOBHA 481.3(454.4)431832
SOMANYCERA 366.75(361.15)94815
SONATSOFTW 305.1(308.35)92901
SOUTHBANK 15.4(15.25)19411726
SPARC 186.5(186.8)727309
SREINFRA 36.15(35.5)6960537
SRF 2036.75(2025.3)444563
SRTRANSFIN 1209.95(1192.75)834425
STAR 476.3(465.85)1496974
STCINDIA 133.1(135.55)103175
SUNDARMFIN 1487.8(1500.35)9539
SUNDRMFAST 522.35(522.7)83098
SUNPHARMA 448.75(448.05)9034282
SUNTV 588.9(599.85)966892
SUPREMEIND 1047.25(1039.1)208589
SUVEN 225.25(229.25)140178
SUZLON 5.35(5.35)15578959
SWANENERGY 98.3(98.35)429586
SYMPHONY 1128.65(1134.35)4206
SYNDIBANK 40.7(41.6)5476691
SYNGENE 564.9(553.2)24977
TAKE 148.45(145.65)80368
TATACHEM 697.15(699.8)281106
TATACOFFEE 97.55(97.35)278109
TATACOMM 520.8(527.6)264753
TATAELXSI 970.05(972.25)1345457
TATAGLOBAL 212.6(215.15)908322
TATAMOTORS 183.05(179.95)17468948
TATAMTRDVR 96.9(96)3811519
TATAPOWER 74.35(74.95)2006348
TATASPONGE 830(810.1)191361
TATASTEEL 479.2(491.35)12696660
TATASTLBSL 35.45(36.9)611914
TBZ 65.4(66.45)42020
TCS 1886.95(1893.55)2414376
TECHM 693.7(689.85)2183998
TEXRAIL 57.3(57.35)177339
THERMAX 1138(1152)8875
THOMASCOOK 234.7(235)78161
TIDEWATER 5371.85(5374.3)278
TIMKEN 590.6(598.5)15631
TITAN 952.95(946.15)2115974
TNPL 239.5(243.5)43192
TORNTPHARM 1830.2(1817.4)211987
TORNTPOWER 261.65(262.75)856853
TREEHOUSE 4.65(4.6)8558
TRIDENT 67.7(67.9)290348
TRITURBINE 110(108.7)87122
TTKPRESTIG 7463.2(7425.35)1086
TTML 3.95(3.9)909357
TV18BRDCST 37.8(37.75)2438036
TVSMOTOR 539.65(535.15)1068861
TVSSRICHAK 2452.75(2462.45)513
TVTODAY 371.4(365.2)14217
UBL 1385.3(1410.85)619475
UCOBANK 21.15(21.5)755725
UFLEX 267.55(270.5)42273
ULTRACEMCO 3817.25(3916.3)248627
UNICHEMLAB 194.05(197.4)39525
UNIONBANK 92(94.55)10605358
UNITECH 2(2.05)2079528
UPL 764.8(752.2)1039851
VAIBHAVGBL 727.8(712.05)7429
VAKRANGEE 36.05(37.2)4459739
VEDL 194.75(195.65)11205333
VIDEOIND 3.1(3.15)167777
VIJAYABANK 49.7(49.1)1409278
VINATIORGA 1615.55(1611)30606
VIPIND 501.6(509.15)163328
VOLTAS 535.15(539.6)769323
VRLLOG 278.65(279.05)7471
VSTIND 3172.1(3147.5)1181
VTL 1079.55(1074.3)4808
WABAG 279.5(275.4)448986
WABCOINDIA 6379.35(6395.9)5088
WELCORP 134.25(135.25)184662
WELSPUNIND 61.25(61.25)422659
WHIRLPOOL 1460.85(1421)84118
WIPRO 329(325.55)3927881
WOCKPHARMA 510.35(513.7)729692
WONDERLA 262.15(262.5)13183
ZEEL 451.25(451.65)6334834
ZEELEARN 34.5(35.7)143240
ZYDUSWELL 1325.95(1325.8)4387

పాఠశాలలకు 11 నుంచి సంక్రాంతి సెలవులు

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని పాఠశాలలకు ఈ నెల 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ఉంటాయని విద్యాశాఖ ప్రకటించింది. ఈ మేరకు అకడమిక్ కేలండర్‌లో తేదీలను పొందుపరిచింది. 18వ తేదీన పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి.

● గణతంత్ర వేడుకలు కొత్తగా ఉండాలి: సీఎస్

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గణతంత్ర వేడుకల నిర్వహణ ఈ సారి కొత్తగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి అధికారులను ఆదేశించారు. ఉద్యానవన శాఖ ద్వారా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌ను వినూత్నంగా పూలతో అలంకరించాలని, వేడుకలకు హాజరయ్యే పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. పలుశాఖల అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, చార్మినార్ వంటి భవనాలను విద్యుత్‌దీపాలతో అలంకరించాలని తెలిపారు.

● సాయికృష్ణ వైద్యానికి 10 లక్షల సాయం

» అతడి తల్లిదండ్రులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందించిన కేటీఆర్

మహబూబాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో దుండగుల కాల్పుల్లో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహబూబాబాద్ వాసి సాయికృష్ణ వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరు చేసిన రూ.10 లక్షల చెక్కును సాయికృష్ణ తల్లిదండ్రులు పూస ఎల్లయ్య, శైలజకు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం అందజేశారు. వారు అమెరికా వెళ్లడానికి వీసాలు మంజూరు చేయించారు. ఈసందర్భంగా సాయికృష్ణ తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమారుడి వైద్యం కోసం 10లక్షల సాయం అందించిన కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


కేటీఆర్ అందజేసిన చెక్కుతో సాయికృష్ణ తల్లిదండ్రులు ఎల్లయ్య, శైలజ దంపతులు

● జూనియర్ కార్యదర్శి పోస్టుల్లో క్రీడా కోటా!

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జూనియర్ పంచాయతీ కార్యదర్శి పోస్టుల భర్తీలో క్రీడా కోటా అమలు చేయాలని పంచాయతీరాజ్ శాఖ సూత్రప్రాయంగా నిర్ణయించింది. జీవో 5 ప్రకారం 2శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సిందేనని కోర్టు సైతం ప్రభుత్వానికి సూచించింది. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ అధికారులు బుధవారం న్యాయ శాఖ అధికారుల సలహా తీసుకున్నారు. మరోసారి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సంప్రదించి, చర్యలు తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు.

● డిగ్రీలో 'డిమాండ్' కోర్సులకు గ్రీన్‌సిగ్నల్!

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు తక్షణ ఉపాధి చూపించే కోర్సులను ప్రైవేట్ కాలేజీల్లో అనుమతించేందుకు తెలంగాణ ఉన్నత విద్యామండలి కసరత్తు చేస్తోంది. ల్యాబ్ టెక్నీషియన్, ఫుడ్ టెక్నాలజీ వంటి డిగ్రీ కోర్సులకు ఉన్న డిమాండ్ దృష్ట్యా ప్రైవేట్ కాలేజీల్లోనూ వీటికి అనుమతి ఇవ్వాలని భావిస్తోంది. దీనిపై ఈ నెల 18వ తేదీన జరిగే సమావేశంలో ఓ నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు.

● చైనా మాంజాను వాడొద్దు!: అటవీ శాఖ

పతంగులు ఎగురవేయడానికి చైనా మాంజా (దారం)ను వినియోగించొద్దంటూ సోషల్ మీడియా ద్వారా అటవీశాఖ ప్రచారం చేస్తోంది. ప్రజలకు అవగాహన కల్పించడానికి వీడియోలు, చిత్రాలు రూపొందించి ఫేస్‌బుక్‌తో పాటు వాట్సాప్ ద్వారా కోరుతోంది. ఈ మేరకు రూపొందించిన పలు వీడియోలు బుధవారం విడుదల చేసింది. చైనా మాంజా కనిపిస్తే టోల్ ఫ్రీ నంబర్ 18004255364కు ఫిర్యాదు చేయాలని సూచించింది.

● ఇంటీరియర్‌పై జయశంకర్ వర్సిటీలో శిక్షణ

ఆచార్య జయశంకర్ వర్సిటీలో 'ఇంటీరియర్ డెకరేషన్'పై శిక్షణ ఇవ్వనున్నారు. ఈనెల 23 నుంచి ఫిబ్రవరి 12 వరకు తరగతులు నిర్వహిస్తామని గృహ విజ్ఞాన కళాశాల అసోసియేట్ డీన్ విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఆపై విద్యార్హతలు కలిగిన యువతులు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. అలాగే, టూరిజం, హాస్పిటాలిటీ, పంచకర్మ ఆయుర్వేద, స్పా కోర్సుల్లో ఆరునెలల పాటు ఎస్సీ నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఎండీ లచ్చిరాం భూక్య తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.

● ప్రశాంతంగా జేఈఈ మెయిన్

ఎన్ఐటీ, ఐఐటీల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్ ప్రవేశ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిసారి ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నా ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తలేదు. తెలంగాణవ్యాప్తంగా 15-20 వేల మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు అంచనా. కెమిస్ట్రీ, మ్యాథ్స్‌తో పోలిస్తే ఫిజిక్స్ ప్రశ్నపత్రం కఠినంగా వచ్చిందని విద్యార్థులు తెలిపారు. ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ నుంచే ఎక్కువ ప్రశ్నలొచ్చాయని ఐఐటీ నిపుణుడు ఉమాశంకర్ తెలిపారు.

● ఫార్మసీ కౌన్సిల్‌కి ఐదుగురు సభ్యులు

తెలంగాణ ఫార్మసి కౌన్సిల్‌కు ఐదుగురు సభ్యులను ఎంపిక చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీరిలో ఎ.సంజయ్ రెడ్డి (హైదరాబాద్), కె.శ్రీనివాస్ (సిరిసిల్ల), ఆర్.శ్రీనివాస్ (వరంగల్), టి.చంద్రశేఖర్ ఆజాద్ (నల్లగొండ), ఎం.వినోద్ కుమార్ (పెద్దపల్లి) ఉన్నారు.

● క్యాట్‌లో జేఎన్‌టీయూ విద్యార్థుల ప్రతిభ

క్యాట్ ఫలితాల్లో జేఎన్‌టీయూ హైదరాబాద్ విద్యార్థులు సత్తా చాటారు. తొమ్మిది మంది విద్యార్థులు 90కి పైగా పర్సంటైల్ సాధించారు. ఈఈఈ విద్యార్థి రోహన్ 98.98, సీఈఈ విద్యార్థి సంజయ్ గందం 98.45 పర్సంటైల్ పొందారు. వైఎస్ యూవిక 98.32, వరుణ్ కుమార్ 97.48, సిద్ధార్థ్ 96.92, ఏకే షిత 92.44, కొళ్ల నిషాంత్ 93.65, సనా ఫర్హానా 92.01, సాయి చరణ్ 91.97 పర్సంటైల్ సాధించారు.


● 85 మంది డిగ్రీ లెక్చరర్ల అంతర్రాష్ట్ర బదిలీ

ప్రభుత్వ డిగ్రీ కాలేజీల లెక్చరర్లు, లైబ్రేరియన్లు బదిలీ అయ్యారు. బదిలీలకు సంబంధించి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉన్నత విద్యాశాఖలు ఉత్తర్వులు జారీ చేశాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం 85 మంది లెక్చరర్లకు బదిలీలు జరిగాయి. తెలంగాణకు బదిలీ అయిన లెక్చరర్లకు సంబంధించి కళాశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.

● సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్ : రావుల

దేశంలో తొలిసారిగా సంక్షేమ పథకాలను ప్రారంభించిన ఘనత టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావుదేనని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. 'ఎన్టీయార్ - కథానాయకుడు' సినిమా విడుదల సందర్భంగా బుధవారం ఇక్కడ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో రావుల మిఠాయిలు పంపిణీ చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ప్రమాణ స్వీకారం చేసిన రోజే ఆయన బయోపిక్ తొలిభాగం విడుదల కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలకృష్ణ, దర్శకుడు క్రిష్, సంగీత దర్శకుడు కీరవాణికి రావుల కృతజ్ఞతలు తెలియజేశారు.

● రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలాతో దాసోజు భేటీ




హైదరాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ సమాచార విభాగం ఇన్‌చార్జి రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలాతో ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ బుధవారం ఢిల్లీలో భేటీ అయ్యారు. ఏఐసీసీ అధికార ప్రతినిధిగా తనకు అవకాశం కల్పించినందుకు సూర్జేవాలకు కృతజ్ఞతలు తెలిపారు.

యాదాద్రిలో వైకుంఠ గాలిగోపురం

మెట్ల మార్గంలో 55 అడుగుల ఎత్తు.. ఐదంతస్తులు.. శిల, దంగు సున్నంతో పనులు.. 1.7కోట్లతో నిర్మాణం


యాదాద్రి మెట్ల మార్గంలో ఉన్న వైకుంఠ ద్వార గాలి గోపురం

యాదాద్రి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి లక్ష్మీనారసింహుడిని దర్శించుకునేందుకు పట్టణంలో అడుగుపెట్టిన భక్తులను కొండపైకి చేరుకునే ముందే ఆధ్యాత్మిక వైభవం ఉట్టిపడే అద్భుత నిర్మాణం పులకింపజేయనుంది. అదే మెట్ల మార్గంలోని వైకుంఠ ద్వార గాలి గోపురం! యాభై ఐదు అడుగుల ఎత్తు.. ఐదంతస్తులతో ఈ గాలి గోపురాన్ని నిర్మించనున్నారు. యాదాద్రి ఆలయ విస్తరణ, పునర్నిర్మాణ పనుల్లో భాగంగా గుట్టపైకి కాలినడకన వెళ్లే ప్రధాన మెట్ల మార్గంలో రూ.1.7 కోట్ల వ్యయంతో ఈ మహా నిర్మాణం చేయనున్నారు. ప్రాచీన నిర్మాణ శైలికి అనుగుణంగా శిల, దంగు సున్నంతో అత్యంత ఆకర్షణీయంగా నిర్మించనున్నారు. స్వామివారికి మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో కాలినడకన మెట్ల మార్గం ద్వారా కొండపైకి వెళతారు. ప్రస్తుతం ప్రధాన మెట్ల మార్గంలో ఉన్న వైకుంఠ ద్వార గాలిగోపురం ప్రదేశం నుంచి మరింత ఎగువన నూతన గాలిగోపుర నిర్మాణాన్ని చేపట్టనున్నారు. స్లాబ్ స్థాయి వరకు రాతి నిర్మాణం, ఆపై కర్ణకూటాలు, దేవతా విగ్రహాలు, పురాణ, ఇతిహాస బొమ్మలను దంగు సున్నం ఉపయోగించి పూర్తి చేయనున్నారు. గాలిగోపురం నిర్మాణం కోసం ఆలయ పునర్నిర్మాణం, విస్తరణ కోసం తొలగించిన పడమటి రాజగోపురానికి చెందిన శిలలను వినియోగించనున్నారు. దాని తొలగింపు సమయంలోనే గాలిగోపురం నిర్మాణంలో ఉపయోగించే విధంగా క్రమ పద్ధతిలో శిలలకు సంఖ్యలు వేశారు. ప్రస్తుతం అదే క్రమపద్ధతిలో గాలిగోపురానికి ఆ శిలలను అమర్చి నిర్మాణం చేపట్టనున్నారు. వైటీడీఏ ఆధ్వర్యంలో ఈ నిర్మాణాన్ని ఏడాదిలో పూర్తి చేయనున్నారు. ఇందు కోసం వైటీడీఏ స్థపతులు సుందరరాజన్, డాక్టర్ ఆనందచారి వేలు, ఇతర స్థపతులు రూపకల్పన చేశారు. యాదాద్రిపై ప్రధాన ఆలయ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకుంటున్నందున కొండకింద అత్యంత ప్రాధాన్యం గల గాలిగోపురం నిర్మాణాలను కూడా వేగవంతం చేసి ఏడాదిలోపే పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వైటీడీఏ వర్గాలు పేర్కొంటున్నాయి.


యాదాద్రి కొండపైకి మెట్లమార్గంలో వైకుంఠద్వార గాలిగోపురం ప్లాన్

కేంద్ర బడ్జెట్‌లో ఏం కోరదాం?

2018-19లో రాష్ట్రానికిచ్చింది 10 కోట్లే!.. ఈసారి ఎక్కువ మొత్తం రాబట్టాలి!

» 3 ప్రాజెక్టులకు నిధులు అడుగుదాం

» బడ్జెట్లపై నేటి నుంచి కేసీఆర్ సమీక్ష

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌పై దృష్టి సారించింది. ఈసారైనా ఎక్కువ మొత్తంలో నిధులు సాధించాలని యోచిస్తోంది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రం పట్ల కొంత సానుకూలతతో ఉందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని భావిస్తోంది. కేంద్ర బడ్జెట్‌కు ముందుగానే ప్రధాని, ఆర్థిక మంత్రులను కలిసి నిధుల కేటాయింపుపై వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీల మేరకు నిధులు కేటాయించాలంటూ మరోసారి గుర్తు చేయనుంది. కేంద్ర నిధుల ఆధారంగా రాష్ట్ర బడ్జెట్‌ను తీర్చిదిద్దుకోవాలన్నది ప్రభుత్వ నిర్ణయం. ఫిబ్రవరి 1న ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు బుధవారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో కేంద్ర బడ్జెట్‌లో ఆశించే నిధులపై సమగ్ర పరిశీలన జరపాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నారు. గురువారం నుంచి కేంద్ర నిధులపై, రాష్ట్ర బడ్జెట్‌పై సమీక్ష నిర్వహించనున్నారు. కేంద్రం నుంచి ఏయే పథకాలకు నిధులు కోరాలనే విషయంపై చర్చించనున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ఆర్థిక సలహాదారు జీఆర్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యాలయ ఉన్నతాధికారులు, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, ఇతర అధికారులతో సీఎం సమీక్షించనున్నారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టు, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ప్లాంటు, గిరిజన, ఉద్యానవన యూనివర్సిటీలకు నిధులు కేటాయించాలని కోరే అవకాశాలున్నాయి. 2018-19 బడ్జెట్‌లో మిషన్ భగీరథకు రూ.19,205 కోట్లు, కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.10 వేల కోట్లు, మిషన్ కాకతీయకు రూ.5000 కోట్లు, రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి రూ.5000 కోట్లు, బయ్యారం స్టీల్ ప్లాంటుకు రూ.3000 కోట్లు, ఎయిమ్స్, గిరిజన, ఉద్యానవన వర్సిటీలకు రూ.300 కోట్లను కేటాయించాలని కేంద్రాన్ని కోరింది. కానీ, రాష్ట్ర డిమాండ్లను కేంద్రం పట్టించుకోలేదు. గిరిజన వర్సిటీకి రూ.10 కోట్లు కేటాయించి చేతులు దులుపుకొంది. ఈసారి అలాంటి పరిస్థితి రాకూడదని.. ఎక్కువ నిధులు రాబట్టాలని సీఎం యోచిస్తున్నారు. రాష్ట్ర పథకాలతోపాటు కేంద్ర సౌజన్య పథకాల(సీఎస్ఎస్) కింద అధికంగా నిధులు రాబట్టాలని నిర్ణయించారు. వివిధ ప్రాజెక్టులకు నిధులు కోరుతూ కేంద్రానికి సమర్పించాల్సిన వినతిపత్రాన్ని రూపొందించాల్సిందిగా అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు.


సీతారామ ప్రాజెక్టుకు అటవీ, పర్యావరణ అనుమతులు సాధించినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు చెబుతున్న ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్

3 నెలలకు 'ఓట్ ఆన్ అకౌంట్' బడ్జెట్

రాష్ట్రంలోనూ ఈసారి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపైనా సీఎం కేసీఆర్ గురువారం నుంచి సమీక్ష ప్రారంభించనున్నారు. కేంద్రం ప్రవేశపెట్టనున్న ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో పూర్తి స్థాయి సమాచారం ఉండదని, అందుకే కేంద్రం పూర్తి స్థాయి బడ్జెట్ పెట్టిన తర్వాతే రాష్ట్ర బడ్జెట్‌ను కూడా పెడదామని కేసీఆర్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ మేరకు కసరత్తు చేసిన అధికారులు.. ఈసారి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఇప్పటికైతే మూడు నెలల కోసం బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఏప్రిల్, మే, జూన్ నెలల కోసం దీన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలిసింది.

7.41 లక్షల ఓట్లు తొలగించాం

» వెబ్‌సైట్‌లో సంబంధిత ఓట్ల జాబితా

» ఓటరు నమోదు గడువు ఈ నెల 25

» ఓట్ల గల్లంతుపై ప్రత్యేకంగా బృందాలు

» వచ్చే నెల 22న తుది జాబితా ప్రకటన

» ఈవీఎంల ట్యాంపరింగ్ సాధ్యపడదు

» సీఈవో రజత్‌కుమార్ వెల్లడి



హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత నెల26 నుంచి కొత్త ఓటర్ల నమోదు ప్రారంభమైందని, ఈనెల 25వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ తెలిపారు. కొత్త ఓటర్లతోపాటు చిరునామా మార్పు తదితర అంశాలకు సంబంధించి మొత్తం 9,54,827 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. వచ్చే నెల 22న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తామని వివరించారు. ఈవీఎం, వీవీ ప్యాడ్ యంత్రాల ట్యాంపరింగ్ సాధ్యమయ్యే పని కాదని స్పష్టం చేశారు. ఉపగ్రహాల ద్వారా చేయవచ్చంటూ గతంలో కొందరు తనను ప్రశ్నించారని.. అలా జరిగేందుకు అవకాశమే లేదని తేల్చిచెప్పారు. సచివాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో ఓటర్ల జాబితాపై పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. జాబితాలో అనర్హమైన ఓటర్లను 95 శాతం మేర తొలగించామని చెప్పారు. ఈ క్రమంలో 7.41 లక్షల ఓట్లను తొలగించామని, వాటిలో 6లక్షల పైచిలుకు తొలగింపులు సరైనవేనని అభిప్రాయపడ్డారు. సంబంధిత జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ఓట్లు గల్లంతయ్యాయన్న ఫిర్యాదులపై ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. వారిని మళ్లీ జాబితాలో చేర్చేందుకు ప్రత్యేకంగా క్యాంపెయినింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కొత్తగా ఏర్పాటు కానున్న 2,030 పోలింగ్ కేంద్రాలతో కలుపుకుని రాష్ట్రంలో మొత్తం 35వేల పోలింగ్ కేంద్రాలు ఉంటాయని చెప్పారు. ఓటర్ల నమోదు, జాబితాలు, తొలగింపులు తదితర అంశాలకు సంబంధించి ఎటువంటి సమస్య ఉన్నప్పటికీ తమకు నేరుగా లేఖలు రాయొచ్చని వెల్లడించారు. తాము కూడా 1.10 కోట్ల మందికి లేఖలు రాస్తున్నట్లు వెల్లడించారు. గృహాల వారీగా ఓటర్లను ధ్రువీకరించుకునే సాంకేతిక పరిజ్ఞానం కూడా అందుబాటులోకి వచ్చిందని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో ఎక్కడా మెతగ్గా వ్యవహరించలేదని, ముగ్గురు రిటర్నింగ్ అధికారులకు వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశించామని వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఫిబ్రవరి 20న తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు. కాగా, తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఓటరు దరఖాస్తు గడువును ఫిబ్రవరి 10 వరకూ పొడగించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ నేత నిరంజన్ కోరారు. ఈమేరకు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు బుధవారం లేఖ రాశారు

14 కోట్ల జీఎస్టీ ఎగవేత

» రిసార్టు సీఎండీ అరెస్టు

» 18 వరకు జ్యుడీషియల్ రిమాండు

» ఐదు బ్యాంకు ఖాతాల జప్తు

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మీరు వ్యాపారస్తులా? ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీ బకాయి ఐదు కోట్లు దాటిందా? చెల్లించాల్సిన గడువు దాటి మూడు నెలలైందా? అయితే, మీరు ఏ క్షణమైనా అరెస్టయ్యే అవకాశం ఉంది. ఇది నాన్ బెయిలబుల్ కేసు. ఐదేళ్ల వరకు జైలుశిక్ష పడుతుంది. ఏకంగా కంపెనీ పెద్ద బాస్‌నే అరెస్టు చేస్తారు. అపరాధ రుసుం కూడా విధిస్తారు. దేశవ్యాప్తంగా ఇటీవల జీఎస్టీ ఎగవేతదారులపై ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. హైదరాబాద్ శివారు శామీర్‌పేటలోని ప్రముఖ రిసార్టు సీఎండీని ఇలాంటి కేసులోనే హైదరాబాద్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్(డీజీజీఐ) అధికారులు బుధవారం అరెస్టు చేశారు. మొత్తం రూ.13.81 కోట్ల జీఎస్‌టీని ఆ రిసార్ట్ ఎగవేసినట్లు తేల్చారు. 2017 జూలైలో జీఎస్టీ అమలులోకి వచ్చినప్పటి నుంచి వినియోగదారుల నుంచి రిసార్టు నిర్వాహకులు జీఎస్టీని వసూలు చేస్తున్నారు. ప్రతి నెలా రిటర్నులతో పాటు ప్రభుత్వానికి ఆ మొత్తాలను బదలాయించాలి. రిసార్టు యాజమాన్యం జీఎస్టీని బదలాయించకుండా, తమ వద్దే పెట్టుకుందని, ఎలాంటి రిటర్నులను దాఖలు చేయలేదని డీజీజీఐ ఒక ప్రకటనలో తెలిపింది. రిసార్టు సీఎండీ తమ దర్యాప్తు బృందానికి సహకరించడం లేదని, ఈ దృష్ట్యా అరెస్టు చేసి, ఈ నెల 18 వరకు జ్యుడీషియల్ రిమాండుకు పంపించామని తెలిపింది. రిసార్టుకు చెందిన ఐదు బ్యాంకు ఖాతాలను జప్తు చేసినట్లు తెలిపింది. మొత్తం రూ.13.81కోట్ల పన్ను ఎగవేతలో రూ.2.27 కోట్లను ఇది వరకే రిసార్టు నిర్వాహకులు చెల్లించారని డీజీజీఐ వివరించింది.

నకిలీ బిల్లులతో నొక్కేశారు!

» 'బోధన్ స్కాం'లో సగానికిపైగా నకిలీలే

» చార్జిషీట్ దాఖలు చేయనున్న సీఐడీ



హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బోధన్ 'వాణిజ్య పన్నుల అక్రమాల' కేసులో సీఐడీ స్వాధీనం చేసుకున్న బిల్లుల్లో సగానికిపైగా నకిలీవే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సీఐడీ చేపట్టిన కీలక కేసుల దర్యాప్తుల్లో బోధన్ కుంభకోణం ఒకటి. అధికారులు స్వాధీనం చేసుకున్న కంప్యూటర్, హార్డ్ డిస్క్ ఇతర సాంకేతిక పరికరాలకు సంబంధించిన ఎఫ్ఎస్ఎల్ నివేదిక అందడంతో అధికారులు చార్జిషీట్ రూపొందిస్తున్నారు. ప్రాథమిక విచారణలో ఈ కుంభకోణం విలువ రూ.100 కోట్ల వరకు ఉంటుందని భావించగా.. ఆతర్వాత 250 కోట్లకు పైగా ఉన్నట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది. వ్యాపారులు ట్రెజరీ నంబరు ద్వారా ప్రభుత్వం ఎంపిక చేసిన బ్యాంకుల్లో చలానాలు చెల్లిస్తారు. అయితే బోధన్‌లో ఉన్నతాధికారులు ఏళ్ల తరబడి ఈ-చలానాలు పరిశీలించలేదు. దీన్ని ఆసరాగా చేసుకుని అక్రమాలకు తెరతీసినట్లు అధికారులు గుర్తించారు. రికార్డుల్లో చెల్లింపులు ఉన్నా.. ఖాతాలో మాత్రం జమ కావడం లేదు. అంకెల గారడీతో ప్రభుత్వ ఖజానాకు వందల కోట్లు గండి కొట్టినట్లు దర్యాప్తులో గుర్తించారు. కేసు దర్యాప్తులో భాగంగా ప్రధాన నిందితుడు శివరాజ్, ఆయన కుమారుడు సునీల్‌తోపాటు మరికొందర్ని సీఐడీ అరెస్ట్ చేసింది. అభియోగాలు ఎదుర్కొంటున్న వారిలో చాలా మంది న్యాయస్థానంలో లొంగిపోయారు. స్వాధీనం చేసుకున్న బిల్లుల్లో సగానికిపైగా నకిలీవేనని, వాటి ద్వారా ప్రభుత్వ ఖజానాకు గండికొట్టినట్లు అధికారులు సాంకేతికంగా నిర్ధారించారు

రైతుబంధు కోసం అప్పు?

» ఓ ఆర్థిక సంస్థ నుంచి రుణం..11న ఢిల్లీకి వెళుతున్న అధికారులు

» రూ.500 కోట్ల మేర బకాయిలు.. కొత్త బడ్జెట్లో మరింత భారం

హైదరాబాద్, జనవరి 09(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ టైట్‌గా మారుతోంది. ప్రతిష్ఠాత్మక పథకాలకు కావాల్సిన భారీ మొత్తాలను సేకరించడం అధికారులకు తలకు మించిన బరువుగా మారుతోంది. పెండింగు బిల్లులకు డబ్బులు సర్దుబాటు చేయడమే ఆర్థిక శాఖ అధికారులకు కష్టంగా తయారైంది. రైతుబంధు పథకం రెండో విడత డబ్బులు చెల్లించాల్సినవి రూ.500 కోట్లు ఇంకా పెండింగులో ఉన్నాయి. వాటిని సాధ్యమైనంత త్వరగా చెల్లించాల్సి ఉంది. కొద్ది నెలల్లో కొత్త ఆర్థిక సంవత్సరం మొదలవుతోంది. పెంచిన రైతుబంధు మొత్తాలు, పెంచిన పెన్షన్ మొత్తాలు, కొత్తగా ప్రకటించిన నిరుద్యోగ భృతికి నిధులు సిద్ధం చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అత్యవసర సమస్యల్ని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓ ఆర్థిక సంస్థ నుంచి రుణం తీసుకోబోతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ రుణం కోసం 11న అధికారులు ఢిల్లీకి వెళ్తారని తెలుస్తోంది. ఆర్థిక క్లిష్ట పరిస్థితి నుంచి ఈ రుణం గట్టెక్కించగలదని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ రుణం అందితే నిలిచిపోయిన రైతుబంధు చెల్లింపులు మొదలు కావచ్చని భావిస్తున్నారు.

రూ.500 కోట్ల బకాయిలు

రబీ సీజన్‌లో 50 లక్షల మంది రైతులకు రూ.4,724 కోట్లు బదిలీ చేశారు. రబీలో కొత్తగా చేరిన 2.28 లక్షల మంది, ఖరీఫ్‌లో మిగిలిపోయిన 1.92 లక్షల మందికి కలిపి రూ.500 కోట్ల వరకు పెట్టుబడి అందాల్సి ఉంది. డబ్బు ఖాతాలో పడని రైతులు వ్యవసాయశాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

వచ్చే బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు

గత ఖరీఫ్ సీజన్, ప్రస్తుతం నడుస్తున్న రబీ సీజన్‌లో ఎకరానికి రూ.4 వేల చొప్పున ప్రభుత్వం రైతుబంధు పంపిణీ చేసింది. ఎన్నికల ప్రణాళికలో భాగంగా ఎకరానికి రూ.5 వేల చొప్పున ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. గత బడ్జెట్‌లో 12 వేల కోట్లు రైతుబంధు కోసం కేటాయించారు. రాబోయే బడ్జెట్‌లో రూ.15 వేల కోట్ల వరకు కేటాయించే అవకాశాలున్నాయి. ఈ మేరకు వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది.

కూటమి కట్టింది బాబు కాదు

» బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్‌తో జట్టు

» నేషనల్ ఫ్రంట్‌కున్న విలువ దీనికెక్కడిది

» ముందు రాష్ట్రం చూసుకో: వినోద్



న్యూఢిల్లీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఎటువంటి కూటమిని ఏర్పాటు చేయలేదని టీఆర్ఎస్ ఎంపీ వినోద్ అన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న కాంగ్రెస్ కూటమితో మాత్రమే బాబు జత కట్టాడని విమర్శించారు. ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తానే కూటమిని నడిపిస్తున్నానని తరచూ ఢిల్లీకి వచ్చి కాంగ్రెస్ పెద్దలతో బాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్టీఆర్ ఏర్పాటు చేసిన నేషనల్ ఫ్రంట్‌కు ఉన్న విలువ చంద్రబాబు చెబుతున్న కూటమికి ఎక్కడుందని ప్రశ్నించారు. ఏపీలో తన స్థానం ఏంటో తెలుసుకున్నాక, దేశ రాజకీయాలపై ఆలోచన చేస్తే బావుంటుందని హితవు పలికారు. ఆర్థిక బలహీన వర్గాల వారికి రిజర్వేషన్లు పెంచడం మంచి నిర్ణయమే అయినప్పటికీ.. దీన్ని హడావుడిగా తీసుకురావడం సరికాదన్నారు. ఈ బిల్లుకు న్యాయపరంగా ఎలాంటి ఇబ్బందులు ఉండవనే భావిస్తున్నట్లు తెలిపారు. సామాజిక వర్గాలకు 50 శాతం మించకూడదన్న సుప్రీంకోర్టు తీర్పు కూడా చట్టంతో సమానం కాబట్టి దాన్ని కూడా సవరించాలని కోరారు.



లోగోను ఆవిష్కరిస్తున్న మహేశ్‌దత్ ఎక్కా, ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

14 నుంచి 'ఏకలవ్య' స్పోర్ట్స్ మీట్

» 20 రాష్ట్రాల గురుకులాల విద్యార్థులతో పోటీలు: ఎక్కా

» పండగపూటనే ఎందుకంటున్న సిబ్బంది

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఈఎంఆర్ఎస్) నేషనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గిరిజనాభివృద్ధిశాఖ కార్యదర్శి బెనహర్ మహేశ్‌దత్ ఎక్కా తెలిపారు. దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల నుంచి ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలకు చెందిన 17 ఏళ్లలోపు విద్యార్థులు 1800 మంది ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిస్టేడియంలో 26 ఈవెంట్లతో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం సచివాలయంలోని డి బ్లాక్‌లో సోషల్ వెల్ఫేర్ గురుకులాల సెక్రటరీ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జుయెల్ ఓరం తదితర కేంద్ర మంత్రులు, కేంద్ర ప్రభుత్వ అధికారులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అయితే స్పోర్ట్స్ మీట్ నిర్వహణ తేదీలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 14 నుంచి 16 వరకు సంక్రాతి పండగ ఉండటం, దీనిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం 17వ తేదీ వరకు సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. తమను పండగకు దూరం చేయడమేంటని, స్పోర్ట్స్ మీట్‌ను పనిదినాల్లో నిర్వహించవచ్చు కదా? అని సంక్షేమ శాఖల సిబ్బంది ప్రశ్నిస్తున్నారు.

బిల్లుపై సభలో ఎవరేమన్నారు?

ఓడిపోతామనే హడావుడిగా తెచ్చారు



'ఎన్నికల కోడ్ రాక ముందే చేయాలి కాబట్టి హడావుడిగా ఈ బిల్లు తెచ్చారు. ప్రజల ముందు ఓ క్యారెట్ వేలాడదీసి.. మీ పిల్లల ఉపాధి కోసం మోదీ అన్ని ఏర్పాట్లు చేశారని చెప్పుకోవడానికే ఈ తొందరపాటు. మూడు రాష్ట్రాల్లో ఓటమి తర్వాత మోదీ ప్రభుత్వం పడిపోవడం ఖాయమని తేలిపోవడంతో ఈ బిల్లును తీసుకొచ్చారని స్పష్టంగా అర్థమవుతోంది. దమ్ముంటే.. బేటీ బచావో బేటీ పఢావో వంటి నినాదాల బదులు మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకురండి.. ఈ రాత్రికే ఆమోదిస్తాం. ప్రతిపక్షాన్ని ప్రభుత్వం విశ్వాసంలోకి తీసుకోవడం లేదు. అసలు విపక్షాలతో చర్చలే జరపడం లేదు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని 2014లో హామీ ఇచ్చారు. ఇవ్వడం సంగతి తర్వాత.. గత ఏడాదిలోనే 1.1 కోట్ల మంది ఉపాధి కోల్పోయారు. ప్రభుత్వ ఉద్యోగాలు బాగా తగ్గిపోయాయి. ఈ బిల్లును కాంగ్రెస్ వ్యతిరేకించడం లేదు. ఎందుకంటే ఇది మా మేనిఫెస్టోలోనే ఉంది. కానీ పార్లమెంటును అగౌరవపరిచే విధంగా బిల్లును తీసుకురావడం శోచనీయం.'

- ఆనంద్ శర్మ, కాంగ్రెస్

ఓబీసీ కోటా 54 శాతానికి పెంచాలి



'ఈడబ్ల్యూఎస్ బిల్లుకు మేం మద్దతిస్తున్నాం. అయితే ఓబీసీల జనాభాను దృష్టిలో పెట్టుకుని వారి రిజర్వేషన్‌ను కూడా 54 శాతానికి పెంచాలి. సుప్రీంకోర్టు నిర్దేశించిన యాభై శాతం పరిమితిని బద్దలు కొడదామని మీరు నిర్ణయించుకున్నప్పుడు.. ఓబీసీలకు కూడా కోటా పెంచాల్సిందే. ఈ బిల్లును ముందే ఎందుకు తీసుకురాలేదు? ఎవరు అడ్డుకున్నారు? ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ముందే తెచ్చిఉండేవారు. ప్రజలు కూడా లబ్ధి పొంది ఉండేవారు. బిల్లును ఆమోదించినా కోర్టుల సమీక్ష తప్పదు. ప్రజాహిత వ్యాజ్యాలు వేసేవారికి దేశంలో కొదవ లేదు.'

- రాంగోపాల్ యాదవ్, ఎస్పీ

ఇది రాజ్యాంగ విరుద్ధం



'ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధం. కోర్టుల్లో నిలబడదు. వెనుకబడిన కులాలకు తమిళనాడు ప్రభుత్వం ఇప్పటికే 69 శాతం రిజర్వేషన్ కల్పిస్తోంది. ఈడబ్ల్యూఎస్ బిల్లు ఆమోదం పొందితే ఓపెన్ కేటగిరిలోని 31 శాతం మందికి అన్యాయం జరుగుతుంది.'

- నవనీతకృష్ణన్, అన్నాడీఎంకే

ప్రభుత్వం తప్పు అంగీకరించింది



'పార్లమెంటును అవమానించి మరీ ఈ బిల్లును తీసుకురావడం పట్ల మా పార్టీ తీవ్ర ఆగ్రహంతో ఉంది. నాలుగున్నరేళ్లుగా దేశంలో ఉపాధి కల్పన జరుగలేదు. ఈ బిల్లును తీసుకురావడం ద్వారా ప్రభుత్వం ఆ తప్పును అంగీకరించినట్లయింది.'

- డెరిక్ ఓబ్రియాన్, టీఎంసీ

పది శాతానికి ప్రాతిపదికేంటి?



'సామాజిక, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రతిపాదించిన ప్రథమప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ.. కావాలనే ఆర్థిక వెనుకబాటు అనే పదాన్ని విస్మరించారు. ఇప్పుడు ఆర్థిక బలహీన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్ అంటున్నారు. పదిశాతమని ఎలా నిర్ధారించారు? దీనికి ప్రాతిపదిక ఏమిటి? గరిష్ఠ ఆదాయ పరిమితి రూ.8 లక్షలు అంటున్నారు! అదే నిజమైతే 90 శాతం మంది కోటా పరిధిలోకే వస్తారు. ఇక ఐదెకరాలున్న వారినీ ఈడబ్ల్యూఎస్‌గా గుర్తిస్తామంటున్నారు. ఐదెకరాలతో రైతు ఏం సంపాదిస్తున్నాడు? వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉంది. రైతులకు చావు తప్ప మరో మార్గం కనిపించడంలేదు. ఇక జీఎస్టీ, నోట్ల రద్దుతో పారిశ్రామిక రంగం ధ్వంసమైంది. అసాధారణ పరిస్థితులుంటే తప్ప రిజర్వేషన్లు ఇవ్వలేరని ఇప్పటికే సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు చెప్పింది. ఇప్పుడు అలాంటి అసాధారణ, అత్యవసర పరిస్థితి ఏముంది? వంద రోజుల్లో ఎన్నికలు ఉన్నందుకేనా? ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేస్తున్నాం.'

- కనిమొళి, డీఎంకే

ఆ పార్టీల హామీనీ మోదీ నెరవేర్చారు



'ఈడబ్ల్యూఎస్ బిల్లు తేవడం ద్వారా ప్రజలకు బీజేపీ ఇచ్చిన హామీనే గాక... పలు పార్టీలు తమ మేనిఫెస్టోల్లో ఇచ్చిన వాగ్దానాన్ని కూడా ప్రధాని మోదీ నెరవేర్చారు.'

- ప్రభాత్ ఝా, బీజేపీ

మీరు చేయలేనిది మేం చేస్తున్నాం



మా ప్రభుత్వానికి ఆ ధైర్యం ఉంది


- సమాన అవకాశాలపై 'పీఠిక'లోనే చెప్పుకొన్నాం
- 50 శాతం గరిష్ఠ పరిమితి రాజ్యాంగంలో లేదు
- సుప్రీంకోర్టులో... అదీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కోటాకే!
- అగ్రవర్ణాల్లోనూ సఫాయీ, రిక్షా కార్మికులున్నారు
- విపక్షాలకు కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ హితవు

న్యూఢిల్లీ, జనవరి 9: 'అందరికీ సమాన అవకాశాలు, హోదా కల్పించాలి' అనే రాజ్యాంగ పీఠిక, అధికరణల ప్రకారమే ఆర్థిక బలహీన వర్గాలకు పది శాతం కోటా ఇస్తున్నామని కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పష్టం చేశారు. దీన్ని మనస్ఫూర్తిగా స్వాగతించాలని విపక్షాలకు హితవు పలికారు. బుధవారం ఈడబ్ల్యూఎస్ బిల్లుపై రాజ్యసభలో జరిగిన చర్చలో రవిశంకర్ మాట్లాడుతూ.. విపక్షాల అభ్యంతరాలు, సందేహాలకు సమాధానాలు చెప్పారు. "ఈడబ్ల్యూఎస్ కోటాను డీఎంకే సభ్యురాలు కనిమొళి మినహా అందరూ సమర్థించారు. తృణమూల్ నాయకుడు డెరెక్ ఒబ్రెయిన్ సమర్థించారో, వ్యతిరేకించారో అర్థం కాలేదు. మొత్తానికి ప్రతి ఒక్కరూ ఈ బిల్లును సమర్థిస్తున్నారు. కానీ.. 'కానీ' అని మెలిక పెడుతున్నారు. ఇదో చరిత్రాత్మక సందర్భం! ఈ బిల్లును మనస్ఫూర్తిగా సమర్థించండి" అని సూచించారు. రాజ్యాంగాన్ని, చట్టాలను మార్చే అధికారం పార్లమెంటుకు ఉందని గుర్తు చేశారు. "ఈ విషయంలో రాష్ట్రాలను ఎందుకు సంప్రదించలేదని కనిమొళి ప్రశ్నించారు. ఆ అవసరమే లేదు. ఏయే అధికరణలను, అంశాలను మార్చితే రాజ్యాంగాన్ని సంప్రదించాలో 368 అధికరణలో స్పష్టంగా చెప్పారు. ప్రస్తుతం ఆర్టికల్ 16లో కొత్తగా 6వ సెక్షన్ చేర్చుతున్నాం. ఈ విషయంలో రాష్ట్రాలను సంప్రదించాల్సిన అవసరంలేదు" అని రవిశంకర్ ప్రసాద్ స్పష్టత ఇచ్చారు. మండల్ కమిషన్ ఆందోళనల తర్వాత పీవీ నరసింహారావు ఇచ్చిన మెమో సుప్రీంకోర్టులో నిలబడలేదని గుర్తు చేశారు. "రిజర్వేషన్లపై 50 శాతం గరిష్ఠ పరిమితి ఉందని అంటున్నారు. దీనిపై మీకు ఒక స్పష్టత ఇస్తాను! ఈ గరిష్ఠ పరిమితిని రాజ్యాంగం విధించలేదు. సుప్రీం కోర్టు తీర్పులో మాత్రమే ఇది ఉంది. ఇక... అందులోనూ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లకు మాత్రమే గరిష్ఠ పరిమితి వర్తిస్తుంది. ఇప్పుడు... ఈడబ్ల్యూఎస్‌కు 10 శాతం రిజర్వేషన్ ఇస్తూ రాజ్యాంగంలోని 16వ అధికరణలో కొత్తగా 6వ క్లాజ్‌ను చేర్చుతున్నాం. దీనివల్ల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఎలాంటి నష్టం వాటిల్లదు. వారి కోటా యథాతథంగా ఉంటుందని గుర్తుంచుకోవాలి" అని రవిశంకర్ ప్రసాద్ సూచించారు.

మీరెందుకు చేయలేదు?

"రాజ్యాంగ పీఠికలో, ఆర్టికల్ 46లోనే ఆర్థిక బలహీన తరగతులనూ ఆదుకోవాలని ఉంది. మరి... ఇప్పటిదాకా రిజర్వేషన్ ఫలాలు అందుకోని వారికి న్యాయం చేసే అధికారం, అవసరం పార్లమెంటుకు లేదా?" అని రవిశంకర్ ప్రసాద్ ప్రశ్నించారు. ఈడబ్ల్యూఎస్ కోటాపై యూపీఏ హయాంలోనే రెండు కమిషన్లు నివేదికలు సమర్పించాయన్నారు. "మేజర్ జనరల్ సిన్హో నేతృత్వంలోని కమిషన్ రిజర్వేషన్లులేని వర్గాల స్థితిగతులన్నింటినీ పరిశీలించి, వారికి కోటా ఇవ్వాలని సిఫారసు చేస్తూ 2010లో నివేదిక సమర్పించింది. అప్పుడు మీరే అధికారంలో ఉన్నారు. ఆ నివేదికను పట్టించుకోకుండా... ఇప్పుడే ఎందుకు ఇస్తున్నారని మమ్మల్ని ప్రశ్నిస్తున్నారు. మీరు సరైన సమయంలో చేయలేదు కాబట్టే ఇప్పటికైనా మేం చేస్తున్నాం. ఆ దమ్మూ, ధైర్యం మా ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి ఉన్నాయి" అని కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. రిక్షా కార్మికులు, సఫాయి కార్మికుల్లో బ్రాహ్మణులు, రాజ్‌పుత్‌లు, ఇతర అగ్రవర్ణ పేదలు ఎందరో ఉన్నారని తెలిపారు. "ఇలాంటి వాళ్లకు మేలు జరగొద్దా? మీరేమీ చేయకుండా... మేం చేస్తున్న దానిని తప్పు పడతారా?" అని ప్రశ్నించారు.

కొలువుల్లేని కోటా ఎందుకు?



కేంద్రం ఏడాదిలో ఇచ్చిన ఉద్యోగాలు 45వేలు

- 4500 మందికి లబ్ధి కోసం రాజ్యాంగ సవరణా?
- కాంగ్రెస్ నేత సిబల్ ధ్వజం.. బిల్లుకు మద్దతు

న్యూఢిల్లీ, జనవరి 9: ఆర్థిక బలహీన వర్గాలకు రిజర్వేషన్లను కాంగ్రెస్ సూత్రప్రాయంగా సమర్థిస్తూనే, అనేక అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ బిల్లును సభ ముందుకు తెచ్చిన పద్ధతే విషాదకరమని కాంగ్రెస్ ఎంపీ కపిల్ సిబల్ పేర్కొన్నారు. "రాజ్యాంగాన్ని సవరించే అతి కీలకమైన బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించి, చర్చించి, సమీక్షించి, అందరి అభిప్రాయాలను తెలుసుకొని ఆమోదించాల్సింది. దాదాపు ఐదేళ్లు అధికారంలో ఉన్నారు. కానీ, ఇప్పుడే బిల్లు తెచ్చారు" అంటూ కేంద్రప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈడబ్ల్యూఎస్ కోటా అమలుకు రాజ్యాంగ, న్యాయపరమైన అడ్డంకులు అనేకం ఉన్నాయన్నారు. ఏ మాత్రం బుర్ర పెట్టకుండా బిల్లును తీసుకొచ్చారని సిబల్ విమర్శించారు.

ఈడబ్ల్యూఎస్‌కు పదిశాతం కోటా ఇవ్వాలని ఏ ప్రాతిపదికన నిర్ణయించారని సిబల్ ప్రశ్నించారు. "ఒక రాష్ట్రంలో ఓబీసీలు ఎక్కువ. మరో రాష్ట్రంలో ఎస్సీల జనాభా అధికం. ఏ రాష్ట్రంలో ఏ వర్గం జనాభా ఎంతో లెక్కలు తీశారా? ఒడిసాలో ఓబీసీలకు 11 శాతం కోటా మాత్రమే ఉంది. అక్కడ జనరల్ కేటగిరీలో 6 శాతమే ఉన్నారు. ఉత్తరాఖండ్‌లోనూ ఇదే పరిస్థితి. ఒకవైపు వార్షిక ఆదాయం 2.50 లక్షలు దాటితే పన్ను కట్టాలంటున్నారు. మరోవైపు ఈడబ్ల్యూఎస్ కోటాకు 8 లక్షల ఆదాయ పరిమితి విధించారు. ఇదేం న్యాయం! దీని ప్రకారం ఆదాయపు పన్ను పరిమితిని కూడా రూ.8 లక్షలు చేసేయండి" అని కపిల్ సిబల్ డిమాండ్ చేశారు. భూపరిమితి, ఆదాయం వంటి లెక్కలు తీసుకుంటే వందశాతం అగ్రవర్ణాల వారూ కోటాకు అర్హులేనని, పది శాతం రిజర్వేషన్ ఏం సరిపోతుందని అడిగారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం నేపథ్యంలో కొత్తగా వస్తున్న ఉద్యోగాల కంటే పోతున్న కొలువులే ఎక్కువని సిబల్ పేర్కొన్నారు. "2001 నుంచి 2018 వరకు ఉద్యోగాల్లో వార్షిక వృద్ధి రేటు 0.4 శాతం. మోదీ హయాంలో నాలుగేళ్లలో ఏడాదికి సగటున 45వేల ఉద్యోగాలు వచ్చాయి. అందులో 10 శాతమంటే 4500 మందికి మాత్రమే లబ్ధి చేకూరుతుంది! 130 కోట్ల జనాభాలో 4500 మందికి మేలు చేసేందుకు, ఈ మైండ్ సెట్‌తోనే మీరు రాజ్యాంగాన్ని మార్చుతున్నారా?" అని సిబల్ ప్రశ్నించారు. దేశానికి కావాల్సింది కోటా కాదని, ఉద్యోగాలని తెలిపారు. "ఆర్థిక వెనుకబడిన తరగతుల (ఈడబ్ల్యూసీ)కి పది శాతం కోటా ఇవ్వాలన్న సిఫారసును సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఇది రాజ్యాంగపరంగా చెల్లుబాటు కాదని చెప్పింది. ఇప్పుడు... మీరు ఆర్థిక బలహీన వర్గాలకు కోటా అంటున్నారు. ఈడబ్ల్యూసీ వేరు, ఈడబ్ల్యూఎస్ వేరా?" అని ప్రశ్నించారు.

ఈడబ్ల్యూఎస్ కోటా అమలులో అనేక ఆచరణాత్మక సమస్యలు ఎదురవుతాయని సిబల్ తెలిపారు. 'కమల్‌కా హమ్లా... ఔర్ ఏక్ జుమ్లా' అంటూ బిల్లును నిరసించారు.

దళితులు, ఓబీసీలు సంపన్నులా?

"ఈ బిల్లు ప్రకారం వార్షిక ఆదాయం 8 లక్షలలోపు ఉన్నప్పటికీ ఆర్థిక బలహీన వర్గాల కింద కోటా లభిస్తుంది. కానీ, నెలకు ఐదారువేల ఆదాయం ఉన్న దళితులు, ఓబీసీలకు మాత్రం ఈ కోటా కింద లబ్ధి చేకూరదు! ఇదేమి హేతుబద్ధత?" అని కపిల్ సిబల్ ప్రశ్నించారు. దళితుల రిజర్వేషన్లకు గరిష్ఠ ఆదాయ పరిమితి లేదని ఈ సమయంలో కేంద్ర మంత్రులు స్పష్టం చేశారు. "మెజారిటీ ఉన్న వారు దేశాన్ని పరిపాలిస్తున్నప్పుడు.. తామే దైవాంశ సంభూతులమని, ఏదైనా చేయగలమని భావిస్తారు. ఐదేళ్లుగా ఇదే జరుగుతోంది" అని మోదీ సర్కారును విమర్శించారు. 'ఖుదాకే బందే సమఝ్‌జా.. వక్త్‌హై బదల్‌జా' (దేవుడి బిడ్డలారా అర్థం చేసుకోండి... ఇప్పటికైనా మారండి) అంటూ కవితా రూపంలో బీజేపీ సర్కారుకు హితవు పలికారు.

దస్‌కా దమ్

(మొదటి పేజీ తరువాయి)

వెలువడటమే ఆలస్యం! ఆపై.. ఆర్థిక బలహీన వర్గాలకు కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో పది శాతం రిజర్వేషన్ లభిస్తుంది. 8 లక్షల లోపు వార్షిక ఆదాయం, ఐదెకరాల్లోపు వ్యవసాయ భూమి, పట్టణ ప్రాంతాల్లో వెయ్యి చదరపు అడుగుల లోపు విస్తీర్ణం ఉన్న ఇల్లు, నోటిఫైడ్ మున్సిపాలిటీల్లో వంద చదరపు గజాల్లోపు స్థలం, నాన్ నోటిఫైడ్ ప్రాంతాల్లో 200 చదరపు గజాల్లోపు స్థలం ఉన్న వారిని కేంద్రం ఈడబ్ల్యూఎస్‌గా నిర్ధారించింది. రాష్ట్రాలు సొంతంగా ప్రాతిపదికలను నిర్ణయించుకోవచ్చునని న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. ఉదాహరణకు ఐదు లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్నవారినే ఆర్థిక వెనుకబడిన వర్గాలుగా భావించి కోటాకు అర్హులుగా నిర్ణయించవచ్చునని చెప్పారు. రాజ్యాంగం రాష్ట్రాలకు ఆ అధికారం ఇచ్చిందన్నారు. ప్రస్తుతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కోటా యథాతథంగా ఉంటుందని.. ఈడబ్ల్యూఎస్‌కు అదనంగా రిజర్వేషన్ ఇస్తున్నామని ఆయన స్పష్టత ఇచ్చారు.

కానీ... అంటూనే!

భారత రిజర్వేషన్ చరిత్రను మలుపు తిప్పే ఈ బిల్లును సామాజిక న్యాయం, సాధికారత మంత్రి థావర్‌చంద్ గెహ్లాట్ రాజ్యసభలో ప్రవేశపెట్టారు. 'బిల్లును సూత్రప్రాయంగా సమర్థిస్తున్నాం. కానీ...' అంటూ కాంగ్రెస్ తన అభ్యంతరాల నడుమే బిల్లుకు మద్దతు పలికింది. 'ఇంత తొందరెందుకు? ఇప్పుడే ఎందుకు?' అంటూ కాంగ్రెస్, ఇతర విపక్షాలు సంధించిన ప్రశ్నలకు.. బీజేపీ తరఫున కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ సూటిగా సమాధానం చెప్పారు. 'ఇప్పటికైనా తెచ్చే ధైర్యం మాకుంది. మీరెందుకు చేయలేకపోయారు?' అని నిలదీశారు. తమిళనాడుకు చెందిన అన్నాడీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు. ఇక ఆప్, డీఎంకే పార్టీలు మాత్రమే బిల్లును వ్యతిరేకించాయి. తొలుత మూజువాణీ ఓటుతో బిల్లును సభ ఆమోదించింది. తర్వాత డివిజన్ నిర్వహించారు. ఓటింగ్‌లో 172 మంది సభ్యులు పాల్గొనగా, ఈడబ్ల్యూఎస్ కోటాకు మార్గం సుగమం చేసే కీలక బిల్లుకు ఏకంగా 165 మంది 'జై' కొట్టారు. కేవలం ఏడుగురు మాత్రమే వ్యతిరేకించారు. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలన్న ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ డిమాండ్‌కూ మద్దతు కరువైంది. అంతకుముందు కాంగ్రెస్, ఆర్జేడీ, వామపక్ష సభ్యులు ఇదే డిమాండ్‌తో సభలో ఆందోళన చేశారు. ఓటింగ్ దాకా వచ్చేసరికి ఈ పార్టీల సభ్యులే జారుకున్నారు. 'బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలా' అనే అంశంపై ఓటింగ్ పెట్టగా కేవలం 18 మంది మాత్రమే 'ఎస్' అన్నారు. 155 మంది అక్కర్లేదని తేల్చేశారు. బిల్లుకు విపక్ష సభ్యులు ప్రతిపాదించిన సవరణలన్నీ వీగిపోయాయి. ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలన్న సవరణను కూడా సభ తోసిపుచ్చింది. లోక్‌సభలో 333 మంది సభ్యులు ఈ బిల్లుకు మద్దతివ్వగా.. రాజ్యసభలోనూ భారీగా మద్దతు లభించాలని ప్రధాని ఆకాంక్షించారు. చివరికి అదే జరిగింది! రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి అనూహ్య మద్దతు లభించడం విశేషం. ఈ బిల్లు ఆమోదం కోసమే రాజ్యసభను ఒకరోజు పొడిగించారు. ఆ పని పూర్తికాగానే నిరవధిక వాయిదా వేశారు.

కొసమెరుపు: 30 ఏళ్ల క్రితం అగ్రవర్ణాలకు చెందిన వీపీసింగ్ హయాంలో ఓబీసీలకు 27 శాతం కోటా ఇవ్వడం ఒక చరిత్ర! ఇప్పుడు బీసీ ప్రధాని మోదీ హయాంలో అగ్రవర్ణ పేదలకు ఆర్థిక వెనకబాటు ప్రాతిపదికన కోటా ఇవ్వడం సరికొత్త చరిత్ర!

ఇప్పుడు కాకుంటే మరెప్పుడు..?

- భారత్‌లో తరుచూ ఎన్నికలాయె...!
- ఎన్నికల దృష్టితో కోటా బిల్లు తేలేదు
- అందరికీ అవకాశం రావాలె
- ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను సమర్థించుకున్న మోదీ
- జమిలీకి మళ్లీ పిలుపు



> "ప్రస్తుతం ఉన్న ఎస్సీ ఎస్టీ కోటా యథాతథం... ప్రస్తుతం ఉన్న ఓబీసీ కోటా యథాతథం.. ప్రస్తుతం ఉన్న మిగిలిన అన్ని రకాల రిజర్వేషన్లు యథాతథం... వాటికి అతీతంగా, వాటికి అదనంగా, ఆర్థికంగా బలహీనవర్గాలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నాం. ఉన్న రిజర్వేషన్లేవీ పోవు. కొత్త వర్గాలకు, అందని వర్గాలకు మాత్రమే న్యాయం చేస్తున్నాం"
>
> - ప్రధాని నరేంద్ర మోదీ

షోలాపూర్- ఆగ్రా, జనవరి 9: ఆర్థికంగా బలహీనవర్గాల వారికి పదిశాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించడాన్ని ప్రధాని నరేంద్ర మోదీ గట్టిగా సమర్థించుకున్నారు. మహారాష్ట్రలోని షోలాపూర్, యూపీలోని ఆగ్రాల్లో రెండు బహిరంగసభల్లో ప్రసంగించిన ఆయన- ఈ రిజర్వేషన్ బిల్లును సార్వత్రిక ఎన్నికల దృష్టితో తేలేదని చెప్పుకొచ్చారు. "భారత్‌లో ప్రతీ కొద్ది నెలలకూ , గడిగడికీ ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. ఎన్నికలు సమీపదూరంలో లేకుండా ఉన్న సమయమేదైనా ఉందా? చెప్పండి... ఇప్పుడు కాకపోతే మరెన్నడు తేవాలి? అందుకే నేను జమిలీ ఎన్నికలు రావాలని పదేపదే చెబుతున్నాను. అన్యాయం జరుగుతోందనే భావన పోవాలి. అందరికీ సమానావకాశాలు రావాలి. ఇదే మా లక్ష్యం. అందుకే ఈ బిల్లు తెచ్చాం" అని మోదీ వివరించారు. "లోక్‌సభలో ఈ బిల్లు ఆమోదం చరిత్రాత్మకం. సమాజంలో పేద వర్గాల అభ్యున్నతికి దీన్ని ఉద్దేశించాం" అన్నారు. 'నిమ్న వర్గాలకు, గిరిజనులకు ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు తగ్గించలేదు. కొత్తగా పదిశాతం ఈడబ్ల్యూఎస్‌లకు కల్పించాం. సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్ అన్న మా నినాదం అంతరార్థమిదే' అని ఆయన పేర్కొన్నారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్‌ల నుంచి వచ్చిన ముస్లిమేతరులకు పౌరసత్వం కల్పించడానికి ఉద్దేశించిన బిల్లు తేవడాన్ని కూడా ఆయన సమర్థించుకున్నారు. దీని వల్ల అసోం, ఇతర ఈశాన్య రాష్ట్రాల ప్రజల హక్కులకేమీ భంగం వాటిల్లబోదని స్పష్టం చేశారు. ఇతర దేశాల్లో కష్టాలు పడుతున్న హిందూ శరణార్థులకు ఇపుడు దారి ఏర్పాటుచేశామని చెప్పారు. ఓటుబ్యాంకు రాజకీయాలే తప్ప వెనకబడిన ప్రాంతాల అభివృద్ధిపై కాంగ్రెస్ ఏనాడూ దృష్టిపెట్టలేదని మోదీ ఘాటుగా విమర్శించారు. అధికారంలోకొచ్చాక- కాంగ్రెస్ విస్మరించిన అన్ని ప్రాంతాలనూ ప్రధాన స్రవంతిలో కలిపేందుకు తమ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. 9వేల కోట్ల రూపాయల ఖర్చుకాగల ప్రాజెక్టులకు షోలాపూర్‌లో శంకుస్థాపన చేశారు.

రాజ్యసభలో వెంకయ్యలేని లోటు!

- సభా నిర్వహణపై డిప్యూటీ ఛైర్మన్ తడబాటు
- పాయింట్ ఆఫ్ ఆర్డర్లకు తిరస్కరణ
- సెలక్ట్ కమిటీకి పంపాలని డీఎంకే తీర్మానం
- చర్చ తర్వాత చూద్దామంటూ దాటవేత

న్యూఢిల్లీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ ప్రభుత్వం అత్యంత గోప్యంగా, ప్రతిష్ఠాత్మకంగా తెచ్చిన బిల్లు (ఈడబ్ల్యూఎస్‌లకు పదిశాతం రిజర్వేషన్ బిల్లు)కు విపక్షాలు సైతం మద్దతివ్వడంతో లోక్‌సభలో సులభంగా ఆమోదం పొందింది. కానీ రాజ్యసభలో ఆ పరిస్థితి లేదు. బిల్లుకు అన్ని పార్టీలు మద్ధతిస్తున్నా సాంకేతిక అంశాలను లేవనెత్తుతూ ప్రతిపక్షాలు సభకు పదేపదే అంతరాయం కలిగించాయి. బుధవారం ఛైర్మన్ వెంకయ్యనాయుడు లేనందున డిప్యుటీ ఛైర్మన్ హరివంశ్ సభను నడిపించారు. కీలక సమయంలో వెంకయ్యనాయుడు సభలో లేని లోటు స్పష్టంగా కనిపించిందని ఎంపీలు చర్చించుకోవడం కనిపించింది. తన సతీమణి తల్లి కౌశల్యమ్మ మరణించడంతో దశదినకర్మ కోసం వెంకయ్య నెల్లూరు జిల్లాలో ఉన్నారు. సభను సజావుగా నడిపించడంలో హరివంశ్ విఫలమయ్యారన్న విమర్శలు వచ్చాయి. సుదీర్ఘకాలం పార్లమెంటరీ అనుభవం ఉన్న వెంకయ్య -సభలో ఎంపీలు పాయింట్ ఆఫ్ ఆర్డర్లు లేవనెత్తితే రూలు పుస్తకాన్ని చూడకుండానే రూలింగ్ ఇచ్చేవారు. కానీ బుధవారం పాయింట్ ఆఫ్ ఆర్డర్లనే పరిగణలోకి తీసుకోలేదు. కొంత మంది ఎంపీలకు పాయింట్ ఆఫ్ ఆర్డర్లనే లేవనెత్తడానికి సమయం ఇవ్వలేదు. అంతేకాకుండా, ఉదయం సభ ప్రారంభమైన వెంటనే ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపించాలని డీఎంకే ఎంపీ కనిమొళి తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. నిబంధనల ప్రకారం తొలుత ఈ తీర్మానాన్ని తేల్చిన తర్వాత బిల్లుపై చర్చ చేపట్టాలి. కానీ, చర్చ పూర్తయిన తర్వాత తీర్మానంపై నిర్ణయం తీసుకుంటానని డిప్యుటీ ఛైర్మన్ ప్రకటించడం అందరికి ఆశ్చర్యం కలిగించింది. ఒక దశలో ప్రతిపక్ష ఎంపీలంతా సెక్రటరీ జనరల్ దేశ్‌దీపక్ వర్మతో వాగ్వివాదానికి దిగారు. ప్రతి అంశంపై నిర్ణయానికి పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి విజయ్ గోయల్‌ను డిప్యుటీ ఛైర్మన్ సంప్రదించడం కనిపించింది. ఈ పరిణామాల నేపథ్యంలో మధ్యాహ్నం వరకు సభ పలుమార్లు వాయిదా పడింది. బిల్లుపై చర్చకు కేటాయించిన సమయాన్ని వెల్లడించే విషయంలోనూ ఆయన అయోమయానికి గురయ్యారు. మంగళవారంతో ముగియాల్సిన సమావేశాలను తమకు సమాచారమివ్వకుండానే పొడిగించడంపైనా విపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. డిప్యూటీ ఛైర్మన్ ఇది తన లోపమేనని చెప్పారు. ఒకరోజు పొడిగింపును ఛైర్మన్ వెంకయ్యనాయుడు ఆమోదించారని.. మంగళవారం సభను వాయిదావేసేటప్పుడు తాను ఈ విషయం ప్రకటించలేదని, దీనిని తన పొరపాటుగా పరిగణించాలని సభ్యులను కోరారు.



బేగంపేట విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యకు స్వాగతం పలుకుతున్న రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ

రిజర్వేషన్లు రాష్ట్రానికో రకమా?

దేశమంతా ఒకే విధానం ఉండాలి: టీఆర్ఎస్ ఎంపీ ప్రకాశ్

న్యూఢిల్లీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లపై దేశవ్యాప్తంగా ఒకే విధానం తీసుకురావాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని టీఆర్ఎస్ ఎంపీ బండా ప్రకాశ్ చెప్పారు. ప్రస్తుతం రిజర్వేషన్లు రాష్ట్రానికో రకంగా ఉన్నాయని.. అలాకాకుండా దేశం మొత్తం ఒకే విధానం ఉండాలని కోరారు. లేదంటే ఆ అధికారం రాష్ట్రాలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్థిక బలహీన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించేందుకు చేస్తున్న 124వ రాజ్యాంగ సవరణ బిల్లుపై బుధవారం ఆయన రాజ్యసభలో మాట్లాడుతూ.. ఈ తరహా బిల్లుకు తమ పార్టీ అధినేత స్వాగతం పలుకుతున్నారని తెలిపారు. అదే సమయంలో తెలంగాణ అసెంబ్లీలో రిజర్వేషన్లపై చేసిన తీర్మానాలను కూడా పార్లమెంట్ ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. రిజర్వేషన్లు హరియాణాలో 70 శాతం, తమిళనాడులో 69, మహారాష్ట్రలో 68, రాజస్థాన్‌లో 54 శాతం ఉన్నాయని.. మహారాష్ట్రలో తాజాగా మళ్లీ పెంచారని గుర్తుచేశారు. కేవలం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే 50శాతం లోపల ఉన్నాయని తెలిపారు. ఇప్పుడు కేంద్రమే 60 శాతం తెచ్చేందుకు సిద్ధపడిందని, మరి రాష్ట్రాల నుంచి వచ్చిన అభ్యర్థనల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు 90.5 శాతం ఉన్నారని అలాంటప్పుడు వారి దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వరని అడిగారు. దేశవ్యాప్తంగా ఒకే విధానం తీసుకురావాలని.. లేదంటే రాష్ట్రాలకే ఆ అధికారాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

● 'కోటా'పై ఆందోళన వద్దు :రాంమాధవ్

న్యూఢిల్లీ, జనవరి 9 : కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అందరి సంక్షేమానికి కట్టుబడి పని చేస్తున్నదని, ఆర్థిక బలహీన వర్గాలకు పది శాతం రిజర్వేషన్, పౌరసత్వ సవరణ బిల్లు విషయంలో ఆందోళన చెందాల్సిన పని లేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ అన్నారు. ఈ నిర్ణయాలు ఏ వర్గానికీ వ్యతిరేకం కాదన్నారు. ఆర్థిక బలహీన వర్గాలకు విద్య, ఉద్యోగాల్లో లబ్ధిని చేకూర్చాలన్న మోదీ ప్రభుత్వ నిర్ణయాన్ని విపక్షాలు తప్పుబట్టడం సరికాదన్నారు. "దాదాపు మూడు దశాబ్దాలుగా ఈ రిజర్వేషన్ అంశం అపరిష్కృతంగా ఉంది. ఆ డిమాండ్‌ను తీర్చడానికి ప్రయత్నించడమే పాపం అన్నట్టు, మమ్మల్ని విపక్షాలు తప్పుబడుతున్నాయి. అందరి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడటమే ప్రతిపక్షాల కడుపుమంటకు కారణం అవుతోంది" అని రామ్ మాధవ్ పేర్కొన్నారు. పౌరసత్వ సవరణ బిల్లు ఆమోదానికి నిరసనగా ఈశాన్య భారతంలో ఆందోళనలు కొనసాగడంపై స్పందిస్తూ.. ఒక రాష్ట్రం, ఒక మతాన్ని దృష్టిలో ఉంచుకొని ఆ బిల్లును కేంద్రం తీసుకురాలేదని, మొత్తంగా దేశం కోసం తీసుకొన్న నిర్ణయమని అన్నారు.


● ఓబీసీ కోటా పెంచుతారా? 'మండల్' పార్టీల ప్రశ్న

న్యూఢిల్లీ, జనవరి 9: ఆర్థిక బలహీన వర్గాలకు పది శాతం రిజర్వేషన్ బిల్లుపై జరిగిన చర్చలో 'కమండల్'తో 'మండల్' శక్తులు కలిసొచ్చినా అధికార పార్టీపై తమ ఆగ్రహాన్ని మాత్రం దాచుకోలేదు! ఓబీసీల్లో గట్టి పట్టు ఉన్న మండల్ పార్టీలు (జేడీయూ మినహా) 10 శాతం కోటాకు మద్దతు తెలుపుతూనే ఓబీసీల కోటా పెంపు కోసం నిలదీశాయి. "ప్రస్తుత అంచనాల కంటే దేశంలో ఓబీసీల జనాభా చాలా ఎక్కువని తేలితే ప్రభుత్వం ఏం చేస్తుంది? మా వాటా పెంచుతుందా?" అని యూపీలో బీజేపీ మిత్రపక్షమైన అప్నా దళ్ (ఎస్) ఎంపీ అనుప్రియా పటేల్ ప్రశ్నించారు. ఇదే వాదనను ఇతర పార్టీలూ అందుకున్నాయి. కులాలవారీ జనాభా లెక్కలను ఎందుకు వెల్లడించడం లేదని ఆర్జేడీ ఎంపీ పప్పూ యాద్ కేంద్రాన్ని నిలదీశారు. సామాజిక న్యాయ కమిటీ సిఫారసు ప్రకారం 'కోటాలో కోటా' ఇవ్వకపోతే తెగదెంపులు చేసుకుంటామని యూపీలో బీజేపీ మరో మిత్రపక్షం ఎస్బీఎస్పీ హెచ్చరించింది.

● 10% కోటా రాజ్యాంగ విరుద్ధం:జస్టిస్ ఈశ్వరయ్య

రాంనగర్/హైదరాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆర్థిక బలహీన వర్గాలకు రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని జాతీయ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య గుర్తు చేశారు. కేంద్రం ఈడబ్ల్యూసీలకు 10 శాతం కోటా ఇవ్వడం వల్ల పేద దళిత, గిరిజన, బీసీ వర్గాలు మరింత వెనుకబాటుకు గురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆధ్వర్యంలో ఈడబ్ల్యూసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వాలు ఆర్థికంగా వెనుబడిన వర్గాలకు జేబు సంస్థలుగా మారాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. బుధవారం బీసీ సంఘం రాష్ట్ర సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈడబ్ల్యూఎస్‌లకు రిజర్వేషన్లతో బీసీలకు తీరని నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

● ఈబీసీ రిజర్వేషన్లు జిమ్మిక్కే: సురవరం



హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించేలా చట్టాలు రూపొందిస్తోందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. కార్మికుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ట్రేడ్ యూనియన్ల రిజిస్ట్రేషన్ చట్టాన్ని ఆదరాబాదరాగా ఆమోదించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను కాలరాస్తుంటే సీపీఐ చూస్తూ ఊరుకోదని, ప్రతిఘటన ఉద్యమాలు నిర్మిస్తుందని కేంద్రాన్ని హెచ్చరించారు. మూడు రాష్ట్రాల్లో బీజేపీ ఓటమి, రాఫెల్ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే కేంద్రం ఈబీసీ రిజర్వేషన్లు తీసుకొచ్చిందని విమర్శించారు. ఇది ఎన్నికల జిమ్మిక్కేనని అభివర్ణించారు. సీబీఐ డైరెక్టర్‌గా అలోక్‌వర్మనే కొనసాగించాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రధాని మోదీ, అమిత్‌షాకు చెంపపెట్టు లాంటిదని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ మజ్లిస్ ఎమ్మెల్యే ప్రొటెం స్పీకర్‌గా ఉంటే ప్రమాణ స్వీకారం చేయబోనంటూ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రకటించటం చట్ట విరుద్ధమన్నారు.

గగన్‌యాన్ ఓ మేలు మలుపు

» అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్: ఇస్రో మాజీ చైర్మన్



హైదరాబాద్, జనవరి 9: భారత అంతరిక్ష రంగంలో గగన్‌యాన్ ఓ మేలు మలుపని, దీంతో అంతరిక్ష పరిశోధనల్లో అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ చేరుతుందని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) మాజీ చైర్మన్ మాధవన్ నాయర్ అన్నారు. ఈ ప్రాజెక్టును అనుకున్న సమయానికే (2022 కల్లా) ఇస్రో పూర్తి చేస్తుందని ధీమా వ్యక్తంచేశారు. కేంద్రం ఈ ప్రాజెక్టు కోసం రూ.9,023 కోట్లు మంజూరు చేయడాన్ని కొనియాడారు. అయితే గగన్‌యాన్‌లో ప్రయాణించే వ్యోమగాములకు శిక్షణనిచ్చే సదుపాయాలు ఇస్రోలో లేవని, రష్యా వంటి దేశాల సహకారం తీసుకోక తప్పదని చెప్పారు.

● 11, 12న బీజేపీ జాతీయ కౌన్సిల్

న్యూఢిల్లీ, జనవరి 9: బీజేపీ జాతీయ కౌన్సిల్ సమావేశం శుక్రవారం నాడిక్కడ ప్రారంభం కానుంది. రామ్‌లీలా మైదానంలో రెండు రోజుల పాటు జరిగే పార్టీ అత్యున్నత కార్యవర్గ సమావేశంలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, పార్టీ ప్రముఖులు సహా 12 వేల మంది ప్రతినిధులు పాల్గొంటారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలతో పాటు పలు అంశాలపై విస్తృతంగా చర్చిస్తారు. ఈ సందర్భంగా శుక్ర, శనివారాల్లో ప్రధాని మోదీ కోసం సభా వేదిక వద్ద ఏకంగా తాత్కాలిక పీఎంవోను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

● ప్రైమరీ స్కూళ్ల టీచర్లకు వచ్చేనెల 7 రోజుల సెలవు

న్యూఢిల్లీ, జనవరి 9: గోవాలో వచ్చే నెల 4-11 తేదీల్లో 'అఖిల్ భారతీయ ప్రాథమిక్ శిక్షక్ మహాసంగం' (ప్రాథమిక ఉపాధ్యాయుల సమ్మేళనం) జరగనుంది. ఇందులో హాజరయ్యేందుకు దేశవ్యాప్తంగా ప్రాథమిక టీచర్లకు కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ ఏడు రోజుల సెలవు మంజూరు చేశారు. ఉపాధ్యాయుల సమ్మేళనానికి హాజరయ్యేందుకు సెలవు ఇవ్వాలని పాల్‌గఢ్ ఎంపీ రాజేంద్ర గవిట్, అఖిల భారతీయ టీచర్ల యూనియన్ అధ్యక్షుడు శివాజీరావ్ పాటిల్ కోరగా మంత్రి అంగీకరించారు.

● సీబీఎస్‌ఈ సిలబస్ 15% తగ్గింపు!

హైదరాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సిలబస్ భారంతో ఇబ్బంది పడుతున్న సీబీఎస్‌ఈ విద్యార్థులపై భారాన్ని తగ్గించేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. 2019-20 విద్యా సంవత్సరంలో సిలబస్‌లో 10-15% తగ్గించాలని ఎన్‌సీఈఆర్‌టీ నిర్ణయించింది. పాఠశాల స్థాయి సిలబస్ అతిగా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారని, వీలైనంత మేరకు సిలబస్‌ను తగ్గించాలనే వాదనలు వినిపించాయి. దీంతో సీబీఎస్‌ఈ సిలబస్‌ను 50% తగ్గిస్తామని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అయితే ఒకేసారి 50% తగ్గిస్తే ఇబ్బందులు వస్తాయని, 2021 కల్లా 50% సిలబస్‌ను తగ్గించేలా ప్రణాళికలు రూపొందించారు.

● బీజేపీలోకి తృణమూల్ ఎంపీ



న్యూఢిల్లీ, జనవరి 9: సార్వత్రిక ఎన్నికల ముంగిట పశ్చిమబెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ)కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ యువ నేత, బిష్ణుపూర్ ఎంపీ సౌమిత్రా ఖాన్ బుధవారం బీజేపీలో చేరారు. బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షాతో భేటీ అనంతరం ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆధ్వర్యంలో బీజేపీ కండువా కప్పుకొన్నారు. ఈ సందర్భంగా బెంగాల్ సీఎం మమతా బెనర్జీపై ఖాన్ విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో పోలీస్ రాజ్యం నడుస్తోందని, ప్రజాస్వామ్యం మంటగలిసిందని ఆరోపించారు. కాగా, సుమిత్రా ఖాన్‌ను పార్టీ నుంచి ఎప్పుడో బహిష్కరించామని టీఎంసీ తెలిపింది.

సీబీఐ బదిలీలు రద్దు

» అలోక్ వర్మ సంచలన నిర్ణయం

» తాత్కాలిక డైరెక్టర్ నాగేశ్వర్‌కు షాక్

» డైరెక్టర్‌గా అలోక్ తిరిగి విధుల్లోకి



న్యూఢిల్లీ, జనవరి 9: సీబీఐ డైరెక్టర్‌గా తిరిగి నియమితులైన అలోక్‌వర్మ బుధవారం సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన పరోక్షంలో తాత్కాలిక డైరెక్టర్ ఎం.నాగేశ్వర్‌రావు చేపట్టిన బదిలీలను రద్దు చేశారు. అలోక్ వర్మను విధుల నుంచి తప్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న వివాదాస్పద నిర్ణయాన్ని కొట్టేస్తూ సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో బుధవారం ఉదయం ఆయన సీబీఐ కార్యాలయంలోకి అడుగుపెట్టారు. ఆయనకు జాయింట్ డైరెక్టర్ ఎం.నాగేశ్వర్‌రావు స్వాగతం పలికారు. గత ఏడాది సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మ, స్పెషల్ డైరెక్టర్ ఆస్థానా పరస్పరం తీవ్రమైన అవినీతి ఆరోపణలు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇద్దరినీ విధుల్లోంచి తప్పిస్తూ నిర్ణయం తీసుకుంది. ఎం.నాగేశ్వర్‌రావును తాత్కాలిక డైరెక్టర్‌గా నియమించింది. ఆయన బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఏడుగురు అధికారులను బదిలీ చేశారు. అందులో ఆస్థానాపై అవినీతి ఆరోపణలను దర్యాప్తు చేస్తున్న అధికారులు కూడా ఉన్నారు. జనవరి మూడున జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారులు పలువురిని బదిలీ చేశారు. ఈ రెండు ఆదేశాలను బుధవారం అలోక్‌వర్మ రద్దు చేశారు.

ఎంపిక కమిటీ నిర్ణయం వాయిదా

అలోక్ వర్మ భవిష్యత్తుపై సస్పెన్స్ మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం కనిపిస్తోంది. ఆయన ఎన్ని రోజులు పదవిలో కొనసాగుతారో తెలియని అనిశ్చితి నెలకొంది. అలోక్ వర్మ భవిష్యత్తును ప్రధాని మోదీ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి ఎంపిక కమిటీ తేలుస్తుందని సుప్రీంకోర్టు ప్రకటించింది. సీబీఐ డైరెక్టర్‌ను ఎంపిక చేసే ఈ కమిటీ బుధవారం రాత్రి సమావేశమై వర్మ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే వాయిదా పడింది. ఇందులో ప్రధాని, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులు. ఈ ఎంపిక కమిటీ సమావేశంలో సీజేఐ రంజన్ గోగోయ్ పాల్గొనకుండా... సభ్యుడిగా సుప్రీంకోర్టు సీనియర్ జడ్జి ఏకే సిక్రీని నామినేట్ చేశారు. లోక్‌సభలో విపక్ష నేత పదవి ప్రస్తుతం ఖాళీగా ఉంది.

మహాకూటమిలో చేరబోం: నవీన్



భువనేశ్వర్, జనవరి 9: బీజేపీకి వ్యతిరేకంగా జాతీయస్థాయిలో ఏర్పడుతున్న ప్రతిపక్షాల మహాకూటమిలో చేరబోమని బిజూ జనతా దళ్(బీజేడీ) అధ్యక్షుడు, ఒడిసా సీఎం నవీన్ పట్నాయక్ స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి దిగుతామని ప్రకటించారు. బీజేపీ, కాంగ్రెస్‌కు దూరంగా ఉంటామని తెలిపారు. భువనేశ్వర్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ.. 'బీజేపీ వ్యతిరేకంగా ఏర్పడుతున్న ప్రతిపక్షాల మహాఘట్‌బంధన్‌లో చేరే ఉద్దేశం లేదు. కాంగ్రెస్, బీజేపీకి సమాన దూరంలో ఉండాలనే మా విధానపరమైన నిర్ణయానికి కట్టుబడి ఉన్నాం.' అని తెలిపారు. మహాకూటమి లో చేరడంపై ఇప్పుడే నిర్ణయించలేమని, కొంత సమయం కావాలని చెప్పిన 24 గంటల్లోనే ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. కాగా, ఒడిసాలో 21 ఎంపీ స్థానాలు ఉన్నాయి.

చానళ్ల కొత్త టారిఫ్ ఆర్డర్ వాయిదా పడదు: ట్రాయ్

న్యూఢిల్లీ, జనవరి 9: టీవీ చానళ్ల కొత్త టారిఫ్ ఆర్డర్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఫిబ్రవరి ఒకటి నుంచి అమల్లోకి తెస్తామని నియంత్రణ సంస్థ ట్రాయ్ తెలిపింది. ఇది వాయిదా పడుతుందంటూ వస్తున్న వదంతుల్ని ట్రాయ్ బుధవారం ఖండించింది. చానళ్ల కొత్త ప్లాన్‌లకు త్వరగా మారాల్సిందిగా నియంత్రణ సంస్థ సూచించింది. కేబుల్, డీటీహెచ్ ఆపరేటర్లు తమ వినియోగదారుల అభిరుచి మేరకు జనవరి 31లోగా ప్లాన్‌లు తీసుకునేలా చూడాలని ట్రాయ్ కోరింది. కొత్త టారిఫ్ ప్లాన్‌లు సార్వత్రిక ఎన్నికల తర్వాతే అమల్లోకి వస్తాయంటూ ఒక ఎంపీ కేబుల్ ఆపరేటర్లకు హామీ ఇచ్చిన వీడియో బయటపడడంతో ట్రాయ్ ఈ వివరణ ఇచ్చింది.



భగ్గుమన్న ఈశాన్యం!

న్యూఢిల్లీ, జనవరి 9: ఈశాన్య రాష్ట్రాల్లో నిరసనలు హోరెత్తాయి. ఆందోళనకారుల ఆగ్రహ జ్వాలలతో జనజీవనం స్తంభించింది. పౌరసత్వ చట్ట సవరణ బిల్లును లోక్‌సభ ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం మొదలైన ఆందోళనలు బుధవారం కూడా కొనసాగాయి. బిల్లును రద్దు చేయాలని కోరుతూ ఆందోళనకారులు ఈశాన్య రాష్ట్రాలన్నింట్లో రహదారులను దిగ్బంధించడంతో పాటు రైల్వే ట్రాక్‌లపై బైఠాయించారు.



సార్వత్రిక సమ్మెకు మిశ్రమ స్పందన

న్యూఢిల్లీ, జనవరి 9: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక సంస్కరణలకు నిరసనగా కార్మిక సంఘాలు చేపట్టిన రెండు రోజుల సార్వత్రిక సమ్మెకు దేశవ్యాప్తంగా మిశ్రమ స్పందన లభించింది. బ్యాంకింగ్, రవాణా వ్యవస్థకు పాక్షిక అంతరాయం కలిగింది. వామపక్షాలు బలంగా ఉన్న పశ్చిమ బెంగాల్, కేరళతో పాటు ఒడిశా, కర్ణాటక రాష్ట్రాల్లో సమ్మె ప్రభావం ఎక్కువగా ఉంది.

రాఫెల్‌ను నాడు ఆపింది మిచెల్ మామా?

/ అతనితో సంబంధాలున్న కాంగ్రెస్ నేత ఎవరు?

» రాహుల్‌పై ఎదురుదాడికి దిగిన మోదీ

» వేరే కంపెనీకి మిచెల్ లాబీ!

» మోదీనెవరూ కొనలేరు

» అవినీతిపై పోరును ఆపలేరని వ్యాఖ్య



ఆగ్రా- షోలాపూర్, జనవరి 9: 'రాఫెల్' ఒప్పందంలో భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న రాహుల్ గాంధీపై ప్రధాని మోదీ ఎదురుదాడికి దిగారు. అగస్టా హెలికాప్టర్ల స్కాంలో మధ్య దళారీగా ఉన్న క్రిస్టియన్ మిచెల్ గతంలో వేరే కంపెనీ యుద్ధవిమానాల కొనుగోలుకు లాబీయింగ్ చేశారని ధ్వజమెత్తారు. "యూపీఏ హయాంలో దళారి సంస్కృతి విశృంఖలంగా ఉండేది. వారు వ్యవస్థలో ఒక భాగం. వారు పేదల హక్కులను హరించి దేశ భద్రతతో చెలగాటమాడేవారు. ప్రభుత్వ పెద్దల అండదండలు వారికి ఉండేవి. అలాంటి ఓ దళారీని (మిచెల్‌ను) మేం ఈ మధ్యే ఓ స్కాంకు సంబంధించి భారత్‌కు రప్పించాం. అతను దిగ్భ్రాంతపర్చే విషయాలు వెల్లడించాడు. మీడియాలో వచ్చిన వివరాల ప్రకారం అతను వీవీఐపీ హెలికాప్టర్ల కొనుగోలే కాదు.. యుద్ధ విమానాల కొనుగోలుకూ లాబీయింగ్ చేశాడు. అతనితో సంబంధాలు నెరపిన కాంగ్రెస్ నేత ఎవరు? ఇపుడు యుద్ధవిమానాల కొనుగోలుపై గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు దీనికి సమాధానం చెప్పాలి. పెట్టిన ప్రతీ పైసాకూ ఖర్చు చూపాలి" అని మోదీ ఆగ్రా, షోలాపూర్ సభల్లో నేరుగా దాడి చేశారు. "యూపీఏ హయాంలో ఆ డీల్ ఎందుకు కుదర్లేదు? వేరే కంపెనీకి లాబీ చేసిన ఆ దళారీ వల్లా? కాంగ్రెస్ బదులు చెప్పాలి"అన్నారాయన. యూరోఫైటర్ టైఫూన్ అనే యుద్ధవిమానాల కోసం మిచెల్ లాబీ చేసినట్లు అగస్టా స్కాంలో నిందితుడైన మరో దళారీ గైడో హష్కే నివాసంలో లభ్యమైన పత్రాల ద్వారా తేలిందని వార్తాకథనాలు వచ్చాయి. యూరోఫైటర్ యుద్ధవిమానాలను నాటో దేశాల కూటమి (బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్) సంయుక్తంగా తయారు చేయాలని తొలుత నిర్ణయించినా తరువాత విభేదాలు తలెత్తడంతో ఫ్రాన్స్ దాని నుంచి వైదొలిగి దసో ఏవియేషన్‌ను నెలకొల్పి రఫేల్ విమానాలకు రూపకల్పన చేసింది. మిచెల్ రాఫెల్‌కు వ్యతిరేకంగా లాబీ చేశారా లేదా, ఆ దళారీకి వెన్నుదన్నుగా ఉన్నదెవరు అన్నవి దర్యాప్తు సంస్థలు తేలుస్తాయని మోదీ అన్నారు. "నేను కాపలాదారునే. నేను నిద్రపోను. బెదిరిపోను. నేను ఓ విభిన్నమైన వాతావరణంలో పెరిగిన వాణ్ని. నన్నెవరూ కొనలేరు. ప్రస్తుతం (అవినీతి) నిర్మూలన పనిలో ఉన్నాను. అవిశ్రాంతంగా పోరాడతా. తీసుకున్న ప్రతీ పైసాకీ నేను జవాబ్దారీ. అవినీతి అంతమయ్యే దాకా నిద్రపోను. తప్పుడు పనులు చేసే వారిని ఈ చౌకీదారు చీకట్లో కూడా వెంటాడి పట్టుకుంటాడు. వారు నన్నెన్ని విమర్శలు చేసినా.. నా లక్ష్యం నెరవేరే దాకా ఆగను. అవినీతి అంతం నా లక్ష్యం" అని ఆయన చెప్పుకొచ్చారు.

ఓ మహిళను శరణు వేడి.. పార్లమెంట్ నుంచి మోదీ పరార్: రాహుల్

» ప్రధాని మండిపాటు...మహిళా జాతిని అవమానించారని విమర్శ

జైపూర్/ఆగ్రా, జనవరి 9: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేసిన ఓ వ్యాఖ్య ఆయనను వివాదంలో పడేసింది. లోక్‌సభలో మూడ్రోజుల కిందట రాఫెల్ వివాదంపై జరిగిన చర్చ గురించి ప్రస్తావిస్తూ.. "విశాలమైన 56 అంగుళాల ఛాతీ ఉందని చెప్పుకున్న మన చౌకీదారు తనను కాపాడే బాధ్యతను ఓ మహిళకు వదిలేశారు. నిర్మలా సీతారామన్‌జీ! నన్ను నేను సమర్థించుకోలేను. మీరు ఆ బాధ్యత తీసుకోవాలి.. అంటూ చర్చ నుంచి పారిపోయారు" అని రాహుల్ జైపూర్‌లో ఓ రైతు బహిరంగ సభలో వ్యాఖ్యానించారు. "రెండున్నర గంటల పాటు ఆమె ప్రధానిని సమర్థించారు. కానీ నేను అడిగిన ఒకే ఒక ప్రశ్నకు అవును లేదా కాదు అని సమాధానమివ్వాలని కోరినపుడు ఆమె బదులివ్వలేకపోయారు' అని రాహుల్ పేర్కొన్నారు. దీనిపై ప్రధాని మోదీ తీవ్రంగా స్పందించారు. "ఒక మహిళకు వదిలి..." అని రాహుల్ అనడాన్ని తప్పుబడుతూ 'ఇది కేవలం రక్షణమంత్రిని అవమానించడమే కాదు. యావత్ మహిళా లోకాన్ని కించపర్చే వ్యాఖ్య" అని ఆగ్రా సభలో అన్నారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కూడా 'నిర్మలా సీతారామన్‌ను ఎదుర్కోలేక దిగజారి మాట్లాడుతున్నారని, నారీలోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిర్మలపై రాహుల్ చేసిన వ్యాఖ్యలపై జాతీయ మహిళా కమిషన్ అసంతృప్తి వ్యక్తం చేసింది. వివరణ కోరుతూ గురువారం రాహుల్‌కు నోటీసు జారీచేయనుంది.



రూ.100 కోట్ల పన్ను కట్టండి!

» సోనియా, రాహుల్‌కు ఐటీ నోటీసు

» ఏజేఎల్ కేసులో కీలక మలుపు

న్యూఢిల్లీ, జనవరి 9: కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, సోనియా గాంధీలకు భారీ షాక్! వారిని వెంటాడుతున్న అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్) కేసులో మరో కీలక మలుపు! సుమారు రూ.100 కోట్ల పన్ను ఎగవేశారంటూ ఆదాయ పన్ను శాఖ సోనియా, రాహుల్‌కు నోటీసులు జారీ చేసింది. 2011-12లో ఏజేఎల్‌కు సంబంధించి వందల కోట్ల రూపాయల ఆదాయాన్ని లెక్కల్లో చూపకుండా తప్పించారని ఆ నోటీసుల్లో పేర్కొంది. ఇలా సోనియా రూ.155.4 కోట్లు, రాహుల్ రూ.155 కోట్ల ఆదాయాన్ని తప్పించారని ఆదాయ పన్ను శాఖ లెక్కకట్టింది. "ఆ అసెస్‌మెంట్ సంవత్సరానికి రూ.68.1 లక్షల ఆదాయం చూపుతూ రాహుల్ రిటర్ను దాఖలు చేశారు. మరో కాంగ్రెస్ నేత ఆస్కార్ ఫెర్నాండెజ్ ఆదాయం రూ.48.9 కోట్లు" అని ఐటీ వర్గాలు తెలిపాయి. తమ పన్ను అసెస్‌మెంట్‌ను తిరిగి తెరవాలన్న నిర్ణయానికి వ్యతిరేకంగా సోనియా, రాహుల్ సుప్రీం కోర్టును ఆశ్రయించడం తెలిసిందే. దీనిపై సుప్రీంలో విచారణ కొనసాగుతోంది. 2011-12 సంవత్సరానికి సోనియా, రాహుల్, ఫెర్నాండెజ్‌కు సంబంధించిన ఆదాయాన్ని తిరిగి మదింపు జరిపిన అనంతరం డిసెంబరు 31న ఈ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అయితే కోర్టులో విచారణ జరుగుతున్నందున ఈ నోటీసును తాత్కాలికంగా పక్కనపెట్టారు. సోనియా, రాహుల్ వ్యాజ్యాన్ని జస్టిస్ ఏకే సిక్రీ నేతృత్వంలోని బెంచ్ విచారిస్తోంది. వారి తరఫున కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం వాదిస్తున్నారు. మరోవైపు ఏజేఎల్ స్థల వివాదం కేసు విచారణను ఢిల్లీ హైకోర్టు జనవరి 16కు వాయిదా వేసింది. ఢిల్లీలోని ఐటీవోలో కేటాయించిన స్థలాన్ని ఏజేఎల్ ఖాళీ చేయాలన్న సింగిల్ జడ్జి ఆదేశాలను సవాల్ చేస్తూ ఆ సంస్థ హైకోర్టుకు వెళ్లింది. ఏజేఎల్... నేషనల్ హెరాల్డ్ పత్రిక ప్రచురణకర్త. పదేళ్లుగా పత్రిక ముద్రణ లేనందున ఏజేఎల్‌తో 1926లో కుదుర్చుకున్న లీజు ఒప్పందాన్ని ప్రభుత్వం రద్దు చేసుకుంది.

నా వద్ద డబ్బులెక్కడివి?

» ఆర్థిక దిక్సూచికి ఆర్థిక కష్టాలు

» మాజీ ప్రధాని మన్మోహన్ ఆవేదన



న్యూఢిల్లీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆయన పదేళ్ల పాటు దేశ ప్రధాని. అప్పుల ఊబిలోని దేశాన్ని సంస్కరణలతో ఒడ్డున పడేసిన ఆర్థిక నిపుణుడు. రిజర్వ్ బ్యాంకు గవర్నర్‌గా, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా, ఐఎంఎఫ్ సలహాదారుగా.. ఇలా అనేక హోదాల్లో పనిచేసిన నిరుపమాన ఆర్థిక రథసారథి. మచ్చలేని వ్యక్తిత్వం ఉన్న ఆయన.. డాక్టర్ మన్మోహన్ సింగ్... ఇపుడు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడంటే నమ్మగలమా? కానీ ఇది నిజం.. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా తనను కలిసిన ఓ మాజీ ఎంపీతో అన్నారు. 'ది ఏక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' పేరుతో మన్మోహన్‌పై ఓ సినిమా తీస్తున్న సంగతి తెలిసిందే. ఆ సినిమా ట్రైలర్‌లో ఆయనను కించపరుస్తూ కొన్ని దృశ్యాలు, వ్యాఖ్యలు ఉన్నట్లు దుమారం రేగింది. ఆ సినిమా నిర్మాతలపై పరువు నష్టం దావా వేయాలని కొందరు కాంగ్రెస్ నేతలు తనకు సలహా ఇచ్చారని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ బుధవారం నాడు తనను కలిసిన పాత స్నేహితుడు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మాజీ ఎంపీ యలమంచిలి శివాజీతో అన్నట్లు తెలిసింది. "నిజమే.. నన్ను పరువునష్టం దావా వెయ్యమన్నారు.. వారిపై దావా వేసి కోర్టులో పోరాడేందుకు నా దగ్గర డబ్బులెక్కడివీ?.. న్యాయవాదులకు భారీగా ఫీజులు చెల్లించాలి కదా.." అని ఆయన అన్నట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి. "మీరు కూడా ఏ పార్టీలో చేరకుండా ఇలాగే ఉండిపోయారు. మీలాంటి మేధావులు, వ్యవసాయ నిపుణులను ఉపయోగించుకునేవారు లేరని" ఆయన శివాజీతో నవ్వుతూ అన్నట్లు తెలిసింది. లాయర్ ఫీజులకు డబ్బుల్లేవు.. అని ఓ మాజీ ప్రధాని- అదీ కాంగ్రెస్‌లాంటి ప్రధాన పార్టీ తరఫున పనిచేసిన నేత అనడం విస్మయం కలిగిస్తుంది.

శబరిమల క్షేత్రం భక్తులదే

శాంతిని భగ్నం చేసేవారిని గుర్తించాలి: కేరళ హైకోర్టు ఆదేశం


కోచి/న్యూఢిల్లీ, జనవరి 9: శబరిమల ఆలయం అయ్యప్పస్వామి భక్తుల కోసం ఉద్దేశించిన క్షేత్రమనీ, అక్కడ శాంతియుత వాతావరణాన్ని భగ్నం చేసే శక్తులను రాష్ట్ర ప్రభుత్వం కనిపెట్టాలని కేరళ హైకోర్టు ఆదేశించింది. ఈ గుడికి సంబంధించిన పలు వ్యాజ్యాలను ఇద్దరు జడ్జిలతో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది. ఆలయం వద్ద నెలకొన్న పరిస్థితిని ప్రభుత్వం చక్కదిద్దలేకపోతే, బయటి నుంచి సంస్థలను తెచ్చుకోవచ్చని కూడా ధర్మాసనం సూచించింది. ఈనెల 2న గుడిలోకి ప్రవేశించిన ఇద్దరు మహిళా భక్తుల దైవదర్శనం వెనుక ఏదైనా రహస్య వ్యూహం ఉందా అని ధర్మాసనం ప్రశ్నించింది. శబరిమల విషయమై కేరళ సర్కారు వ్యవహార శైలిని బీజేపీ నేతలు తప్పుబట్టారు. ఈమేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ సరోజ్ పాండే నేతృత్వంలోని బృందం బుధవారం ఢిల్లీలో రాష్ట్రపతి కోవింద్‌కు వినతిపత్రాన్ని సమర్పించింది. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో జోక్యం చేసుకోవాలని రాష్ట్రపతిని కోరారు. కాగా, కేరళలోని ఛాతన్నూరుకు చెందిన 36 ఏళ్ల మంజు.. తాను శబరిమల అయ్యప్పను దర్శించుకున్నట్లు ప్రకటించారు. త్రిసూర్ నుంచి అయ్యప్ప సన్నిధికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశానని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు.

పంబ అడవిలో భక్తుడిని తొక్కి చంపిన ఏనుగు

కొట్టాయం, జనవరి 9: శబరిమల బయల్దేరిన భక్తుడిని ఓ ఏనుగు తొక్కి చంపేసింది. తమిళనాడులోని సాలెంకు చెందిన పరమశివం(35) తన కుమారుడు, మరో 13 మంది శబరిమల యాత్రకు వెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి ఎరుమలై-పంబ అడవిలో వెళ్తున్న వారిపై ఓ ఏనుగు దాడి చేసింది. దాంతో ఆ బృందం చెల్లాచెదురైంది. భుజాలపై కొడుకు ఉండటంతో పరమశివం వేగంగా పరిగెత్తలేక వెనుకబడ్డాడు. దాంతో అతన్ని ఆ ఏనుగు తొక్కి చంపేసింది. అతని కొడుకు ప్రమాదం నుంచి తప్పించుకున్నాడని పోలీసులు తెలిపారు.

ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్

» 31 నుంచి బడ్జెట్ సమావేశాలు



న్యూఢిల్లీ, జనవరి 9: మోదీ సర్కారు చివరి బడ్జెట్‌కు ముహూర్తం ఖరారైంది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31 నుంచి వచ్చే నెల 13 వరకు జరగనున్నాయి. వచ్చే నెల 1న ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ బుధవారం ఈ తేదీల పై చర్చించింది. రాజ్యసభ నిరవధికంగా వాయిదాపడిన తర్వాత బడ్జెట్ సమావేశాల షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉంది. ఈ నెల 31న సమావేశాల తొలి రోజు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఆర్థిక సర్వేను కూడా అదే రోజు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. సాధారణంగా రెండు విడతలు గా జరిగే బడ్జెట్ సమావేశాలు ఈసారి ఒకే విడతలో ముగియనున్నాయి. ఏప్రిల్-మే నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఈ మార్పు చేస్తున్నట్టు సమాచారం. ప్రస్తుత లోక్‌సభకు ఇవే చివరి సమావేశాలు అవుతాయి. రాజ్యసభ శీతాకాల సమావేశాలు మంగళవారంతో ముగియవలసి ఉండగా ఆర్థిక బలహీన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టేందుకు ఒక రోజు పొడిగించారు. లోక్‌సభ మంగళవారం నాడే నిరవధికంగా వాయిదా పడింది. ఎన్నికల సంవత్సరం ఏ ప్రభుత్వమైనా పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టదు. ఈసారి జైట్లీ ప్రవేశపెట్టే మధ్యంతర బడ్జెట్ కూడా ఫుల్ బడ్జెట్‌లాగానే ఉంటుందని భావిస్తున్నారు.


భారీ సభలే కార్యక్షేత్రాలు!

మోదీ వ్యతిరేక కూటమి నిర్మాణం వేగవంతం.. రాహుల్, పవార్, కేజ్రీవాల్‌తో బాబు మంతనాలు

» 19న కోల్‌కతా ర్యాలీకి పెద్దసంఖ్యలో విపక్ష నేతలు

» వచ్చే నెలలో అమరావతిలో బహిరంగ సభ

» మూడు దశల్లో కూటమి సంఘటితం!



అమరావతి/న్యూఢిల్లీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మోదీ వ్యతిరేక కూటమి నిర్మాణాన్ని వేగవంతం చేసి.. ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే దిశగా ప్రతిపక్షాల నేతలు వడివడిగా అడుగులు వేస్తున్నారు. బీజేపీ వ్యతిరేక పార్టీలను ఏకతాటిపైకి తెచ్చేందుకు టీడీపీ అధినేత, నవ్యాంధ్ర సీఎం చంద్రబాబు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఆయా రాష్ట్రాల్లో నిర్వహించే భారీ బహిరంగ సభలనే కూటమి ఏర్పాటుకు కార్యక్షేత్రాలుగా మలుచుకోవాలని ఆయన చేసిన సూచనకు పలు పార్టీల నేతలు సమ్మతి తెలియజేశారు. ఈ నెల 19న టీఎంసీ అధినేత్రి, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ భారీ ర్యాలీ నిర్వహిస్తున్నారు. దీనికి పెద్దసంఖ్యలో విపక్ష నేతలు హాజరు కావాలని.. తద్వారా కూటమి నిర్మాణం ఊపందుకుందని గట్టి సంకేతాలు పంపాలని నిర్ణయించారు. చంద్రబాబు మంగళవారం రాత్రి ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని కలిశారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, టీఎంసీ సీనియర్ నాయకుడు దినేశ్ త్రివేదిని కూడా కలిశారు. తదుపరి కార్యాచరణకు సంబంధించి రోడ్ మ్యాప్ ఎలా ఉండాలో వారితో కసరత్తు చేశారు. ఫిబ్రవరి చివరిలో ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉన్నందు వల్ల కూటమి నిర్మాణం.. బీజేపీ వ్యతిరేక పార్టీల మధ్య సమన్వయం పెంచడంలో వేగం పెంచాలని నిశ్చయించారు. మమత ర్యాలీ తర్వాత ఫిబ్రవరిలో అమరావతిలో తాము భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, దానికి అందరినీ ఆహ్వానిస్తున్నామని చంద్రబాబు వారికి చెప్పారు. వివిధ పార్టీల మధ్య రాష్ట్రాల్లో ఉన్న విభేదాలను పరిష్కరించడంపైనా చర్చ జరిగింది. కోల్‌కతాలో జరిగిన ర్యాలీకి రాహుల్‌ను ఆహ్వానించినట్లు టీఎంసీ నేతలు బాబుకు తెలిపారు. కానీ ఈ సభకు రావద్దని బెంగాల్ కాంగ్రెస్ నేతలు రాహుల్‌పై ఒత్తిడి తెస్తున్నారు. తాము అక్కడ మమతపై పోరాడుతున్నామని, ఆయన వచ్చి ఆమె పక్కన కూర్చుంటే తమ పోరాటం బలహీనపడుతుందని వారు వాదిస్తున్నారు. మరోపక్క ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికల పొత్తు పెట్టుకున్న ఎస్పీ, బీఎస్పీ.. కాంగ్రెస్‌ను తమతో కలుపుకోవడానికి ఇష్టపడడం లేదు. రాహుల్ ప్రాతినిధ్యం వహిస్తున్న అమేథీలో, సోనియా ఎంపీగా ఉన్న రాయ్‌బరేలీలో మాత్రం పోటీ పెట్టబోమని చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆ రెండు పార్టీల అధినేతలు అఖిలేశ్, మాయావతిలతో చర్చించాలని చంద్రబాబు నిర్ణయించారు. తనతో పవార్, ఫరూక్‌లను కూడా తీసుకెళ్లి ఆ ఇద్దరు నేతలతో మాట్లాడాలని నిశ్చయించారు. కోల్‌కతా సభ తర్వాత అక్కడకు వచ్చిన నేతలంతా కలిసి కూర్చుని భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయానికి రావాలనుకున్నారు.

3 దశల్లో పార్టీల చేరువ..

మోదీ వ్యతిరేక పార్టీలన్నీ మూడు దశల్లో సంఘటితమవుతాయని చంద్రబాబు, రాహుల్ అంచనా వేస్తున్నారు. కోల్‌కతా ర్యాలీ ద్వారా కొన్నిపార్టీలు చేరువవుతాయని భావిస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్‌తో బహిరంగంగా కలిసి పనిచేసే పార్టీల్లో తెలుగుదేశం, ఎన్‌సీపీ, ఆర్‌జేడీ, డీఎంకే, ఆర్‌ఎల్‌ఎస్‌పీ, ఇండియన్ ముస్లింలీగ్, జేఎంఎం, జనతాదళ్ (ఎస్), ఆర్‌ఎల్‌డీ, నేషనల్ కాన్ఫరెన్స్ ఉన్నాయి. ఎన్నికల తేదీలు ప్రకటించాక టీఎంసీ, సమాజ్‌వాదీ, బీఎస్పీ కూడా రావచ్చు. ఎన్నికల తర్వాతే పలు పార్టీలు కూటమిలోకి వచ్చే అవకాశాలున్నాయి ఈ 3 దశల్లోనూ బీజేపీ వ్యతిరేక పార్టీలే అధికంగా ఉన్నందున కూటమి సంఘటితమవుతుందని విశ్లేషిస్తున్నారు.

ఎన్నికలయ్యాకే ఫ్రంట్ సాధ్యం: ఏచూరి

ఎన్నికల ముందు ఎలాంటి ఫ్రంట్ సాధ్యం కాకపోవచ్చని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చెప్పారు. ఇదే విషయం చంద్రబాబుకు కూడా చెప్పామన్నారు. రాష్ట్రాల్లో ఆయా పార్టీలపై రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని. పరస్పర వైరుధ్యాల వల్ల ఎన్నికల ముందు అవి కలిసి పనిచేయకపోవచ్చని ఆయన బుధవారం 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు ఉదాహరణకు మమత ర్యాలీకి తాము వెళ్లడం జరిగేది కాదని చెప్పారు. 1996లో ఎన్నికల తర్వాతే దాదాపు 13 పార్టీలు కలిసి యునైటెడ్ ఫ్రంట్ ఏర్పరచిన విషయాన్ని గుర్తుచేశారు. 2004లో కూడా ఎన్నికల తర్వాత ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాకపోవడంతో వివిధ పార్టీలు చేతులు కలిపి యూపీఏగా ఏర్పడ్డాయన్నారు. బీజేపీ వ్యతిరేకతే వివిధ పార్టీలను వివిధ దశల్లో కలుపుతుందని అభిప్రాయపడ్డారు.

పీబీఎల్‌లో నేడు
బెంగళూరు x చెన్నై (సా. 4 గం)
స్టార్ స్పోర్ట్స్-1 స్టార్ స్పోర్ట్స్ సెలెక్ట్-1లో

ఏఎఫ్‌సీ ఆసియా కప్‌లో నేడు
భారత్ x యూఏఈ
రా. 9.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్-2లో


శశికాంత్ (6/18)

35/4 నుంచి 35 ఆలౌట్

● 16.5 ఓవర్లలో ఇన్నింగ్స్ ఖతం
మధ్యప్రదేశ్ చెత్త ప్రదర్శన ● ఆంధ్ర భారీ విజయం

ఇండోర్: మన దేశవాళీ క్రికెట్ గొప్పతనం గురించి టీమిండియా కెప్టెన్ కోహ్లీ ఆస్ట్రేలియాలో ఘనంగా చెప్పిన కొద్దిరోజుల్లోనే రంజీట్రోఫీలో మధ్యప్రదేశ్ అత్యంత చెత్త ప్రదర్శన చేసింది. ఆంధ్రతో జరిగిన గ్రూప్-బి మ్యాచ్ ఇందుకు వేదికైంది. 343 పరుగుల అలవికాని లక్ష్య ఛేదనలో 35/4తో ఓటమి అంచున నిలిచిన మధ్యప్రదేశ్ అదే స్కోరు వద్ద ఆలౌట్ కావడం నివ్వెరపరిచింది. ఏడుగురిలో ఒక బ్యాట్స్‌మన్ గాయంతో బరిలోకి దిగకపోగా..ఆరుగురు ఆటగాళ్లు ఒకటే స్కోరువద్ద చాపచుట్టేశారు. వీరిలో ఐదుగురు డకౌటయ్యారు. యాష్ దుబే, ఆర్యమన్ బిర్లా మాత్రమే ఆతిథ్య జట్టులో రెండంకెల స్కోరు చేశారు. ఆంధ్ర పేసర్ కేవీ శశికాంత్ (6/18) దెబ్బకు మధ్యప్రదేశ్ కుదేలైంది. తన ఎనిమిదో ఓవర్లో శశికాంత్ హ్యాట్రిక్ మిస్సయ్యాడు. ఒక దశలో అతడు 8 ఓవర్లలో నాలుగు మేడిన్లతో కేవలం 8 పరుగులకు 6 వికెట్లు పడగొట్టాడు. మూడోరోజే ముగిసిన ఈ గ్రూప్ మ్యాచ్‌లో ఏపీ 307 పరుగుల భారీ తేడాతో రికార్డు విజయం సాధించింది. దీంతో గ్రూప్-బిలో ఏపీ జట్టు మొత్తం 17 పాయింట్లతో హైదరాబాద్‌ను వెనక్కినెట్టి ఆరో స్థానంలో నిలిచింది.

సంక్షిప్త స్కోర్లు:
ఆంధ్రప్రదేశ్: 132, 301; **మధ్యప్రదేశ్:** 91, 35 (యాష్ దుబే 16, ఆర్యమన్ బిర్లా 12, కేవీ శశికాంత్ 6/18, విజయ్ కుమార్ 3/17).


కోహ్లీతో విహారి

మహిళలపై హార్దిక్, రాహుల్ అనుచిత వ్యాఖ్యలు

బీసీసీఐ షోకాజ్ ● పాండ్యా క్షమాపణ ● ఫ్యాన్స్ గరం గరం



న్యూఢిల్లీ: టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా నోరుజారి అభిమానుల ఆగ్రహానికి గురయ్యాడు. ఓ షోలో స్త్రీల గురించి అసభ్యంగా మాట్లాడిన అతడు బీసీసీఐ నుంచి షోకాజ్ నోటీస్ అందుకున్నాడు. ఈ షోలో హార్దిక్‌తోపాటు పాల్గొన్న కేఎల్ రాహుల్‌కు కూడా బోర్డు బుధవారం షోకాజ్ నోటీస్ జారీ చేసింది. అభిమానులు తీవ్ర ఆగ్రహానికి లోనుకావడంతో మేల్కొన్న పాండ్యా తన వ్యాఖ్యలపై బహిరంగంగా క్షమాపణ చెప్పాడు. బాలీవుడ్ దర్శకుడు కరణ్ జోహార్ నిర్వహించిన ఈ 'కాఫీ విత్ కరణ్' షో గత ఆదివారం ప్రసారమైంది. వివాదానికి దారి తీసిన ఆ షోలో.. 'మీరు నైట్ క్లబ్బుల్లో మహిళల పేర్లు అడగరెందుకు' అని హార్దిక్‌ను కరణ్ ప్రశ్నించాడు. అందుకు పాండ్యా.. 'పార్టీల్లో నేను సంభాషించే మహిళల పేర్లను గుర్తుపెట్టుకోవడానికి ఇబ్బందిపడుతుంటాను. పార్టీల్లో మహిళల కదలికలు, వారి ప్రవర్తనను గమనించడం నాకు ఇష్టం' అని బదులిచ్చాడు. తన సెక్సువల్ లైఫ్ గురించి అడిగిన ప్రశ్నకు ఏమాత్రం సంకోచం లేకుండా పాండ్యా సమాధానమిచ్చాడు. తాను వర్జినిటీ కోల్పోయిన రోజున ఆ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పినట్టు వెల్లడించాడు. ఇద్దరు క్రికెటర్లను కూడా కరణ్.. మహిళలకు సంబంధించిన ప్రశ్నలే ఎక్కువగా అడగడం గమనార్హం. మీరిద్దరూ ఒకే మహిళలతో డేటింగ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడితే అన్న ప్రశ్నకు..'ఆ మహిళకు ఇష్టమైతేనే ముందుకు సాగుతా' అని రాహుల్ బదులిచ్చాడు. పాండ్యా అయితే 'అబ్బెబ్బే..అలాంటి పరిస్థితి రాదు. ఒకవేళ అలాంటి పరిస్థితి ఏర్పడితే..ఆ మహిళను ఇష్టపడితే తీసుకువెళ్లిపోవడమే' అని పాండ్యా కుండబద్ధలుగొట్టాడు. ఇలా పాండ్యా నోటికొచ్చినట్టు మాట్లాడడంతో అభిమానులు ఆగ్రహోదగ్రులయ్యారు. సోషల్‌మీడియాలో హార్దిక్‌ను దుమ్మెత్తి పోశారు. రాహుల్ కూడా షోలో పాల్గొన్నా.. అతడు సంయమనం పాటించడంతో అభిమానులు అతడిపై ఎలాంటి విమర్శలు చేయలేదు.

బీసీసీఐ ఆగ్రహం: పాండ్యా వ్యాఖ్యలను బీసీసీఐ కూడా గర్హించింది. అవి స్త్రీలను కించపరిచేలా ఉన్నాయని అంగీకరించింది. ఆ వ్యాఖ్యలు క్రికెట్‌కే చెడ్డపేరు తెచ్చేలా ఉండడంతో దిద్దుబాటు చర్యలు చేపట్టింది. పాండ్యాతోపాటు రాహుల్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. 'హార్దిక్ పాండ్యా, రాహుల్‌కు షోకాజ్ పంపాం. 24 గంటల్లో వాటికి సమాధానామివ్వాలని సూచించాం' అని క్రికెట్ పాలక మండలి (సీఓఏ) చీఫ్ వినోద్ రాయ్ తెలిపారు. మొత్తంగా..హార్దిక్ పాండ్యా వ్యాఖ్యల నేపథ్యంలో అసలు క్రికెటర్లు 'క్రికెటేతర షో'లలో పాల్గొనవచ్చా అన్న చర్చలు మొదలయ్యాయి. 'క్రికెట్‌తో సంబంధంలేని షోలలో ఆటగాళ్లు పాల్గొనేందుకు అనుమతించకూడదనే విషయాన్ని పరిశీలిస్తున్నాం' అని బోర్డు అధికారి వెల్లడించారు.

షోకాజ్‌కు పాండ్యా స్పందన

తాను 'ఓపెన్'గా మాట్లాడిన మాటలు దుమారం రేపడంతో హతాశుడైన పాండ్యా సోషల్ మీడియా ద్వారా బహిరంగ క్షమాపణలు వేడుకున్నాడు. 'నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధించివుంటే వారందరినీ క్షమాపణలు కోరుతున్నా. షోకు అనుగుణంగా మాట్లాడానే తప్ప ఎవరినీ కించపరచడం నా ఉద్దేశం కాదు' అని ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్న అతడు వివరణ ఇచ్చుకున్నాడు. తన వ్యాఖ్యలకు తీవ్రంగా చింతిస్తున్నట్టు షోకాజ్ నోటీసుకు స్పందిస్తూ పేర్కొన్నాడు.

హాకీ కోచ్ హరేంద్రపై వేటు


హరేంద్ర

న్యూఢిల్లీ: పురుషుల హాకీ జట్టు కోచ్ హరేంద్ర సింగ్‌పై వేటు పడింది. 2018లో అతడి ఆధ్వర్యంలో భారత్ నిరాశాజనక ఫలితాలు సాధించడంతో హరేంద్రను తప్పిస్తూ హాకీ ఇండియా (హెచ్‌ఐ) బుధవారం నిర్ణయం తీసుకుంది. అతడిని జూనియర్ జట్టు కోచ్ బాధ్యతలు చేపట్టాల్సిందిగా సూచించింది. జూనియర్లపై దృష్టి సారించామనీ, అందుకనే హరేంద్రను ఆ జట్టు కోచ్‌గా పంపుతున్నట్టు హెచ్‌ఐ ప్రకటించింది. హరేంద్ర ఆధ్వర్యంలోనే గతంలో భారత జూనియర్ జట్టు ప్రపంచ కప్ గెలిచింది. నిరుడు మేలోనే సీనియర్ జట్టు కోచ్‌గా హరేంద్ర నియమితుడయ్యాడు. ప్రస్తుతానికి హై పెర్‌ఫామెన్స్ డైరెక్టర్ డేవిడ్ జాన్, అనలిటికల్ కోచ్ క్రిస్ సిరీలో కోచ్ బాధ్యతలను చూస్తారని హెచ్‌ఐ తెలిపింది. చీఫ్ కోచ్ పదవికి త్వరలో దరఖాస్తులు ఆహ్వానించనున్నట్టు వెల్లడించింది.

కంగుతిన్న హంటర్స్

ఢిల్లీ చేతిలో ఓటమి
పీబీఎల్



బెంగళూరు: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్‌లో ఈపాటికే సెమీస్ చేరిన హైదరాబాద్ హంటర్స్.. చివరి లీగ్ మ్యాచ్‌లో మాత్రం కంగుతింది. బుధవారం ఉత్కంఠభరితంగా జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 3-4తో ఢిల్లీ స్మాషర్స్ చేతిలో పరాజయంపాలైంది. విజయంతో టోర్నీ నుంచి ఢిల్లీ నిష్క్రమించింది. ట్రంప్‌గా ఎంచుకున్న మహిళల సింగిల్స్‌లో హంటర్స్ కెప్టెన్ పీవీ సింధు 15-11, 15-9తో ఎవగీనియా కొసెట్‌కయాపై నెగ్గి రెండు పాయింట్లు అందించింది. అంతకుముందు జరిగిన మ్యాచ్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ 15-10, 9-15, 15-12తో రాహుల్‌పై నెగ్గి ఢిల్లీకి శుభారంభం అందించాడు. పురుషుల డబుల్స్‌ను స్మాషర్స్ ట్రంప్‌గా ఎంచుకోగా.. చియా బియా వో-మోనీపోంగ్ జోంగ్జిట్ జోడీ 8-15, 15-9, 15-8తో బోడిన్ ఇసారా-అరుణ్ జార్జ్‌పై గెలిచింది. టామీ సుగియార్తో 15-6, 15-11తో మార్క్ కల్‌ఝౌపై నెగ్గి.. ఢిల్లీని 4-2తో గెలిపించాడు. చివరగా జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో హైదరాబాద్ జోడీ కిమ్ స ర్యాంగ్-ఎమ్ హై ఓన్ 15-7, 15-12తో వాంగ్ సిజే-సిన్ లిపై నెగ్గింది.

సైనా జట్టు ఇంటికి

మరో మ్యాచ్‌లో అవధె వారియర్స్ 5-0తో నార్త్ ఈస్ట్రన్ వారియర్స్‌ను చిత్తు చేసింది. 25 పాయింట్లతో టాపర్‌గా నిలిచింది. ట్రంప్‌గా ఎంచుకున్న మ్యాచ్‌లో నార్త్ ఈస్ట్రన్ టీమ్ కెప్టెన్ సైనా నెహ్వాల్ 15-11, 11-15, 7-15తో బీవెన్ జాంగ్ చేతిలో ఓడింది. టోర్నీలో మొత్తంగా 11 పాయింట్లే సాధించిన నార్త్ ఈస్ట్రన్ ఇంటి ముఖం పట్టింది. తొలి మ్యాచ్‌గా జరిగిన పురుషుల సింగిల్స్‌లో లి డాంగ్ కియున్ 15-10, 15-13తో టియాన్ హోవీపై గెలిచి అవధెకు పాయింట్ అందించాడు. ట్రంప్‌గా ఎంచుకున్న మిక్స్‌డ్ డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-క్రిస్టిన్‌సెన్ జంట 15-7, 15-14తో లియో మిన్ చున్-కిమ్ హ నపై నెగ్గి 3-0 ఆధిక్యంలో నిలబెట్టింది. పురుషుల రెండో సింగిల్స్‌లో నార్త్ ఈస్ట్రన్ ప్లేయర్ తియాంగ్‌సక సయూన్‌సోమ్బుక్ 15-8, 15-10తో సన్ వాన్ హోపై గెలిచాడు. ఆఖరి మ్యాచ్‌లో యాంగ్ లి-అర్జున్ ద్వయం 15-5, 15-12తో ధ్రువ్ కపిల్-యు యాన్ సియాన్‌పై నెగ్గింది.



పంత్.. మా బేబీని చూసుకుంటావా?



న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ ముగిసిన తర్వాత ఖాళీగా ఉన్న వికెట్ కీపర్ రిషభ్ పంత్‌కు ఓ మంచి ఆఫర్ వచ్చింది. ఇటీవల తండ్రైన రోహిత్ శర్మ.. తన కుమార్తె సమైరాను చూసుకుంటావా? అని సరదాగా అడిగాడు. పంత్ 'గుడ్‌మార్నింగ్' ట్వీట్‌కు రోహిత్ ఫన్నీగా రిప్లై ఇచ్చాడు. 'శుభోదయం మిత్రమా. నువ్వు పసిపిల్లలను బాగా చూసుకుంటావని విన్నాను. అలాంటి వారు ఒకరు కావాలి. రితిక కూడా ఆనందపడుతుంద'ని శర్మ ట్వీట్ చేశాడు. మెల్‌బోర్న్ టెస్టు సందర్భంగా ఆస్ట్రేలియా కెప్టెన్ టిమ్ పెయిన్.. తన పిలల్లను చూసుకుంటే భార్యను సినిమాకు తీసుకెళ్తానంటూ రిషభ్‌ను స్లెడ్జ్ చేశాడు. అయితే, అది నిజమవుతుందని ఎవరూ ఊహించలేదు. ఆసీస్ ప్రధాని ఏర్పాటు చేసిన విందు సందర్భంగా పెయిన్ బిడ్డను పంత్ ఎత్తుకున్నాడు. అప్పుడు తీసిన ఫొటోను 'బెస్ట్ బేబీ సిట్టర్' అంటూ పెయిన్ భార్య బొన్నీ నెట్‌లో పోస్టు చేసింది.



బూమ్ బూమ్.. బుల్లి బుమ్రా!

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాలో టీమిండియా టెస్ట్ సిరీస్ నెగ్గి చరిత్ర సృష్టించడంలో యువ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా కీలకపాత్ర ఎంతుందో అందరికీ తెలిసిందే. ఆ సిరీస్‌లో అతని అద్భుత బౌలింగ్‌ను చూసి ఇప్పుడు చిన్నారులు స్ఫూర్తి పొందుతున్నట్టున్నారు. వైవిధ్యమైన అతని బౌలింగ్‌ను అనుకరించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆస్ట్రేలియాకు చెందిన ఓ బుడ్డోడు అచ్చం బుమ్రాలా బౌలింగ్ వేస్తూ అందరినీ ఆకట్టుకుంటున్నాడు. ఆ వీడియోను ఆసీస్‌కు చెందిన ఓ నెటిజన్ సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అదిప్పుడు వైరల్‌గా మారింది. ఈ బుడతడి బౌలింగ్‌కు ప్రముఖ కామెంటేటర్ హర్షా భోగ్లేతోపాటు పేసర్ బుమ్రా కూడా ఫిదా అయ్యారు. 'ఈ కిడ్ చాలా క్యూట్‌గా ఉన్నాడు. అతనికి నా అభినందనలు తెలపండి' అని బుమ్రా ట్వీట్ చేయగా.. 'అద్భుతం' అని భోగ్లే ట్వీట్ చేశాడు. ఇక, ఐసీసీ మాత్రం చాలా ఫన్నీగా '2034లో భారత్-ఆసీస్ మధ్య జరిగే సిరీస్ రసవత్తరంగా సాగుతుందేమో!' అని ట్వీట్ చేయడం విశేషం.

కోహ్లీ, సైనాకు మంత్రి రాథోడ్ చాలెంజ్



న్యూఢిల్లీ: కేంద్ర క్రీడాశాఖ మంత్రి రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్ ఖేలో ఇండియా పోటీల ప్రచారంలో భాగంగా స్టార్ క్రీడాకారులకు వినూత్నమైన చాలెంజ్ విసిరారు. ఇందుకు సంబంధించి మంత్రి సోషల్ మీడియాలో ఓ వీడియో పోస్ట్ చేశారు. ఓవైపు రెండు చేతులతో టీటీ ఆడుతూ, మరోవైపు క్రీడల ప్రాముఖ్యం గురించి చెబుతున్నట్టుగా ఆ వీడియోలో ఉంది. ఖేలో ఇండియా ప్రచారం కోసం '5 మినిట్స్ ఔర్' అనే పేరుతో ఈ చాలెంజ్ చేశారు. 'చిన్నతనంలో హోమ్‌వర్క్ చేసుకోకుండా ఆడుతుంటే మనల్ని అమ్మ వారిస్తూ ఉండేది. అప్పుడు మనం ఇంకో ఐదు నిమిషాలే అని అమ్మకు చెబుతూ ఆటలోనే మునిగిపోతుంటాం. ఇలాంటి అనుభవాలు దాదాపు అందరికీ ఉంటాయి. ఇప్పుడు కూడా ప్రతి ఒక్కరూ ఐదు నిమిషాల పాటు క్రీడల గురించి ఆలోచించండి. ఖేలో ఇండియా ప్రచారంలో భాగంగా మీరు కూడా ఇలాంటి అనుభవాలను పంచుకోండి' అని పేర్కొంటూ మంత్రి... టీమిండియా కెప్టెన్ కోహ్లీ, బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్, బాలీవుడ్ నటి దీపికా పదుకోన్‌కు పై చాలెంజ్‌ను విసిరారు. కాగా, సవాల్‌ను స్వీకరించిన సైనా.. ఈ చాలెంజ్ కోసం తన భర్త, షట్లర్ కశ్యప్, సానియా, ధవన్ పేర్లను నామినేట్ చేసింది.



మహారాష్ట్రలోని పుణెలో బుధవారం ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభ వేడుకల్లో ఓ దృశ్యం

మెల్‌బోర్న్.. మధుర జ్ఞాపకం!

టీమిండియా బ్యాట్స్‌మన్ హనుమ విహారి

హైదరాబాద్: ఆస్ట్రేలియాలో చారిత్రక విజయంతో యావత్ భారతం మురిసింది. టీమిండియా తుది జట్టులో చోటుదక్కించుకున్న హనుమ విహారికి ఈ టూర్ మధురమైన జ్ఞాపకాలను మిగిల్చింది. మిడిలార్డర్, ఓపెనర్‌గా తనదైన ముద్ర వేసిన విహారి.. బంతితో మెరుగైన ప్రదర్శనే చేశాడు. ఇంగ్లండ్ పర్యటనలో ఏకైక టెస్టు ఆడిన విహారి.. ఆసీస్ గడ్డపై మూడు టెస్టుల్లో సత్తా చాటాడు. చిరస్మరణీయ విజయం తర్వాత మెల్‌బోర్న్ టెస్టులో తొలిసారి ఓపెనర్ పాత్రలో బరిలోకి దిగిన విహారి (8) క్రీజులో నిలబడి 66 బంతులు ఆడడం కూడా సెంచరీ లేదా భారీ ఇన్నింగ్స్‌కు తక్కువేం కాదని విరాట్ కోహ్లీ ప్రశంసించడం హనుమ కెరీర్‌కు బూస్ట్..! ఈ విజయవంతమైన పర్యటన తాలూకూ అనుభూతులు అతడి మాటల్లోనే..

ఆస్ట్రేలియాను ఆస్ట్రేలియాలో ఎదుర్కోవడమంటే పెద్ద సవాల్ అని సీనియర్లు చెబుతుంటారు. క్లిష్టమైన ఆస్ట్రేలియా టూర్‌కు.. భారత డ్రెస్సింగ్ రూమ్‌లో చోటుదక్కడం నిజంగా నా అదృష్టం. టీమ్ ప్రతి మీటింగ్‌లోనూ ఎంతో సానుకూల దృక్పథం కనిపించింది. నా తొలి ఆసీస్ టూర్‌లోనే టీమిండియా చరిత్ర సృష్టించడం నా కెరీర్‌లో చిరకాల జ్ఞాపకం.



నా ప్రతిభను గుర్తించారు..

నేను ఇంగ్లండ్ టూర్‌కు ఎంపికైనప్పుడు అప్పటికే సిరీస్ ముగింపు దశకు చేరుకుంది. కానీ, ఈ పర్యటనలో బ్యాట్‌తో.. స్పెషలిస్ట్ స్పిన్నర్ లేనప్పుడు బంతితో జట్టుకు తగిన విధంగా సహకరించే అవకాశం దక్కింది. ఆటగాడి ప్రతిభను కెప్టెన్, కోచ్, సహాయ సిబ్బంది గుర్తిస్తే.. అంతకంటే కావాల్సిందేముంది. నాకు అదే పెద్ద ప్లస్ పాయింట్.

ఎక్కడైనా సిద్ధంగా..

అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఆడేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి. ఓపెనర్‌గానే కాదు ఏ స్థానంలో బ్యాటింగ్ అయినా అది చాలెంజే..! కానీ ఎంతో బాగా ఆస్వాదించాను. జట్టు అవసరాలకు అనుగుణంగా బంతి, బ్యాట్‌తో నా వంతు సహకారం అందించడం ఎంతో సంతృప్తినిచ్చింది.

భారీ స్కోర్లు సాధించాలి..


స్లెడ్జింగ్ గేమ్‌లో ఒక భాగం. దాని గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదు. హద్దుల్లో ఉన్నంత వరకు అది ఆటలో మజాను పెంచేదే..! ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుంటూ.. భారీ స్కోర్లు సాధించాలనుకుంటున్నా. ఆసీస్ పర్యటనకు ముందు వ్యక్తిగతంగా నాకు ఎటువంటి లక్ష్యాలూ లేవు. కానీ, టెస్టు సిరీస్ గెలవాలనే కాంక్ష నాతో సహా జట్టులోకి ప్రతి ఒక్కరిలోనూ ఉంది. ఆసీస్‌లో క్రికెట్ కోలాహలం అద్భుతం. 80 వేల మంది ప్రేక్షకుల ముందు ఆడడాన్ని నా జీవితంలో మరచిపోలేను.

పుజారా, బౌలర్లు అదరగొట్టారు



ముంబై: ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ విజయంలో రన్‌మషీన్ చటేశ్వర్ పుజారా, బౌలర్ల ప్రదర్శన అద్భుతమని దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసించాడు. మొత్తంగా భారత జట్టు ప్రదర్శన అదిరిందని చెప్పాడు. పుజారా బలమైన పునాది వేస్తే.. మిగతా వాళ్లు ఆ బాటలోనే పయనించారని మాస్టర్ అన్నాడు. చటేశ్వర్‌తోపాటు బౌలర్ల ప్రదర్శననూ మరువకూడదన్నాడు. టీమిండియా విజయం భావితరాలకు స్ఫూర్తిదాయమన్నాడు. 'నాకు పదేళ్లప్పుడు క్రికెట్ గురించి అంతగా అవగాహన లేదు. కానీ వరల్డ్‌కప్ నెగ్గామని మాత్రం తెలుసు. అక్కడే నా క్రికెట్ ప్రయాణం మొదలైంది. యువతకు స్ఫూర్తిదాయకమైన ఇలాంటి విజయాలు ఎంతో అవసరమ'ని సచిన్ అన్నాడు.

8 నెగ్గితే.. టాప్‌కు చేరువగా..!


ప్రాక్టీస్‌లో ధోనీ

దుబాయ్: టెస్టుల్లో నెం:1 ర్యాంక్‌లో కొనసాగుతున్న టీమిండియా.. వన్డేల్లో కూడా టాప్ ర్యాంక్‌కు చేరువయ్యే అవకాశాలున్నాయి. వరుసగా ఎనిమిది వన్డేలు నెగ్గితే భారత జట్టు ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరువకానుంది. ఆస్ట్రేలియాతో మూడు వన్డేలు, న్యూజిలాండ్‌తో ఐదు వన్డేలు నెగ్గితే భారత్ ఖాతాలో 125 పాయింట్లు చేరుతాయి. ప్రస్తుతం ఇంగ్లండ్ 126 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉండగా.. టీమిండియా 121 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతోంది. బ్యాట్స్‌మెన్ జాబితాలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టాప్-2లో ఉన్నారు. బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా అగ్రస్థానంలో కొనసాగు తుండగా.. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు మూడో ర్యాంక్ దక్కింది. అఫ్ఘాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ రెండో ర్యాంక్‌లో ఉన్నాడు. శిఖర్ ధవన్ 9వ, లెగ్ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ 6వ ర్యాంక్‌లో ఉన్నారు.

● అవినీతిపరులకు 15 రోజుల గడువు

దుబాయ్: శ్రీలంక క్రికెట్‌లో అవినీతికి సంబంధించిన వివరాలను అందజేసేందుకు ఐసీసీ 15 రోజులు గడువు విధించింది. లంక క్రికెట్‌లో అవినీతికి పాల్పడినవారు, దానికి సంబంధించిన సమాచారం కలిగిన వారు వివరాలను ఈ నెల 16నుంచి 31వరకు తమకు తెలియజేయాలని సూచించింది. అప్పటికీ ముందుకు రాకపోతే ఆ గడువు ముగిశాక.. సదరు వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.

● క్రికెట్‌కు అల్బీ మోర్కెల్ గుడ్‌బై

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ అల్బీ మోర్కెల్ (37) క్రికెట్‌కు బుధవారం వీడ్కోలు పలికాడు. మోర్కెల్ సౌతాఫ్రికా తరపున 58 వన్డేలు, 50 టీ20లు, ఓ టెస్టులో ఆడాడు. ఈ ఆల్‌రౌండర్ అన్ని ఫార్మాట్లలో కలిపి 77 వికెట్లు పడగొట్టగా, 1,412 పరుగులు చేశాడు. 2011 ఐపీఎల్ ట్రోఫీని గెల్చుకున్న చెన్నై సూపర్‌కింగ్స్ జట్టులో మోర్కెల్ సభ్యుడు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.





ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ+ఇండియన్ టాలెంట్= ఇండియా టుమారో... దేశంలోని అన్ని వర్గాల ప్రజలు టెక్నాలజీని వినియోగించాల్సిన అవసరాన్ని ప్రధాని నరేంద్రమోదీ చెప్పిన తీరు ఆమెను ఎంతో ఆలోచింపచేసింది. సాంకేతిక ప్రగతి కొద్దిమందికే పరిమితం కాకూడదు. అందుకే తమిళనాడులోని గ్రామీణ ప్రాంతాలు, చిన్న చిన్న పట్టణాల్లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పిల్లల్లో సాంకేతిక పరిజ్ఞానం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)లపై అవగాహన పెంపొందించే దిశగా అడుగులు వేశారు. 'యూకోడ్ ఇంటెలిజెన్స్ సొల్యూషన్స్' అనే టెక్ స్టార్టప్‌కు శ్రీకారం చుట్టి, స్కూలు పిల్లలను టెక్నాలజీ దిశగా అడుగులు వేయిస్తున్న సూర్య ప్రభ ఆలోచనలు... ఆమె మాటల్లోనే...

శ్రీ శక్తి



గ్రామీణ బాలల కోసం టెక్ స్టార్టప్!

తమిళనాడులోని తేని జిల్లాలో ఉన్న కంబం మా వూరు. మాది చాలా సామాన్య కుటుంబం. 'తేని నాడార్ సరస్వతి కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్' లో బీఎస్సీ మైక్రోబయోలజీ చదివాను. కార్తీక్ కణ్ణన్‌తో పెళ్లయిన తర్వాత చెన్నైలో స్థిరపడ్డాం. నా భర్త మెక్రోట్రానిక్స్ ప్రొఫెషనల్. నేను చదివింది సైన్స్ అయినా సృజనాత్మక కళలంటే ఇష్టముండేది. మ్యూరల్, వర్లీ, కలంకారీ, మధుబని పెయింటింగ్స్ నేర్చుకున్నా. ఏ సృజనాత్మక పనినైనా బాగా ఆస్వాదిస్తా. పెళ్లికి ముందు ఒక యాడ్ డిజైనింగ్‌లో ఉద్యోగం కూడా చేశా. సాంకేతిక రంగం వైపు నా దృష్టి మళ్లడానికి కారణం అందులో సృజనాత్మక ప్రయోగాలు చేయవచ్చనే ఆలోచనే. పెళ్లి కాక ముందు టెక్నాలజీకి సంబంధించి నాకు ఏమీ తెలియదు. అయితే టెక్నాలజీపై నా ఆసక్తిని గమనించి మావారు అత్యాధునిక టెక్నాలజీకి సంబంధించిన ఎన్నో విషయాలను నాకు నేర్పారు. అప్పుడే నాకు ఒక విషయం స్పష్టమైంది. అదేమిటంటే మనకున్న తెలివికి సాంకేతిక పరిజ్ఞానం కూడా తోడైతే మరింత ఆధునికంగా పనిచేయగలుగుతామని.

❖ టెక్నాలజీ దిశగా...

నాకు ఇద్దరు పిల్లలు. వాళ్లు బడికి వెళ్లడం ప్రారంభించిన తర్వాత నాకు ఖాళీ సమయం దొరికేది. ఇంట్లోనే స్వంతంగా కోడింగ్ నేర్చుకోవడం మొదలెట్టా. ఆ క్రమంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం గురించిన తాజా సమాచారాన్ని నా భర్త కార్తీక్‌ను అడిగి తెలుసుకుని వాటిపై అధ్యయనం చేసేదాన్ని. నా సందేహాలను ఆయన నివృత్తి చేసేవారు. సాంకేతిక రంగంలో టెక్నాలజీ స్టార్టప్‌లు పెట్టిన మహిళలు చాలా తక్కువమంది ఉండడాన్ని గమనించా. అప్పుడే టెక్ ఎడ్యుకేషన్ స్టార్టప్ పెట్టాలన్న ఆలోచన వచ్చింది. ఇది నిజంగా ఛాలెంజింగ్ పని. ధైర్యం చేసి 'యూకోడ్ ఇంటెలిజెన్స్ సొల్యూషన్స్'కు శ్రీకారం చుట్టా.

గ్రామాలు, చిన్న చిన్న పట్టణాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న చిన్నారులకు టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పట్ల అవగాహన పెంపొందించాలనుకున్నా. ఎందుకంటే భవిష్యత్తు అంతా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌దే. ఇప్పటి నుంచే మన విద్యార్థులకు ఆ దిశగా అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉంది. అంతకన్నా ముందు గ్రామాల్లోని విద్యార్థుల్లో టెక్నాలజీపై అవగాహన పెరగాల్సిన అవసరం ఎంతో ఉంది. అందుకే ప్రధాని మోదీ పేర్కొన్న 'ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ+ఇండియన్ టాలెంట్= ఇండియా టుమారో' ఫార్ములా నాకు బాగా నచ్చింది. ఆయన మాటలు నా ఆలోచనలకు మరింత బలాన్ని చేకూర్చాయి.

❖ ఆటలా నేర్పుతాం...

ఒకసారి కేంద్ర రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ ఒక సమావేశంలో తమిళనాడులోని రామనాథపురం వంటి వెనుకబడిన ప్రాంతాలలో వెనుకబాటుతనాన్ని పోగొట్టి ప్రగతిపథంలో నడిచేలా చేయాలన్నారు. ఆమె మాటలు నా మనసులో ముద్రించుకుపోయాయి. వెంటనే అక్కడి 'డిస్ట్రిక్ స్కిల్స్ ట్రైనింగ్ ఆఫీస్' డైరక్టర్‌తో మాట్లాడి స్థానిక విద్యాధికారుల సహాయసహకారాలతో పలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)లో యూకోడ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించాం.



నాకు ఇద్దరు పిల్లలు. వాళ్లు బడికి వెళ్లిన తర్వాత ఖాళీ సమయం దొరికేది. ఇంట్లోనే స్వంతంగా కోడింగ్ నేర్చుకోవడం మొదలెట్టా. ఆ క్రమంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం గురించిన తాజా సమాచారాన్ని నా భర్త కార్తీక్‌ను అడిగి తెలుసుకుని వాటిపై అధ్యయనం చేసేదాన్ని. నా సందేహాలను ఆయన నివృత్తి చేసేవారు.

అమెజాన్, యాపిల్‌లకు మల్లే ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగాములు గ్రామీణ విద్యార్థులకు అందివ్వాలని భావించాం.

ఈ కార్యక్రమం కింద ఎనిమిదేళ్ల విద్యార్థుల నుంచి 12వ గ్రేడ్ విద్యార్థుల వరకూ అందరికీ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్సెస్, రొబోటిక్ టెక్నాలజీలలో అవగాహన కలిగిస్తాం. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా మూడు విషయాలను పిల్లలకు నేర్పుతాం. రోబోట్స్ కోడింగ్ చెబుతాం. తర్వాత 'బికమ్ ఎ రోబోట్' ఎలాగో నేర్పుతాం. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వారిచేత చేయిస్తాం. వీటికి సంబంధించిన టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్, ఇతర ఇన్‌పుట్స్ అన్నీ మేమే అందిస్తాం. వీటి ద్వారా ప్రతీది పిల్లలు అనుభవపూర్వకంగా, లైవ్‌గా నేర్చుకుంటారు. నిజానికి ఇవి ఎంతో సంక్లిష్టమైన అంశాలు. వీటిని వినోదాత్మకంగా, పిల్లలకు సులువుగా అర్థమయ్యేలా, ఆడుతూపాడుతూ నేర్చుకునేలా చెప్తాం. పిల్లలు సొంతంగా టెక్నాలజీ ప్రయోగాలను చేస్తూ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ని ప్రాక్టికల్‌గా అప్లై చేసి రోబోలను తయారు చేయడం వంటి అంశాలను నేర్చుకుంటున్నారు. ఒకరోజు వర్క్‌షాపులో పిల్లలకు ఇవన్నీ మేం చెప్తాం. పిల్లల మధ్య ఇంటరాక్షన్‌తోపాటు స్వయంగా పిల్లలు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా, తమ కళ్లతో తాము దాన్ని చూసేలా 'ఎఐ' (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) ప్రోగామ్ ఉంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది వారికి రియల్ టైమ్ ఎక్స్‌పీరియన్స్‌ని ఇస్తుంది.

❖ ఇంకా విస్తరిస్తాం...

ఇప్పటివరకూ మొత్తం 3000 మంది విద్యార్థులు యూకోడ్ ద్వారా టెక్నాలజీ అవగాహన పొందారు. వీరంతా మదురై, విరుదునగర్, రామనాథపురం జిల్లాల్లోని గ్రామాలు, పట్టణాలకు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు. పది లక్షల పెట్టుబడితో మా స్టార్టప్‌ను చెన్నైలో ప్రారంభించాం. దేశంలో టెక్నాలజీ చేరని, టెక్నాలజీ అవగాహన అవసరమైన గ్రామాలు, పట్టణాల్లోని పిల్లలందరికీ టెక్నాలజీ అవగాహనను విస్తృత పరచాలనే లక్ష్యం పెట్టుకున్నాం. ఇలా చేయడం వల్ల భవిష్యత్తులో ఈ రంగంలో మన యువత గ్లోబల్‌గా ముందుంటారు. ఈ కార్యక్రమానికి కావాల్సిన నిధులు ఎంత ఎక్కువగా వస్తే అంతగా దేశమంతటా మా టెక్ ఎడ్యుకేషన్ అవగాహనను పిల్లలకు అందేలా కృషిచేస్తాం.

❖ డిజిటల్ విప్లవంలో...

అమెరికా, చైనాలో పిల్లల్లో టెక్నాలజీ వినియోగంతోపాటు దానిపై అవగాహన బాగా ఉంటుంది. మనదేశంలోని పిల్లలు ఈ విషయంలో బాగా వృద్ధి చెందాలి. ఆ లక్ష్యంతో మేం పనిచేస్తున్నాం. టెక్నాలజీ పరంగా మన యువత వృద్ధి చెందడమంటే సూపర్‌పవర్‌గా భారత్ రూపుదిద్దుకోవడమని నా అభిప్రాయం. మా కార్యక్రమాల విషయానికొస్తే పిల్లలకు వాటిని ఉచితంగానే అందజేస్తున్నాం. పాఠశాలల నుంచి కూడా ఎలాంటి రుసుము తీసుకోవడం లేదు. పిల్లలకు మా కార్యక్రమాలను అందజేయడంలో ప్రభుత్వ అధికారుల నుంచి స్కూళ్ల పరంగా అనుమతి ఇతరత్రా తోడ్పాటును మాత్రమే తీసుకుంటున్నాం. ఐసిఐసిఐ ఫౌండేషన్, సిఎస్ఆర్ ఫండింగ్, ఎన్జీవోలతో కలిసి మా టెక్ ఎడ్యుకేషన్ అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. మా టార్గెట్ గ్రామాలు, చిన్న చిన్న పట్టణాల్లోని పిల్లలే. కార్యక్రమ నిర్వహణలో నా భర్త ఫీల్డ్ వర్క్ చూస్తారు. నేను యూకోడ్‌కు సంబంధించిన ఇతర బాధ్యతలు, స్కూళ్లకు వెళ్లి ప్రోగ్రాములు నిర్వహించడం చేస్తుంటా.

❖ గ్రామీణ మహిళలకూ...

కేవలం గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు మాత్రమే గాక అక్కడి మహిళలకు సైతం టెక్నాలజీ పరంగా అవగాహన పెంచే ప్రయత్నాలకు శ్రీకారం చుడుతున్నాం. గ్రామ పంచాయతీల్లో 'విలేజ్ సముదాయ కూటం' కింద మహిళల్లో సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచే దిశగా కృషిచేయాలని నిశ్చయించుకున్నాం. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలను కూడా ఈ రంగంలో సాధికారులుగా నిలపాలన్నది మా లక్ష్యం.

• **నాగసుందరి**


శ్రీ శక్తి

తిరుప్పావై

ఆరు సోపానాలు

ఇరవయ్యారో పాశురం

మాలే! మణివణ్ణా! మార్గళి నీరాడువాన్
మేలైయార్ శెయ్ వనగళ్ వేణ్డువన కేట్టియేల్
ఞాలత్తై యెల్లామ్ నడుఙ్గ మురల్వన
పాలన్న వణ్ణత్తు ఉన్ పాఞ్జశన్నియమే
పోల్వన శఙ్గఙ్గళ్, పోయ్ ప్పాడుడై యనవే
శాల ప్పెరుమ్ పఱైయే, పల్లాణ్డిశైప్పారే
కోలవిళక్కే, కొడియే, విదామే
ఆలినిలైయాయ్! అరుళేలో రెమ్బావాయ్!



చిత్రం: కేశవ్ https://www.facebook.com/keshav61/

ఈ పాశురం గోపికల ప్రార్థనను వివరిస్తోంది. తమకు ఢక్క (పర), దీపం, ఛత్రం, ధ్వజం, శంఖాలనూ, మంగళ గానం చేసేవారినీ అనుగ్రహించాలని గోపికలు కృష్ణుణ్ణి కోరుతున్నారు. "అమలిన హృదయుడా, ప్రేమమూర్తీ, నీలమేఘవర్ణుడా! మా మొర ఆలకింపు. మార్గశిర స్నానం ఆచరించి, పూర్వీకులు బోధించినట్లు వ్రతాచరణం చేయగల మాకు ఈ ఆరు వ్రతోపకరణాలను అనుగ్రహించు. నీ పాంచజన్యం వంటి శ్రేష్టమైన, గంభీరనాదం గల తెల్లని శంఖం, గొప్ప భేరీ, విశాలమైన ఛత్రం, పల్లాండు (మంగళాశాసనాలు) పాడే గాయకులు, వెలుగులు విరజిమ్మే దీపస్తంభాలు, ధ్వజం అనుగ్రహించి మా వ్రతాన్ని పరిపూర్తి చెయ్యి. ప్రళయపయోధి జలాలలో తేలియాడే, మాయామానుషరూపుడవైన ఓ వటపత్రశాయీ! నీకు ఇదే మా విన్నపం!" అని ప్రార్థిస్తున్నారు.

ఈ వ్రతం అందుకే...

సింహాసనారూఢుడైన కృష్ణుడు... "గోపికలారా! మార్గశిర వ్రతం ఆచరిస్తున్నాం, సామగ్రి ఇవ్వమని అడుగుతున్నారు కదా! నా సాన్నిధ్యం కోసమే వచ్చామనీ, నేనే కావాలనీ కూడా చెబుతున్నారు. నా సాన్నిధ్యం కావలసినవారు ఇతర వాంఛలన్నింటిని త్యజించాలి. అయినా ఈ వ్రతమేమిటి? ఎవరు చెయ్యమంటే చేస్తున్నారు? దానికి కావలసిన అనుషంగికాలు ఏవి?" అని ప్రశ్నించాడు.

గోపికలు ఇలా సమాధానం చెబుతున్నారు- "ప్రభూ! గొల్ల పెద్దలంతా ఈ వ్రతాన్ని ఆచరించి శుభాలు పొందాలని ఆదేశిస్తున్నారు. నీ కల్యాణ గుణాలు గానం చెయ్యవచ్చనీ, నీ దర్శనభాగ్యాన్ని పొందవచ్చనీ మేము వ్రతాచరణకు సిద్ధపడ్డాం. మమ్ముల్ని నీతో సంధానపరచిన గొల్ల పెద్దల పట్ల కృతజ్ఞతతో ఈ వ్రతాన్ని చెయ్యబూనాం. కులపెద్దల ఆజ్ఞ శాస్త్రనిర్దేశనం కన్నా మిన్న కదా, నీకు తెలియనిదేమున్నది!".

ఈ పాశురం పరంధాముని సౌలభ్యాన్నీ, సౌశీల్యాన్నీ, స్వామిత్వాన్నీ తెలియజేస్తుంది.

ఆ మార్గమే అనుసరణీయం!

ఇక్కడ ఆండాళ్ 'మానసిక ఆరాధన' ప్రాముఖ్యతను వివరిస్తోంది. బాహ్య ఆరాధన నిర్వర్తించగలిగేది మానసిక ఆరాధన తరువాతనే!. శిష్టాచారపరులు... అంటే శాస్త్రోక్తమైన పద్ధతిలో జీవించేవారు, బాహ్యారాధనకు ఆరు రకాల సోపానాలను సూచించారు. అవి: మంత్రాసనం, స్నానాసనం, అలంకారాసనం, భోజ్యాసనం. పునర్మంత్రాసనం, పర్యంకాసనం. ఈ ఆరు ఆసనాలు పరచి స్వామిని పరివేష్ఠించి, ఉపచారాలు ఒనరించాలని శాస్త్రం. శిష్టాచారం విశిష్టతను కొనియాడుతూ, నిత్య నైమిత్తిక ధర్మాచరణలో సందేహాలు ఉత్పన్నమైనప్పుడు... ధార్మికులు, శిష్టులు ఆచరించే మార్గమే అనుసరణీయమని ప్రతిపాదిస్తున్నది ఆండాళ్.

గోపికలు కృష్ణుని అర్థించిన ఆరు వ్రతోపకారణాలు పైన చెప్పిన ఆరు ఆసనాలతో పోల్చతగినవి. శంఖాన్ని పూరించటం మంత్రాసనం. వాద్యఘోషతో తిరుమంజనం స్నానాసనం. అలంకారాసన సమయంలో చేసేవి... మంత్రపుష్పం, ఆళ్వారుల శ్రీసూక్తుల పారాయణ, వేదఘోష... దీనినే పల్లాండు (మంగళాశాసనం)గా వ్యవహరించవచ్చు. దీప ప్రజ్వలనాన్ని నైవేద్యసమర్పణగా భావించవచ్చు. పునర్మంత్రాసన సమయంలో భగవానుడికి (గరుడాళ్వార్ పై) సంచారేచ్ఛ, పర్యంకాసనంలో ధ్వజసేవ గురించిన విజ్ఞాపన... భగవానుని శయ్యపై ఆచ్ఛాదనగా ఛత్రాన్ని పరచడం! ఈ ఆరు వ్రతోపకరణాలూ భగవదారాధన క్రమానికి సూచికలు.

ఆండాళ్ తిరువడిగళే శరణం!

• **శ్రీదేవీ మురళీధర్**

ఫ్యామిలీ కౌన్సెలింగ్

ప్రేమ వివాహం... అయినా ఎందుకిలా?

నా వివాహమై నాలుగు నెలలయ్యింది. ప్రేమపెళ్లి. అయినా నాకు, నా భార్యకు ఏదో ఒక గొడవ. తనే నాకు ప్రపోజ్ చేసి పెళ్లి చేసుకుంది. అయినా ప్రతి విషయం సమస్యగా మారుస్తుంది. ఎందుకిలా? ఏం చేయాలి?

-జగదీశ్

చాలామంది ప్రేమించి పెళ్లి చేసుకుంటే చాలనుకుంటారు. నిజానికి ప్రేమకు అసలైన పరీక్ష మొదలయ్యేది పెళ్లయ్యాకే. ప్రేమించేప్పుడు లోకమంతా పచ్చగానే ఉంటుంది. ప్రేమికుడు ఎంతో మంచివాడుగా, అర్థం చేసుకునేవాడిగా అనిపిస్తాడు. అలాగే అమ్మాయి కూడా సుగుణాలరాశిలా కనిపిస్తుంది. ఎందుకంటే వివాహానికి ముందు వారిద్దరూ కొంచెం సేపు మాత్రమే కలుస్తారు. ఆ కాసేపూ ఒకరినొకరు చూసుకుంటూ అర్థం చేసుకున్నామని అనుకుంటారు. పెళ్లి అనేది బాధ్యత అని, దాన్ని ఇద్దరూ సమంగా పంచుకోవాలని ఆలోచించరు. పెళ్లి వరకూ ఎంతో ఉన్నతంగా ఉండే ఆలోచనలు పెళ్లవగానే వారి తల్లితండ్రుల్లా మారిపోతాయి. తమ భాగస్వామి అలా ఉండటం లేదా అని ఆలోచనలో పడతారు. అక్కడ నుంచి అలకలు, అపార్థాలు మొదలవుతాయి. విచిత్రమేమిటంటే... పెళ్లికి ముందు అంతకన్నా పెద్ద గొడవలైనా బతిమాలుకుని, సర్దుబాటు చేసుకున్న సంగతి మర్చిపోతారు. ఎంతసేపూ ఒకర్నొకరు తప్పు పడుతూ, గొడవపడుతూ ఉంటారు. అందరూ ఇలాగే ఉంటారని కాదు. ప్రేమ ఒకటే ముఖ్యం, పెళ్లి సాధారణం అనుకుంటూ భవిష్యత్తు సమస్యలు ఊహించకపోతే ఇలాగే అవుతుంది. మరి మీ ప్రేమ ఏ తరహానో ఆలోచించుకుంటే పరిష్కారం మీ చేతుల్లోనే ఉంటుంది.



• **కె.శోభ**

ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్, shobhas292@gmail.com

ముత్యాలముగ్గు



15 చుక్కలు
8 వచ్చే వరకు
మధ్యచుక్క



ఆర్.ఎం.ప్రత్యూష
పరిగి



21 చుక్కలు
9 వరుసలు
9 వచ్చే వరకు



సుర్వు శైలజ
అంబారిపేట్
కథలాపూర్



12 చుక్కలు
ఎదురు చుక్క
4 వచ్చే వరకు



ఎం.విజయలక్ష్మి
హరేరామబజార్
ఒంగోలు



17 చుక్కలు
మధ్య చుక్క
9 వచ్చే వరకు



పి.మమత
ఫిల్మ్‌నగర్
హైదరాబాద్



చూసొద్దామా?

కుంభమేళా...
అపూర్వ ఆధ్యాత్మిక సంగమం...
అచంచల విశ్వాసానికి తార్కాణం...
ఎలాంటి భేదభావాలూ లేకుండా కోట్లాది ప్రజలు ఒకే చోట చేరి, పవిత్ర స్నానాలు ఆచరించే అద్భుత ఘట్టం...
మనసా, వాచా, కర్మణా పవిత్రంగా ఉండాలనే సంకల్పాన్ని చేసుకొనే సందర్భం...

భక్తి... ఆధ్యాత్మిక అనురక్తి... పర్యాటక ఆసక్తి...

త్రివేణీ కుంభస్థలి!

ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ఆధ్యాత్మిక సమ్మేళనం కుంభమేళా! కోట్లాది జనం ఒక చోట చేరి, పవిత్ర స్నానాలు చేసే ఇలాంటి ఘట్టం మరెక్కడా కనిపించదు. వేల సంవత్సరాల నుంచి పరంపరగా వస్తున్న అచంచల విశ్వాసానికీ, భక్తికీ ఇది ప్రతీక. రెండేళ్ళ కిందట కుంభమేళాను సాంస్కృతిక వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించింది. ఈ ఏడాది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగలోని పవిత్ర త్రివేణీ సంగమం 'అర్ధ కుంభమేళా'కు వేదికగా ఆహ్వానం పలుకుతోంది.

ఇలా చేద్దాం!

- వీలయినంతవరకూ ముందుగానే వసతిని బుక్ చేసుకోవడం మంచిది.
- మేళాలో అధికారికంగా గుర్తించిన ఘాట్‌ల దగ్గరే స్నానం చేయడం భద్రతారీత్యా మంచిది.
- అత్యవసర ఫోన్ నెంబర్లను దగ్గర ఉంచుకోండి.
- రద్దీ ఎక్కువ ఉండడం వల్ల స్నానాలకు ఆలస్యం కావచ్చు. కాబట్టి కాస్త ఎక్కువ సమయం గడిపేలా ప్రయాణాలను ప్లాన్ చేసుకోండి.
- కుంభమేళాకు హాజరయ్యేవారు గుర్తింపు కార్డుల్ని తప్పనిసరిగా తీసుకువెళ్ళండి. మేళాకు వచ్చేవారి వివరాలను అధికారులు రిజిస్టర్లలో నమోదు చేస్తారు.
- ప్లాస్టిక్ సంచులూ, సీసాలు తీసుకువెళ్ళకండి.
- రద్దీగా, తొక్కిసలాటకు అవకాశం ఉండే ప్రదేశాలకు దూరంగా ఉండండి. స్నానాలకు అనుమతించిన పరిధి దాటి నది లోపలకు వెళ్ళకండి.
- విలువైన వస్తువులను తీసుకువెళ్ళకండి.

ఎక్కడ బస చెయ్యాలి?

కుంభమేళా యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక నగరంలో నాలుగు వేర్వేరు టెంట్ సిటీలు ఉన్నాయి. వాటిలో రద్దీ, లభ్యత, సౌకర్యాలను బట్టి ఛార్జీలు ఉంటాయి. ప్రత్యేక వెబ్‌సైట్ లేదా ఫోన్ నెంబర్ల ద్వారా వసతి బుక్ చేసుకోవచ్చు. **వివరాలు:** కల్పవృక్ష (www.kalpavriksh.in, +91 9415247600)), కుంభ్ కాన్వాస్ (www.kumbhcanvas.com, +91 63889 33340), వైదిక్ టెంట్ సిటీ (www.kumbhtent.com, +91 99099 00776, +91 99099 00778), ఇంద్రప్రస్థం సిటీ (wwww.indraprasthamcity.com. +91 8588857881/83). అలాగే తొంభైకి పైగా హోటళ్ళు, రిసార్టులు, ధర్మశాలల్లో కూడా వసతి పొందవచ్చు. వివరాల కోసం https://kalpavriksh.in/wp/accomodations/ వెబ్‌లింక్‌ను సందర్శించండి.

తాత్కాలిక నగరం

ప్రయాగ్‌రాజ్‌లో జరగబోయే అర్ధ కుంభమేళా కోసం ప్రపంచంలోనే అతి పెద్ద తాత్కాలిక నగరం రూపుదిద్దుకుంది. దాదాపు రెండువేల కోట్ల రూపాయలతో దీన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 250 కిలోమీటర్ల విస్తీర్ణంలో రోడ్లను నిర్మించారు. ఇరవైకి పైగా పంటూన్ వంతెనలు వేశారు. అధికారిక, సాంస్కృతిక కార్యక్రమాల కోసం గంగా పండాల్ (సామర్థ్యం 10,000 మంది), ఆధ్యాత్మిక కార్యక్రమాలకోసం ప్రవచన పండాల్, (సామర్థ్యం 2,000 మంది). నాలుగు కన్వెన్షన్ హాల్స్, 4,200 గుడారాలు ఏర్పాటు చేశారు. వీటిలో 1,500 ప్రీమియం టెంట్లు ఉన్నాయి (వీటిలో సౌకర్యాలను బట్టి ఛార్జీలు వసూలు చేస్తారు). ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా భద్రతను పర్యవేక్షిస్తారు.

అంకెల్లో కుంభమేళా!


ఉత్సవం జరిగే రోజులు: 49
ఏర్పాట్ల కోసం బడ్జెట్: రూ. 4,300 కోట్లు
హాజరయ్యే భక్తులు: సుమారు 12 కోట్లు అని అంచనా.
ఎక్కడి నుంచి?: భారత్‌తో పాటు సుమారు 192 దేశాల నుంచి.
71 దేశాల రాయబారులు కూడా కుంభమేళాను సందర్శించనున్నారు.



ఇవీ మూలాలు!

క్షీరసాగర మథనంలో ఉద్భవించిన అమృతం కోసం దేవతలకూ, రాక్షసులకూమధ్య జరిగిన పెనుగులాటలో నాలుగు అమృత బిందువులు హరిద్వార్, ఉజ్జయిని, ప్రయాగ, నాసిక్‌లలో పడ్డాయనీ, గరుత్మంతుడు అమృతభాండం తెస్తూండగా నేలపై సుధా బిందువులు చిలికాయనీ పురాణ కథనాలు ఉన్నాయి. అమృత స్పర్శతో పునీతమైన చోట్లు కాబట్టి, ఆ ప్రదేశాల్లో స్నానం ఆచరించడం పుణ్యప్రదమని పెద్దలు చెబుతారు. ఆ కారణంగానే ఆ నాలుగు ప్రాంతాలూ అనాదిగా కుంభమేళాలకు వేదికలయ్యాయి.

వేల సంవత్సరాల క్రితం నుంచీ కుంభమేళాలు జరుగుతున్నాయనడానికి పౌరాణికంగానే కాకుండా చారిత్రకంగా కూడా ఆధారాలు ఉన్నాయి. హర్ష చక్రవర్తి (క్రీ.శ. 590-647) ఉత్తరాదిని పాలిస్తున్న సమయంలో భారతదేశానికి వచ్చిన చైనా యాత్రికుడు హ్యుయాన్ సాంగ్ ప్రయాగను దర్శించి, కుంభమేళాను తిలకించాడు. ఆ విషయాన్ని రచనల్లో వివరంగా రాశాడు. కాగా, ఆనాటి భారతదేశంలో ఉన్న వివిధ తాత్విక సిద్ధాంతాలను ఏకమార్గంలోకి తీసుకువచ్చిన ఆదిశంకరులు 'అర్ధ కుంభమేళా', 'మహా కుంభమేళా'ల విధివిధానాలకు రూపకల్పన చేశారన్న కథనాలు కూడా ఉన్నాయి.



ఇవీ చూద్దాం!

అలహాబాద్ (ప్రయాగ్‌రాజ్), ఆ చుట్టుపక్కల చూడాల్సిన ఆలయాలూ, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాలూ అనేకం ఉన్నాయి.

వాటిలో కొన్ని:

- అలహాబాద్ (అక్బర్) కోట
- వేణీ మాధవ ఆలయం
- విక్టోరియా మెమోరియల్
- అలహాబాద్ యూనివర్సిటీ
- గంగా గ్యాలరీ
- భరద్వాజ ఆశ్రమం
- బడే హనుమాన్ ఆలయం
- అక్బర్ ఫోర్ట్ దగ్గర కుంభమేళా సందర్భంగా ఏర్పాటు చేస్తున్న భారీ సరస్వతి విగ్రహం
- జవహర్‌లాల్ నెహ్రూ పుట్టిన ప్రదేశం (ఆనంద్‌భవన్)

ఎలా వెళ్ళాలి?

తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలు, పట్టణాల నుంచి ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్)కు నేరుగా రైళ్ళు ఉన్నాయి. అలహాబాద్‌లో విమానాశ్రయం ఉంది.

ఊహకు అందని అద్భుతం!

1895లో సుప్రసిద్ధ ఆంగ్ల రచయిత మార్క్ ట్వైన్ ప్రయాగలో కుంభమేళాను సందర్శించాడు. "వృద్ధులూ, బలహీనులూ, యువకులూ, దారుఢ్యం లేనివారూ ఎలాంటి సంకోచం లేకుండా... కష్టాలకు ఓర్చి, సుదీర్ఘమైన ప్రయాణాలు చేసి, తండోపతండాలుగా తరలివస్తున్నారు. వారి విశ్వాసానికి ఉన్న శక్తి అద్భుతం. ఇదంతా ప్రేమతో చేస్తున్నారో, భయంతో చేస్తున్నారో నాకు తెలీదు. ప్రేరణ ఏదన్నది అప్రస్తుతం. మన లాంటి శ్వేతజాతీయుల ఊహకు అందని విషయం ఇది!" అని ఆయన రాశారు. అలాంటి విశ్వాసమే సాధువుల నుంచి సామాన్యుల వరకూ... కోట్ల మందిని ఉత్తేజపరుస్తోంది. కుంభమేళా దిశగా నడిపిస్తోంది.

ఎప్పుడు, ఎక్కడ?

దేశంలోని నాలుగు ప్రసిద్ధ క్షేత్రాల్లో పన్నెండేళ్ళకు ఒకసారి కుంభమేళా జరుగుతుంది. సూర్యుడు, గురువు (బృహస్పతి) నిర్ణీత రాశులలో ఉన్నప్పుడు వీటిని నిర్వహిస్తారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో గంగానది వద్ద, మహారాష్ట్రలోని నాసిక్ సమీపంలోని త్రయంబకేశ్వర్‌లో గోదావరి నది వద్ద, మధ్యప్రదేశ్‌ని ఉజ్జయినిలో క్షిప్రానది వద్ద, ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్)లో గంగా, యమునా, సరస్వతీ (అంతర్వాహిని) నదుల సంగమం వద్ద కుంభమేళాలు జరుగుతాయి. అలాగే హరిద్వార్, ప్రయాగల్లో ఆరేళ్ళకు ఒకసారి అర్ధ కుంభమేళాలు నిర్వహిస్తారు.

- తాజాగా ఈ నెల 15వ తేదీ నుంచి మార్చి 4వ తేదీ వరకూ ప్రయాగ్‌రాజ్‌లో అర్ధ కుంభమేళా జరగనుంది.

49 రోజులు జరిగే కుంభమేళాలో కొన్ని రోజులను అత్యంత పవిత్రంగా భావిస్తారు. కుంభమేళా తొలి రోజున వివిధ అఖారాలకు (మఠాలకు) చెందిన వారూ, నాగ సాధువులూ పెద్ద సంఖ్యలో హాజరవుతారు. షాహి స్నానం లేదా రాజ యోగి స్నానం ఆచరించి కుంభమేళాను ప్రారంభిస్తారు. షాహి స్నానాలు పూర్తయిన తరువాత మాత్రమే ఇతర భక్తుల్ని అనుమతిస్తారు.

కుంభమేళాలో స్నానానికి ముఖ్యమైన రోజులు

- జనవరి 15 - మకర సంక్రాంతి
- జనవరి 21- పుష్య పౌర్ణమి
- ఫిబ్రవరి 4 - మౌని అమావాస్య
- ఫిబ్రవరి 10- వసంత పంచమి
- ఫిబ్రవరి 19- మాఘ పౌర్ణమి
- మార్చి 4- మహా శివరాత్రి
- పన్నెండేళ్ళకు ఒకసారి హరిద్వార్‌లో నిర్వహించే కుంభమేళా 2021-22 మధ్య జరుగుతుంది.

సౌకర్యాలూ, సదుపాయాలూ!

సందర్శకుల బస కోసం శాటిలైట్ టౌన్‌షిప్‌లు: 18
భక్తులకోసం ఏర్పాటు చేస్తున్న టాయిలెట్స్: 1.20 లక్షలు
యాత్రికులను ఘాట్లకు చేరవేయడానికి షటిల్ **బస్సులు:** 564, ఇంకా వందల సంఖ్యలో సిఎన్‌డి ఆటోలు,
బ్యాటరీలతో పనిచేసే ఇ-రిక్షాలు: 500కు పైగా
కుంభమేళాకు వచ్చే భక్తులకు బీమా కవరేజ్ అందించాలని యూపీ ప్రభుత్వం యోచిస్తోంది.
రైల్వే శాఖ దాదాపు 800 ప్రత్యేక రైళ్ళు నడుపుతోంది.
ఎయిర్ ఇండియా ఢిల్లీ, అహ్మదాబాద్, కోల్‌కతాల నుంచి ప్రత్యేక విమాన సేవలు నిర్వహిస్తోంది.

అర చేతిలో సమస్తం!

ప్రత్యేక యాప్స్
రైల్వే సమాచారం కోసం: రైల్ కుంభ్ సేవా
యాత్రికుల సహాయార్థం: కుంభ్- 2019
జియో స్పెషల్ ఎడిషన్: ప్రయాగ్‌రాజ్ కుంభమేళా సందర్భంగా జియో ఫోన్ ప్రత్యేక ఎడిషన్ విడుదలయింది. కుంభమేళాకు సంబంధించిన సమస్త సమాచారం తెలుస్తుంది. బస్సు, రైలు టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చు. అత్యవసర సేవల వివరాలు, ఫోన్ నెంబర్లు, వసతి సమాచారం, రూట్ మ్యాప్‌లు, పూజల వివరాలు దీనిలో తెలుసుకోవచ్చు. కుంభమేళాలో జరిగే కార్యక్రమాలను లైవ్‌లో తిలకించవచ్చు. రోజంతా ప్రత్యేక రేడియో ఛానెల్ కూడా ఉంటుంది. మీ సన్నిహితులు ఉన్న లొకేషన్, తప్పిపోయినవారి ఆచూకీ తెలుసుకోవచ్చు. అలాగే గేమ్స్, కుంభమేళా క్విజ్ పోటీలు కూడా ఉంటాయి.

మరిన్ని వివరాలకోసం
https://kumbh.gov.in/
+ 91 532 2500775 / +91 532 2504011



కైట్స్ అండ్ స్వీట్స్... సంతోషానికి హైట్స్!

సంక్రాంతి పండుగ అనగానే సంప్రదాయికమైన పిండివంటలూ, పెద్దలూ, పిల్లలూ సందడిగా నింగిలోకి ఎగురవేసే పతంగులూ గుర్తుకొస్తాయి. తియ్యటి విందులూ, గాలిపటాల కనువిందులూ ఒకే చోట కొలువుతీరే వేడుక వచ్చేస్తోంది. గత నాలుగు సంవత్సరాలుగా అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌కు హైదరాబాద్ వేదికగా నిలుస్తోంది. దేశంలోనే తొలిసారిగా కిందటి ఏడాది ప్రారంభమైన అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్ దీనికి జత కలిసింది. ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి ప్రఖ్యాతి చెందిన కైట్ ఫ్లయర్స్ (పతంగుల నిపుణులు) తరలి వస్తున్నారు. దీనితోపాటు కల్చర్ లాంగ్వేజ్ ఇండియన్ కనెక్షన్స్ (సీఎల్ఐసీ)తో కలిసి అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్‌ను నిర్వహించడానికి తెలంగాణ టూరిజం శాఖ రంగం సిద్ధం చేసింది.

ఎప్పుడు?: ఈనెల 13 నుంచి 15వరకూ మూడు రోజులపాటు
ఎక్కడ?: సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్

ఇవీ ప్రత్యేకతలు:

పతంగుల పండుగ: ఇటలీ, అమెరికా, చైనా, మలేషియా, ఫిలిప్పిన్స్, సింగపూర్, శ్రీలంక, ఉక్రెయిన్, ఇండోనేషియా, తైవాన్, పోలాండ్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, న్యూజిలాండ్, స్వీడన్, కొలంబియా, ఇండోనేషియా-బాలి, థాయిలాండ్, ఇంగ్లండ్... మొత్తం 19 దేశాలకు చెందిన 50మంది, మన దేశం నుంచి దాదాపు 60 మంది కైట్ ఫ్లయర్స్ (పతంగులు ఎగురవేసే నిపుణులు) పాల్గొంటున్నారు. మొసలి, పావురం, బటర్‌ఫ్లై, కాటర్‌పిల్లర్, కార్టూన్ పాత్రలు, టెడ్డీ బేర్స్, జాతీయజెండా, ఆక్టోపస్, వింగ్‌డ్ వండర్స్... ఇలా అనేక డిజైన్లు, రంగులతో పతంగులు నింగిలో సందడి చేయబోతున్నాయి. వీటిని తిలకించడానికి ఈ ఏడాది సుమారు పది లక్షల మంది ప్రజలు హాజరవుతారని అంచనా. రాత్రివేళలో కూడా పతంగులను ఎగురవేసేందుకు ప్రత్యేకంగా బృందం ఉంది. 'బాలికలను చదివిస్తే వారు ప్రపంచాన్నే



మార్చేయగలరు' అనే నినాదంతో బాలిక విద్య ప్రాముఖ్యతపై ఈ వేడుకల ద్వారా అవగాహన కల్పించనున్నారు. అలాగే వివిధ రకాల వంటకాలు, చేనేత వస్త్రాలు, హస్త కళాకృతుల దుకాణాలు ఏర్పాటవుతున్నాయి. ఎకో ఫ్రెండ్లీ మన దగ్గరే! పతంగుల పండుగలో ప్లాస్టిక్, మంజా దారం లేకుండా సాధారణ రీతిలో పతంగులను ఎగురవేయాలని అధికారులు సూచిస్తున్నారు. పోటీలను తిలకించేందుకు వచ్చే వారిని ఉత్సాహ పరిచేందుకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

స్వీట్ ఫెస్టివల్: తెలంగాణ సంప్రదాయ వంటకాలతో పాటు, హైదరాబాద్ నగరంలో నివాసం ఉంటున్న తమిళనాడు, కేరళ, పంజాబ్, గుజరాత్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర మహిళలు, ఇతర దేశాలకు చెందిన మహిళలు తయారు చేసిన స్వీట్లు ఈ ఉత్సవంలో ప్రదర్శితమవుతాయి. ఈ ఏడాది దాదాపు వెయ్యి రకాల స్వీట్స్ ప్రదర్శనలో ఉంటాయి. విభిన్న కులాలు, మతాలు, భాషలకు చెందిన సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయడం ద్వారా జాతీయ సమైక్యతను పెంపొందించడమే దీని వెనుక ప్రధానోద్దేశం.

- **కొమ్ము రాజు,** హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

మన దగ్గరే!



బొజ్జన్న తీర్థం

తెలుగునాట ఒకప్పుడు బౌద్ధమతం వర్ధిల్లింది. ఆనాటి వైభవానికి చిహ్నాలు ఇప్పటికీ పలుచోట్ల కనిపిస్తాయి. అలాంటి చారిత్రక ప్రదేశాల్లో ఒకటి బొజ్జన్న కొండ బౌద్ధారామం. ప్రతియేటా ఇక్కడ నిర్వహించే బౌద్ధమేళా, తీర్థం (జాతర) బొజ్జన్న కొండ వైశిష్ట్యాన్ని చాటిచెబుతాయి.

ఎప్పుడు?: ప్రతి సంవత్సరం కనుమ రోజున (ఈ ఏడాది జనవరి 16న)
ఎక్కడ?: విశాఖపట్నం జిల్లా అనకాపల్లి మండలం శంఖారం లేదా శంకారం దగ్గర
ఎలా వెళ్ళాలి?: అనకాపల్లికి సుమారు 4 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రైవేటు వాహనాల్లో చేరుకోవచ్చు.
విశేషాలు: చుట్టూ పచ్చదనం మధ్య బౌద్ధారామాలు, వందలాది లింగాకృతులూ కొలువైన ప్రదేశం బొజ్జన్న కొండ. 'బొజ్జన్న' అంటే బుద్ధుడని చెబుతారు. ఈ కొండ ఉపరితలాన్ని చదును చేసి దానిపై స్థూపాన్ని నిర్మించారు. స్థూపానికి తూర్పు దిశగా కాల్చిన ఇటుకలతో మహా విహారం నిర్మించారు. పశ్చిమ దిశలో కొండను తొలిచి 8 గుహాలయాలు, స్థూపాలు ఏర్పాటు చేశారు. కొండ పశ్చిమ కొనలో- రెండు అంతస్థుల్లో గుహాలయాలను నిర్మించారు. వీటిలో ధ్యాన, బుద్ధ ప్రతిమలున్నాయి. బొజ్జన్నకొండను ఆనుకొని పశ్చిమ దిశగా తిమింగలాకారంలో తీర్చిదిద్దబడిన లింగాలకొండ ఉంది. బౌద్ధ, హిందూ దేవతల విగ్రహాలు ఇక్కడ ఉండడాన్ని బట్టి, ఇరు మతాలకూ ఆరాధనా స్థలంగా ఇది ఒకప్పుడు వర్ధిల్లిందనేది కొందరి అభిప్రాయం.
బౌద్ధ మేళా, తీర్థం: ఏటా కనుమ రోజున బొజ్జన్నకొండ వద్ద బౌద్ధమేళా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీలంక, నేపాల్, చైనా తదితర దేశాల నుంచి బౌద్ధ భిక్షువులు ఆ రోజున వస్తారు. అలాగే దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో బౌద్ధ భిక్షువులు చేరుకొని, పూజలు నిర్వహిస్తారు. ఆ రోజున బొజ్జన్న కొండ దగ్గర తీర్థం (జాతర) జరుగుతుంది. విశాఖ గ్రామీణ జిల్లాలోని వివిధ మండలాల నుంచి వేలాది ప్రజలు తరలివస్తారు. గాలిపటాల ఎగురవేత, రంగుల రాట్నాల సందడితో బొజ్జన్న కొండ కోలాహలంగా మారుతుంది.

- **రమణ,** ఆంధ్రజ్యోతి, అనకాపల్లి

ఈ క్లిప్ క్లిక్ అయింది!

ఎక్కడికైనా వెళుతున్నప్పుడు దుస్తులన్నీ ఇస్త్రీ చేయించుకొని సర్దుకోవడం చాలా మందికి అలవాటు. కానీ ఒక్కసారి బ్యాగ్ నుంచి తీసిన ఇస్త్రీ చొక్కా మళ్లీ మరో రోజుకు కావాలంటే కష్టమే. అవి చాలా సులువుగా నలిగిపోతూ ఉంటాయి. సరిగ్గా రెండీ బ్లవిన్స్ అనే అమెరికన్ కూడా ఇలాంటి సమస్యే ఎదుర్కొన్నాడు. అందుకే ఓ క్లిప్‌ను రూపొందించాడు. దీని పేరు 'స్టీమ్ క్లిప్'. పర్యాటకులకు, తరచూ ప్రయాణాలు చేసే వ్యాపారస్తులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. హోటల్స్‌లో బస చేసినప్పుడు అక్కడ హ్యాంగర్స్ లేకపోతే ఈ క్లిప్‌ను షర్ట్‌కు తగిలించి వాడుకోవచ్చు. రెస్టారెంట్‌కు వెళ్లినప్పుడు మహిళలు తమ హ్యాండ్ బ్యాగ్‌ను ఈ క్లిప్ సాయంతో వారి టేబుల్‌కు తగిలించవచ్చు. అంతేకాదు బాటిల్ ఓపెనర్‌గా ఉపయోగపడుతుంది. అప్పుడే కొన్న వస్తువుల ప్రైస్ ట్యాగ్స్ తీయడానికి కత్తెర లేదా బ్లేడ్ కోసమో వెతుక్కోవాల్సిన అవసరం లేదు. అలాగే స్మార్ట్‌ఫోన్ స్టాండ్‌గా కూడా పనికొస్తుంది. ఈ మధ్యకాలంలో మార్కెట్లోకి వచ్చిన ట్రావెల్ గ్యాడ్జెట్స్‌లో ఈ మల్టీపర్పస్ స్టీమ్ క్లిప్ వినియోగదారులను బాగా ఆకట్టుకుంది. త్రీడీ ప్రింటింగ్ పరిజ్ఞానంతో రూపొందిన ఈ క్లిప్ ధర 13 డాలర్లు (రూ. 911)



ట్రై చేయండి

డైలీ సుడోకు - 421

		1	6		7		4	2
9					2			
	2					5		9
		9		1	5		6	4
6	5		4	2		1		
4		5					8	
			9					7
3	7		5		6	2		

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 420 సమాధానం

[illegible]	[illegible]	1	[illegible]	7	[illegible]	3	9	[illegible]
9	[illegible]	[illegible]	[illegible]	[illegible]	2	[illegible]	[illegible]	[illegible]
[illegible]	2	[illegible]	4	3	[illegible]	5	[illegible]	[illegible]
[illegible]	[illegible]	[illegible]	8	2	[illegible]	[illegible]	[illegible]	[illegible]
7	[illegible]	8	[illegible]	[illegible]	[illegible]	4	[illegible]	6
[illegible]	[illegible]	[illegible]	[illegible]	4	6	[illegible]	[illegible]	[illegible]
[illegible]	[illegible]	5	[illegible]	1	4	[illegible]	7	[illegible]
[illegible]	[illegible]	[illegible]	5	[illegible]	[illegible]	[illegible]	[illegible]	4
[illegible]	9	3	[illegible]	8	[illegible]	6	[illegible]	[illegible]

ఉద్యోగానికి ఐఏఎస్ టాపర్ గుడ్‌బై

కశ్మీరీల జీవితాలు నాకు ముఖ్యం!.. 'ఆగని హత్యలపై నిరసన'.. కేంద్రానికి చిత్తశుద్ధి లేదు

- **హిందూత్వ శక్తుల చేతిలో ముస్లింల హననం**
- **ఫేస్‌బుక్ పోస్ట్‌లో ఫైసల్ ధ్వజం..**
- **త్వరలో రాజకీయాల్లోకి?**

శ్రీనగర్, జనవరి 9: జమ్మూ కశ్మీర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి షా ఫెసల్ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. 2009లో టాపర్ అయిన ఫైజల్... "రాష్ట్రంలో అడ్డూ ఆపూ లేకుండా సాగుతున్న కశ్మీరీ పౌరుల హత్యాకాండకు నిరసనగా" రాజీనామా చేస్తున్నట్లు ఓ ఫేస్‌బుక్ పోస్ట్‌లో వెల్లడించారు. "నాకు ఉద్యోగం కాదు.. కశ్మీరీల జీవితాలు ముఖ్యం. ప్రజలకు చేరువయ్యేందుకు కేంద్రం నుంచి ఎలాంటి చొరవా లేదు.. చిత్తశుద్ధి లేదు. హిందూత్వ శక్తుల చేతిలో దేశంలోని దాదాపు 20 కోట్ల ముస్లింల సామూహిక హననం సాగుతోంది. ముస్లింల ప్రాధాన్యం తగ్గించేలా, వారిని అసలు లేకుండా చేసే ప్రయత్నం సాగుతోంది. వారిని ద్వితీయ శ్రేణి పౌరులుగా దిగజారుస్తున్నారు. ప్రత్యేక ప్రతిపత్తి ఉన్న రాష్ట్రంపై దారుణమైన దొంగదెబ్బ తీస్తున్నారు. అతివాద జాతీయవాదం పేరిట పరమత ద్వేషం పెచ్చరిల్లుతోంది" అని ఆయన తన పోస్ట్‌లో తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ పేరెత్తకుండా తీవ్రంగా దాడి చేస్తూ- సీబీఐ, ఆర్బీఐ, ఎన్ఐఏ మొదలైన వ్యవస్థల విధ్వంసం వెనుక దేశ రాజ్యాంగ సౌధాన్ని కుప్పకూల్చే యత్నం సాగుతోంది. దీన్ని అడ్డుకోవాలి. నిజమైన ప్రజాస్వామ్యం నెలకొనాలంటే ప్రశ్నించే గళాలను అణగదొక్కరాదు. ఇకపై సివిల్ సర్వీసెస్‌కు వెళ్లాలనుకునే వారికి శిక్షణనిచ్చి నా కల నెరవేర్చుకుంటా" అని ఫైసల్ పేర్కొన్నారు. హార్వర్డ్ కెనెడీ స్కూల్‌లో ఫుల్‌బ్రైట్ ఫెలో అయిన ఫైసల్ ఈ మధ్యే విదేశీ పర్యటన ముగించుకుని వచ్చి పోస్టింగ్‌కు ఎదురుచూస్తున్నారు. ఫైసల్ త్వరలో రాజకీయాల్లో చేరవచ్చు ననే వాదన వినిపిస్తోంది. నేషనల్ కాన్ఫరెన్స్ నేత మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆయన పోస్ట్‌పై ట్వీట్ చేస్తూ- 'బ్యూరాక్రసీకి నష్టమైనది రాజకీయాలకు లాభమవుతుంది. వెల్‌కమ్ ...' అని వ్యాఖ్యానించడం ఫైసల్ భవిష్యత్ గమనానికి సంకేతమని అంటున్నారు.



నా హృదయాన్ని దొంగిలించారు

- **వెతికిపెట్టండి.. నాగ్‌పూర్ పోలీసులను ఆశ్రయించిన యువకుడు**



నాగ్‌పూర్, జనవరి 9: డబ్బులు దోచుకున్నారని, బంగారం దోచుకున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసేవారిని చూశాం. కానీ నా హృదయాన్ని దోచుకున్నారంటూ ఫిర్యాదు చేయడం ఎప్పుడైనా చూశారా.. ?. నాగ్‌పూర్‌లో ఓ యువకుడు అదే పని చేశాడు 'సార్... ఓ అమ్మాయి నా హృదయాన్ని దోచుకుంది. వెతికిపెట్టరా ప్లీజ్' అంటూ పోలీసులను ఆశ్రయించాడు. 'మేం అలాంటి కేసులను స్వీకరించం' అని పోలీసులు ఎంత చెప్పినా వినలేదు. 'నా హృదయం నాకు తిరిగి ఇప్పిస్తామ'ని మాట ఇస్తేనే ఇక్కడ నుంచి వెళ్తానని భీష్మించుకు కూర్చున్నాడు. అప్పటిదాకా అలాంటి కేసులను చూడని పోలీసులు కాసేపు బిత్తరపోయారు. ఏం చేయాలో పాలుపోక పైస్థాయి అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి వచ్చిన అధికారులు.. హృదయాన్ని దోచుకుంటే ఏం చేయాలనేది భారత శిక్షాస్మృతిలో లేదని, అలాంటి చట్టం వచ్చాక తప్పకుండా వెతికి పెడతామని యువకుడికి నచ్చజెప్పి పంపించారు. నాగ్‌పూర్ పోలీస్ కమిషనర్ భూషణ్ కుమార్ ఉపాధ్యాయ తాము దొంగల దగ్గర నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను యజమానులకు తిరిగి ఇచ్చే సందర్భంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సరదాగా ఈ విషయాన్ని చెప్పారు. "అప్పుడప్పుడు ఇలాంటి దొంగతనాల కేసులు కూడా వస్తాయి. మేమేం చేసేది" అని అన్నారు.



పాక్‌కు చైనా బ్రహ్మాస్త్రం

- **బ్రహ్మోస్‌ను తలదన్నే డ్రాగన్ క్షిపణి?.. పాక్ చేతికి సీఎం-302 మిస్సైల్ వ్యవస్థ**

బ్రహ్మోస్.. 2005 నుంచి భారత నావికాదళానికి తిరుగులేని అస్త్రం. రష్యా సహకారంతో అభివృద్ధి చేసిన ఈ క్షిపణి వ్యవస్థ.. పాక్ నేవీపై భారత నేవీ ఒక మెట్టుపైనే ఉందని తెలియజేసింది. అయితే, ఇప్పుడు ఆ పెత్తనానికి గండి పడబోతోందా? పాక్‌కు చైనా అందజేస్తోన్న సూపర్‌సోనిక్ క్షిపణి వ్యవస్థ.. బ్రహ్మోస్ కంటే శక్తిమంతమైనదా? దానికి ఎక్కువ పరిధితో, అత్యంత వేగంగా దూసుకెళ్లగల సామర్థ్యం ఉందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. అమెరికా తోమహక్, హర్పూన్ క్షిపణుల కంటే బ్రహ్మోస్ వేగం అమోఘం. కానీ, దానికంటే చైనా 'సీఎం-302' క్షిపణి వ్యవస్థ శక్తిమంతమైనదట. ధ్వనివేగం కంటే మూడు రెట్లు ఎక్కువ వేగంతో దూసుకెళ్లగలదట. దాని పరిధి కూడా 400 కిలోమీటర్ల మేర వ్యాపించి ఉందట. ప్రస్తుతం షాంఘైలోని హుడాంగ్-ఝోంగువా నౌకాశ్రయంలో తయారు చేస్తున్న నాలుగు యుద్ధ నౌకల్ని పాకిస్థాన్‌కు చైనా అందజేయనుంది. ఆ క్షిపణులతో భారత నావికాదళానికి ఇప్పటికిప్పుడు ముంచుకొచ్చే ప్రమాదమేమీ లేదని భారత నేవీ అధికారులు తెలిపారు. భారత్‌పై సీఎం-302ను ప్రయోగించాలంటే పాక్‌కు ఎక్కువ దూరాన్ని లక్ష్యం చేసుకునే సెన్సర్లు అవసరమని, ప్రస్తుతం ఆ దేశ నేవీ వద్ద ఆ సెన్సర్లు లేవని వెల్లడించారు. 'లక్ష్యం చేసుకునేందుకు కచ్చితమైన డేటా, నిఘా సామర్థ్యం ఉండాలి. క్షిపణి ప్రయోగానికి ముందు ఆ దేశ నేవీకి ఉన్న ప్రతికూలతలను తొలగించుకోవాలి. ముఖ్యంగా 2021 నాటికే ఆ యుద్ధ నౌకలు పాక్ చేతికి అందుతాయి' అని వివరించారు.

'డ్రాగన్' రాడార్

భారత భూభాగం మొత్తాన్ని నిఘా పెట్టే సామర్థ్యం కలిగిన అత్యాధునిక, అతి శక్తిమంతమైన రాడార్‌ను చైనా అభివృద్ధి చేసింది. నావికాదళం కోసం ఈ రాడార్ వ్యవస్థను ఆ దేశం దేశీయంగానే రూపొందించింది. చైనా సముద్రాలపై కచ్చితమైన నిఘా పర్యవేక్షణకు ఇది ఉపయోగపడుతుందని, శత్రు నౌకలు, విమానాలు, క్షిపణుల వల్ల కలగబోయే ప్రమాదాన్ని చాలా ముందుగానే పసిగట్టేందుకు ఇది దోహదం చేస్తుందని సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ తెలిపింది. దీన్ని చైనా అకాడమీ ఆఫ్ సైన్సెస్, చైనా అకాడమీ ఇంజనీరింగ్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు.

ఇండోనేషియా టు ఈజిప్ట్!





శ్రియ

సాగర తీరాల్లో సేద తీరుతున్నారు శ్రియ! ప్రస్తుతం ఈజిప్ట్‌లోని సాగర తీరాల్లో... సాగరంలో... షికారు చేస్తున్నారు. స్కూబా డైవింగ్ చేస్తున్నారు. శ్రియ సముద్రపు లోతుల్లోకి వెళ్ళడం కొత్తేమీ కాదు. సరిగ్గా ఏడాది క్రితం... జనవరి 2018లో ఇండోనేషియా వెళ్ళారామె. అక్కడా స్కూబా డైవింగ్ చేశారు. అండర్ వాటర్‌లో దిగిన ఫొటోలు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. తనలో భయాన్ని పోగొట్టుకోవడానికి డీప్-సీ డైవింగ్ నేర్చుకున్నానని శ్రియ చెప్పారు. ఈసారి స్కూబా డైవింగ్‌కి ఆమె ఈజిప్ట్ వెళ్ళారు. 'నవ్వులు.. సంతోషాలు' అంటూ ఫొటోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు.

మూడో కాంచన!



రాఘవా లారెన్స్

నృత్యదర్శకుడు రాఘవా లారెన్స్ కథానాయకుడిగా నటిస్తూ, దర్శకత్వం వహించిన సినిమా 'కాంచన-3'. 'ముని'తో మొదలైన లారెన్స్ హారర్ ఫ్రాంచైజీలో ఇప్పటి వరకూ మూడు చిత్రాలు వచ్చాయి. 'కాంచన', 'కాంచన-2' తర్వాత వస్తున్న 'కాంచన-3' చిత్రీకరణ చివరిదశకు వచ్చింది. ఈ సందర్భంగా తెలుగు మోషన్ పోస్టర్ విడుదల చేశారు. బి. మధు సమర్పణలో లైట్ హౌస్ మూవీమేకర్స్ పతాకంపై ఈ ఏప్రిల్ 18న తెలుగులో విడుదల కానుందీ సినిమా. బి. మధు మాట్లాడుతూ "రాఘవ లారెన్స్ నటిస్తూ, దర్శకత్వం వహించిన హారర్ చిత్రాలన్నీ సూపర్‌హిట్సే. ఈ ఫ్రాంచైజీలోని ప్రతి సినిమాలో తన లుక్‌ని సామాన్యుడికి దగ్గరగా ఉండేలా రాఘవా లారెన్స్ చూసుకున్నారు. ఇందులో తెల్లజుట్టుతో కొత్త స్టైల్‌కి శ్రీకారం చుట్టారు. మోషన్ పోస్టర్‌లో సౌండ్‌కి ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన లభిస్తోంది. సినిమా కూడా ప్రేక్షకుల అంచనాలు చేరుకుంటుంది" అన్నారు. ఓవియా, వేదిక, కోవై సరళ, కబీర్ సింగ్, శ్రీమన్, దేవదర్శిని, సత్యరాజ్, కిశోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వెట్రి, సర్వేశ్ మురారి, నిర్మాణం: రాఘవ, కథ-స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: రాఘవా లారెన్స్.

'ఇమేజ్'... నాకు ఎప్పుడూ అర్థం కాదు!

- వెంకటేశ్



వెంకటేశ్ అటు మాస్ సినిమాలకు, ఇటు ఫ్యామిలీ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్. ఇటీవలి కాలంలో సీరియస్ సబ్జెక్టులలోనూ, మల్టీస్టారర్ పాత్రల్లోనూ మెప్పిస్తున్నారాయన. తాజాగా వరుణ్‌తేజ్ కాంబినేషన్‌లో ఆయన నటించిన చిత్రం 'ఎఫ్2'. ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్ అనే ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కింది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని దిల్‌రాజు నిర్మించారు. సంక్రాంతి సందర్భంగా శనివారం విడుదల కానున్న ఈ చిత్రం గురించి వెంకటేశ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆ విశేషాలు...

నా తరహా చిత్రం!

ఈ మధ్య 'గురు', 'దృశ్యం' అని కాస్త సీరియస్ సబ్జెక్టులు చేశాను. నాదైన కామెడీ టింజ్ ఉన్న సినిమాలు కావు అవి. అనిల్ రావిపూడి 'ఎఫ్2' కథ చెప్పినప్పుడు నాకు వెంటనే నచ్చేసింది. తను నా గత చిత్రాలన్నిటినీ బాగా స్టడీ చేశాడు. స్వతహాగా రచయిత కావడంతో స్పాట్‌లోనూ ఇంప్రూవ్ చేసేవాడు. తన తొలి సినిమా మేమే చేయాల్సింది. కానీ అప్పుడు కుదరలేదు. ఇది మాత్రం సంక్రాంతికి ఫ్యామిలీతో కలిసి చూడటానికి సరైన సినిమా అనిపించింది. 'ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు', 'మల్లీశ్వరి', 'నువ్వు నాకు నచ్చావ్' తరహాలో... వాటన్నిటిని కలిపితే ఎలా ఉంటుందో అంత ఫన్ రైడ్‌గా ఉంటుంది ఈ సినిమా. ఆద్యంతం ఫ్రెష్‌గా అనిపించింది. యంగ్ హీరో వరుణ్‌తేజ్ ఇందులో నాకు తోడల్లుడు. వరుణ్ ఏదో ఒకే తరహా సినిమాలు చేయకుండా, ప్రతి సినిమాలోనూ కొత్తగా చేయాలని తహతహలాడుతున్నాడు. ప్రతి విషయాన్నీ త్వరగా ఆకళింపు చేసుకుంటున్నాడు. చాలా మంచి అబ్బాయి. ఇలా కొత్తహీరోలతో కలిసి పనిచేసినప్పుడు నాకు నేను కొత్తగా కనిపిస్తా.

అప్పుడే నచ్చింది!

'ఎఫ్2' అనే టైటిల్ విన్నప్పుడే నాకు బాగా నచ్చింది. కొత్తగా, ఈ జనరేషన్‌కి సరిపోతుందనిపించింది. అందరికీ అర్థం కావాలని సంక్రాంతి అల్లుళ్ల అని కొత్తగా మరో ట్యాగ్‌లైన్ కూడా వేశారు. 'సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు' తర్వాత దిల్‌రాజుగారి బ్యానర్‌లో నేను చేసిన చిత్రమిది. వరుణ్‌కీ, అనిల్‌కీ దిల్‌రాజు కొత్తకాదు. 'ఎఫ్2'కు దేవిశ్రీ ప్రసాద్ సమకూర్చిన సంగీతం హైలైట్ అవుతుంది. నేను, తమన్నా, వరుణ్, మెహ్రీన్ కలిసి వేసిన స్టెప్పులు కూడా ఒక పాటలో భలే ఉంటాయి. టీజర్, ట్రైలర్ ఎప్పుడో ప్రేక్షకుల్లోకి వెళ్లింది. అందులో పెళ్లయ్యాక వచ్చే ఫ్రస్ట్రేషన్‌ను ఫన్నీగా చూపించాం. మహిళల పట్ల మగవాళ్లు ఎంత గౌరవంగా ప్రవర్తించాలో కూడా సినిమాలో అంతర్లీనంగా చెప్పాం. 'మీటూ' వంటివాటి గురించి ఇందులో పంచ్‌లు లేవు. అయినా అది పంచ్‌లు వేయాల్సిన విషయం కాదు. నిలిచి నిదానంగా వాళ్ల గొంతుల్ని వినాల్సిన విషయం. వారి అభిప్రాయాల్ని గౌరవించాల్సిన అంశం.

నేను ఆలోచించలేదు!

నాకున్న 'ఇమేజ్' గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు. అసలు 'ఇమేజ్' అనే పదం నాకెప్పుడూ అర్థం కాదు. సినిమా అనేది నాకు ఒక మంచి వ్యాపారం. చదువు పూర్తయిన తర్వాత మరేదైనా ఉద్యోగం చేసి ఉంటే ఎంత క్రమశిక్షణతో చేసి ఉండేవాడినో, సినిమాలు కూడా అంతే. మా నాన్నగారు, మా అన్నయ్య వల్ల నాకు క్రమశిక్షణ అలవాటైంది. కష్టపడే తత్వం అలవాటైంది. నా వరకు నాతో సినిమాలు తీసే నిర్మాతలు బావుండాలి. సినిమాలు కొనుక్కున్న డిస్ట్రిబ్యూటర్లకు లాభాలు రావాలి. అంతకుమించి అభిమానులు, ప్రేక్షకులు అనుకునే ఇమేజ్ గురించి నాకు తెలియదు. ప్రేక్షకులు అభినందించిన ప్రతిసారీ నాకు కొత్త శక్తి మాత్రం వస్తుంది. మూడు దశాబ్దాలు దాటిన నా కెరీర్‌ను వెనక్కి తిరిగి చూసుకుంటే సంతృప్తికరంగా ఉంది.

కొన్నిసార్లు నా వరకు వచ్చి చేజారిపోయిన సినిమాలున్నాయి. వాటిని చేసి ఉంటే కెరీర్ ఇంకో రకంగా ఉండేది. చేయకపోవడం వల్ల ఇబ్బందేమీ లేదు. నాకే కాదు అందరి కెరీర్లోనూ ఇలాంటివి ఉంటాయి. వాటి గురించి ఆలోచించను. పక్కవాళ్ల గురించి ఎక్కువగా పట్టించుకుంటే ప్రశాంతంగా ఉండలేం. అమ్మో... సినిమా ఇండస్ట్రీలో అటూ ఇటూ చూడటం మొదలుపెట్టామంటే మన పని మటాషే. అందుకే సమాజంలో అందరూ నాకన్నా బావుండాలని మాత్రమే కోరుకుంటాను. నాలోని నటుడిని సంపూర్ణంగా ఆవిష్కరించదగ్గ స్క్రిప్టులు ఇంకా వస్తే బావుంటుంది. 'బాహుబలి' తరహా చిత్రాలు చేయాలని నాక్కూడా ఉంటుంది. మంచి కథల కోసం వెయిట్ చేస్తున్నా. ఇన్నేళ్ల అనుభవం వచ్చిన తర్వాత ఇప్పుడు యువ హీరోలు చేస్తున్న సినిమాలను నేను చేస్తే బావుండదు. అందుకే నిలిచి నిదానంగా స్క్రిప్టులు ఎంపిక చేసుకుంటున్నా.

ఓపిక అవసరం!

నా దృష్టిలో సినిమా పరిశ్రమ పెద్ద పజిల్‌లాంటిది. ఇక్కడ ప్రతిభావంతులూ ఉంటారు. అవకాశాలు కలిసొచ్చి పేరు వచ్చిన వారూ ఉంటారు. అయితే దేనికైనా ఓపిగ్గా ఉండాలి. ఎక్కడ అవకాశాలున్నాయన్న విషయాన్ని మనమే వెతికి పట్టుకోవాలి. ఎప్పుడూ సినిమా ధ్యాసతోనే ఉండాలి. తదేకంగా సినిమాలు చూడాలి. కొత్త విషయాల పట్ల అవగాహన పెంచుకోవాలి. సినిమా పరిశ్రమ కల్పతరువులాంటిది. ఇక్కడ సానుకూల దృక్పథంతో దేన్నైనా సాధించుకోవచ్చు. ఈర్ష్య వల్ల ఏదీ సాధ్యం కాదు. ప్రతి విషయంతోనూ అనుబంధాన్ని ఎంతగా పెంచుకుంటామో, దాన్నుంచి అంతే తేలిగ్గా బయటపడగలగాలి. అలాగే ఫలితం ఏదైనా దాన్ని అర్థం చేసుకుని అంగీకరించే మనస్తత్వం కూడా కీలకం.

ఇన్‌స్టా..!

ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో ఎంటర్ అయ్యా. మిగిలిన సోషల్ మీడియాలతో పోలిస్తే ఇది కాస్త సులువుగా అనిపించింది. నేను ఎక్కువగా నేచర్‌ని ఇష్టపడతా. ప్రకృతితో కాసేపు మమేకమైతే ఆ ఆనందం వేరుగా ఉంటుంది. నాకు నచ్చిన దృశ్యాలను ఫొటోలు తీస్తుంటా. వాటిని నలుగురితో పంచుకుంటా. ఇది కూడా ఒత్తిడిగా అనిపించిన రోజు... పోస్ట్ చేయడం ఆపేస్తా. ఏదీ బలవంతంగా చేయడం నాకిష్టం ఉండదు. అలాగని సోషల్ మీడియాలో ఉన్నవారందరిదీ తప్పనీ చెప్పడం లేదు. ఎవరి స్వభావం వారిది.

చేతిలో ఉన్నాయ్!

ప్రస్తుతం చైతన్యతో కలిసి 'వెంకీమామ' చేస్తున్నా. చాలా మంచి కేరక్టర్ అది. చాలా చక్కగా రాసుకున్నారు కథని. త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా చేయాలి. అనిల్ రావిపూడి మరో స్క్రిప్ట్ ప్రిపేర్ చేస్తున్నాడు. మరికొన్ని కథలు కూడా సిద్ధమవుతున్నాయి.

నా కథ చెప్పాలని..!



మనీషా కోయిరాల

"ప్రజలకు నా కథ చెప్పాలనుకున్నా! క్యాన్సర్ చికిత్స తీసుకుంటున్న పేషెంట్లకు, నాకు నేను ఉత్సాహాన్ని ఇవ్వాలనుకున్నా. అందుకనే, ఈ పుస్తకం రాశా" అని నటి మనీషా కోయిరాల అన్నారు. 'హీల్డ్: హౌ క్యాన్సర్ గేవ్ మి ఎ న్యూ లైఫ్' (నయమైంది: క్యాన్సర్ నాకు ఓ కొత్త జీవితాన్ని ఎలా ఇచ్చింది) అని ఆమె రాసిన పుస్తకాన్ని మంగళవారం ముంబైలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మనీషా కొయిరాల మాట్లాడుతూ "క్యాన్సర్ చికిత్స తీసుకున్నప్పుడు నాకు చాలా గాయాలయ్యాయి. కానీ, ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే... జీవితాన్ని నాకు కొత్త కోణంలో చూపించిందీ క్యాన్సర్. జీవితంలో చాలా అంశాలపై ఆశలు కల్పించింది. నా జీవితం, నా ఆరోగ్యం ఎంత ముఖ్యమో అర్థమయ్యేలా చేసింది. మనకు చిన్న చిన్న ఇబ్బందులు ఎదురైనప్పుడు కలత చెందుతాం. నిరాశలోకి వెళతాం. కానీ, ఆ ఇబ్బందులు మనకు ఏదో పాఠాన్ని నేర్పడానికి వచ్చాయని నా అభిప్రాయం. బదులుగా మనకు ఏదో ఒక మంచి చేస్తాయి. క్యాన్సర్‌ను జయించిన తర్వాత ఈ జీవితంలో నాకు లభించిన గొప్ప బహుమతి ఇదే అనుకున్నా" అని అన్నారు.

భరతనాట్యం నేపథ్యంగా...



శ్రీ మంగం, అవంతిక

శ్రీ మంగం , శశాంత్, అవంతిక, గాయత్రి అయ్యర్ ప్రధాన పాత్రధారులుగా కుమార్ జి. దర్శకత్వంలో రూపుదిద్దుకొంటున్న చిత్రం 'ప్రణవం'. తను ఎస్ నిర్మించిన ఈ చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకొంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. భరతనాట్యం నేపథ్యంలో లవ్, సస్పెన్స్ అంశాలతో చిత్రాన్ని రూపొందిస్తున్నాం. సంగీతం మా సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. ఆర్.పి. పట్నాయక్, ఉష మా సినిమాలో ఓ డ్యూయెట్ పాడారు. త్వరలో ఆడియో విడుదల చేస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి వైశాలి, అనుదీప్ సహ నిర్మాతలు.